వసుంధర నెల నాలుగోతులపై చిత్సాత్మ

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు

సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు

ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

విజయవాడ

fb.com/vaartha Digital

**అమెరికాకు మిత్రుడైనా భారత్‌కు శత్రువే: ఖర్గే**

**నేపాల్‌లో తీవ్ర హింస.. 20 మంది మృతి**

9

Published from Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

9-9-2025 మంగళవారం సంపుటి: 31 సంచిక: 219 పేజీలు: 12 వెల: 6.50



# గెలుపెవరిది?

## ఉపరాష్ట్రపతి ఎన్నిక నేడే

ఎన్డీయే అభ్యర్థిగా సిపి రాధాకృష్ణన్

ఇండియా కూటమి నుంచి జస్టిస్ బి సుదర్శన్‌రెడ్డి

**ఉదయం 10 గంటలకు పోలింగ్.. సా.6 గంటలకు ఫలితం**

**తొలి ఓటు వేయనున్న ప్రధాని మోడీ.. బిఆర్ఎస్, బిజెడీ ఎన్నికకు దూరం**

ఓటింగ్ ఏజెంట్లుగా రామ్మోహన్, రిజిజు, షిండే

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,సెప్టెంబరు 8:** బీజేపీ సారథ్యంలోని ఎన్డీయే, విపక్ష కాంగ్రెస్ సారథ్యంలోని ఇండియా కూటమి ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న ఉప రాష్ట్రపతి ఎన్నిక మంగళవారం నాడు జరగనుంది. ఈ ఎన్నికలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తొలి ఓటు వేయనున్నారు. పంజాబ్, హర్యానా ఎంపీలతో కలిసి ప్రధాని తన ఓటు హక్కును వినియోగించుకుంటారని పార్టీ వర్గాలు తెలిపాయి. ఈ ఎన్నికల పోలింగ్ ప్రక్రియను పర్యవేక్షించేందుకు కేంద్ర ప్రభుత్వం ఓటింగ్ ఏజెంట్లను నియమించింది. వీరిలో తెలుగుదేశం పార్టీకి చెందిన కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడుతో పాటు >>2

| బలాబలాలు | |
|---|---|
| మొత్తం ఎంపిలు | 781 |
| లోక్‌సభలో | 542 |
| రాజ్యసభలో | 239 |
| మెజార్టీ మార్కు | 391 |
| ఎన్డీయే బలం | 422 |
| ఇండియా కూటమి | 311 |
| ఇతరులు | 45 |

# సమృద్ధిగా యూరియా

## రాష్ట్రంలో 80 వేల మె.ట నిల్వలు

**కేంద్రమంత్రి జెపి నడ్డాతో ఫోన్‌లో మాట్లాడిన సిఎం చంద్రబాబు**

**కాకినాడ పోర్టుకు వచ్చిన నౌకలో ఏడు ర్యాక్‌లు కేటాయింపు**

రబీ సీజన్‌కు సైతం ప్లాన్ చేయాలన్న ముఖ్యమంత్రి

తురకపాలెం ఆరోగ్యపరిస్థితిపై కూడా సిఎం సమీక్ష



సోమవారం ఎరువుల సరఫరాపై అధికారులతో సమీక్ష చేస్తున్న సిఎం చంద్రబాబు

**విజయవాడ, సెప్టెంబరు 8,ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో ప్రస్తుతం 80,503 మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలు ఉన్నాయని ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. అన్ని జిల్లాల్లోనూ ఎరువులు సమృద్ధిగా సరఫరా చేస్తున్నామని పేర్కొన్నారు. పంపిణీలో ఎక్కడా సమస్య రాకుండా చూడాలని అధికారులకు సీఎం సూచనలు జారీ చేశారు. సోమవారం ఆర్టీజీఎస్ నుంచి రాష్ట్రంలో ఎరువుల సరఫరా, ఉల్లి కొనుగోళ్లు, తురకపాలెం గ్రామంలో ఆరోగ్య పరిస్థితులు, కాఫీ పంటలకు సోకిన తెగులు తదితర అంశాలపై సుదీర్ఘంగా మూడు గంటలపాటు అధికారులతో సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో రైతులకు ఎక్కడా యూరియా సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సీఎం స్పష్టం చేశారు. మరో పది రోజుల్లో 23,592 మెట్రిక్ టన్నుల యూరియా రాష్ట్రానికి వస్తుందని అన్నారు. ఆర్టీజీఎస్ నుంచి అధికారులతో సమీక్ష నిర్వహిస్తూనే రాష్ట్రానికి మరింత ఎరువుల కేటాయింపుపై కేంద్రమంత్రి జేపీ నడ్డాతో ముఖ్యమంత్రి ఫోన్‌లో మాట్లాడారు. ఇవాళ కాకినాడ తీరానికి చేరుకున్న నౌకలోని 7ర్యాక్‌ల యూరియాను ఏపీకి కేటాయించాలని కోరారు. దీనిపై స్పందించిన కేంద్రమంత్రి తక్షణమే రాష్ట్రానికి ఆ యూరియాను కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో రాష్ట్రానికి అదనంగా మరో 50 వేల మెట్రిక్ టన్నుల కేటాయించినట్లైంది. వచ్చే రబీ సీజన్‌కు ఇప్పటి నుంచే యూరియా సరఫరా ప్రణాళికలు చేయాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి రైతులకు ఎరువుల పంపిణీకి సంబంధించి భరోసా ఇవ్వాలని సూచించారు. అలాగే రైతులు, కౌలు రైతులు ఎరువులు దొరకవనే ఆందోళనతో ఒకేసారి కొనుగోలు చేయకుండా.. నిల్వచేసి పెట్టుకోకుండా చూడాలని సీఎం పేర్కొన్నారు. అలాగే అనవసరపు కొనుగోళ్లపైనా దృష్టి పెట్టాలని సీఎం పేర్కొన్నారు. నిత్యావసర సరకుల జాబితాలో ఉన్న ఎరువులను బ్లాక్ మార్కెటింగ్ చేయకుండా నియంత్రించాలని సీఎం స్పష్టం చేశారు. కొందరు కావాలనే రాజకీయ దురుద్దేశాలతో చేస్తున్న ప్రయత్నాలను నిలువరించాలని >>2

**మూడోసారి టిటిడి కొత్త ఇఒగా**

# అనిల్‌కుమార్

రెండురోజుల్లో బాధ్యతలు



**తిరుమల,సెప్టెంబర్ 8ప్రభాతవార్తప్రతినిధి:** సీనియర్ ఐఎఎస్ అధికారి ,ప్రిన్సిపల్ కార్యదర్శి హోదాలో అనిల్ కుమార్‌సింఘాల్ ముచ్చటగా మూడోసారి తిరుమల తిరుపతిదేవస్థానం కార్యనిర్వహణాధికారి(ఇఒ)గా నియమితులయ్యారు. ఆయన పరిపాలనలో ఎంతో అనుభవం కలిగిన అధికారిగా..పైకి తోటి అధికారులను, ఉద్యోగులను నవ్వుతూ పలకరించినా ముక్కుసూటి తనంతో వ్యవహరించడంలో >>2



# పలువురు ఐఎఎస్‌ల బదలీ

**జిఎడి ముఖ్య కార్యదర్శిగా శ్యామలరావు**

రెవెన్యూ, ఎక్సైజ్ ప్రిన్సిపల్ సెక్రటరీగా ముఖేష్ కుమార్ మీనా

**విజయవాడ, సెప్టెంబరు 8, ప్రభాతవార్తప్రతినిధి:** ఎపిలో పలువురు ఐఏఎస్ అధికారులు బదిలీ అయ్యారు. ఆ మేరకు టిటిడి ఈవోగా అనిల్‌కుమార్ సింఘాల్‌ను ప్రభుత్వం నియమించింది. గతంలోనూ అనిల్ టిటిడి ఈవోగా పనిచేశారు. ప్రస్తుత ఈవో శ్యామలరావును జీఏడీ ముఖ్య కార్యదర్శిగా బదిలీ చేశారు. రోడ్లు భవనాల ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా కృష్ణబాబును వైద్య,ఆరోగ్యశాఖ నుంచి బదిలీ చేసారు,రెవెన్యూ, ఎక్సైజ్ ప్రిన్సిపల్ సెక్రటరీగా ముఖేశ్‌కుమార్ మీనా, అటవీ, పర్యావరణశాఖ కార్యదర్శిగా కాంతిలాల్ దండే బదిలీ అయ్యారు. ఆల్ ఇండియా సర్వీసెస్ అధికారుల బదిలీలపై ఎపి రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేస్తుంది. ఈ ప్రక్రియను స్వయంగా సిఎం చంద్రబాబు పర్యవేక్షిస్తున్నారు. ఆదివారం >>2

# ఉల్లి రైతులను ఆదుకోండి

## మద్దతు ధర కల్పించాలి

**అన్నదాతలను ఓదార్చిన కాంగ్రెస్ చీఫ్ షర్మిల**



సోమవారం కర్నూలు మార్కెట్ యార్డులో రైతులతో షర్మిల

**కర్నూలు కార్పొరేషన్. సెప్టెంబర్ 8. ప్రభాతవార్త:** ఉల్లి రైతులను కూటమి ప్రభుత్వం ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం నంద్యాల డిసిసి అధ్యక్షులు, కర్నూల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఎ ఐ సి సి మెంబర్ జే లక్ష్మీ నరసింహ యాదవ్ మరియు కర్నూల్ సిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు షేక్ జిలాని భాష గారి ఆధ్వర్యంలో ఉల్లి రైతుల పరామర్శ కార్యక్రమంలో షర్మిలా రెడ్డి మాట్లాడుతూ ఉల్లి రైతుల కష్టాలు తెలుసుకునేందుకు కర్నూల్ మార్కెట్ యార్డుకు రావడం జరిగిందని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిళా రెడ్డి తెలియజేశారు. ఉల్లి రైతులు పండించిన ధరకు అమ్ముతున్న ధరకు పొంతనలేదని ఉల్లి రైతులు కన్నీరు పెట్టుకునే స్థితిలో ఉన్నారని ఉల్లి పండించిన రైతులు ఆందోళన చెందుతున్నారని ఇబ్బందులు పడుతున్నారని వారిని చూస్తే స్పష్టంగా అర్థం అవుతుందని ఉల్లి పండించడానికి ఎకరానికి ఎనభై వేల నుండి లక్ష ఇరవై వేల వరకు పెట్టుబడీ అవుతుందని రైతులు చెబుతున్నారని కానీ క్వింటాలుకు 600 రూపాయల కంటే రావడం లేదని గత సంవత్సరం క్వింటాలకు 4 వేల నుండి 5 వేల రూపాయల వరకు ఉల్లి అమ్ముడుపోయిందని ఈసారి డిమాండ్ లేక ఉల్లి కొనడం కూడా కరువైందని దళారులు మంచి గ్రేడ్ అయితే కేవలం 600కు కొంటున్నారని రెండో రకం అయితే రెండు వందలు మూడు వందలు కొంటున్నారని పండించిన పంటలో పెట్టుబడులు కనీసం సగం కూడా రావడం లేదని రైతులు వాపోతున్నారని మొన్న ఇద్దరు రైతులు ఆత్మహత్య యత్నం చేసుకోబోతే వైసీపీ కార్యకర్తలు అంటూ ముద్రవేసి వారిపై కేసులు పెట్టారని రైతులకు, పండించిన పంటలకు కూడా పార్టీలు ఉంటాయా అని ఇప్పుడే అర్థమైందని షర్మిలమ్మ గారు ప్రశ్నించారు.

ఏ ఒక్క రైతుకు 1200 మద్దతు ధర ఇవ్వలేదని ఉల్లి రైతులపై దృష్టి పెట్టి డిఫరెంట్ అమోంటు వేయాలని, ఉల్లికి కనీస మద్దతు ధర 2400 రూపాయలు కల్పించాలని షర్మిలారెడ్డి డిమాండ్ చేశారు. రైతుల ఖాతాలో క్వింటాలుకు 1200 రైతుల ఖాతాలలో జమ చేయాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేస్తుందని షర్మిలా రెడ్డి గారు తెలియజేశారు. ముందుగా పిసిసి అధ్యక్షులు షర్మిలా రెడ్డి గారు నేరుగా కర్నూలు మార్కెట్ యార్డ్ వ్యవసాయ మార్కెట్ యార్డుకు వచ్చి ఉల్లి రైతులు ఉల్లి రైతుల వద్దకు వెళ్లి ముఖాముఖిగా వారితో మాట్లాడి కుటుంబ ప్రభుత్వంతో మాట్లాడి మీకు తప్పకుండా మద్దతు ధర వచ్చే విధంగా కృషి చేస్తామని రైతులకు భరోసా కల్పించారు.




అమెరికా వీసా షాక్

ఇక అపాయింట్‌మెంట్

# స్వదేశంలోనే

**పార్ట్‌టైమ్ ఉద్యోగం చేస్తున్నా హెచ్‌వన్‌బి వీసా రద్దు**

**వర్సిటీల నుంచి వారిని స్వదేశాలకు పంపించేసే యోచన.. భారత్ విద్యార్థులు బెంబేలు**

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 8:** అమెరికా వీసాల కోసం ఎదురు చూస్తున్న ఇండియన్లకు ట్రంప్ యంత్రాంగం మరో షాక్ ఇచ్చింది. వీసాలపై అమెరికా కొత్త రూల్ తెచ్చింది. ఇక నుంచి ఎవరైనా సరే నాన్ ఇమ్మిగ్రెంట్ వీసా ఇంటర్వ్యూకి తమ సొంత దేశం లేదా చట్టబద్ధంగా నివాసం ఉంటున్న దేశంలోనే అపాయింట్‌మెంట్ తీసుకోవాల్సి ఉంటుంది. ఈనిబంధన తక్షణమే అమల్లోకి వస్తుందని అమెరికా >>2

సృష్టి అక్రమాల కేసు:

మరో ముగ్గురు ప్రభుత్వ

# డాక్టర్ల సస్పెన్షన్

**విజయవాడ,సెప్టెంబరు8,ప్రభాతవార్తప్రతినిధి:** హైదరాబాద్ ప్రధాన కేంద్రంగా నడుస్తూ సంతాన సాఫల్య సేవల్లో అక్రమాలకు సంబంధించిన సృష్టికేసులో ప్రభుత్వ వైద్య కళాశాలలు / బోధనాసుపత్రులకు చెందిన ముగ్గురు వైద్యులను ప్రభుత్వం సస్పెండ్ చేసింది. ఈ వ్యవహారంలో ఆంధ్ర మెడికల్ కాలేజి, విశాఖపట్నం లో ఏనస్థిషియా విభాగాధిపతి డా. వాసుపల్లి రవి, గైనకాలజీ విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్ డా.పి. ఉషాదేవి మరియు శ్రీకాకుళం ప్రభుత్వ వైద్య కళాశాలలో పిడియాట్రిక్స్ విభాగంలో పనిచేస్తున్న అసిస్టెంట్ ప్రొఫెసర్ డా. ఎ. విద్యుల్లతలపై గత నెలలో ఆరోపణలు వచ్చాయి. వీరు ముగ్గురిపై హైదరాబాద్ పోలీసులు కేసు నమోదు చేశారు. సరోగమి చట్టం మరియు జువినైల్ జస్టిస్ చట్టం లోని పలు సెక్షన్ల క్రింద వీరిపై కేసులు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు గత నెల 28న హైదరాబాద్ పోలీసులు అధికారికంగా తెలిపారు. ఈ నేపథ్యంలో... ఈ ముగ్గురు వైద్యులపై నమోదైన ఆరోపణల తీవ్రత దృష్ట్యా వారిని పోలీసులు అరెస్ట్ చేసిన తేది నుంచి సస్పెండ్ చేయాలని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి శ్రీ సత్యకుమార్ యాదవ్ ఆదేశాలిచ్చారు. వీరిని విధుల్లో కొనసాగిస్తే వ్యవస్థ పట్ల ప్రజా విశ్వాసం సన్నగిల్లుతుందని, కేసుల విచారణకు ఆటంకం కలిగించే అవకాశమున్నందున వారిని సస్పెండ్ చేయాలని మంత్రి ఆదేశించారు. ఈ ముగ్గురు వైద్యులు సృష్టి అక్రమాల కేసులో అరెస్ట్ అయినట్లు గత నెల 9న వార్తలొచ్చాయని, వారిపై చర్యలు తీసుకొనటానికి ఆలస్యం ఎందుకయిందని మంత్రి వాకబు చేశారు.



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ప్రొఫెసర్

**ప్రొఫెసర్‌పై కత్తులతో**

# విద్యార్థి దాడి

నూజివీడు ట్రిపుల్ ఐటిలో దారుణం

**నూజివీడు, సెప్టెంబరు 8 ప్రభాతవార్త:** నూజివీడు ట్రిపుల్ ఐటీ లో ప్రొఫెసర్ పై విద్యార్థి 2 కత్తులతో దాడి చేసిన సంఘటన సోమవారం విస్మయం కలిగించింది. త్రిబుల్ ఐటీలో ఈ విద్యా సంవత్సరంలో విజయనగరం జిల్లా వడ్డీ పేట గ్రామానికి చెందిన వెంకటరమణ కుమారుడు వినయ్ పురుషోత్తం ఎంటెక్ సివిల్ ఇంజనీరింగ్ ప్రథమ సంవత్సరం చదువుతున్న విద్యార్థి (అటెండెన్స్) హాజరు శాతం తక్కువగా ఉండటంతో గోపాలరాజు అనే ప్రొఫెసర్ పరీక్ష రాసేందుకు అనుమతించలేదు. >>2

# రేపు 'అనంత'లో 'సూపర్ సిక్స్'

**విజయోత్సవాలకు భారీ ఏర్పాట్లు**

**సిఎం చంద్రబాబు, డి.సిఎం పవన్ రాక**

**దారులకు ఇరువైపులా పోటాపోటీగా ఫ్లెక్సీలు**



సోమవారం సభా ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రులు, అధికారులు

**అనంతపురం, సెప్టెంబర్ 8, (ప్రభాతవార్త బ్యూరో):** జిల్లా కేంద్రమైన అనంతపురంలో రాష్ట్రస్థాయిలో సూపర్ సిక్స్ విజయోత్సవ సభను ఈనెల 10వ తేదీన మధ్యాహ్నం నుంచి 3.5 లక్షల మందితో భారీ ఎత్తున నిర్వహించేందుకు కూటమి ప్రభుత్వం నేతలు భారీ సన్నాహాలు చేస్తున్నారు. మధ్యాహ్నం ఒంటిగంట లోపు ఉమ్మడి అనంతపురం జిల్లాలోని అన్ని నియోజకవర్గాల నుంచి భారీ ఎత్తున జన సమీకరణకు కసరత్తు చేస్తున్నారు. ఆయా నియోజకవర్గ ఎమ్మెల్యేలకు ప్రత్యేక బాధ్యతలను మంత్రులు అప్పగించారు. ఏ నియోజకవర్గంలో ఎక్కడ వాహనాలు నిలపాలి, జనాన్ని ఎక్కడ తీసుకురావాలి అన్నది కూడా పక్క ప్లాన్ తో ఎమ్మెల్యేలకు మంత్రులు, ఇతర పార్టీ రాష్ట్ర స్థాయి ముఖ్యులు ప్రత్యేక బాధ్యతలు అప్పగించారు. జిల్లా మంత్రి పయ్యావుల కేశవ్ తో పాటు రాష్ట్ర మంత్రులు అనగాని సత్యప్రసాద్, గొట్టిపాటి రవికుమార్, రాంప్రసాద్ రెడ్డి, నారాయణ , సీఎం ప్రోగ్రాం కోఆర్డినేటర్ మంతెన సత్యనారాయణ రాజు,తదితరులు అనంతపురంలోని తిష్ట వేసి ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు. మంత్రులకు తోడు జిల్లా ఎమ్మెల్యేలు, ఎంపీలు ప్రత్యేక బాధ్యతలు తీసుకొని ముందుకెళ్తున్నారు. అనంతపురం ఎమ్మెల్యే దగ్గుబాటి ప్రసాద్, కళ్యాణ్ దుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు, తదితర జిల్లా తదితర నాయకులకు స్వాగతం పలుకుతూ ఫ్లెక్సీలు కట్టారు. సభ కు అనంతపురం సత్యసాయి ఉమ్మడి జిల్లాల నుంచి సుమారు 5లక్షల మంది జనం తరలించే విధంగా ఎమ్మెల్యేలు ప్రత్యేకంగా గ్రామస్థాయి నుంచి బూతులు వారిగా వాహనాల ఏర్పాట్లు భోజన వసతి ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. ఎమ్మెల్యేలు, ఎంపీలు , ఇతర నాయకులు మంత్రులతో కలిసి ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్, జిల్లా ఎస్పీ జగదీష్ తదితర వివిధ విభాగాల జిల్లా అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. అనంతపురం శివారులోని శ్రీనగర్ కాలనీ ఎగువ భాగంలో అయ్యప్ప గుడి సమీపంలో ఏర్పాటు చేసే బహిరంగ సభకు భారీ ఎత్తున రేయి పగళ్ళు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రజా ప్రతినిధులతో పాటు పలువురు అధికారులు కూడా అక్కడే ఉండి ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు. పెద్ద ఎత్తున స్టేజ్ నిర్మాణం తోపాటు జనం కోసం బారికెట్లు ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే వివిధ జిల్లాల నుంచి పోలీసు అధికారులు కూడా చేరుకున్నారు. మంగళవారం నాటికి రక్షణ వలయంలోకి సభా ప్రాంగణం చేరుకునే అవకాశం ఉంది. ఇదే సమయంలో అనంతపురం నగరంలో ప్రధాన రహదారులు అటు ఇటు ఫ్లెక్సీలు నిండిపోయాయి. టిడిపి, జనసేన నేతలు పెద్ద ఎత్తున సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్,

ఈస్ట్ ఇండియా కంపెనీలో

# మళ్లీ మంటలు

రంగంలోకి నౌకాదళ సిబ్బంది



**గాజువాక,సెప్టెంబర్ 8,ప్రభాత వార్త:** ఈస్టిండియా పెట్రోలియం కంపెనీ లో ఆదివారం మధ్యాహ్నం పిడుగుపడి మంటలు ఏర్పడిన ట్యాంకర్ పై భాగంలో తాజాగా మరోసారి మంటలు చెలరేగాయి. ఇథనాల్ ట్యాంకర్ పైభాగంలో పెద్ద ఎత్తున మంటలు అలముకున్నాయి. పక్కనే ఉన్న ట్యాంక్లకు మంటలు అంటుకునే అవకాశం ఉన్న తరుణంలో పోర్ట్ అధికారులు ఇండియన్ నేవీ సహకారం కోరారు. నేవీ హెలికాప్టర్ల సాయంతో రెస్క్యూ ఆపరేషన్ కొనసాగుతోంది. ఆదివారం మధ్యాహ్నం భారీవర్షం కురవగా 7,500 టన్నుల సామర్థం గల పెట్రోల్ ట్యాంక్పై పిడుగు పడింది. దీంతో పైకప్పు పడిపోయి మంటలు చెలరేగాయి. అధికారులు 10 అగ్నిమాపక శకటాలను తీసుకొచ్చి మంటలను అదుపు చేశారు. తాజాగా మరోసారి మంటలు చెలరేగడంతో పరిసర ప్రాంతాల ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. దింతో హెలికాప్టర్ సహాయంతో. మంటలను అదుపు చేసే హోమ్ కేమికల్ పౌడర్ ను బస్తాలతో జల్లుతున్నారు. ప్రజలు ఎవరు బయపడవలసిన అవసరం లేదని అధికారులు చెబుతున్నారు.

09-09pg2exHMNWJQE_09-09pg2exHMNWJQE.qxd 9/8/2025 11:57 PM Page 1





గుజరాత్‌లోని ఖేడాలో సోమవారం కురిసిన భారీ వర్షాలకు నీట మునిగిన రసిక్‌పురా గ్రామం

## పవన్ కల్యాణ్ పై విచారణ వాయిదా

**విజయవాడ, సెప్టెంబరు 8,ప్రభాతవార్తప్రతినిధి:** డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ దాఖలైన పిటీషన్పై విచారణ ఈ నెల 15కు వాయిదా పడింది. డీసీఎంగా ఉన్న పవన్ కల్యాణ్ షూటింగ్లో పాల్గొనడంపై మాజీ ఐఏఎస్ అధికారి విజయ్ కుమార్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసారు. హరిహరవీర మల్లుఖి సినిమా ప్రమోషన్లో ప్రభుత్వ నిధులు, అధికార యంత్రాంగాన్ని దుర్వినియోగం చేశారని పిటిషన్లో పేర్కొన్నారు. దీనిపై ఇరు వర్గాల వాదనలు విన్న ధర్మాసనం విచారణ వాయిదా వేసింది. పవన్ కల్యాణ్ తన చిత్రం విడుదల సందర్భంగా రాష్ట్రంలో ప్రాంతాల వారిగా. ప్రీ,పోస్టు రిలీజ్ ఈవెంట్లు నిర్వహించారు. ఆయన సినిమా టిక్కెట్లు ధరలు పెంచుకోవడానికి ప్రభుత్వం అనుమతినిచ్చింది. వీటిని మాజీ ఐఎఎస్ అధికారి విజయ్ కుమార్ తన పిటిషన్‌లో తప్పుపట్టారు.

## రాష్ట్రం మీదుగా తిరిగే పలు రైళ్ల హాల్టింగ్‌లు కొనసాగింపు

**గుంతకల్లు రైల్వే, సెప్టెంబరు 8,ప్రభాతవార్త:** తెలుగు రాష్ట్రాలలోని దక్షిణ మధ్య రైల్వే మీదుగా వివిధ ప్రాంతాల మధ్య రాకపోకలు సాగించే పలు రైలు సర్వీసులకు సంబంధించి ప్రస్తుతం ఉన్న హాల్టింగులు/స్టాపింగ్‌లను ప్రయాణికుల సౌకర్యార్థం కొనసాగిస్తున్నట్లు రైల్వే వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం దక్షిణ మధ్య రైల్వే వివిధ ప్రాంతాల మధ్య తిరిగే 55రైలు సర్వీసులకు ప్రయాణికుల సౌకర్యార్థం ప్రయోగాత్మకంగా అనేక రైల్వే స్టేషన్లలో హాల్టింగులు/ స్టాపింగ్‌లను కల్పించింది. ప్రయాణికుల అవసరాలను దృష్టిలో ఉంచకొని వీటిని తదుపరి ఆదేశాలు జారీ చేసేందుకు యథాతథంగా కొనసాగించాలని ఈ మేరకు నిర్ణయించినట్లు రైల్వే వర్గాల సమాచారం.

## పలువురు ఐఎఎస్‌ల బదలీ

>> సీఎస్, డీజీపీ, సీఎంవో అధికారు లతో సుదీర్ఘంగా చర్చించిన ఆయన.. ఐఏఎస్, ఐపీఎస్‌ల బదిలీలపై సమీక్ష నిర్వహించారు. రైట్ పర్సన్, రైట్ ప్లేస్ అనే కాన్సెప్ట్‌తోనే ఈ బదిలీలు జరగనున్నాయని ప్రభుత్వం స్పష్టం చేసింది. జేసీల నుంచి స్పెషల్ చీఫ్ సెక్రటరీల వరకు ఈ మార్పులు జరిపే అవకాశం ఉందని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. అంతేకాక, ఎస్పీల నుంచి డీఐజీ, ఐజీ వరకు కీలక పోస్టుల్లో కొత్త అధికారులను తీసుకుంటున్నట్లు సమా చారం. అయితే.. సోమవారం పలువురు ముఖ్య కార్యదర్శుల బదిలీ లపై ఉత్తర్వులు వెలువడ్డాయి. సమూల మార్పుల ద్వారా పాలనలో వేగాన్ని పెంచాలని ముఖ్యమంత్రి చంద్రబాబు భావిస్తున్నట్లు తెలు స్తుంది. గత 15 నెలల కాలంలో అధికారుల పనితీరుపై క్లారిటీ రావడంతో ఈసారి బదిలీలపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు సమాచారం. కాగా, బాగా పనిచేసిన అధికారులను ప్రోత్సహించేలా, ఆశించిన స్థాయిలో పనితీరు కనబరచనివారిని మార్చేలా ప్రభుత్వం నిర్ణయాలు తీసుకునే అవకాశంఉంది. తన ఆలోచనలకు, పాలనా వేగానికి అనుగు ణంగా అధికారుల పనితీరు ఉండాలని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ఇక బదిలీల క్రమంలో రెవెన్యూ,ఎక్సైజ్ ప్రిన్సిపల్ సెక్రటరీగా ముఖేష్‌కుమార్ మీనా, మైనార్టీ సంక్షేమ శాఖ కార్యదర్శిగా సీహెచ్ శ్రీధర్, అటవీ, పర్యావరణ కార్యదర్శిగా కాంతి లాల్ దండేను నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. గవర్నర్ ప్రత్యేక కార్యదర్శిగా అనంతరామ్,కుటుంబ సంక్షేమశాఖ కార్యదర్శిగా సౌరబ్ గౌర్, ఆంధ్రప్రదేశ్‌భవన్ రెసిడెంట్ కమీషనర్‌గా ప్రవీణ్‌కుమార్, పరిశ్రమలు, కార్మిక శాఖ కమీషనర్ శేషగిరిబాబు, రెవెన్యూ(ఎండోమెంట్) కార్యదర్శిగా హరి జవహర్‌లాల్ నియమితులయ్యారు.

## ప్రొఫెసర్‌పై కత్తులతో విద్యార్థి దాడి

>>సదరు విద్యార్థి పరీక్ష రాసేందుకు అనుమతించాలని పట్టు బట్టటంతో ప్రొఫెసర్ గోపాలరాజు హెచ్వోడి అనుమతి తీసుకోవాలని , హెచ్వోడి ఒప్పుకుంటే తాము అనుమతిస్తామని ఆయన విద్యార్థికి సూచించారు. హెచ్ ఓ డి దగ్గరకు వెళ్లి మరలా తరగతి గదికి వచ్చిన విద్యార్థి తమను పరీక్ష రాసేందుకు హెచ్వోడి ఒప్పుకున్నారని విద్యార్థి చెప్పాడు. ప్రొఫెసర్ హెచ్‌ఓడి కి ఫోన్ చేసి సమాచారం తెలుసుకున్నారు. సదరు విద్యార్థిని పరీక్షకు అనుమతించమని తాము చెప్పలేదని ఆయనకు వివరించారు. దీంతో ప్రొఫెసర్ గోపాలరాజు పరీక్ష రాసేందుకు ఎటు వంటి పరిస్థితిలో అనుమతించేది లేదని మరోసారి గట్టిగా చెప్పారు. ఆ విద్యార్థి ఒక పథకం ప్రకారం ముందుగా తెచ్చుకున్న రెండు కత్తులను తీసి ప్రొఫెసర్ గోపాలరాజును విచక్షణ రహితంగా పొడిచేందుకు ప్రయత్నించాడు. తరగతి గదిలో ఉన్న సహ విద్యార్థులు చుట్టుపక్కల ఉన్న ప్రొఫెసర్లు అందరూ రావడంతో అప్పటికే మెడ , భుజాల, చేతి పై పొడిచిన విద్యార్థి భయంతో హాస్టల్ గదిలోనికి పారిపోయాడు. అక్కడ ఉన్న సెక్యూరిటీ సిబ్బంది , సహ విద్యార్థులు అతను పారిపోకుండా పట్టుకున్నారు. ట్రిబుల్ ఐటీ లోనే అవుట్ పోలీస్ స్టేషన్ ఉండటంతో పోలీస్ సిబ్బంది వచ్చి నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. గాయపడిన స్వల్పంగా గాయపడిన ప్రొఫెసర్ గోపాల్ రాజును నూజివీడు ఏరియా ఆసుపత్రికి తరలించారు. ప్రొఫెసర్ కు ప్రాణాపాయ పరిస్థితి ఏమిలేదని గాయాలైనట్లు వైద్యులు పేర్కొన్నారు.

## అపాయింట్‌మెంట్ స్వదేశంలోనే

>> ప్రభుత్వం తేల్చి చెప్పేసింది. సాధారణంగా వ్యాపారం, పర్యటకం కోసం బీ1, బీ2 వీసాలకు చాలామంది దరఖాస్తు చేసుకుంటూరు. తాజా నిబంధన కారణంగా భారతీయులైన వ్యాపారులు, పర్యటకులకు ఇబ్బందులు తప్పకపోవచ్చు. వీళ్ల బీ1 వ్యాపార, బీ2టూరిస్ట్ వీసాలను స్వల్ప వ్యవధిలో పొందడం సాధ్యం కాకపోవచ్చు. గతంలో ఈ వీసా అపాయింట్‌మెంట్లను విదేశాల్లో బుక్ చేసుకొనే అవకాశం ఉండేది. ఇప్పుడు అది వీలుపడదు. కోవిడ్19 సమయంలో వ్యాపార, పర్యాటక వీసాల జారీలో తీవ్ర జాప్యం ఏర్పడింది.. తాజా నిబంధనలతో మళ్లీ అలాంటి పరిస్థితే తలెత్తవచ్చు. నాన్ ఇమిగ్రెంట్ వీసాలను వ్యాపార, పర్యాటక, విద్య, తాత్కాలిక ఉద్యోగాలు, అమెరికా (యుఎస్ఎ) పౌరులతో వివాహం వంటి వాటికి సాధారణంగా ఇస్తుంటారు. సరికొత్త నిబంధన తక్షణమే అమల్లోకి వస్తుందని అమెరికా (యుఎస్ఎ) విదేశాంగశాఖ శనివారం వెల్లడించింది. ఈ నేపథ్యంలో దరఖాస్తుదారులు వారి స్వదేశాల్లో వీసా అపాయింట్‌మెంట్లను షెడ్యూల్ చేసుకోవాలని సూచించింది. ప్రస్తుతం భారత్‌లో హైదరాబాద్, ముంబయిల్లోని అమెరికా కాన్సులేట్స్ లో బీ 1, బీ 2 వీసాల ఇంటర్వ్యూలకు సుమారు మూడున్నర నెలల సమయం పడుతోంది. ఢిల్లీలో అయితే నాలుగు నెలలు, కోల్‌కతాలో ఐదు నెలలు, చెన్నైలో 9 నెలల సమయం తీసుకొంటోంది. సాధారణంగా భారతీయులు ఈ వీసాల ఇంటర్వ్యూల కోసం జర్మనీ, సింగపుర్, బ్యాంకాక్‌కు వెళుతుంటారని ట్రావెల్ ఏజెన్సీలు చెబుతున్నాయి. రెండేళ్ల కిందట ఫ్రాంక్‌ఫర్ట్‌లోని అమెరికా దౌత్య కార్యాలయం భారతీయుల కోసం ప్రత్యేకంగా ఇంటర్వ్యూలు కూడా నిర్వహించే ఏర్పాట్లు చేసింది.

## టిటిడి కొత్త ఇఒగా అనిల్‌కుమార్

>> ఆయనకు ఆయనేసాటి అనే నానుడి ఉంది. గతంలోనూ తెలుగుదేశం ప్రభుత్వంలో సిఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలో 2017 మే 6వతేదీ నుండి 2020 అక్టోబర్ 4వరకు టిటిడిలో పూర్తిస్థాయి ఇఒగా కొనసాగారు. అంతేగాక ఆయన హయాంలోనే టిటిడి ధర్మకర్తలమండలి ఛైర్మన్ పుట్టాసుధాకర్‌యాదవ్ ఆధ్వర్యంలో టిటిడి ఆలయాల్లో పనిచేసే అర్చకుల పదవీవిరమణ వయస్సును అమలుచేయడంలో సవాళ్ళు ఎదురైనా, ప్రతిఘటనలు వచ్చినా చట్టం అమలుచేసి అర్చకులను ఇంటికి సాగనంపిన సంచలన నిర్ణయం సింఘాల్‌దే. ఇప్పుడు మళ్ళీ ఆయన టిటిడి ఇఒగా అన్యమత ఉద్యోగులను 300మంది వరకు గుర్తించిన వారిని విఆర్ఎస్‌పై బయటకు పంపడం ఆ తరువాత ఇతర ప్రభుత్వశాఖలకు బదిలీ చేయడం వంటి కీలక నిర్ణయం అమలుచేసే దిశగా కఠినంగా వ్యవహరించేలా సర్కార్,టిటిడి బోర్డు పూర్తిస్వేచ్ఛ ఇవ్వనుంది. అంతేగాక టిటిడిలో ముఖ్యంగా తిరుమలలో వివిధ విభాగాల్లో ఆలయంలో ఉద్యోగులు విధులు నిర్వహించే సమయంలో నేమ్‌బ్యాడ్జి దరించాలనే ఆదేశాలు అమలుచేసేదిశగా ఉత్తర్వులు రానున్నాయి. వీటన్నిటినీ సమర్ధవంతంగా, నిక్కచ్చిగా అమలుచేసే అదికారిగా సింఘాల్‌కు పేరుంది. గతంలోనే ఇఒగా సింఘాల్ సమర్ధవంతంగా అటు టిటిడి ఉద్యోగులు ఇటు శ్రీవారి భక్తులకు సేవలందించడంలో సఫలీకృతులయ్యారు. టిటిడి ఇఒ పోస్టునుండి బదిలీ అయిన సింఘాల్ విజయవాడలో రాష్ట్రవైద్య ఆరోగ్యకుటుంబసంక్షేమశాఖ ప్రిన్సిపల్ కార్యదర్శిగా, గవర్నర్ కార్యదర్శిగా, దేవాదాయశాఖ ప్రిన్సిపల్ కార్యదర్శిగా సమర్ధవంతంగా బాధ్యతలు నిర్వహించారు. 2023లో డిసెంబర్ 22నుండి జనవరి 2వతేదీ వరకు 12రోజులు పాటు ఇన్‌ఛార్జి ఇఒగా అదనపు బాధ్యతలు చేపట్టారు. ఇవన్నీ సింఘాల్‌కు కలసి రావడంతో ప్రస్తుత పరిస్థితుల్లో టిటిడి ఇఒగా ఎంతో అనుభవం ఉన్న,పరిపాలన దక్షత కలిగిన అనిల్‌కుమార్‌సింఘాల్‌ను చంద్రబాబు నాయుడు రెండవసారి పూర్తిస్థాయి ఇఒగా నియమించడం వెనుక కీలక సంస్కరణలు చేపట్టే సూచనలు కనిపిస్తున్నాయి. సోమవారం జరిగిన 11మంది ఐఎఎస్‌ల బదిలీల్లో వెయిటింగ్‌లో ఉన్న సింఘాల్‌కు టిటిడి ఇఒగా బ్రహ్మోత్సవాల వేళ దేవునిసేవకు పునరంకితం కావడం పూర్వజన్మసుకృతమే.

### వారం - వర్జ్యం

09-09-2025, మంగళవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
భాద్రపద మాసం, దక్షిణాయణం
వర్ష ఋతువు, కృష్ణపక్షం
విదియ సా.6.28
ఉత్తరభాద్ర సా.6.06
వర్జ్యం : తె.5.06-5.32
దు.ఉ.8.24-9.13, 2)రా.11.12-12.01
శుభసమయం:ఉ.11.00-11.30
రాహుకాలం - మ.3.00-4.30

### వార్తాఫలం

**మేషం :** కాలానుగుణంగా ప్రవర్తించడమే విజయానికి మార్గమని గుర్తించండి.

**వృషభం:** వ్యవహారాలలో తొందరపాటు వద్దు. ఆరోగ్య విషయంలో మెలుకువ పాటించండి.

**మిథునం:** కోపతాపాలకు దూరంగా ఉండండి. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా వుంటుంది.

**కర్కాటకం :** కొన్ని అవకాశాలు లభిస్తాయి. పాత మిత్రులను కలిసి ఆనందంగా గడుపుతారు.

**సింహం:** దూరపు బంధువుల నుండి వచ్చిన సమాచారం ఆనందం కలిగిస్తుంది.

**కన్య :** కుటుంబ సమస్యలు కొంత వరకు తీరుతాయి. నూతన పెట్టుబడులకు అనుకూలం

**తుల :** బంధువులతో వ్యక్తిగత విషయాలపై సంప్రదిస్తారు. ఆరోగ్యం పట్ల మెలుకువ అవసరం.

**వృశ్చికం:** ఓర్పునేర్పుతో ముందుకు సాగుతారు. గృహ నిర్మాణ యత్నాలు సాగిస్తారు.

**ధనుస్సు:** అధికార హోదా కలిగిన వ్యక్తులతో పరిచయాలు ఏర్పడతాయి.

**మకరం:** సంఘంలో ప్రత్యేక గుర్తింపు పొందుతారు. విలువైన వస్తువులు కొనుగోలు చేస్తారు.

**కుంభం:** ఆర్థిక పరిస్థితి ప్రోత్సాహకరంగా వుంటుంది. నూతన పెట్టుబడులకు తగిన లాభాలు పొందుతారు.

**మీనం :** ఇంటిలో శుభకార్యాల ప్రస్తావన వుంటుంది. స్థిరాస్తి వివాదాల నుండి బయటపడతారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# సమృద్ధిగా యూరియా

>>సూచించారు. శాంతిభద్రతల సమస్య సృష్టించేందుకు జరుగుతున్న ఈ తరహా ప్రయత్నాలకు అడ్డుకట్ట వేయాలని ఆదేశించారు. అధిక మోతాదులో ఎరువుల వినియోగంపై రైతులను చైతన్య పరిచేలా కార్యక్రమాలను, ప్రచారాన్ని నిర్వహించాలని స్పష్టం చేశారు. ఎరువుల వినియోగాన్ని తగ్గించిన రైతులకు ప్రోత్సాహకంగా సబ్సీడీని రైతుల ఖాతాల్లోకి జమ చేసే పథకంపైనా దృష్టి పెట్టి విస్తృత ప్రచారం చేయాలన్నారు.

**ఉల్లి కొనుగోళ్లు నిల్వలపై దృష్టి పెట్టండి**

కర్నూలు మార్కెట్‌లో ఉల్లి కొనుగోళ్ల మద్దతు ధరపైనా ముఖ్యమంత్రి సమీక్షించారు. ఉల్లి క్వింటాలుకు రూ.1200 ధర తగ్గకుండా చూడాలని సీఎం స్పష్టం చేశారు. ఎవరైనా ఆ ధరకంటే తక్కువకు అమ్ముకుంటే ఆ మేరకు ప్రభుత్వం చెల్లిస్తుందని పేర్కొన్నారు. ఉల్లి పంట ఉత్పత్తి అంచనాల మేరకు నిల్వ చేసేందుకు గోదాములు, కోల్డ్ స్టోరేజీ సౌకర్యాలను కల్పించాలని సూచించారు. కొనుగోలు చేసిన ఉల్లిని రైతు బజార్లతో పాటు మార్కెట్ కు కూడా తరలించాలని స్పష్టం చేశారు. కర్నూలు జిల్లా కోడుమూరులో పురుగు మందు డబ్బాతో ఆత్మహత్యకు పాల్పడిన ఘటనపై ముఖ్యమంత్రి ఆరా తీశారు. ఈ ఘటనలో డ్రామా ఆడిన వారిపై విచారణ చేస్తున్నామని అధికారులు తెలిపారు. పంటను కనీస మార్కెట్ తేకుండానే పురుగుమందు తాగినట్టుగా డ్రామా చేసిన వ్యవహారంపై చర్యలు తీసుకుంటున్నామని అధికారులు స్పష్టం చేశారు. మరోవైపు అరకులో కాఫీ పంటకు సోకిన కాయతొలుచు పురుగు తెగులుపైనా తక్షణ చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఇప్పటికే తెగులు సోకిన 60 ఎకరాల్లో పంట తొలగించామని మరో 20 ఎకరాల్లో తొలగింపు ప్రక్రియ జరుగుతోందని అధికారులు సీఎంకు వివరించారు. అలాగే తురకపాలెం గ్రామంలో తలెత్తిన ఆరోగ్య పరిస్థితిపైనా ముఖ్యమంత్రి అధికారులకు పలు సూచనలు జారీ చేశారు. ఈ వ్యాధికి మూలం ఎక్కడుందన్న అంశాన్ని గుర్తించాలని ఆదేశించారు. దీన్ని కేస్ స్టడీగా తీసుకుని రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లోనూ ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సీఎం సూచించారు.

**పౌర సేవల్లో సంతృప్త స్థాయికే ప్రాధాన్యత**

ప్రభుత్వ విభాగాలు అందించే వివిధ పౌరసేవల్లో సంతృప్త స్థాయిపై ఇక ప్రతీవారం సమీక్షిస్తానని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. పెన్షన్లు, ఉచిత గ్యాస్, ఆర్టీసీ, రెవెన్యూ, పంచాయతీరాజ్ ఇలా వేర్వేరు శాఖల్లో అందిస్తున్న సేవలపై ఇంకా సంతృప్త స్థాయి పెరగాలని సీఎం పేర్కొన్నారు. ప్రజల నుంచి వ్యక్తం అయ్యే అభిప్రాయాలను డేటా అనలటిక్స్ ద్వారా విశ్లేషించి తగిన నిర్ణయం తీసుకుంటామని సీఎం తెలిపారు. కొన్ని చోట్ల రాజకీయ కారణాల వల్ల కూడా ప్రజల సంతృప్త స్థాయిపై ప్రభావం చూపుతోందని సీఎం అన్నారు. ప్రతీ ప్రభుత్వ శాఖ ప్రజలకు అందించే పౌరసేవల్ని మరింతగా మెరుగుపర్చుకోవాలని సూచించారు. అలాగే కీ పెర్ఫార్మెన్సు ఇండికేటర్లు ఏమేరకు రాష్ట్ర స్థూల ఉత్పత్తి పెరిగేందుకు ఉపకరిస్తున్నాయన్న అంశాన్ని కూడా పరిగణనలోకి తీసుకుంటామని సీఎం పేర్కొన్నారు. ఆర్టీజీఎస్ నుంచి నిర్వహించిన సమీక్షకు సీఎస్ కే.విజయానంద్ సహా వ్యవసాయ శాఖ, వైద్యారోగ్యశాఖ, మార్కెటింగ్, ఐటీ శాఖ ఉన్నతాధికారులు హాజరయ్యారు.

**యూరియా సరఫరాపై అధికారులతో టెలికాన్ఫరెన్స్**

వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి యూరియా సరఫరా, లభ్యతపై రైతులకు నమ్మకాన్ని కల్పించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. జిల్లా కలెక్టర్లు, వ్యవసాయ శాఖ అధికారులతో మరోమారు టెలికాన్ఫరెన్సు నిర్వహించారు. రాష్ట్రంలో యూరియా లభ్యత సమృద్ధిగానే ఉందని దానిని సక్రమంగా వినియోగించుకోవాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. మోతాదుకు మించి ఎరువులు వినియోగిస్తే భూసారం కూడా దెబ్బతింటుందన్న అంశాన్ని రైతులకు అవగాహన కల్పించాలని అన్నారు. కొందరు రైతులు రబీ కోసం కూడా ఇప్పుడే కొనుగోలు చేయకుండా చూడాలని అన్నారు. రబీ పంట కోసం ముందస్తుగానే ఎరువులను సిద్ధం చేస్తున్నట్టు సీఎం పేర్కొన్నారు. కొందరు రాజకీయ ముసుగులో క్రిమినల్స్ తరహాలో ఆలోచిస్తూ ఎరువులు లభ్యత ఉండదన్న అభద్రతా భావాన్ని కల్పిస్తున్నారని దీన్ని నియంత్రించాలన్నారు.

ఎక్కడా రైతుల్లో ఆందోళన లేకుండా భరోసా కల్పించాలని స్పష్టం చేశారు. సీజన్ లో సాగునీరు ముందుగానే ఇవ్వటం వల్ల పంటల సాగుకూడా ఎక్కువ చేశారని.. వాణిజ్య పంటలైన ఉల్లి, మామిడి, మ్యాంగో, టమాటో, చీని కాయల ఉత్పత్తి ఎక్కువ వచ్చే అవకాశం ఉందని .. దీనికి స్వల్ప, మధ్య, ధీర్ఘ కాలిక ప్రణాళికలు ఉండాలని సూచించారు. మరోవైపు ఏజెన్సీ ప్రాంతాల్లో మలేరియా సహా విష జ్వరాలు సోకకుండా చర్యలు చేపట్టాలని సీఎం జిల్లా కలెక్టర్ కు సూచనలు జారీ చేశారు. ఆర్టీజీఎస్ సమీక్షతో పాటు టెలికాన్ఫరెన్సు ద్వారా దాదాపు 5 గంటల పాటు సీఎం యూరియా సహా వివిధ అంశాలపై సమీక్షించారు. టెలికాన్ఫరెన్సు ద్వారా నిర్వహించిన సమీక్షకు మంత్రి అచ్చెన్నాయుడు, వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్లు, జిల్లా వ్యవసాయ అధికారులు హాజరయ్యారు.



పార్లమెంట్ సెంట్రల్ హాల్‌లో సోమవారం ప్రతిపక్ష పార్టీ ఎంపీల సమావేశంలో కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే, పార్టీ సీనియర్ నాయకురాలు సోనియా, ఎస్పీ అధినేత అఖిలేష్ , ఎన్‌సిపి (ఎస్పీ) చీఫ్ శరద్ పవార్ తదితరులు

## విశాఖ అభివృద్ధికి రూ.553 కోట్లతో నూతన ప్రాజెక్ట్

### సిఎం చంద్రబాబు సమక్షంలో జివిఎంసి, ఐఎఫ్‌సి మధ్య కుదిరిన ఒప్పందం

**విజయవాడ, సెప్టెంబర్ 8,ప్రభాతవార్తప్రతినిధి:** విశాఖ నగరాభివృద్ధి కోసం అంతర్జాతీయ ఆర్థిక సంస్థ (ఐఎఫ్‌సి) నుంచి విశాఖపట్నం మహానగర పాలక సంస్థ (జివిఎంసి) రుణం తీసుకునేందుకు సంబంధించి ఐఎఫ్‌సీజీవీఎంసీ అధికారులు మధ్య ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సమక్షంలో ఒప్పందం జరిగింది. అనంతరం జీవీఎంసీ అధికారులు ముఖ్యమంత్రితో సమావేశమై త్వరలో చేపట్టే అభివృద్ధి ప్రాజెక్టు వివరాలను వెల్లడించారు. ఈ ఒప్పందంతో భారతదేశంలో మొదటిసారిగా అంతర్జాతీయ ఆర్థిక సంస్థ నుంచి ప్రత్యక్ష రుణం పొందిన మున్సిపల్ కార్పొరేషన్‌గా జీవీఎంసీ నిలిచిందని అధికారులు తెలిపారు. విశాఖపట్నంలోని మధురవాడ జోన్-2లో ఆధునిక మురుగునీటి వ్యవస్థను ప్రాజెక్టులో భాగంగా అభివృద్ధి చేయనున్నారు. దీనికి మొత్తం రూ.553 కోట్లు వ్యయం అయ్యే ఈ ప్రాజెక్టులో రూ.498 కోట్లు ఐఎఫ్‌సీ రుణంగా ఇవ్వనుంది. మిగిలిన మొత్తంలో అమృత్ 2.0 నుంచి రూ.45.64 కోట్లు, జీవిఎంసీ సొంత నిధులు రూ. 9.36 కోట్లు వినియోగించనుంది. జీవీఎంసీ తన సొంత ఆదాయ వనరుల ద్వారా ఈ రుణాన్ని తిరిగి ఐఎఫ్‌సీకి చెల్లించనుంది. 15 సంవత్సరాల కాలపరిమితి కలిగిన ఈ రుణానికి వడ్డీ రేటు 8.15 శాతం (ఫ్లోటింగ్)గా నిర్ణయించారు. త్వరలో మొదలయ్యే మధురవాడ మురుగునీటి ప్రాజెక్టుతో 100 శాతం అండర్‌గ్రౌండ్ మురుగునీటి నెట్‌వర్క్, ఆధునిక పంపింగ్ లిఫ్టింగ్ స్టేషన్లు, అత్యాధునిక శుద్ధి కేంద్రం - నీటి పునర్వినియోగం, రీసైక్లింగ్ చేయనున్నారు. 30 ఏళ్ల జనాభా వృద్ధి అవసరాలను దృష్టిలో పెట్టుకొని దీనిని డిజైన్ చేశారు. నీటి శుద్ధి వల్ల వ్యాధులు తగ్గడంతో పాటు, భూగర్భజలాలు కలుషితం కావు, పర్యావరణానికి మేలు చేస్తుంది. వరద నీటి నిర్వహణ సాధ్యమవుతుంది. ఈ ప్రాజెక్టు పరిధిలో నివసిస్తున్న రెండున్నర కోట్ల మందికి ఉపయోగకారిగా ఉంటుంది. ఈ ఒప్పందం ద్వారా భారతదేశంలో నగరాల ఆర్థిక స్వయంప్రతిపత్తికి కొత్త దారి చూపినట్టయ్యింది.

## మెట్రో ప్రాజెక్ట్ టెండర్ డెడ్‌లైన్ పొడిగింపు

**విజయవాడ,సెప్టెంబరు 8,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ మెట్రో రైలు కార్పొరేషన్ ఎండీ ఎస్వీ రామకృష్ణారెడ్డి కీలక ప్రకటన చేశారు. విజయవాడ,విశాఖపట్నంలో చేపట్టబోయే మెట్రో రైలు ప్రాజెక్ట్ టెండర్లకు గడువు పొడిగిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇక విజయవాడ మెట్రో రైల్ టెండర్ల గడువు అక్టోబరు 14వ తేదీ వరకు పొడిగించగా, వైజాగ్ మెట్రోరైల్ టెండర్ల గడువు అక్టోబరు 7వ తేదీ వరకు పొడిగించబడింది అన్నారు. అయితే, టెండర్ల ప్రీబిడ్ మీటింగ్‌లో కాంట్రాక్ట్ సంస్థల నుంచి వచ్చిన వినతులను పరిశీలించడానికి ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. అయితే విశాఖపట్నంలో మెట్రోరైల్ ఫేజ్ 1 క్రింద 46.23 కి.మీ తొలి దశ నిర్మాణానికి టెండర్లు పిలవగా విజయవాడలో మెట్రో రైల్ ఫేజ్-1 కింద 38 కిలోమీటర్ల మేర నిర్మాణానికి కూడ టెండర్లు పిలిచినట్లు తెలుసో_ంది. ఈ నిర్ణయంతో ప్రాజెక్ట్ వేగవంతమైన అభివృద్ధికి మేలు చేస్తుందని, గడువు పొడిగింపుల ద్వారా కాంట్రాక్టర్లకు సమయం సమకూర్చే అవకాశం లభిస్తుందని ఏపీ మెట్రో రైల్ కార్పొరేషన్ ఎండీ ఎస్వీ రామకృష్ణారెడ్డి తెలిపారు. విజయవాడ, విశాఖపట్నంలలో మెట్రో రైల్ ప్రాజెక్టు మొదటి దశ పనులను 3 సంత్సరాలలో పూర్తి చేయనున్నారు. మొదటి దశ మెట్రో రైల్ ప్రాజెక్టు పనులకు 2 నగరాల్లో కలిపి మొత్తం 21,616 కోట్ల రూపాయలు ఖర్చు చేయనున్నారు. మెట్రో రైల్ ప్రాజెక్టు తొలిదశ పనులకు అయ్యే వ్యయంలో రాష్ట్ర ప్రభుత్వం 20 , కేంద్ర ప్రభుత్వం 20 నిధులు కేటాయించనుంది. రాష్ట్ర ప్రభుత్వం తన వాటా నిధులను విశాఖ నగరపాలక సంస్థ, సీఆర్డీఏ నుంచి సమకూర్చనుంది. మిగిలిన 60 నిధులను అంతర్జాతీయ బ్యాంకుల నుంచి తక్కువ వడ్డీకి రుణంగా తీసుకోనున్నారు. దేశంలో ప్రస్తుతం ఉన్న మెట్రో రైల ప్రాజెక్టులకంటే అధునాతనంగా, వినూత్న మోడళ్లలో విజయవాడ, విశాఖ మెట్రో రైలు ప్రాజెక్టులు నిర్మించనున్నారు. ప్రస్తుతం ఉన్న మెట్రో రైలు ప్రాజెక్టుల్లో రైలు పై భాగంలో ఎలక్ట్రిక్ లైన్లు ఉండగా, ఆంధ్రప్రదేశ్ లో నిర్మించే ప్రాజెక్టుల్లో మాత్రం ఓవర్ హెడ్ లైన్లు లేకుండానే నిర్మిస్తున్నారు.

# గెలుపెవరిది?

>> మరో కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు, శివసేన ఎంపీ శ్రీకాంత్ షిండే ఉన్నారు. మరి కొద్ది గంటల్లో ఉపరాష్ట్రపతి ఎన్నిక జరగనున్న నేపథ్యంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఎన్డీయే ఎంపీలకు సోమవారం రాత్రి డిన్నర్ ఇచ్చారు. ఓటింగ్ సందర్భంగా ఎంపీల మధ్య పూర్తి సమన్వయం, ఐక్యతకు ఈ తరహా విందు సమావేశాలు ఎంతో ఉపకరిస్తుంటాయని ఎన్డీయే సీనియర్ నేత ఒకరు తెలిపారు. తమ ఉపరాష్ట్రపతి అభ్యర్థి సీపీ రాధాకృష్ణన్‌కు ఎన్డీయే భాగస్వాముల నుంచి పూర్తి మద్దతు ఉందని చెప్పారు. పార్లమెంటు వర్షాకాల సమావేశాల తొలిరోజు జగ్‌దీప్ ధన్‌ఖడ్ ఉపరాష్ట్రపతి పదవికి రాజీనామా చేశారు. దీంతో ఆ పదవికి ఎన్నిక అనివార్యమైంది. ఈ ఎన్నికల్లో ఎన్డీయే అభ్యర్థిగా సీపీ రాధాకృష్ణన్, ఇండియా కూటమి అభ్యర్థి సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి, జస్టిస్ బి.సుదర్శన్ రెడ్డి మధ్య ముఖాముఖీ పోరు నెలకొంది. ఉభయసభల్లోని ఎంపీలు ఉపరాష్ట్రపతిని ఎన్నుకుంటారు. రాజ్యాంగంలోని 64, 68 అధికరణలోని నిబంధనల కింద ఉపరాష్ట్రపతి ఎన్నిక జరుగుతోంది. ఈ ఎన్నికలను ఎలక్షన్ కమిషన్ నోటిఫై చేసింది. సీక్రెట్ బ్యాలెట్ పద్ధతిలో ఓటింగ్ జరగనుంది. ఉపరాష్ట్రపతి ఎన్నిక ముందే పలు పార్టీలు తమ నిర్ణయాలను ప్రకటిస్తున్నాయి. తెలంగాణ నుంచి బిఆర్ఎస్ పార్టీ ఈ ఎన్నికకు దూరంగా ఉంటున్నట్లు ప్రకటించింది. తాజాగా మరో పార్టీ కూడా బిఆర్ఎస్ బాటలోనే తమ నిర్ణయాన్ని తెలిపింది. ఒడిశాలోని ప్రధాన ప్రతిపక్ష పార్టీ బిజూ జనతాదళ్ ఉపరాష్ట్రపతి ఎన్నిక ఓటింగ్‌లో తమ పార్టీ ఎంపిలు దూరంగా ఉంటారని తెలిపింది. ఈ విషయాన్ని ఆ పార్టీ రాజ్యసభ ఎంపి సస్మిత్ పాత్రా వెల్లడించారు. పార్టీ ఎంపిలు, రాజకీయ వ్యవహారాల కమిటీలతో సంప్రదింపుల అనంతరం మాజీ సిఎం,బిజెడి అధినేత నవీన్ పట్నాయక్ ఈ నిర్ణయం తీసుకున్నారని ప్రకటించారు. ఎన్డీఎ,ఇండియా కూటములకు తమ పార్టీ సమాన దూరం కొనసాగించాలనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. తమ దృష్టి అంతా రాష్ట్రాభివృద్ధి, 4.5 కోట్ల ప్రజల అభ్యున్నతి పైనే అని పాత్ర తెలిపారు. బిజెడికి రాజ్యసభలో ఏడుగురు ఎంపిలు ఉన్నారు. ఇప్పటికే ఈ ఎన్నికలకు దూరంగా ఉండనున్నట్టు భారత రాష్ట్ర సమితి ప్రకటించింది. రాష్ట్రంలో యూరియా కొరతపై తమ ఆందోళనను తెలియజేసేందుకు, రైతులకు మద్దతుగా నిలిచేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్టు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు తెలిపారు. తెలంగాణ రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవహరిస్తున్న తీరుకు నిరసనగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు స్పష్టం చేశారు. రైతుల పక్షాన తమ గళాన్ని వినిపించేందుకే ఈ ఎన్నికలను బహిష్కరిస్తున్నట్లు ఆయన తెలిపారు. రాష్ట్రంలో యూరియా కొరతతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంలో రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రెండూ రైతాంగాన్ని వేధిస్తున్నాయని ఆరోపించారు. యూరియా సమస్యపై తాము 20 రోజుల ముందే హెచ్చరించినా, రెండు ప్రభుత్వాల నుంచి ఎలాంటి స్పందన రాలేదని కేటీఆర్ విమర్శించారు. రాష్ట్రంలోని 70 లక్షల మంది రైతుల తరఫున నిరసన తెలిపేందుకే ఈ కఠిన నిర్ణయం తీసుకున్నామని వివరించారు. "మేము ఎన్డీఏకు గానీ,ఇండియా కూటమికి గానీ జవాబుదారీ కాదు. కేవలం తెలంగాణ ప్రజలకు మాత్రమే జవాబుదారీ" అని ఆయన అన్నారు. ఉపరాష్ట్రపతి ఎన్నికల బహిష్కరణను ఒక వేదికగా ఉపయోగించుకుని, తెలంగాణ రైతుల బాధలను దేశం దృష్టికి తీసుకెళుతున్నామని ఆయన పేర్కొన్నారు. తమ పోరాటం కేవలం రైతుల సంక్షేమం కోసమేనని కేటీఆర్ తేల్చిచెప్పారు. బిఆర్ఎస్ పార్లమెంటరీ పక్ష నేత కెఆర్ సురేశ్‌రెడ్డి ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ ఇద్దరు అభ్యర్థుల పట్ల తమకు అపారమైన గౌరవం ఉందని, వారు తమ రంగాల్లో నిష్ణాతులని పేర్కొన్నారు. ముఖ్యంగా ఒక అభ్యర్థి తమ రాష్ట్రానికి చెందినవారే అయినప్పటికీ, రైతుల సమస్యలకే తమ పార్టీ మొదటి ప్రాధాన్యం ఇస్తుందని ఆయన స్పష్టం చేశారు. బీఆర్ఎస్‌కు రాజ్యసభలో నలుగురు సభ్యులు ఉన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం ఇప్పటికే పోలింగ్‌కు సంబంధించిన అన్ని ఏర్పాట్లను పూర్తి చేసింది. పార్లమెంటు ఉభయ సభలకు చెందిన మొత్తం 781 మంది ఎంపీలు ఈ ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఇందులో లోక్‌సభ నుంచి 542 మంది, రాజ్యసభ నుంచి 239 మంది సభ్యులు ఉన్నారు. అభ్యర్థి గెలుపొందాలంటే కనీసం 391 ఓట్లు సాధించాల్సి ఉంటుంది. ప్రస్తుత బలాబలాలను పరిశీలిస్తే, ఎన్డీఏ కూటమికి మొత్తం 425 మంది సభ్యుల మద్దతు ఉంది. 11మంది సభ్యులున్న వైసీపీ పార్టీ ఎన్‌డీఏకు మద్దతు ఇవ్వాలని నిర్ణయించడంతో మెజార్టీ పెరిగింది. దీంతో వారి అభ్యర్థి సీపీ రాధాకృష్ణన్ విజయం దాదాపు ఖాయంగా కనిపిస్తోంది. మరోవైపు, ఇండియా కూటమికి 311 మంది సభ్యుల బలం ఉండగా, మరో 45 మంది ఇతరులు ఉన్నారు. తాను ఏ పార్టీకి చెందినవాడిని కాదని, పార్టీలకు అతీతంగా విజ్ఞతతో ఓటు వేయాలని జస్టిస్ సుదర్శన్ రెడ్డి ఇప్పటికే ఎంపీలకు విజ్ఞప్తి చేశారు. ఈ నేపథ్యంలో క్రాస్ ఓటింగ్ జరిగి ఏమైనా సమీకరణాలు మారతాయా అని రాజకీయ విశ్లేషకులు ఆసక్తిగా గమనిస్తున్నారు. అయినప్పటికీ, సంఖ్యాబలం దృష్ట్యా ఎన్డీఏ అభ్యర్థికే విజయావకాశాలు మెండుగా ఉన్నాయి. ఉపరాష్ట్రపతి ఎన్నికకు సర్వం సిద్ధమైంది. మంగళవారం జరగనున్న ఎన్నిక కోసం అన్ని ఏర్పాట్లు చేశారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ జరగనుండగా, సాయంత్రం ఆరు గంటలకు లెక్కింపు జరగనుంది. లెక్కింపు పూర్తికాగానే ఫలితాలను వెలువరించనున్నారు. పార్లమెంట్ భవనంలో రహస్య ఓటింగ్ విధానంలో జరిగే పోలింగ్‌లో ఉభయ సభల సభ్యులు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. రాజ్యసభ, లోక్‌సభ సభ్యులతో కూడుకున్న ఎలక్టోరల్ కాలేజీలో ఎంపీలు తమకు నచ్చిన వారికి ఓటు వేసే వెసులుబాటు ఉంటుంది. అయినప్పటికీ తమ పార్టీకే ప్రాధాన్యం ఇస్తారు. క్రాస్ ఓటింగ్ జరిగే అవకాశము కూడా ఉంటుంది. దీంతో అధికార ఎన్‌డీఏ పూర్తి మెజార్టీ ఉన్నప్పటికీ జాగ్రత్తగా వ్యవహరిస్తోంది. ఇందులో ప్రతి సభ్యుడి ఓటు విలువ ఒకటిగానే ఉంటుంది. శిరోమణి అకాలీదళ్, మిజోరం పీపుల్స్ మూమెంట్ లాంటి పార్టీలకు ఒక్కో సభ్యుడు మాత్రమే ఉన్నారు. విపక్షాల అభ్యర్థికి మద్దతు ఇస్తున్నట్లు పది మంది ఎంపీలు ఉన్న ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) ప్రకటించినప్పటికీ, ఎంపీ స్వాతి మాలివాల్‌కు ఆ పార్టీతో సంబంధాలు క్షీణించిన నేపథ్యంలో, ఆమె ఎవరికి ఓటు వేస్తారనే దానిపై స్పష్టత లేదు. స్వతంత్ర అభ్యర్థులు, ఇతర పార్టీ సభ్యులు ఎవరివైపు మొగ్గు చూపుతారనే విషయంపై ఆసక్తి నెలకొంది. మరోవైపు ఎన్నిక ప్రక్రియపై అవగాహన కల్పించేందుకు ఎన్‌డీఏ, ఇండియా కూటమిలు తమ ఎంపీలతో వేర్వేలు సమావేశాలు నిర్వహించాయి. సంవిధాన్ సదన్‌లోని సెంట్రల్ హాల్‌లో తమ ఎంపీలతో భేటీ నిర్వహించి ఈ ఎన్నికలో ఓటు వేయాల్సిన పద్ధతిని, పాటించాల్సిన విధివిధానాలను సభ్యులకు ఇండియా కూటమి వివరించింది. సమావేశం అనంతరం వారికి మాక్ పోల్ నిర్వహించారు. తమ కూటమి బలంగా ఉందని ప్రతిపక్షాలు పూర్తిగా ఐక్యంగా ఉన్నాయని విపక్ష ఎంపీలు అన్నారు. మెజార్టీ మార్జిన్ తక్కువగా ఉందని, అందువల్ల తమ అభ్యర్థి జస్టిస్ సుదర్శన్ రెడ్డి గెలుస్తారని విశ్వాసం వ్యక్తం చేశారు. తప్పుడు ఓటింగ్ జరిగే అవకాశం లేకుండా మాక్ డ్రిల్ నిర్వహించినట్లు చెప్పారు. పార్టీలకు అతీతంగా ఆలోచించి ఓటు వేయాలని విపక్షాల ఉమ్మడి అభ్యర్థి జస్టిస్ సుదర్శన్ విజ్ఞప్తి చేశారు. వంద శాతం ఈ ఎన్నికల్లో గెలుపు తనదేనని ధీమా వ్యక్తం చేసిన ఆయన, జాతీయ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని ఓటు వేయాలని కోరారు. ఈ వ్యాఖ్యలపై స్పందించిన ఎన్డీయే అభ్యర్థి సీపీ రాధాకృష్ణన్ ప్రతి ఒక్కరూ దేశం పట్ల మాత్రమే ఆసక్తి చూపుతున్నారని వ్యాఖ్యానించారు.

9-9Pg3 bz_9-9Pg3 bz.qxd 9/9/2025 12:29 AM Page 1





# ఇఒ శ్యామలరావు బదిలీ

## సిఎం ఆదేశాలకనుగుణంగా 15 నెలలు సంస్కరణల పాలన
## అన్నదానం, లడ్డూల నాణ్యత పెంపుపై ప్రత్యేక ఫోకస్

**తిరుమల,సెప్టెంబరు 8ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల తిరుపతిదేవస్థానం కార్యనిర్వహణాధికారి(ఇఒ) జె.శ్యామలరావు బదిలీ అయ్యారు. సీనియర్ ఐఎఎస్ అధికారిగా ఉన్న అనుభవంతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గత ఏడాది జూన్ 16న రాష్ట్రఉన్నతవిద్యాశాఖ కార్యదర్శి స్థానం నుండి టిటిడి ఇఒగా శ్యామలరావును నియమించారు. గత ఏడాది టిటిడిలో ఉన్న అస్తవ్యస్థ పాలన, గాడితప్పిన అనేక పథకాలను చక్కబెట్టేందుకు శ్యామలరావుకు బాధ్యతలు అప్పగించారు. చంద్రబాబు ఆదేశాలకనుగుణంగా శ్యామలరావు గత 15నెలల పాలనలో అనేక సంస్కరణలు తీసుకువచ్చారు. ముఖ్యంగా సామాన్యభక్తులు అన్నప్రసాదాలపై తీవ్ర అసంతృప్తి చెందేవారు. అంతేగాక రుచిగా శుచిగా లేవనే ఫిర్యాదులు అందాయి. ఏడుకొండల స్వామి లడ్డూప్రసాదాల నాణ్యత సరిగా లేదని, నెయ్యివాసన,రుచి లేకపోయిందని, కుంకుమపువ్వు, యాలకులు,నెయ్యిమిశ్రమం కూడా వాడటంలేదని, చక్కెరశాతం ఎక్కువగా ఉందనే ఫిర్యాదులు భక్తుల నుండి వెల్లువెత్తాయి. అప్పట్లోనే గత ఐదేళ్ళ వైసిపి పాలనలో టిటిడి ధర్మకర్తలమండలి పెద్దలు, అప్పటి అధికారులు కల్తీ చేసిన నెయ్యిని వినియోగించి లడ్డూలు తయారుచేశారనే ఆరోపణలు వెల్లువెత్తాయి. దీనిపై సమగ్రంగా అటు పోటు కార్మికులను ఇటు వైష్ణవబ్రాహ్మణులతో సమన్వయంగా సమావేశం నిర్వహించి పలు అంశాలపై దర్యాప్తు చేపట్టారు. ఏకంగా కల్తీనెయ్యివాడారనే బాగోతంపై లోతుగా దర్యాప్తుచేయించి ఆధారాలను వెలికితీశారు. ఇంకా టిటిడిలో పలు సంస్కరణలు చేపట్టారు. టిటిడిలో అన్యమత ఉద్యోగులకు విఆర్ఎస్, ఇతర ప్రభుత్వ శాఖలకు బదిలీ వ్యవహారం, ఉద్యోగులకు నేమ్‌బ్యాడ్జ్‌లు అమలువంటివి ఛైర్మన్ నాయుడుతో విభేధించారు. అయితే దురదృష్టవశాత్తు టిటిడి పాలనపై పూర్తిగా పట్టు సాధించలేకపోయిన శ్యామలరావు నేతృత్వంలో ఈ ఏడాది జనవరిలో వైకుంఠద్వారదర్శనాలకు సంబంధించి ఆఫ్‌లైన్‌లో తిరుపతిలో టోకెన్ల జారీ ఘటనలో అవగాహన లేక, క్రిందిస్థాయి అధికారుల అత్యుత్సాహంతో ప్రమాదం తప్పిదం జరిగింది. దీంతో ఆరుగురు భక్తులు తొక్కిసలాటలో ప్రాణాలు కోల్పోయారు. అప్పట్లోనే ఈ ఘటనపై టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడుకు, ఇఒ శ్యామలరావుకు మధ్య సమన్వయం లేకపోయింది. అధికారుల తప్పిదం వల్లనే ఈ దారుణం జరిగిందని, తనకు మాటవరుసకైనా ఇఒ విషయాలు చెప్పలేదనేది సిఎం చంద్రబాబు తిరుపతి పర్యటనలో ఆయన ఎదుటే మాట మాట చేసుకున్నారు. దీన్ని అప్పట్లోనే సిఎం తీవ్రంగా తీసుకున్నా చేసేది ఏమీ లేక శ్యామలరావును కొనసాగించారు. అయితే టిటిడిలో తిరుమలలో ఇఒగా శ్యామలరావు అటు ఛైర్మన్‌తో విభేధిస్తున్నాడనేది ప్రధానమైన ఆరోపణ. ఈ నేపథ్యంలో తాజాగా 11మంది ఐఎఎస్‌ల బదిలీల్లో టిటిడి ఇఒ శ్యామలరావు జిఎడిలో ప్రభుత్వ పొలిటికల్ ప్రిన్సిపల్ కార్యదర్శిగా నియమించారు. దీంతో దేవదేవుని బ్రహ్మోత్సవాలకు ముందు ఇఒ బదిలీ మాత్రం సంచలనమే. సహజంగా రాష్ట్రప్రభుత్వ పరిపాలనలో ప్రధాన కార్యదర్శి హోదాకంటే ధార్మికసంస్థ తిరుమల తిరుపతిదేవస్థానంలో కార్యనిర్వహణాధికారి(ఇఒ)గా పనిచేసే భాగ్యం జీవితంలో అధికారికి అయినా మరచిపోలేని అనుభూతి. అలాంటిది ఏడుకొండలవెంకన్న వార్షిక బ్రహ్మోత్సవాలకు సమయం సమీపిస్తున్న తరుణంలో ఇఒ బదిలీ జరగడం మాత్రం ఆయన జీర్ణించుకోలేని పరిస్థితి. దేవునికి దగ్గరుండి సేవచేసుకునే భాగ్యం కలిగించుకోవడం నిజంగా అదృష్టమే. అలాంటిది సరిగ్గా ఉత్సవాలకు ముందే ఆయన బదిలీ అనివార్యమైంది. గత ఏడాది జూన్ 16న ఇఒగా బాధ్యతలు చేపట్టిన శ్యామలరావు తనదైనశైలిలో దేవుని చెంత ప్రతి భక్తుడిలో సంతోషం చూసేలా పనిచేస్తానని, సామాన్య భక్తుడికి ఇబ్బంది లేకుండా సౌకర్యాలుకల్పిస్తానని, సిఎం విజన్ 2047కు తగ్గట్లు తిరుమలలో పాలన చేస్తానని చెప్పిన శ్యామలరావు అందుకు అవసరమైన కీలక చర్యలు తీసుకోవడంలో ఆయన సాహసం చేయలేకపోయారనేది ఉద్యోగవర్గాల్లో గుప్పుమంటోంది.

# హాకీ జట్టుకు సిఎం చంద్రబాబు అభినందనలు

**విజయవాడ,సెప్టెంబరు8,ప్రభాతవార్తప్రతినిధి:** బీహార్‌లోని రాజ్‌గిర్‌లో జరిగిన 2025 ఆసియా కప్‌లో ఛాంపియన్ నిలిచిన భారత పురుషుల హాకీ జట్టుకు ఏపీ సిఎం చంద్రబాబు అభినందనలు తెలిపారు. ఈ మేరకు సోషల్ వేదికగా పోస్టు చేశారు. డిఫెండింగ్ ఛాంపియన్స్ దక్షిణ కొరియాపై 4-1 తేడాతో విజయం సాధించి ఎనిమిది సంవత్సరాల తర్వాత భారత జట్టు టైటిల్‌ను తిరిగి పొందిందని పేర్కొన్నారు. ఈ విజయం భారత క్రీడలో గర్వించదగ్గ మైలురాయి అని తెలిపారు. యువ ఆటగాళ్ల ధైర్యం, పట్టుదలను కొనియాడారు. మన ఆటగాళ్ళు భారతదేశ గొప్ప హాకీ వారసత్వాన్ని ముందుకు తీసుకెళ్లడం కొనసాగిస్తారని, ప్రపంచ వేదికపై మరిన్ని చిరస్మరణీయ ప్రదర్శనలను ఇవ్వాలని కోరారు. అదేవిధంగా భారత హాకీ జట్టు ఆసియా కప్2025లో చారిత్రక విజయం సాధించడం పట్ల జట్టు సభ్యులకు హృదయపూర్వక అభినందనలని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తెలిపారు. హాకీ మాంత్రికుడు మేజర్ ధ్యాన్ చంద్ స్ఫూర్తితో జట్టు సభ్యులు ముందుకు సాగాలని కోరారు. ఎనిమిదేళ్ల తర్వాత టైటిల్ సాధించి జాతిని గర్వపడేలా చేసిన క్రీడాకారులకు అభినందనలు తెలిపారు.

# సిపిఎస్ ఉద్యోగులకు ప్రభుత్వం తీపికబురు

**విజయవాడ,సెప్టెంబరు 8,ప్రభాతవార్తప్రతినిధి:** సీపీఎస్ ఉద్యోగులకు సర్కారు మొదటి విడత డీఏ బకాయిలను విడుదల చేసింది. డీఏ ఎరియర్స్ ఏపీ సెక్రటేరియట్ సీపీఎస్ ఉద్యోగులకు జమ అవుతున్నాయి. త్వరలోనే మిగిలిన సీపీఎస్ ఉద్యోగులందరికీ 90 బకాయిలు నగదుగా చెల్లించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. సుమారు ఆరు విడతలుగా ఈ మొత్తం చెల్లింపునకు నిర్ణయం తీసుకున్నారు ప్రస్తుతం ఒక్కో ఉద్యోగికి రూ.40వేలు నుంచి రూ.70వేల వరకు సోమవారం అకౌంట్లకు జమచేసింది. మిగిలిన వారికి 6విడతల్లో ఒక్కో ఉద్యోగికి రూ.2 లక్షల నుంచి రూ.4లక్షల వరకు బకాయిలు చెల్లించేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. డీఏ బకాయిల విడుదలపట్ల ఏపీసచివాలయ సీపీఎస్ ఉద్యోగులసంఘం అధ్యక్ష, ఉపాధ్యక్షులు కోట్ల రాజేష్, నాపా ప్రసాద్‌లు హర్షం వ్యక్తంచేశారు. ఏపీ సచివాలయ సీపీఎస్ ఉద్యోగుల సంఘం హర్షం వ్యక్తం చేసింది.

# ఎక్యూసిసి అనుబంధ కార్యక్రమాలకు కమిటీలు

**విజయవాడ.సెప్టెంబరు8,ప్రభాతవార్తప్రతినిధి:** అమరావతి క్వాంటమ్ కంప్యూటింగ్ సెంటర్ (ఎక్యూసిసి) అనుబంధ కార్యక్రమాలకు అపెక్స్ కమిటీ, నిపుణుల కమిటీలను ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్స్ శాఖ కార్యదర్శి కాటంనేని భాస్కర్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. చెన్నై ఐఐటి డైరెక్టర్ వి.కామకోటి ఛైర్మన్‌గా 13 మంది ఈ రంగంలోని నిపుణులతో అపెక్స్ కమిటీ ఏర్పాటు చేశారు. ఈ కమిటీకి సభ్య కార్యదర్శిగా ఐటిఇ అండ్ సి శాఖ కార్యదర్శి కాటంనేని భాస్కర్ వ్యవహరించనున్నారు. తిరుపతి ఐఐటి డైరెక్టర్ కెఎన్ సత్యనారాయణ ఛైర్మన్‌గా మరో 12 మందితో నిపుణుల కమిటీని నియమించారు. ఈ కమిటీకి సభ్య కార్యదర్శిగా ఐటిఇ అండ్ సి శాఖ ప్రత్యేక కార్యదర్శి బి సుందర్ వ్యవహరించనున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. మరోవైపు గ్లోబల్ కాపాబిలిటీ సెంటర్ (జిసిసి) సలహా మండలిని ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు ఆదివారం మరో జిఓను ఐటిఇ అండ్ సికార్యదర్శి కాటంనేని భాస్కర్ విడుదల చేశారు. ఈసలహా మండలి ప్రతి మూడు నెలలకోసారి సమావేశమై జిసిసి విధానాల అమలుపై సమీక్షించడంతోపాటు, తన సిఫార్సులను ప్రభుత్వానికి అందజేయాలని సూచించారు. ఐటిశాఖ మంత్రి నారా లోకేష్ అధ్యక్షతన మరో 10 మందితో ఈ సలహా మండలిని నియమించారు.

# రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా హసీం బేగ్

**విజయవాడ,సెప్టెంబరు 8,ప్రభాతవార్త:** రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా డాక్టర్ హసీం బేగ్‌ను నియామకం చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా ఆయన మంత్రి కొల్లు రవీంద్రను మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన మాట్లాడుతూ మైనార్టీగా ఉన్న ప్రతి ఒక్కరికీ విద్య, ఉపాధి, ఆర్థికంగా ఎదగడానికి సమాన అవకాశాలు అందించడమే తన లక్ష్యమని ఉద్ఘాటించారు. రాష్ట్ర ప్రభుత్వం మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా అనేక పథకాలను అమలు చేస్తోందని, వీటి ద్వారా మైనార్టీ ప్రజలు స్వయం ఉపాధి పొందేందుకు, వ్యాపారం ప్రారంభించేందుకు, విద్యాభివృద్ధికి, పర్యటనలకు సహాయం అందిస్తోందన్నారు. వ్యాపారం ప్రారంభించాలనుకునే మైనార్టీలకు బ్యాంకు లోన్‌పై ప్రభుత్వం సబ్సిడీ ఇస్తుందని, ఇది వారి స్వయం ఉపాధిని పెంచడంలో ఉపయోగపడుతుందన్నారు. విద్యలో



మంత్రి కొల్లు రవీంద్రను మర్యాదపూర్వకంగా కలిసి రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ హసీం బేగ్

ముందడుగు వేయాలనుకునే విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీఎంబర్స్‌మెంట్, కోచింగ్ సదుపాయాలను ఈపథకాల ద్వారా అందిస్తారన్నారు. పవిత్ర స్థలాలకు వెళ్ళే వారికి ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించి, వారి ధార్మిక ప్రయాణానికి తోడ్పడుతుందని, ఇటీవల హజ్ యాత్రకు వెళ్ళిన వారికి రూ.లక్ష చొప్పున ఆర్థిక సహాయం అందించిందన్నారు. యువతకు నైపుణ్య శిక్షణలు అందించి, ఉద్యోగ అవకాశాలను పెంచేందుకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తుందని, మైనార్టీలు చిన్న, సూక్ష్మ వ్యాపారాలను ప్రారంభించి ఆదాయాన్ని పెంచుకునేందుకు తక్కువ వడ్డీకి మైనార్టీ కార్పొరేషన్ ద్వారా రుణాలందిస్తామన్నారు. మైనార్టీ సమాజానికి ప్రభుత్వంఅందిస్తున్న సహాయాలను సద్వినియోగం చేసుకొని విద్యలో, వ్యాపారంలో ముందడుగు వేసి సమాజ అభివృద్ధికి తోడ్పడదామని పిలుపునిచ్చారు. తనను డైరెక్టర్‌గా నియమించిన రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, రాష్ట్ర ఐటీ శాఖ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, రాష్ట్ర మంత్రి కొల్లురవీంద్ర, కొనకళ్ళ నారాయణ రావులకు ఈసందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.

# వాల్మీకుల ఎస్టీ రిజర్వేషన్ పునరుద్ధరణకు పోరాటం

## ఉమ్మడి చిత్తూరు జిల్లాప్రతినిధుల సమావేశం

**ప్రభాతవార్త ప్రతినిధి,పుంగనూరు సెప్టెంబరు 8:** ఆంధ్రప్రదేశ్‌లో వాల్మీకి, బోయ కులస్తులకు ఎస్టీ రిజర్వేషన్ పునరుద్ధరించేంత వరకు పోరాటాలు కొనసాగించాలని, రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం ప్రారంభించేందుకు కార్యాచరణ సిద్ధం చేస్తున్నామని రాష్ట్ర వాల్మీకి సంఘం అధ్యక్షుడు కనుమ కుంట సుకుమార్ బాబు స్పష్టం చేశారు. కమ ఉమ్మడి చిత్తూరు జిల్లాలకు చెందిన బోయ వాల్మీకి సంఘం కృతజ్ఞతలు సమావేశం ఆదివారం పట్టణంలోని బిఎంఎస్ క్లబ్ లో జరిగింది. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో సుకుమార్ బాబు మాట్లాడుతూ గత ప్రభుత్వం వాల్మీకులను ఎస్టీలుగా పరిగణిసామని మాట చెప్పి తప్పినందువల్ల ఆ పార్టీకి




బుద్ధి చెప్పామన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం కూడా ఎన్నికల సమయంలో వాల్మీకులను ఎస్టీలుగా పరిగణించేందుకు తమ ప్రభుత్వం కృషి చేస్తుందని మాట ఇచ్చిందన్నారు. అయితే, రాష్ట్రంలో ఆర్థికపరమైన సమస్యల వల్ల కూటమి ప్రభుత్వానికి గడువు కేటాయించామన్నారు. దేశంలో వాల్మీకులను గిరిజనులుగా పరిగణించిన తొలి రాష్ట్రాలలో ఆంధ్రప్రదేశ్ కు ప్రముఖ స్థానం ఉందన్నారు. గతంలో రాష్ట్రంలో వాల్మీకులను ఎస్టీలుగా పరిగణించారని, ఆ తరువాత రిజర్వేషన్ తొలగించారన్నారు. రెండు దశాబ్దాలు గా వాల్మీకుల రిజర్వేషన్లపై పోరాటాలు చేస్తున్నప్పటికీ ప్రభుత్వాలు స్పందించలేదన్నారు. ఈ సమావేశంలో సీనియర్ వాల్మీకి సంఘ నాయకులు కుప్పం సురేష్, అద్దాల నాగరాజు, న్యాయవాది ఎల్. భాస్కర్‌లు మాట్లాడుతూ సమాజంలో అణగారిపోయిన వృత్తుల కుటుంబాలలో వాల్మీకుల దయనీయ పరిస్థితిపై భారత మానవ హక్కుల సంఘం కూడా ఆందోళన వ్యక్తం చేసిందని వివరించారు. డాక్టర్ సుబ్రహ్మణ్యం, మాడి శంకరప్ప, వి కోట జయ చంద్ర, రెంటకుంట్ల నరసింహులు, బొమ్మనపల్లి మునిస్వామి, కొలిమి శ్రీనివాసులు, టైలర్ శ్రీనివాసులు, పెద్ద పంజాని గంగప్ప, ఏ. కొత్తకోట చిన్న, కే. రెడ్డప్ప, సోమల శంకరప్ప, శ్రీనివాసులు, వెంకటస్వామి, వెంకటేష్ నేటిగుట్లపల్లి శ్రీనివాసులు, ఈడిగపల్లి నరేష్, బ్యాంకు రాజశేఖర్, రిటైర్డ్ టీచర్ రెడ్డప్పలు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

# చంద్రగ్రహణం తర్వాత తెరుచుకున్న ఆలయాలు

**విజయవాడ,సెప్టెంబరు 8,ప్రభాతవార్త ప్రతినిధి:** చంద్రగ్రహణం తర్వాత ఏపీ.టీజీల్లోని వివిధ ఆలయాలు తెరుచుకున్నాయి. తిరుమలలో ఆలయ శుద్ధి, పుణ్యాహవచనం తర్వాత వేకువజామున 2.40 గంటలకు శ్రీవారి ఆలయ తలుపులు తెరిచారు. సుప్రభాత సేవను అర్చకులు ఏకాంతంగా నిర్వహించారు. తిరుమలలో టోకెన్లు లేని భక్తులకు సర్వ దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. 18 కంపార్ట్‌మెంట్‌లలో భక్తులు వేచి ఉన్నారు. శ్రీశైలం మల్లన్న ఆలయంలో చంద్రగ్రహణం సంప్రోక్షణ పూజలు చేశారు. ఉదయం 5 గంటలకు మల్లన్న ఆలయ ద్వారాలను అధికారులు తెరిచారు. ఆలయ శుద్ది తర్వాత అర్చకులు ప్రాత :కాల పూజలు నిర్వహించారు. ఉదయం 7.30 గంటల నుంచి భక్తులకు స్వామి, అమ్మవార్ల దర్శనాలు ప్రారంభమయ్యాయి. సింహాచలం దేవస్థానం శ్రీవరాహ లక్ష్మీనర్సింహ స్వామికి చంద్రగ్రహణం అనంతరం సంప్రోక్షణ పూర్తి చేశారు. ఉదయం 8 గంటల నుంచి భక్తులు దర్శనాలకు అనుమతినిచ్చారు. విశాఖ బురుజు పేట శ్రీకనక మహాలక్ష్మి ఆలయంలో సంప్రోక్షణ పూర్తి చేసి ఉదయం 9 గంటల నుంచి దర్శనాలకు అనుమతి నిచ్చారు. ఇక తెలంగ3ణాలో బాసర సరస్వతీ అమ్మవారి ఆలయంతో పాటు ఉప ఆలయాల్లో కవాటోద్ఘాటనం గణపతి పూజ నిర్వహించారు. వేకువజామున నుంచి మహా సంప్రోక్షణ, ఆలయ శుద్ధి కార్యక్రమం చేశారు. అనంతరం సుప్రభాతం, విశేష అభిషక్త్రం, మహా నివేదన నీరాజనం, మహా మంత్రపుష్ప నిర్వహించారు. ఆలయంలో యథావిధిగా తిరిగి అక్షరాభ్యాసాలు, ఆర్జిత సేవలు ప్రారంభమయ్యాయి. యాదగిరిగుట్ట లక్ష్మీనర్సింహస్వామి ఆలయాన్ని అధికారులు తెరిచారు. తెల్లవారుజామున 3.30 గంటలకు ఆలయాన్ని తెరిచి అర్చకులు సంప్రోక్షణ చేశారు. నిత్య కైంకర్యాలు నిర్వహించి యథావిధిగా స్వామివారి దర్శనానికి భక్తులకు అనుమతినిచ్చారు. విజయవాడ ఇంద్రకీలాద్రిపై ఉదయం 8.30 గంటల నుంచి భక్తులకు దర్శనానికి అనుమతి ఇచ్చారు. సంప్రోక్షణ, పూజల తర్వాత అమ్మవారి దర్శనానికి వీలు కల్పించారు. చంద్రగ్రహణం ముగిసినందున భద్రాద్రి రామాలయం తలుపులు తెరుచుకున్నాయి. తెల్లవారుజామున 3 గంటలకు రామాలయం తలుపులు తెరుచుకున్నాయి. సుప్రభాత సేవ తర్వాత గోదావరి జలాలతో ఆలయాన్ని అర్చకులు శుద్ధి చేశారు. అనంతరం ప్రధానాలయంలో సీతారామ మూర్తులకు అభిషేకం చేశారు. స్వామివారి మహానివేదన తర్వాత ఉదయం 7.30 గంటల నుంచి భక్తులకు దర్శనానికి అనుమతి నిచ్చారు. ప్రముఖ వైష్ణవ క్షేత్రమైన స్వర్ణగిరి శ్రీ వెంకటేశ్వరస్వామి వారి దేవాలయంలో చంద్రగ్రహణం తర్వాత ఆలయం తలుపులు తెరుచుకున్నాయి.

చంద్రగ్రహణం కారణంగా ఆదివారం ఉదయం 11 గంటలకు ఆలయాన్ని మూసి వేశారు. సోమవారం తెల్లవారుజామున 5 గంటలకుస్వామివారిని సుప్రభాతంతో మేల్కొలిపారు.

# రాష్ట్రంలో గణనీయంగా తగ్గిన ప్రసూతి మరణాల రేటు

**విజయవాడ,సెప్టెంబరు 8,ప్రభాతవార్త ప్రతినిధి:** దేశంలోనే మాతృ మరణాల రేటు తక్కువగా నమోదైన రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ ఒకటిగా నిలిచింది. కేంద్ర జనగణన విభాగం శాంపిల్ రిజిస్ట్రేషన్ సిస్టం ద్వారా విడుదల చేసిన 2021 -2023కి సంబంధించిన ప్రత్యేక బులిటెన్ ప్రకారం, ఆంధ్రప్రదేశ్, కేరళల్లో ఎంఎంఆర్ రేటు 30గా నమోదు అయింది.

ఇది దేశంలోనే అత్యల్పం. ఇది గమనించినప్పుడు రాష్ట్రంలో మాతృ మరణాలు గతంతో పోలిస్తే గణనీయంగా తగ్గాయి. ప్రధాన మంత్రి సురక్షిత్ మాతృత్వ అభియాన్. ప్రధాన మంత్రి మాతృ వందన యోజన పోషణ్ అభియాన్, ఎనీమియా ముక్త్ భారత్ సురక్షిత్ మాతృత్వ్ ఆశ్వాసన్ జననీ సురక్ష యోజన జననీ శిశు సంరక్షణ కార్యక్రమం మాతృ మరణాల సర్వైలెన్స్ రివ్యూ సేఫ్ డెలివరీ క్యాలెండర్ వంటి కార్యక్రమాలను ఏపీలో ఆరోగ్యశాఖ అమలు చేసింది. ఈ చర్యల వల్ల రాష్ట్రంలో ఆరోగ్య మౌలిక సదుపాయాలు బలోపేతం అయ్యాయి. వైద్యసిబ్బందికి శిక్షణ, గ్రామీణ స్థాయిలో అవగాహన, ఎమర్జెన్సీ రిఫరల్ సర్వీసులు కూడా మరణాల తగ్గుదలకు తోడ్పడ్డాయి. ఆంధ్రప్రదేశ్ మాతృ మరణాల రేటులో కేరళతో సమానంగా దేశంలోనే అగ్రస్థానంలో నిలవడం రాష్ట్రానికి గర్వకారణం. అయితే, ఇంకా ఎక్కువ శ్రద్ధ తీసుకుంటే రేటు మరింత తగ్గే అవకాశముందని నిపుణులు చెబుతున్నారు.

జాతీయ ఆరోగ్య మిషన్ కింద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పలు పథకాలు ఈ ఫలితానికి కారణమయ్యాయి. గర్భిణులకు నాణ్యమైన, నగదు రహిత ఆరోగ్య సేవలు అందించడం వల్ల మాతాశిశు మరణాల రేటు తగ్గింది. ఆంధ్రప్రదేశ్‌లో మాతృ మరణాల రేటు క్రమంగా తగ్గుతూ వస్తోంది.

2018-20లో 45, 2019-21లో 47, 2021 -23లో 30 ఈ తగ్గుదల రాష్ట్ర ఆరోగ్య రంగంలో తీసుకున్న చర్యలకు నిదర్శనం. ప్రసూతి సమయంలో తల్లి మరణించే అవకాశం కూడా రాష్ట్రాలవారీగా లెక్కించారు. ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళల్లో 0.05 శాతం మాత్రమే ఉంది. తెలంగాణలో 0.11శాతం, కర్ణాటకలో 0.12 శాతం. ఛత్తీస్‌గఢ్‌లో 0.37 శాతం. ఒడిశాలో 0.31 శాతంగా మహారాష్ట్రలో 0.06 శాతం గా ఉంది. ప్రతి వెయ్యి జననాలకు ప్రసూతి మరణాల రేటు కూడా రాష్ట్రాల వారీగా విశ్లేషించారు.

ఆంధ్రప్రదేశ్‌లో ప్రసూతి మరణాల రేటు 2గా నమోదయింది. కేరళలో ఇది 1 మాత్రమే. తెలంగాణలో 3, కర్ణాటకలో 3, తమిళనాడులో 2, ఒడిశాలో 9, ఛత్తీస్ గఢ్‌లో 10, మహారాష్ట్రలో 2గా ఉంది.

# కృష్ణాజిల్లాలో గుండెపోటుతో బాలిక మృతి

**విజయవాడ,సెప్టెంబరు 8,ప్రభాతవార్తప్రతినిధి:** జ్వరంతో ఆస్పత్రిలో చేరిన ఓ బాలిక కార్డియాక్ అరెస్ట్‌తో మృతి చెందింది. వివరాల్లోకి వెళ్తే పామర్రు మండలం పెదమద్దాలికి చెందిన గుమ్మడి లావణ్య ఎనిమిదో తరగతి చదువుతోంది. జ్వరంతో భాధపడుతూ ఈ నెల 5న ఆస్పత్రిలో చేరింది. చికిత్స పొందుతున్న బాలిక సోమవారం గుండెపోటుకు గురై మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. బాలిక మృతితో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

# తిరుమల సమాచారం



## భక్తులకు ఇబ్బందులు లేకుండా క్యూలైన్లు

### గరుడసేవరోజు అదనపు క్యూలైన్లపై తిరుపతి ఎస్పీ తనిఖీలు

**తిరుమల,సెప్టెంబరు 8ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమలలో 23వతేదీ నుండి మొదలుకానున్న ఏడుకొండల వేంకటేశ్వరస్వామి సాలకట్ల వార్షిక బ్రహ్మోత్సవాలకు విచ్చేసే భక్తులకు ఇబ్బందులు లేకుండా సాఫీగా ప్రవేశాలకు క్యూలైన్లు ఉండాలని తిరుపతి జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు సూచించారు. బ్రహ్మోత్సవాల్లో అత్యంత ప్రధానమైన గరుడసేవరోజు రాత్రి తిరుమలలో అదనపు క్యూలైన్లు ఏర్పాటు, భద్రత సిబ్బంది విధులు, ఏ గేట్‌ద్వారా ఏఏ క్యూలైన్లలోకి తీసుకునే విధంగా సూచనలు చేయాలన్నారు. ఏదైనా సమస్య వచ్చినపుడు తొందరగా భక్తులకు సేవలందించేలా బందోబస్తు సిబ్బందికి అవగాహన కల్పించాలన్నారు. సోమవారం మధ్యాహ్నం తిరుమలలో తిరుమల డిఎస్పీ కె.విజయశేఖర్, సిఐలు విజయకుమార్, రాముడు, ఎస్ఐలతో కలసి తిరుపతి జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్‌రాజు వరాహస్వామి విశ్రాంతి గృహాలు ప్రాంతం, పాపవినాశనం మార్గం, శ్రీవారిసేవా సదన్‌లు, కృష్ణతేజ కూడలి వద్ద గేట్లను తనిఖీ చేశారు.

ఇక్కడ భక్తులను అనుమతించే విష యం, తిరిగి బయటకు పంపడం వంటివి సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. ఆలయ మాఢవీధుల్లోకి భక్తులను అనుమతించే సమయంలో తోపులాట లేకుండా చూడాల న్నారు. 24వతేదీ సిఎం చంద్రబాబు స్వామి వారికి పట్టువస్త్రాలు తీసుకువచ్చే సమయంలో భద్రతను మరింత కట్టుదిట్టం చేయాలని, గ్యాలరీల్లోకిని భక్తులకు సేవలందించాలన్నారు.

## భక్తులకు అసౌకర్యం కలగకుండా విస్తృత ఏర్పాట్లు

### గ్యాలరీల్లో సకల సదుపాయాలు: అదనపు ఇఒ



**తిరుమల,సెప్టెంబరు 8ప్రభాతవార్తప్రతినిధి:** ఏడుకొండల వేంకటేశ్వరస్వామికి మరో ఇరవై రోజుల్లో ఆరంభంకానున్న సాలకట్ల వార్షిక బ్రహ్మోత్సవాలకు విచ్చేయనున్న సామాన్య భక్తులకు అసౌకర్యం కలగకుండా విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు టిటిడి అదనపు ఇఒ చిరూమామిళ్ళ వెంకయ్యచౌదరి తెలిపారు. స్వామివారి బ్రహ్మోత్సవాల సమయంలో మాఢ వీధుల్లో ప్రత్యేక గ్యాలరీలు ఏర్పాటు జరుగు తోందని, భక్తులకు అసౌకర్యం కలగకుండా చూస్తామన్నారు. ఉదయం, రాత్రి వాహనసేవల సమయంలో గ్యాలరీల్లో, మాఢవీధుల్లో వేచి ఉండే భక్తులకు నిరంతరాయంగా అన్ని విధాలా సదుపాయాలు ఉంటాయన్నారు. వైద్యసేవలు, మరుగుదొడ్లు, తాగునీరు. అన్నప్రసాదాలు, కాఫీ, పాలు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఆలయ మాఢవీధుల్లో, ఆలయం ముందు, వాహనమండపం ప్రాంతాల్లో ఆధ్యాత్మికతతో రంగవల్లులు తీర్చిదిద్దడం, బారికేడ్లు, గ్యాలరీలు ఏర్పాటు, వంటి పనులు పూర్తిదశకు చేరుకున్నాయి. మాఢవీధుల్లో భక్తులకు అసౌ కర్యం లేకుండా మరింత ఏర్పాట్లుపై సూచనలు చేశారు. వాహనసేవలు జరిగే సమయంలో భక్తులు గ్యాలరీల్లోకి సులభంగా చేరుకునేలా, తిరిగి వెలుపలకు వెళ్ళేలా సూచికబోర్డులు ఏర్పాటుచేపట్టారు. భక్తుల రద్దీ నియంత్రణ, క్రమ బద్ధీకరణ ఎక్కడా హడావిడి లేకుండా సాఫీగా జరగాలని సూచించారు.

## శ్రీవారి దర్శనం ఆనందదాయకం: ప్రముఖులు

**తిరుమల,సెప్టెంబరు 8ప్రభాతవార్తప్రతినిధి:** ఏడుకొండల వేంకటేశ్వరస్వామిని దర్శించుకుంటే కష్టాలు తొలగిపోతాయని, అంతా ఆనందదాయకమని పలువురు ప్రముఖులు తెలిపారు. సోమవారం ఉదయం విఐపి బ్రేక్ సమయంలో కార్పొరేట్ ప్రతినిధి నీరారాడియా, చీఫ్ ఆఫ్ ఆర్మీస్టాఫ్ ధీరజ్‌సేథ్‌లు కుటుంబంతో కలసి వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. టిటిడి ఆలయ అధికారులు దర్శనం చేయించి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.




## సంప్రోక్షణతో యధావిధిగా గోవిందుని దర్శనాలు పునఃప్రారంభం



**తిరుమల,సెప్టెంబరు 8ప్రభాతవార్తప్రతినిధి:** సంపూర్ణచంద్రగ్రహణం ముగియడంతో సోమవారం వేకువజామున 3గంటలకు ఏడు కొండల వేంకటేశ్వరస్వామి ఆలయ తలుపులు తెరచి అర్చకులు శుద్ధి, సంప్రోక్షణచేశారు. వేకువజామున సుప్రభాతం, తోమాల, అర్చన సేవలను ఏకాంతంగా నిర్వహించిన ఆలయ అధికారులు, అర్చకులు అనంతరం ఉదయం 7గంటలకు వైకుంఠమ్ క్యూలైన్లలోని భక్తులను ఆలయంలోనికి అనుమతించారు. యదావిధిగా ఉదయం నుండి స్వామివారి దర్శనానికి సామాన్యభక్తులకు అవకాశం కల్పించారు. ఆదివారం మధ్యాహ్నం 3.30గంటలకు మూతబడిన శ్రీవారి ఆలయంసోమవారం వేకువజామున 3గంటలకు తిరిగి తెరచుకుంది. పుణ్యాహవచనం, ఆలయ సంప్రోక్షణతో భక్తులకు దర్శనం కలిగింది. అన్నప్రసాద భవనం, లడ్డూవితరణ శాలను తెరిచి సేవలందించారు. సోమవారం సాయంత్రం వరకు 35వేలమంది భక్తులకు మహాలఘులో స్వామివారి దర్శనం చేయించారు. తిరుమలలో భక్తుల రద్దీ మోస్తరుగా ఉంది.


**ACHARYA N.G RANGA AGRICULTURAL UNIVERSITY**
Administrative Office, Lam, Guntur-522034: Andhra Pradesh

**PG DIPLOMA ADMISSIONS 2025-26**

Notification No 001209/PG/A1/2025 Dated: 04.09.2025

Applications are invited for admission into the following PG Diploma Programmes for the **Academic Year 2025-26**
* Agri-inputs and Biologicals
* Post-Harvest Technology, Food Safety and Quality

Completed applications with enclosures and proof of online payment must reach The Registrar, ANGRAU, Administrative Office, Lam, Guntur-522034, Andhra Pradesh, on or before **03-10-2025 by 4:00 PM.** For application form, brochure, and updates, visit: www.angrau.ac.in

DIPR.No.4406 PP/CL/Advt/1/1/2022-23, Date: 08.09.2025 Sd/- REGISTRAR

**ANDHRA PRADESH CAPITAL REGION DEVELOPMENT AUTHORITY (APCRDA)**
Lenin Center, Governorpet, Vijayawada - 520 002 (A.P.)

**E PROCUREMENT TENDER NOTICE**

APCRDA invites tenders for the following works.

| S.No | NIT Number | Name of the Work |
|---|---|---|
| 1 | 23/MAU61-USI0HB(HEEW)/6/2025-HB Dt:04.09.2025 | "Providing necessary power supply on permanent basis to all four (04) e-Sewa Kendras(Porta Cabins) installed in the premises of the High Court of Andhra Pradesh at Nelapadu, Amaravati" - **Estimate Cost Rs.4,75,000/-** |
| 2 | 24/ MAU61-USI0HB (HEEW)/5/2025-HB Dt:04.09.2025 | "Providing Non Comprehensive Annual Service Maintenance Contract (NCAMC) to 1 nos' 625 KVA Diesel Generator sets of make Kirloskar installed in the Annex Building of the AP High Court, Nelapadu, Amaravati for a period of 1 year"- **Estimate Contract Value Rs.1,00,000/-** |

The bids can be downloaded on AP e-procurement portal from **09.09.2025 to 24.09.2025 up to 14.00 Hrs.** Due date for submission of Bids **24.09.2025 up to 15.00 Hrs,** Technical bid opening **24.09.2025 @ 16.00 Hrs.** For further details please refer to **www.apeprocurement.gov.in** and **www.crda.ap.gov.in**

**E – AUCTION NOTICE**

| S.No | NIT Number | Name of the Work |
|---|---|---|
| 1 | No. MAU61-USI0HB(OTH)/353/2025-IFR1 Dt. 01-09-2025 | APCRDA - "Auction of Scrap Material in APCRDA main office, Lenin Centre, Vijayawada." with combined Basic Opening Price of **Rs.70,540/-** |

The Auction document can be downloaded on Konugolu portal from **10.09.2025 to 18.09.2025 up to 13.00 Hrs.** Due date for submission is **18.09.2025 up to 14.00 Hrs,** E-Auction start date and time is **19.09.2025 @ 13.00 Hrs.** For further details please refer to **www.konugolu.ap.gov.in** and **www.crda.ap.gov.in**

Sd/- Commissioner, APCRDA, Vijayawada

ప్రతి కష్టంలోనూ అవకాశాన్ని చూస్తాడు ఆశావాది,
ప్రతి అవకాశంలోనూ కష్టాన్నే
చూస్తాడు నిరాశావాది.

- షేక్స్పియర్

# 'కల్తీ'కి కాపలాదారులెవరు?

మానవుడికే కాదు పశుపక్ష్యాదుల ఆరోగ్యానికి సంకటకంగా మారుతున్న కల్తీని నిరోధించేందుకు పాలకపెద్దలు చేస్తున్న ప్రయత్నాలు ఏమాత్రం ఫలించడంలేదు. దేశంలో రానురాను కల్తీ పెరిగిపోతున్నది. తాగేనీటిలో కల్తీ, పప్పులో కల్తీ,ప్రాణాపాయం నుండి కాపాడే మందుల్లో కల్తీ, చివరకు పౌష్టికాహారంగా వయసుతో నిమిత్తం లేకుండా పసిపిల్లల నుండి వృద్ధుల వరకు సేవించే పాలల్లో కల్తీ, అదీ ఇదీ అని తేడా లేకుండా మొత్తం కల్తీమయంగా మారిపోతున్నది. మనిషి మనుగడనే ప్రశ్నార్థకం చేసే సూచనలు కన్పిస్తున్నాయి. ఇంత ప్రమాదకరంగా మారుతున్నా, పొగమంచులా విస్తరిస్తున్నా అడిగేవారు, అడ్డగించేవారు కరవైపోతున్నారు. ఒకరకంగా చెప్పాలంటే అవినీతికి, కల్తీకి అవినాభావ సంబంధాలున్నాయి.పెరుగుతున్న అవినీతికి రెట్టింపుస్థాయిలో కల్తీ విస్తరిస్తున్నది. అన్నిటికంటే ముఖ్యంగా ఇటీవల కాలంలో ప్రభుత్వరంగంలో నడుస్తున్న వసతిగృహాల్లోని విద్యార్థుల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్నది. తినే ఆహారంలో వాడే వస్తువులు కల్తీ ఉండడంతో వాంతులు, విరేచనాలతో ఆస్పత్రులపాలవుతున్నారు. ఇందుకు బాధ్యులంటూ చిరు ఉద్యోగులపై ఏదో నామమాత్రపు చర్యలు తీసుకొని ఉన్నతాధికారులు చేతులు దులుపుకుంటున్నారు. రానురాను ఇది పెరిగిపోతుండడంతో అస్వస్థతపాలయ్యే విద్యార్థులసంఖ్య పెరిగిపోతున్నది. వాస్తవంగా కల్తీని అరికట్టేందుకు ఎన్నో చట్టాలున్నాయి. ఆ చట్టాలు అమలుచేసి కల్తీ జరగకుండా నిరోధించేందుకు దేశవ్యాప్తంగా లక్షలాది మంది అధికారులు ఉన్నారు. కోట్లాది రూపాయల జీతభత్యాల రూపేణా తీసుకుంటున్నారు. కానీ కల్తీని నియంత్రించడం అటుంచి రోజురోజుకు పెరిగిపోతున్నది. కల్తీ భారత్‌లోనే కాదు. ప్రపంచవ్యాప్తంగా మానవ జీవనానికి సవాలుగా మారుతున్నా మనదేశంలో అత్యంత ప్రమాదకరంగా పరిణమిస్తున్నాయనే సంకేతాలు వెలువడుతున్నాయి. ఇది మూడో కంటికి తెలియకుండా జరగడం లేదు. అన్నిటికంటే ముఖ్యంగా ఆహార కల్తీ పెరిగిపోతున్నది. కొందరు దళారులు, వ్యాపారులు లాభాల కోసం పప్పుదినుసులు, మసాలాలు వంటి నిత్యావసర సరుకుల్లో కల్తీ చేస్తున్నారు. హోటళ్లలో కల్తీ ఇష్టానుసారంగా చేస్తున్నారు. కల్తీ అడ్డుకట్ట ప్రమాణాల చట్టం 2006లో తీసుకువచ్చినా అమలు విషయంలో పట్టించుకునేవారే లేరు. అది ఎన్నో ప్రమాదాలను ఉద్దేశిస్తున్నది. భారత ఆహార భద్రత ప్రమాణాల ప్రాధికారిక సంస్థ (ఎఫ్ఎస్ఎస్ఎ) అమలు గూర్చి దాదాపు మరిచిపోయారనే చెప్పొచ్చు. మార్కెట్లో విక్రయించే ఆహార పదార్థాల తయారీకి ఎఫ్ఎస్ఎస్ఎ అనుమతి తప్పనిసరి. కానీ వ్యాపార సంస్థలేవీ ఈ అనుమతులు తీసుకోవడం లేదు.అలాగే ఎన్నో చట్టాలు కూడా అమలుకునోచుకోవడంలేదు. 1947 వంటనూనెల నియంత్రణ చట్టం, 1955 నిత్యవసర సరుకుల నియంత్రణ చట్టం, 1992 పాల ఉత్పత్తుల నియంత్రణ చట్టం లాంటివెన్నో అమలుకు నోచుకోవడం లేదనే చెప్పొచ్చు. అన్నింటికంటే ముఖ్యంగా 1954నాటి ఆహార కల్తీ నిరోధక చట్టాన్ని మరిచిపోయారనే చెప్పొచ్చు. ఇక్కడ, అక్కడ అని కాదు. దేశవ్యాప్తంగా కల్తీ విజృంభించిపోతున్నది. ఈ కల్తీ ద్వారా రకరకాల రుగ్మతలకు గురవుతున్నారు.ముఖ్యంగా గుండె, నరాలు, ఎముకలు, మూత్రపిండాలు, మెదడు, చర్మసంబంధిత సమస్యలు పెరిగిపోతున్నాయి. కల్తీ కాటుకు యేటా ప్రపంచ వ్యాప్తంగా డెబ్బైలక్షల మంది వరకు రకరకాల వ్యాధుల బారినపడుతున్నారు. అందులో పది లక్షల వరకు మరణిస్తున్నట్లు అనధికార అంచనాలు. అన్నిటికంటే బాధాకరంగా ఇలా మరణిసునతన్నవారిలో ముప్పైశాతానికి మందికి ఐదేళ్లలోపల ఉన్న బాలబాలికలే. ఇక పాలల్లో కల్తీ ఇటీవల బాగా పెరిగిపోయింది. డిమాండ్‌కు తగినట్లుగా ఉత్పత్తి లేకపోవడంతో ఆ వ్యత్యాసాన్ని పూడ్చేందుకు రకరకాల మార్గాలతో కృత్రిమ పాలను తయారు చేస్తున్నారు.చక్కెర, ఉప్పు, గంజిపొడి,బియ్యం పిండి, యూరియా, గ్లూకోజ్, హైడ్రోజన్ పరాక్సైడ్, కాస్టిక్ సోడా, వంటసోడా, డిటర్జెంట్, మైలమన్‌పొడి, నూనె తదితర పదార్థాలతో కల్తీపాలను తయారు చేస్తున్నారు. ఈ కల్తీ పాలను తాగితే అజీర్తి సమస్యతలతో ప్రారంభమై కడుపునొప్పితోపాటు మూత్రపిండాలు, కాలేయం నాడీ వ్యవస్థపై ప్రభావం పడుతుందని వైద్యనిపుణులే హెచ్చరిస్తున్నారు. రసాయనంతో కూడిన పాలను తీసుకుంటే కేన్సర్ వచ్చే అవకాశముందని డాక్టర్లే చెబుతున్నారు. ఈ పాలల్లో చిక్కదనం రవాలని ఇటీవల కాలంలో ప్రోటీన్‌శాతాన్ని పెంచేదుకు ప్రమాదకరమైన రసాయనికాలు వాడుతున్నారు. ఇక క్రిమిసంహార మందులు పిచికారీ చేసినమేతను యధాతథంగా పశువులకు వేయడంతో దుష్ప్రభావాలకు కారణమవుతున్నాయి. మరికొన్ని సందర్భాల్లో గాలికుంటు లాంటి వ్యాధులు పశువులకు సోకినప్పుడు పాలు పితికకూడదు. అవేమీ పాటించడం లేదు. ఇలాంటి ఎన్నో కారణాలతో పాలు కల్తీ అయిపోతున్నాయి. ఈ పాల ద్వారా చేసే రకరకాల తీపి పదార్థాలు కూడా కలుషితమైపోతున్నాయి. భారతదేశానికి సంబంధించి ఎన్నోసందర్భాల్లో సర్వోన్నత న్యాయస్థానం కల్పించుకున్న పరిస్థితులు కూడా ఏర్పడ్డాయి. ఇంత పెద్ద సమస్యపై పాలకులు ఏం చేస్తున్నారని చెప్పండంటూ గతంలో సుప్రీంకోర్టు నిలదీసింది. ఈ దురగాతాలను నివారించడంలో విఫలమవుతున్న అధికారులపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారంటూ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలను సుప్రీంకోర్టు ప్రశ్నించిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. ఇప్పటికైనా పాలకులు కల్తీ విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాల్సిన అవసరం ఉంది. కొత్త చట్టాల సంగతి దేవుడెరుగు. ఉన్న చట్టాలను త్రికరణశుద్ధిగా అమలు చేసేందుకు కృషి చేయాలి.

కీర్తి కాంక్ష లేకుండా చేసేదేదో చక్కగా చేయడమే విజయానికి మూలం.



హరివంశ రాయ్ బచన్

గడిచిపోయిన కష్టాలను జ్ఞప్తికి తెచ్చుకో..అనుభవిస్తున్న సుఖాల తీయదనం పెరుగుతుంది.



సిసి కొల్టన్

# ప్రజావాక్కు



## పెరుగుతున్న డిజిటల్ మోసాలు

ఇటీవలి కాలంలో దేశవ్యాప్తంగా 'డిజిటల్ అరెస్ట్" మోసాలు ఆందోళన కలిగిస్తున్నాయి. పోలీసు అధికారుల పేర్లు, ప్రభుత్వ విభాగాల గుర్తింపులు వక్రీకరించి, సాధారణ ప్రజలను మభ్యపెట్టి, ఆన్‌లైన్‌లో బెదరింపులు, దొంగ దర్యాప్తులు చేస్తున్న ఘటనలు పెరుగుతున్నాయి. వీడియో కాల్స్‌లో యూనిఫాం ధరించిన వ్యక్తుల వాయిస్ మోడలింగ్ ఉపయోగించి ప్రజలను భయపెట్టడం, మీపై కేసు నమోదైంది అంటూ డబ్బు వసూలు చేయడం వంటి సంఘటనలు సామాన్యప్రజల ఆందోళనకు దారితీస్తున్నాయి. ఇలాంటి మోసాలకు ప్రజలు మోసపోవడానికి ప్రధానకారణం డిజిటల్ పరిజ్ఞానంలోపం,అలాగే పోలీసు లేదా ప్రభుత్వం పేరు వినగానే కలిగే భయం. కాబట్టి ప్రజలుఅప్రమత్తంగా ఉండడం అత్యంత అవసరం. పోలీసు వ్యవస్థ ఎప్పుడూ ఆన్‌లైన్ ద్వారా అరెస్టు చేయదని స్పష్టంగా గుర్తుంచుకోవాలి. ఏదైనా అనుమానాస్పద కాల్ లేదా సందేశం వస్తే వెంటనే హెల్ప్‌లైన్ లేదా స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయాలి.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

## విద్యావ్యవస్థపై రాజకీయ నాటకం

రాష్ట్రంలో రాజకీయ నాయకుల పిల్లలు విదేశాలలో చదువుతారు. కానీ వీళ్లు మన ఎడ్యుకేషన్‌ని మారుస్తాం అని బూటకపు మాటలు చెప్తారు. మనం కూడా అదే నమ్ముతాము.ఎందుకని వాళ్ల పిల్లల్ని మన ప్రాంతంలోనే చదువుపించరు. అంటే విద్య వ్యవస్థను వారు మార్చరు అనే భావనతోనే కదా! ఎందుకని ఇన్ని విన్యాసాలు పదవుల కోసమేకదా ! పార్టీలకు అతీతంగా ఏ ఒక్క రాజకీయ నాయకులు ఎందుకు చేయడం లేదు.

- కె.సురేష్‌కుమార్, ఆరేపల్లి, భూపాలపల్లిజిల్లా

## అగ్ర రాజ్యంగా ఎదగాలి

అతిపెద్ద ప్రజాస్వామ్య దేశం భారత్ అభివృద్ధి చెంది అమెరికా అగ్రరాజ్యంగా ఎదగాలి. భారత దేశం అవినీతి, ఆధిపత్యం,అక్రమాలను విడనాడి ప్రజా ప్రతినిధులు స్వార్థ ప్రయోజనాలను మానుకుంటే అభివృద్ధి సాధ్య పడుతుంది. ప్రజా ప్రతినిధులు తమ నియోజక వర్గాల్లో సమస్యలను అధిగమించి, ఇచ్చిన హామీలను నెరవేర్చాలి. అప్పుడే దేశం అగ్రరాజ్యంగా ఎదుగుతుంది.

- డి చాంద్ బాషా, కర్నూలు

## గ్రామీణ వైద్యులకు శిక్షణ అవసరం

గ్రామీణ ప్రాంతాల్లో నిరుపేద ప్రజలకు ప్రథమ చికిత్స చేస్తున్న ఆర్ఎంపి పిఎంపీల గ్రామీణ వైద్యులకు తెలంగాణ ప్రభుత్వం శిక్షణ తరగతులు నిర్వహించి గుర్తించాలి. అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి ఆర్ఎంపి పిఎంపీలకు శిక్షణ తరగతులను నిర్వహించేందుకు ఉత్తర్వులు జారీ చేసి తరగతులు సైతం ప్రారంభించారు. కోర్టు వివాదాల కారణంగా ఆగిపోయింది. ప్రస్తుత తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆర్ఎంపి పిఎంపీల సమస్యల పరిష్కారానికి సిద్ధం కావడం హర్షదాయకం.

-ముడితనపెల్లి ప్రభాకర్, భూపాలపల్లి జిల్లా

## రసాయనం వద్దు సేంద్రియం ముద్దు

కృత్రిమ రసాయనాలను ఉపయోగించకుండా వ్యవసాయం వేల సంవత్సరాలుగా జరిగింది. కృత్రిమ ఎరువులు మొదట 19వ శతాబ్దం మధ్యలో అభివృద్ధి చేయబడ్డాయి. ఈ ప్రారంభ ఎరువులు చౌకగా,శక్తివంతంగా పెద్దమొత్తంలో రవాణా చేయ డానికి సులభంగా ఉండేవి. 1940లలో రసాయన పురుగుమందులలో ఇలాంటి పురోగతులు సంభవించాయి , దీని వలన ఆ దశాబ్దం 'పురుగుమందుల యుగం'గా పిలువబడింది.ఈ కొత్త వ్యవసాయ పద్ధతులు, స్వల్పకాలంలో ప్రయోజనకరంగా ఉన్నప్పటికీ, నేల సంపీడనం, కోత, మొత్తం నేల సంతానోత్పత్తిలో క్షీణత వంటి తీవ్రమైన దీర్ఘకాలిక దుష్ప్రభావాలు ఉన్నాయి. అలాగే ఆహార సరఫరాలోకి విష రసాయనాలు ప్రవేశించడం గురించి ఆరోగ్య ఆందోళనలు కూడా ఉన్నాయి.

-డా.దన్నాన అప్పలనాయుడు, చీపురుపల్లి

## భారత్‌పై అమెరికా కసి

గాజా మారణహోమం కొన్ని ఏళ్లుగా సాగుతుంది. అది ఫలితం లేని యుద్ధం కాక మరేమిటి? ఇందులో నేలరాలిన పౌరుల మేధస్సు ఎంత గొప్పగా ప్రపంచానికి ఉపయోగపడుతుందో ఈ ప్రపంచం మరిచిపోతోంది. అసలు ఉద్దేశం ఏమిటి మిడిల్ ఈస్ట్ దేశాలపైన ఆధిపత్యం కదా ఇప్పుడు మిడిల్ ఈస్ట్ దేశాలపైన అమెరికా కన్నుపడింది. అందుకే ఇలా చేస్తుంది. అయితే తన మాట చెల్లుబాటు కావాలె అని చేస్తున్న ప్రయత్నాలు అంతగా ఫలితం ఇస్తున్నట్టు లేదు. ఎందుకని అమెరికా వంటి రాజ్యాధినేత ఫోన్‌ను కనీసం భారత ప్రధానమంత్రి ఎత్తడం లేదు అని వార్తలు వస్తున్న నేపథ్యంలో రష్యా నుండి ఇంధనం దిగుమతి చేసుకోవడం అమెరికాకు రుచించడం లేదు.

- భారత అవినాష్, జనగామ

మనవి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# పర్యావరణ విధ్వంసంతో ప్రపంచానికే ప్రమాదం!

**అడవులను పారిశ్రామిక అభివృద్ధి కోసం కేటాయించడం జరిగిందని చెబుతూ కాంపెన్సేటరీ ఎఫారిస్టేషన్‌లో భాగంగా సదరు అడవుల స్థానంలో మామూలు భూముల్లో మళ్లీ ప్లాంటేషన్ చేబట్టడం ద్వారా అడవుల సంరక్షణ, పునరుద్ధరణతో పాటు దానికి తగిన నష్టపరిహారాన్ని చెల్లించడం తమ విధానంగా ప్రభుత్వం ప్రకటించిందే తప్ప ఆ వైపు అవసరమైన చర్యలు తీసుకున్న దాఖలాలు కనపడడం లేదు. పారిశ్రామిక రంగంతో పాటు ప్రజలు సైతం తమ ఉత్పత్తి విధానాలను, జీవన శైలిని పర్యావరణహితంగా మార్చుకుంటూ గ్లోబల్ వార్మింగ్‌ని నియంత్రించే అటవీరక్షణకు,తద్వారా పర్యావరణ పరిరక్షణకు కంకణబద్ధులై ఈ భూగోళాన్నిమాన వాళితో పాటు సకల జీవ కోటి సుస్థిర మనుగడకు ఊపిరులూదుతారో లేదా మళ్లీ మళ్లీ ప్రకృతిని విధ్వంసం పాలు చేస్తూ దాని ప్రకోపానికి బలై సమిధలుగా మారిపోతారో రాబోయే కాలమే తేల్చిచెప్పాల్సి వుంది.**



డాక్టర్ నీలం సంపత్

ఈ సకల చరాచర ప్రపంచసృష్టి జరిగి అందులో భాగంగా ఏర్పడిన పంచ భూతాలలో ఒకటైన భూమిపై సహజ సిద్ధంగా ఏర్పడిన అడవులు భూగోళానికి ఊపిరితిత్తులుగా వ్యవహరించేవి. ఆ దట్టమైన అడవులే ఆరోగ్యకరమైన పర్యావరణసృష్టితో భూమిపై మానవ మనుగడతో పాటు కోట్ల సంఖ్యలో వున్న వివిధ వృక్ష, జంతు జీవ జాతుల ఆకలితో పాటు అవసరాలను తీరుస్తూ వాటి మనుగడతో పాటు సుస్థిర భవిష్యత్‌కు ప్రాణం పోస్తున్న వైనం బహిరంగ రహస్యమే. నాగరికత పేరుతో మానవాళి సృష్టిస్తున్న అనేక రకాల కాలుష్యాలను ఆహారంగా స్వీకరిస్తూ ప్రాణవాయువైన ఆక్సిజన్ ఉత్పత్తితో మానవ మనుగడకు ఊపిరులూదేవి. మరోవైపు దట్టమైన అడవుల రూపంలో గ్రీన్ కవర్ ఓజోన్ పొరను కాపాడే దుర్భేద్యమైన రక్షణ కవచంగా పనిచేస్తూ సూర్యుడి అతినీల లోహిత కిరణాల బారి నుండి మానవాళిని కాపాడేవి. తద్వార భూతాపం పెరగకుండా వుండి మంచు పర్వతాలను కరిగించేది కాదు. పరిపూర్ణ పర్యావరణ సంతులనంతో అకాల వర్షాలూ, అతి భారీ వర్షాలకు ఆస్కారమే లేకుండా ఋతుక్రమాన్ని అనుసరించి వానలు కురిసేవి. అదే క్రమంలో సహజ సిద్ధమైన అటవీ రక్షకులుగా జీవనాన్ని కొనసాగించే మూలవాసులు రకరకాల పళ్లూ, ఫలాలూ,తేనె, ఇప్పపువ్వుతో పాటు బంక, జిగురు లాంటి ఇతర అనేక రకాలైన కలపేతర ఫలసాయంతో తమ దైనందిన అవసరాలను తీర్చుకునే క్రమంలో అడవిని, దానితో పాటు అడవి మృగాలను సైతం కంటికి రెప్పలా కాపాడేవారు. మరోవైపు అడవికి రారాజుగా జీవించే పులి, చిరుత పులి తదితర మాంసాహార జంతువులు తమలో జనించే ఆకలిని తీర్చు కోవడం కోసం పెద్ద సంఖ్యలో శాఖాహార జంతువులను వేటాడుతూ ఆహారపు గొలుసును సజీవంగా వుంచడమే కాకుండా శాఖాహార జంతువుల బారి నుండి అడవులను కాపాడేవి. అదే విధంగా పులుల ఉనికి ఎంతో విలువైన కలప తదితర అటవీ సంపదను స్మగ్లర్ల బారి నుండి కాపాడడానికి దోహదం చేసేదనే సత్యాన్ని జీర్ణించుకోక తప్పదు. నాగరికత పరిణామ క్రమంలో ఆ అడవి మధ్యలో ఖాళీ ప్రదేశాలు ఏర్పడినప్పుడు ఆ అడవులకు ఏమాత్రం నష్టం కలిగించకుండా పోడు సేద్యం ద్వారా జొన్నలనో, రాగులనో, నువ్వులనో, ఉలవలనో లేదా కూరగాయలనో పండించడం ద్వారా తమ కుటుంబాల అవసరాలను తీర్చుకునేవారు. ఔషధ మొక్కల ద్వారా సమాజంలో అనేక రకాల అనారోగ్యాలతో బాధపడే వారి ఆరోగ్య పరిరక్షణకు తోడ్పడేవారు. ఇబ్బడిముబ్బడిగా పెరుగుతున్న జనాభా, ఆధునిక నాగరికత, పట్టణీకరణపై మోజు, గృహోపకరణాల కోసం కలప వినియోగం పెరుగుతోంది.అటవీ చట్టాలలో లొసుగులు,పోడు సేద్యం నెపంతో గిరిజనేతరుల చే విచ్చల విడిగా అడవుల నరికివేత, ఐక్యరాజ్య సమితి లాంటి అంతర్జాతీయ వేదికల ఒత్తిళ్లు వున్నా ప్రభుత్వాలకు పర్యావరణ పరిరక్షణ స్పృహ లోపిస్తుండడం బాధాకరం. అటవీభూముల్లో నిక్షిప్తమై వున్న బొగ్గు, బంగారం, రాగి, బాక్సైట్, మాంగనీస్, ఇనుము లాంటి అత్యంత విలువైన ఖనిజాలను త్రవ్వి తీయడం ద్వారా అనూహ్యమైన ఆర్థికాభివృద్ధిని సాధిస్తామనే ప్రభుత్వాల అనాలోచిత వైఖరి పర్యావరణ విధ్వంసానికి ప్రేరణగా మారుతోంది. ఆ ఖనిజాల తవ్వకాల కోసం అత్యంత ఆధునిక భారీ యంత్రాల లభ్యతతో పాటు, వాటిని చేరవేయడానికే కాదు, వాటితో పాటు పెద్ద సంఖ్యలో కూలీలను,సాంకేతిక నిపుణులను చేర్చడానికి అవసరమైన రోడ్లు,రైలు రవాణా సదుపాయాల కల్పన, విద్యుచ్ఛక్తి లైన్లను ఏర్పాటు చేయడం లాంటి పనుల కోసం అడవులను విచక్షణా రహితంగా నరికివేస్తున్న వైనం నిస్సం



దేహంగా పర్యావరణ ప్రేమికులకు ఆందోళన కలిగిస్తోంది. ఐక్యరాజ్య సమితి నిర్దేశించిన 17 సుస్థిరతతో కూడిన అభివృద్ధి లక్ష్యాలలో ఒకటి కన్నా ఎక్కువ లక్ష్యాలు వివిధ రకాల కాలుష్యాల బారి నుండి ఈ భూగోళాన్ని కాపాడుతూ దానిని సురక్షితంగా వుంచుతూ తద్వారా దానిపై ఆధారపడి జీవించే మానవాళితో పాటు సకల జీవకోటి మనుగడ సాధ్యమౌతుందని తెలిసినా అమెరికాతో పాటు దక్షిణ యూరోప్‌లోని స్పెయిన్, పోర్చుగల్,ఫ్రాన్స్ లాంటి అనేక ప్రపంచ దేశాలతో పాటు మన దేశం కూడా పర్యావరణ పరిరక్షణ పట్ల తన నిబద్ధతను ప్రదర్శించని నేపథ్యంలో భూతాపం అంచనాలకు మించి పెరుగుతోందనే భావన సర్వత్ర వెల్లువెత్తుతోంది. గతంలో పర్యావరణ పరిరక్షణ కోసం రూపొందించిన చట్టాలను అమలుపరచడంలో అప్పుడప్పుడు ఎంతో కొంత ఉద్దేశపూర్వక నిర్లక్ష్యం కనపడేది. కాని ప్రస్తుతం సదరు చట్టాలను సవరించడం ద్వారా అవసరమైన లొసుగులను సృష్టించి విచ్చలవిడి పర్యావరణ విధ్వంసానికి తెరదీస్తుండడం దురదృష్టకరమేనని పర్యావరణ శాస్త్రవేత్తల అభిప్రాయం ప్రాధాన్యత సంతరించుకుంటోంది.పారిశ్రామిక అభివృద్ధి కోసం సత్వర అభివృద్ధి నమూనా పేరుతో ప్రభుత్వాలు రిజర్వ్ అడవులను సైతం వదిలిపెట్టకుండా ఊచకోతకు పూనుకుంటున్న వైనంపట్ల సాక్షాత్తూ మన దేశ సర్వోన్నత న్యాయస్థానం మానవాళితో పాటు సకల జీవజాతుల మనుగడకు ఊపిరులూదుతున్న అడవులను పూర్తిగా నిర్మూలిస్తారా?అంటూ ప్రభుత్వాలను నిలదీయడం పర్యావరణ పరిరక్షణకు దోహదం చేస్తుందని చెప్పక తప్పదు.నిజానికి ఓ వైపు ప్రపంచ గమనాన్ని మారుస్తున్న పారిశ్రామికీకరణ, ఆటోమొబైల్ పరిశ్రమ విస్తృతితో కోట్లాది వాహనాలు విడుదల చేసే కార్బన్ డై ఆక్సైడ్, శీతలీకరణ యంత్రాలు విడుదల చేస్తున్న క్లోరోఫ్లోరో విషవాయువులు,శిలాజ ఇంధన వనరుల వినియోగం పెచ్చు మీరుతుండడం, అడవులను దహించి వేస్తున్న కార్చిచ్చుల ఉధృతి తోడుగా గ్రీన్‌హౌస్ వాయువులు పర్యావరణానికి హానికలిగిస్తున్న పాలనా విధానాలు, ప్రజల జీవన శైలి ఫలితంగా ఓజోన్ పొరకురంధ్రం పడడం ద్వారా 2000 సంవత్సరంలో 0.69 డిగ్రీ సెల్సియస్‌గా వున్న భూతాపం ఇబ్బడి ముబ్బడిగా పెరిగిపోతూ నేటికది 1.3 సెల్సియస్‌కి చేరుకోవడం ద్వారా ప్రపంచ సగటుయైన 1.55కి చేరువలోకి వెళ్ళడం గమనార్హం. ఈ నేపథ్యంలో ఓ వైపు ప్యారిస్ ఒప్పందం మేరకు 2030 వరకు ఐక్యరాజ్య సమితి నిర్దేశాల మేరకు పర్యావరణ పరిరక్షణ ద్వారా భూతాపాన్ని 1.5 డిగ్రీ సెల్సియస్ మేరకే నియంత్రిస్తామని ఊదర గొడుతున్న ప్రభుత్వాలే గత పదేళ్ల కాలంలో సదరు పర్యావరణానికి గుండెకాయ లాంటి దట్టమైన అడవులను నరికివేయడానికి ఉత్తర్వులనిస్తున్న వైనంతో ఈ శతాబ్దాంతానికి భూతాపం మూడు రెట్లు పెరిగే ప్రమాద ముందనే పర్యావరణ శాస్త్రవేత్తల అంచనా ఆందోళన కలిగిస్తోంది.ఈ నేపథ్యంలో ఇటీవల సాక్షాత్తూ భారత పార్లమెంట్‌లో ఓ విపక్ష పార్లమెంట్ సభ్యుడు పర్యావరణ పరిరక్షణపై అడిగిన ప్రశ్నకు కేంద్ర పర్యావరణ,అటవీశాఖ మంత్రి వర్యులు ఇచ్చిన జవాబులో భాగంగా 2014 నుండి 2024వరకు దేశవ్యాప్తంగా తమ ప్రభుత్వం చేపట్టినసూతన అభివృద్ధి నమూనాలో భాగంగా అటవేతర కార్యక్రమాల నిర్వహణ కోసం 1.7 లక్షల హెక్టార్ల అటవీ భూములను అనగా క్లియర్ చేయగా అందులో గనులు, క్వారీల కోసం 401 చ.కి.మీ.,హైడల్,ఇరిగేషన్ ప్రాజెక్టుల కోసం 401 చ.కి.మీ విస్తీర్ణతలో వున్న అడవులను పారిశ్రామిక అభివృద్ధి కోసం కేటాయించ దం జరిగిందని చెబుతూ కాంపెన్సేటరీ ఎఫారిస్టేషన్‌లో భాగంగా సదరు అడవుల స్థానంలో మామూలు భూముల్లో మళ్లీ ప్లాంటేషన్ చేబట్టడం ద్వారా అడవుల సంరక్షణ, పున రుద్ధరణతో పాటు దానికి తగిన నష్టపరిహారాన్ని చెల్లించడం తమ విధానంగా ప్రభుత్వం ప్రకటించిందే తప్ప ఆవైపు అవసరమైన చర్యలు తీసుకున్న దాఖలాలు కనపడడంలేదు. గ్లోబల్ వార్మింగ్‌కు సింహభాగం తామే కారకంగా మారు తున్న అమెరికా, చైనా, రష్యా తదితర అభివృద్ధి చెందిన దేశాలు దాని మూలంగా పెద్ద మొత్తంలో నష్టపోతున్న అభివృద్ధి చెందుతున్న, వెనుకబడిన దేశాలకు నష్ట పూర్తిని సమకూర్చడంలో తోడ్పాటు నందించాల్సి ందే. పారిశ్రామిక రంగంతోపాటు ప్రజలుసైతం తమ ఉత్పత్తి విధానాలను, జీవన శైలిని పర్యావరణహితంగా మార్చుకుం టూ గ్లోబల్ వార్మింగ్‌ని నియంత్రించే అటవీ రక్షణకు,తద్వారా పర్యావరణ పరిరక్షణకు కంకణబద్ధులై ఈ భూగోళాన్నిమాన వాళితో పాటు సకల జీవ కోటి సుస్థిర మనుగడకు ఊపిరి లూదుతారో లేదా మళ్లీ మళ్లీ ప్రకృతిని విధ్వంసం పాలు చేస్తూ దాని ప్రకోపానికి బలై సమిధలుగా మారిపోతారో రాబోయే కాలమే తేల్చి చెప్పాల్సి వుంది. ●

# సుంకాలెన్ని ఉన్నా ఆర్థిక వ్యవస్థ మెరుగే!

ఇస్కా రాజేష్ బాబు

భారత ఆర్థిక వ్యవస్థ తన బలాన్ని మరోసారి రుజువు చేసింది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సుంకాల మధ్య, భారతదేశం 2025-26 ఆర్థిక సంవత్సరంలో గణనీయమైన జీడీపీ వృద్ధిని నమోదు చేసింది. ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికం (ఏప్రిల్-జూన్)లో 7.8 శాతం ఆర్థిక వృద్ధి రేటును సాధించింది. ఇది నిజంగా గొప్ప విషయం. గత సంవత్సరం ఇదే సమయంలో 6.5 శాతం ఉన్న వృద్ధి రేటుతో పోలిస్తే ఈసారి అంచనాలు మించిపోయామని చెప్పవచ్చు. ఈ గణాంకాలను నేషనల్ స్టాటిస్టిక్స్ ఆఫీస్ విడుదల చేసింది. ప్రపంచ ఆర్థిక సవాళ్ల నడుమ ఈ వృద్ధి నమోదు కావడం విశేషం. మొత్తానికి మన భారత ఆర్థిక వ్యవస్థ మళ్లీ సత్తా చాటింది. వృద్ధి రేటు అనలిస్టులు,రిజర్వ్ బ్యాంక్ అఫ్ ఇండియా అంచనా వేసిన 6.5 శాతం కంటే ఎక్కువగా ఉంది. దీని ద్వారా ఇండియా ఆర్థిక వ్యవస్థలో పట్టు పెంచుకుందన్న విషయం స్పష్టమవుతుంది. సేవల రంగం, మానుఫాక్చరింగ్ రంగం బలంగా పనిచేయడం వృద్ధికి ప్రధాన కారణాలుగా కనిపిస్తున్నాయి. రియల్ జీడీపీ అంటే ద్రవ్యోల్బణాన్ని పరిగణనలోకి తీసుకున్న తర్వాత వచ్చే నిజమైన ఆర్థిక వృద్ధి. ఇది రూ.47.89 లక్షల కోట్లకు పెరిగింది. గతేడాది ఇదే త్రైమాసికంలో రూ. 44.42 లక్షల కోట్లు ఉండేది. అదే సమయంలో నామమాత్రపు జీడీపీ (ద్రవ్యోల్బణంతో కలిపిన మొత్తం విలువ) రూ.86.05లక్షల కోట్లకు చేరింది. గతేడాది ఇదే సమయంలో రూ. 79.08 లక్షల కోట్లుగా ఉంది. వ్యవసాయ రంగం 3.7 శాతం వృద్ధిని సాధించింది. ఇది గతేడాది ఇదే కాలంలో 1.5శాతం మాత్రమే ఉంది. గత వృద్ధితో పోలిస్తే ఇది చాలా గొప్ప అభివృద్ధి అని చెప్పవచ్చు. మంచి పంటల దిగుబడి, వర్షాల ప్రభావం, గ్రామీణ ఆదాయం పెరగడం వల్ల వ్యవసాయ వృద్ధి పెరిగినట్లు తెలుస్తోంది. మాన్యుఫాక్చరింగ్ రంగం



కూడా బాగానే పనిచేసింది. 7.7శాతం వృద్ధిని నమోదు చేసింది. ఇది గత సంవత్సరం త్రైమాసికంలో 7.6 శాతం ఉండేది. ఈ మార్పు తక్కువైనా, స్టేబుల్ ప్రొడక్షన్‌కి ఇది సంకేతంగా చెప్పుకోవచ్చు. సేవల రంగం ముఖ్యంగా ఫైనాన్స్, ఇన్సూరెన్స్, రియల్ ఎస్టేట్ వంటి విభాగాలు ఈ త్రైమాసిక వృద్ధిలో కీలక పాత్ర పోషించాయి. పట్టణ ప్రాంతాల్లో డిమాండ్ పెరగడం, టెక్నాలజీ సేవలు విస్తరించడం వల్ల ఈ రంగం చురుగ్గా కొనసాగుతోంది. ఇండియా ప్రస్తుతం ప్రపంచంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న పెద్ద ఆర్థిక వ్యవస్థగా నిలుస్తోంది. చైనా ఈ కాలంలో కేవలం 5.2 శాతం మాత్రమే వృద్ధి సాధించింది. ఇదే సమయంలో ఇండియా 7.8 శాతం వృద్ధితో ముందుంది. ప్రైవేట్ తుది వినియోగం 2025-26 ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో 7.0వృద్ధి రేటును సాధించింది, గత సంవత్సరంలో ఇదే 8.3 శాతంగా ఉంది. వివిధ రంగాల వృద్ధిని పరిశీలిస్తే, వ్యవసాయం,అనుబంధ రంగాల వృద్ధి రేటు 3.7 శాతంగా ఉంది. తయారీ రంగం వృద్ధి రేటు 7.6 శాతం నుండి 7.7శాతంకి పెరిగింది. వాణిజ్యం, రవాణా, కమ్యూనికేషన్ సేవల వృద్ధి 5.4 శాతం నుండి 8.6 శాతంకి వేగవంతమైంది. ఆర్థిక రంగం,రియల్ ఎస్టేట్ వృద్ధి రేటు 6.6 శాతం నుండి 9.5శాతానికి పెరిగి, ఈ రంగాలలో శక్తివంతమైన వృద్ధి సూచిస్తోంది. మైనింగ్ రంగం గత సంవత్సరం 6.6 శాతం వృద్ధిరేటుతో పోలిస్తే ఇప్పుడు 3.1 శాతానికి తగ్గింది. విద్యుత్, గ్యాస్, ఇతర యుటిలిటీ సేవల వృద్ధి కూడా 10.2శాతం నుండి 0.5 శాతానికి తగ్గింది. ఇది ఈ రంగాల్లో కొంత నిష్పత్తి తగ్గింపును చూపిస్తుంది. అంతర్జాతీయ స్థాయిలో, ఐఎంఎఫ్ నివేదిక ప్రకా రం రాబోయే సంవత్సరాల్లో భారత ఆర్థిక వ్యవస్థ జర్మనీని దాటుకుని, మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మారగలదని భావిస్తోంది. అమెరికా యుఎస్ సుంకాలు ఉన్నప్పటికీ 2028 నాటికి పర్చేసింగ్ పవర్ పారిటీ పరంగా భారతదేశ ఆర్థిక వ్యవస్థ యుఎస్‌ను కూడా అధిగమించగలదని తాజా అంచనాలు వెల్లడిస్తున్నాయి. ●

# ఐదవ షెడ్యూల్ హననం రాజ్యాంగ విరుద్ధం

గుమ్మడి లక్ష్మీనారాయణ

త్వరలో గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉన్న పరిస్థితిని దృష్టిలో పెట్టుకున్న గిరిజనేతరులు ఏజెన్సీ ప్రాంతాల్లో సర్పంచ్ పదవులకు తమకూ పోటీ చేసే అవకాశం ఇవ్వాలని ఇటీవల హైకోర్టును ఆశ్రయించారు. ఏజెన్సీలో 10 శాతం గిరిజనులు కూడా లేని కొన్ని గ్రామ పంచాయతీల పరిధిలో వందశాతం రిజర్వేషన్ ఇవ్వడాన్ని రాజ్యాంగంలోని ఆర్టికల్ 14, 15ద్వారా సవాల్ చేశారు. దీనికి అసంబద్ధమైన జీవో నెంబర్ 03 సుప్రీంకోర్టు తీర్పును కూడా జత చేశారు. దాన్ని రాష్ట్ర హైకోర్టు తిరస్కరించింది. దీని ద్వారా రాజ్యాంగంలోని ఐదవ షెడ్యూల్ శాసన తీర్మాణాన్ని కోర్టులు జోక్యం చేసుకోవడం తగదు అనే విషయం స్పష్టం అయింది. 2018 తెలంగాణ పంచాయతీ రాజ్ చట్టం ప్రకారం ఐదవ షెడ్యూల్ ఏజెన్సీ ప్రాంతాల్లోని ఎం.పి.టి.సి, జెడ్.పి.టి.సి రిజర్వేషన్స్ కూడా రొటేషన్ పద్ధతిని అమలు చేయడం కూడా రాజ్యాంగ విరుద్ధమే. ఆదివాసీల రక్షణ కొరకు ఏర్పాటు చేయబడిన రాజ్యాంగంలోని 5, 6 షెడ్యూళ్లు ప్రత్యేక పరిధిని, గిరిజన హక్కులను కలిగి ఉన్నాయి. అయితే స్వాతంత్ర్యం సిద్ధించి 78 సంవత్సరాల గడచినా ఇక్కడ ఉన్న హక్కులను, చట్టాలను, జీవోలను పకడ్బందీగా అమలు చేసిన దాఖలాలు లేవు. అంటే పేరుకే రాజ్యాంగం గాని అమలు మాత్రం శూన్యం! తెలంగాణ ఏజెన్సీ ఏరియాలో ఏ ప్రభుత్వ శాఖ అయినా గాని పెసా,1/70చట్టానికిలోబడి పని చేయాల్సి ఉంటుంది. కానీ ఇక్కడ గిరిజన చట్టాలపై అవగాహన లేని అధికారులు, రాజకీయ నాయకుల వల్ల హక్కుల హననం జరుగుతోంది. గిరిజన రాజకీయ నాయకులు కూడా ఏజెన్సీ ప్రాంతాల్లో ఓట్లే ప్రధాన అంశంగా పనిచేయడంతో ఐదో షెడ్యూల్ పరిధిలోని చట్టాలు జీవోలు చాలా కాలం నుండి వివక్షకు గురవుతున్నాయి. దీనిలోభాగం గానే అటు ప్రభుత్వాలు, ఇటు వలస వచ్చిన గిరిజనేతర, మైదాన గిరిజనులు సామాజిక అంతరాలకు తెరలేపుతూ ఆదిమ గిరిజనుల హక్కులను కాలరాస్తున్నటు వంటి సంద ర్భాలు అత్యధికంగా కనపడుతున్నాం. తెలంగాణ ఏర్పడ్డాక గిరిజనుల పరిస్థితి పెనం మీద నుంచి



పోయిలో పడ్డ చందంగా మారింది. టిఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో గిరిజనులను ఒక ప్రత్యేక భూభాగంగా గుర్తించకుండా కొత్త జిల్లాల పేరుతో వారు చెట్టుకొకరు పుట్టుకొకరుగా విభజించబడ్డారు. ఐదవ షెడ్యూల్ భూభాగాన్ని పరిగణలోకి తీసుకోకుండా రాజ్యాంగ విలువలకు కట్టుబడకుండా అటు పోలవరం ముంపు, కవ్వాల టైగర్ జోన్, తుపాకుల గూడెం బ్యారేజ్, నల్లమల గనుల వేట వంటివి షెడ్యూల్ ఏజెన్సీ ప్రాంతాల లో ఏర్పాటు చేయడమే కాకుండా వారి భూభాగంలో పెసా కమిటీ ప్రాతినిధ్యం లేకుండా ఆదివాసీలను నిర్వాసితులను చేసిన సందర్భాలు అరుదు. పదేండ్ల పాలనలో నష్టపోయిన ఆదివాసులు ఈసారి ఎన్నికలలో ఐదవ షెడ్యూల్ తెలంగాణ ప్రాంతంలో కాంగ్రెస్ నుంచి ఐదుగురు ఎమ్మెల్యేలను గెలిపించుకున్నారు. కారణం ఇంద్రవెల్లి భారీ బహిరంగ సభతో వారి హక్కులకు రక్షణ కల్పిస్తామని ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిన దరిమిళా ఆదివాసులు ఈప్రాంతాల నుండి కాంగ్రెస్ ఎమ్మెల్యేలను గెలిపించుకోవడం జరిగింది. కానీ ఇచ్చిన మాటలు కార్యరూపం దాల్చకుండా పోరాటమే ఆదివాసులకు శరణ్యమవుతోంది. ప్రజాక్షేత్రంలో నిలబడి గెలిచిన మంత్రిపై ఆదివాసులు గంపెడు ఆశలతో ఎదురు చూస్తున్నారు. తెలంగాణ వ్యాప్తంగా ఆదివాసుల పెసా చట్టాన్ని 1/70 చట్టాన్ని అమలు చేయమని అడుగుతున్నారు. ఇప్పుడిప్పుడే ఏజెన్సీలో రోడ్లు, భవనాల సమస్యలు తీరుతున్నాయి. పోడు భూముల సమస్యలు కాస్త మెరు గుపడుతున్నాయి. కాని 'ధరణి' ఆదివాసీ భూముల్ని దగా చేసింది కాగా 'భూమాత' ధోరణి చూస్తే ధరణిని పోలి ఉంది. సాదా బైనామాలతో ఆదివాసీల భూములు వారి ప్రమేయం లేకుండా గిరిజనేతరుల పాలవ్వకుండా ప్రభుత్వం రక్షణ కల్పించాలి. ఐటిడిఏలలో విద్యాశాఖ ఇంజనీరింగ్ శాఖ లు తప్ప మిగతా శాఖలు పనిచేయడం లేదనేవదంతులు విన్పిస్తున్నాయి. ఐటిడిఏ వ్యవస్థక్రింద ఏమి అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయో తెలియాలంటే పాలక మండలి సమావేశాలు తరుచుగా జరగాలి. గిరిజన సలహా మండలి (టిఏసి) కమిటీ ఏర్పాటుచేసి దాని విధివిధానాలు రూపొందిస్తే ఆదివాసి ప్రజలకు న్యాయం జరుగుతుంది.ఐదవ షెడ్యూల్ ప్రాంతంలోని ఆదివాసుల ప్రాథమిక హక్కులకు భంగం కలిగించే జీవో 49ను రద్దు చేయాలి. ఆదివాసుల మీద అటవీశాఖ అధికారులవిచక్షణారహితమైన దాడులకు చరమగీతం పాడాలి. గిరిజన ప్రాంతాల్లో మానవ అక్రమ రవాణా, లైంగిక వేధింపులను నిరోధించాలి. గిరిజన ఏజెన్సీ ప్రాంతాల్లో స్థానికులకు వందశాతం ఉద్యోగాలు కల్పించే జీవో నెంబర్ 03ను పునరుద్ధరించేలా ప్రభుత్వం చొరవ చూపాలి. ●

# 11న డిప్యూటీ సీఎం పవన్ బాపట్ల పర్యటన

బాపట్ల,సెప్టెంబర్ 8,ప్రభాతవార్త: రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, పంచాయతీశాఖ మంత్రి కె పవన్ కళ్యాణ్ ఈనెల 11వ తేదీన బాపట్ల జిల్లాలో పర్యటించనున్నారని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి తెలిపారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లపై అన్నిశాఖల జిల్లా అధికారులతో సోమవారం ఆయన సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మడ అడవుల అభివృద్ధిలో




భాగంగా సూర్యలంక బీచ్ వద్ద మడ మొక్కలను రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి నాటుతారన్నారు. పవన్ కళ్యాణ్ పర్యటన ఖరారు కావడంతో అధికారులంతా అప్రమత్తం కావాలన్నారు. మంత్రి పర్యటన సజావుగా సాగడానికి సమగ్ర ప్రణాళికతో అధికారులు ముందుకు సాగాలని ఆయన ఆదేశించారు. ఉపముఖ్యమంత్రి తెలుగు సినిమా రంగంలో ప్రముఖ కథానాయకుడు కావడంతో ప్రజల అత్యధికంగా వచ్చే అవకాశం ఉందన్నారు. భద్రత ఏర్పాట్లు చూసుకోవాలని ఎస్పీకి సూచించారు. అల్లర్లు జరగకుండా చూడాలన్నారు. ముఖ్యంగా శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం ఏర్పడకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. బీచ్ వద్ద పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. సముద్ర తీరం వెంట చెత్త, సీసా పెంకులు లేకుండా శుభ్రం చేయాలన్నారు. హెలిప్యాడ్ వద్ద ప్రోటోకాల్ పక్కాగా అమలు చేయాలన్నారు. స్టాల్ ఏర్పాటు చేయాలని సూచించారు. పంచాయతీ శాఖ, డ్వామాశాఖల ద్వారా చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలపై సంక్షిప్త నివేదిక సిద్ధం చేసుకోవాలని కలెక్టర్ చెప్పారు. ఈ సమావేశంలో జిల్లా ఎస్పీ తుషార్ డూడి, ఇంచార్జి సంయుక్త కలెక్టర్, డి ఆర్ ఓ జి.గంగాధర్ గౌడ్, ఆర్డీవోలు, ఆయా శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు 500మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా: మండల వ్యవసాయాధికారి సంధ్యారాణి



తుళ్ళూరు,సెప్టెంబర్ 8,ప్రభాతవార్త : రైతులకు ఇప్పటివరకు 500మెట్రిక్ టన్నుల యూరియాను సరఫరా చేయడం జరిగిందని మండల వ్యవసాయాధికారి పి.సంధ్యారాణి చెప్పారు.మండలంలో పత్తి 1400హెక్టార్లు,వరి 80హెక్టార్ల లో సాగవుతుందని రైతులకు పంటలలో వినియోగానికి 750మెట్రిక్ టన్నుల యూరియా అవసరం కాగా 500టన్నులు సరఫరా చేయడం జరిగిందన్నారు.సోమవారం పెదపరిమిలో "యూరియా మీ చెంతకు" కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో యూరియా మానిటరింగ్ సభ్యులు తహశీల్దార్ హరి బాబు,సిఐ శ్రీనివాసరావు పాల్గొన్నారు.యూరియాను ప్రైవేటు డీలర్లు,రైతు సేవా కేంద్రాల ద్వారా సరఫరా చేయడం జరుగుతోందని ఎవో చెప్పారు.యూరియా కోసం రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని,అవసరం మేరకు యూరియాను ఆర్ఎస్‌కె ద్వారా తెప్పిస్తామని,వదంతులు నమ్మవద్దన్నారు.

## రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా హసీం బేగ్

విజయవాడ,సెప్టెంబరు 8,ప్రభాతవార్త: రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా డాక్టర్ హసీం బేగ్‌ను నియామకం చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా ఆయన మంత్రి కొల్లు రవీంద్రను మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన మాట్లాడుతూ మైనార్టీగా ఉన్న ప్రతి ఒక్కరికీ విద్య,ఉపాధి,ఆర్థికంగా ఎదగడానికి సమాన అవకాశాలు అందించడమే తన లక్ష్యమని ఉద్ఘాటించారు.రాష్ట్ర ప్రభుత్వం మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా అనేక పథకాలను అమలు



చేస్తోందని,వీటి ద్వారా మైనార్టీ ప్రజలు స్వయం ఉపాధి పొందేందుకు,వ్యాపారం ప్రారంభించేందుకు, విద్యాభివృద్ధికి,పర్యటనలకు సహాయం అందిస్తోదన్నారు. వ్యాపారం ప్రారంభించాలనుకునే మైనార్టీలకు బ్యాంకు లోన్‌పై ప్రభుత్వం సబ్సిడీ ఇస్తుందని,ఇది వారి స్వయం ఉపాధిని పెంచడంలో ఉపయోగపడుతుందన్నారు. విద్యలో ముందడుగు వేయాలనుకునే విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు,ఫీజు రీఎంబర్స్‌మెంట్,కోచింగ్ సదుపాయాలను ఈ పథకాల ద్వారా అందిస్తారన్నారు.పవిత్ర స్థలాలకు వెళ్ళే వారికి ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించి, వారి ధార్మిక ప్రయాణానికి తోడ్పడుతుందని,ఇటీవల హజ్ యాత్రకు వెళ్ళిన వారికి రూ.లక్ష చొప్పున ఆర్థిక సహాయం అందించిందన్నారు. యువతకు నైపుణ్య శిక్షణలు అందించి,ఉద్యోగ అవకాశాలను పెంచేందుకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తుందని, మైనార్టీలు చిన్న,సూక్ష్మ వ్యాపారాలను ప్రారంభించి ఆదాయాన్ని పెంచుకునేందుకు తక్కువ వడ్డీకి మైనార్టీ కార్పొరేషన్ ద్వారా రుణాలందిస్తామన్నారు. మైనార్టీ సమాజానికి ప్రభుత్వం అందిస్తున్న సహాయాలను సద్వినియోగం చేసుకొని విద్యలో,వ్యాపారంలో ముందడుగు వేసి సమాజ అభివృద్ధికి తోడ్పడదామని పిలుపునిచ్చారు. తనను డైరెక్టర్‌గా నియమించిన రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు,రాష్ట్ర ఐటీ శాఖ,విద్యాశాఖ మంత్రి నారా లోకేష్,రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర,కొనకళ్ళ నారాయణరావులకు ఈ సందర్భంగా ఆయన కృతజ్ఞతలు తెలిపారు.


## ఉపాధి హామీ పథకం కింద 60 గోకుల షెడ్‌లు
## మంజూరు: గడ్డి కృష్ణారెడ్డి వెల్లడి

ఎ కొండూరు, సెప్టెంబరు 8, ప్రభాతవార్త :ఎన్‌టిఆర్ జిల్లా తిరువూరు నియోజకవర్గం ఎ కొండూరు మండలం రామచంద్రాపురం గ్రామంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం



(ఎంఎన్ఆర్ఈజిఎస్) ఫేజ్-2 కింద మంజూరైన మినీ గోకులం షెడ్డును తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు రైతు బాంధవుడు గడ్డి కృష్ణారెడ్డి సోమవారం ముఖ్య అతిథిగా పాల్గొని శంకుస్థాపన (భూమిపూజ) జరిపారు. ఈ సందర్భంగా గడ్డి కృష్ణారెడ్డి మాట్లాడుతూ ఈ మండలానికి ఉపాధి హామీ ఫేజ్-2 కింద 60 మినీ గోకుల షెడ్డులు మంజూరైనట్లు అందులో భాగంగా ఈ గోకుల షెడ్డు నిర్మాణానికి భూమి పూజ నిర్వహించినట్లు కృష్ణారెడ్డి తెలిపారు. ఒక్కో షెడ్డుకు రూ.2.30 లక్షలు మంజూరవ్వగా అందులో రూ.23వేలు మినీ గోకులం షెడ్ లబ్దిదారుని వాటాగా మంజూరయినదని వీటిని లబ్దిదారులు వినియోగించుకుని రేకుల షెడ్డు నిర్మాణం చేసుకుని పాడిపశువులను సంరక్షించుకోవాలని కృష్ణారెడ్డి లబ్దిదారులను కోరారు. ఇంకా ఈ కార్యక్రమంలో సూరెడ్డి పిచ్చేశ్వరరావు ఒంటేరు రామారావు తుళ్లూరు కృష్ణ పంబి చెన్నారావు ఉపాధి హామీ సిబ్బంది వెటర్నరీ అసిస్టెంట్ తదితరులు పాల్గొన్నారు.

## నల్లగట్ల స్వామిదాస్‌ను కలిసిన మైనార్టీ విభాగం సెక్రటరీ



తిరువూరు, సెప్టెంబరు 8, ప్రభాతవార్త : ఎన్‌టిఆర్ జిల్లా మైనార్టీ విభాగం సెక్రటరీగా నియమితులైన తిరువూరు నియోజకవర్గ సమన్వయకర్త నల్లగట్ల స్వామిదాస్‌ను మైనార్టీ విభాగం సెక్రటరీ రాజ్ మహమ్మద్ సోమవారం వైసిపి కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందచేసి కృతజ్ఞతలు తెలిపారు. వీరితో వైసిపి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## బాబోయ్.. దోమలు.. ఆపై వ్యాధులు..!

ఎ కొండూరు, సెప్టెంబరు 8, ప్రభాతవార్త : ఎన్‌టిఆర్ జిల్లా తిరువూరు నియోజకవర్గం ఎ కొండూరు విసన్నపేట గంపలగూడెం మండలాల్లోని ఆయా గ్రామ పంచాయతీల్లో రాత్రిపూట దోమల బెడద కారణంగా ప్రజలు జ్వరాల బారిన పడి ఇబ్బందులు పడుతున్నారు. ఈ మండలంలోని వివిధ గ్రామ పంచాయతీల్లో ప్రభుత్వం స్వచ్ఛాంధ్ర స్వచ్ఛభారత్ పేరుతో తూతూ మంత్రంగా పారిశుధ్య ఇంకా ఇతర పనులు నిర్వహిస్తున్నా రాత్రిపూట దోమల బెడద దోమ కాటువల్ల పిల్లలు పెద్దలు జ్వరాల బారీన పడిన పడుతున్నారు. అనేక గ్రామ పంచాయతీల్లో నిధుల లేమితో పారిశుధ్యం ఇంకా ఇతర పనులు చేపట్ట లేకపోతున్నామని సర్పంచ్‌లు చేతులెత్తేస్తున్నారు. ఆయా గ్రామాల్లో డ్రైనేజీల వ్యవస్థ సరిగా లేకపోవడం ఈ వర్షాకాలంలో మురుగు నీరు రోడ్లపై ప్రవహిస్తుండటం రాత్రిపూట దోమల నివారణకు అంటు వ్యాధులు విషజ్వరాలు సోకి ఆసుపత్రుల పాలై మృత్యువాత పడితే తప్ప వైద్య ఆరోగ్య శాఖ మలేరియా శాఖ అధికారులు గ్రామాల్లో సిబ్బందితో మొక్కుబడి పర్యటనలు జరిపి మందులు బ్లడ్ టెస్టింగ్ లేని వైద్య శిబిరాలు నామ్‌కావేస్తేగా నిర్వహించి తమ పని అయిపోయిందన్నట్లు వ్యవహరిస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని మండలాల్లోని గ్రామాల ప్రజలు వైద్య ఆరోగ్య శాఖ పనితీరును తీవ్రంగా ఆక్షేపిస్తున్నారు. ఇకనైనా ఆయా మండలాల్లోని గ్రామ పంచాయతీల్లో పారిశుద్యం దోమల నివారణకు రాత్రిపూట దోమల మందు (ఫాగింగ్) పూర్తిస్థాయిలో నిర్వహించి దోమలపై దండయాత్ర చేసి నివారణకు చర్యలు తీసుకొని ప్రజారోగ్యాన్ని కాపాడాలని ఎ కొండూరు విసన్నపేట గంపలగూడెం మండల ప్రాంత ప్రజలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.


## శాంసంగ్ నుంచి గెలాక్సీ ట్యాబ్ ఎస్11

విజయవాడ, సెప్టెంబరు 8, ప్రభాతవార్త : భారతదేశపు అతిపెద్ద కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్ బ్రాండ్ శాంసంగ్ గెలాక్సీ ట్యాబ్ ఎస్11 అల్ట్రా, గెలాక్సీ ట్యాబ్ ఎస్11ను ప్రోగ్రేడ్ హార్డ్‌వేర్‌ను పెద్దస్క్రీన్ కోసం ఆప్టిమైజ్ చేసిన అనుభవాలతో అత్యంత సన్నగా పనితీరులో రాజీపడని తీరుతో ప్రారంబించబడిందని ప్రకటించింది.

## అమెజాన్ గ్రేడ్ ఇండియా ఫెస్టివల్

విజయవాడ, సెప్టెంబరు 8, ప్రభాతవార్త : విస్తృతంగా 1లక్షకి పైగా ఉత్పత్తులు శాంసంగ్ యాపిల్ ఇంటెల్ హెచ్‌పి అనూస్ టైటాన్ లోరియల్ లిబాస్ మరియు ఎన్నో పెద్ద బ్రాండ్స్ నుండి ఎలక్ట్రానిక్స్ ఫ్యాషన్ సౌందర్యం హోమ్ కిచెన్ అండ్ అవుట్ డోర్ ఉత్పత్తుల కొత్త విడుదలపై ఉత్తేజభరితమైన డీల్స్‌ను సంవత్సరంలో తక్కువ ధరలకోసం అమెజాన్ కష్టమర్లు ఎదురుచూడవచ్చు.

# అమరావతి వార్త



## తురకపాలెంలో వైద్యఆరోగ్యశాఖ అధికారులు, ఎయిమ్స్, ప్రైవేటు వైద్యనిపుణులతో ఆరోగ్య సహాయ కార్యక్రమాలు

**-మెలియోడోసిస్ వ్యాధి నిర్ధారించిన ఇద్దరి ఆరోగ్యం స్థిరంగా ఉంది**
**-ఐసిఎఆర్ ఆధ్వర్యంలో మట్టి పరీక్షల కోసం గ్రామంలో నమూనాల సేకరణ**
**-నేడు గ్రామంలో ఆరోగ్య పరిస్థితులను సమీక్షించనున్న బృందం**
**-గుంటూరు జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి వెల్లడి**

గుంటూరు-ప్రభాతవార్త ప్రతినిధి, సెప్టెంబర్ 8: గుంటూరు గ్రామీణ మండలం తురకపాలెం గ్రామంలో సంక్రమణ (ఇన్ఫెక్షన్)వ్యాధుల నియంత్రణ చర్యలను మరింతగా బలోపేతం చేసేలా రాష్ట్ర , జిల్లా స్థాయి వైద్య ఆరోగ్య శాఖాధికారులు , ఎయిమ్స్ , ప్రైవేట్ వైద్య నిపుణులతో విస్తృత స్థాయిలో కృషి చేస్తున్నామని జిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మి తెలిపారు. సోమవారం ఎయిమ్స్ కమ్యూనిటీ మెడిసిన్ విభాగం వైద్యులు సంక్రమణ నియంత్రణ చర్యలను పరిశీలించి పరిస్థితిని సమీక్షించారని , ఆస్టర్ రమేష్ ఆసుపత్రి నుండి వచ్చిన ఇన్ఫెక్షన్ స్పెషలిస్టులు మరియు గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టులు గ్రామంలో ఓపి కేసులను పరీక్షించి రోగులకు చికిత్స అందించారు. రక్త నమూనాల పరీక్షలలో అసాధారణ ఫలితాలు వున్న వారికి సంబంధిత విభాగం వైద్య నిపుణుల ఆధ్వర్యంలో చికిత్స అందించడంతో పాటు తదుపరి చికిత్స నిమిత్తం ప్రభుత్వ సమగ్ర వైద్యశాలకు పంపించడం జరుగుతుందన్నారు. గ్రామంలో పది బృందాల ఆధ్వర్యంలో 41 రకాల పరీక్షల కోసం ఇంటింటికి సర్వే జరుగుతున్నదని , ఈ నెల 6 నుండి 8 వ తేదీ వరకు 1,501 రక్త నమూనాలను సేకరించి ల్యాబ్ లకు పంపడం జరిగిందన్నారు. రక్త పరీక్షలలో అసాధారణ ఫలితాలు వచ్చిన వ్యక్తుల ఆరోగ్య పరిరక్షణ కార్యాచరణ ప్రణాళికకు సంబంధించి మొత్తం పరీక్షల్లో మధుమేహం 6.59 గా కనిపించిందని , ఇందులో పురుషుల్లో 10 , అలాగే 50 సంవత్సరాలు పైబడిన పురుషుల్లో 37 ..గా ఉందన్నారు. మధుమేహం నిర్ధారితమైన 74 మంది వ్యక్తులకు పరీక్షలు నిర్వహించబడుతున్నాయని , వీరికి గుంటూరు జీజీహెచ్ వైద్యులతో తురకపాలెం మెడికల్ క్యాంపులో కన్సల్టేషన్ ఏర్పాటు చేశామన్నారు. గ్రామంలో వైద్య ఆరోగ్య శాఖ నిర్వహించే కార్యక్రమాలపై రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ నోడల్ అధికారి డాక్టర్ ఎ. సిరి ఆధ్వర్యంలో నిపుణుల కమిటీ సమీక్ష సమావేశం నిర్వహించి తదుపరి కార్యాచరణ ప్రణాళిక రూపొందించారన్నారు. మంగళవారం ఢిల్లీ నుండి ।దిలీళి నిపుణుల బృందం గ్రామాన్ని సందర్శించి ఆరోగ్య పరిస్థితులను సమీక్షిస్తుందన్నారు. ప్రస్తుతం గ్రామానికి చెందిన ఏడుగురు వ్యక్తులు అనారోగ్య కారణాలు , ఇన్ఫెక్షన్ డీసీజ్ తో ఆసుపత్రులలో చికిత్స పొందుతున్నారన్నారు. వీరిలో ఆగష్టు 21 వ తేదీన చేరిన పీ . ఎలీషా, 31 వ తేదీన చేరిన పి. నరసింహారావు కు మెలియోయిడోసిస్ వ్యాధి నిర్ధారణ అయిందని , వీరి ఆరోగ్య ప్రస్తుతం స్థిరంగా వుందని , మిగిలిన వారి ఆరోగ్యం కూడా స్థిరంగా వుందన్నారు. వైద్య నిపుణుల పర్యవేక్షణలో పూర్తి స్థాయిలో అత్యుత్తమైన వైద్య సేవలను అందిస్తున్నామన్నారు. గ్రామంలో ।దితిళి రిఫర్ చేసిన హైదరాబాదులోని లాబొరేటరీ బృందం గ్రామంలోని ఎనిమిది ప్రాంతాల్లో సాయిల్ టెస్టు కోసం శాంపిల్స్ సేకరించడం జరిగింది. మైన్స్ అండ్ జియాలజీ శాఖ మరియు ఏపీపీసీవీ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన గాలి నాణ్యత పరీక్షల్లో కణాల స్థాయిలు ఆమోదనీయ పరిమితులలోనే ఉన్నాయని ఫలితాలు వచ్చాయి. జిల్లా పంచాయితీ శాఖ ఆధ్వర్యంలో గ్రామంలో 28 మంది మున్సిపల్ సిబ్బంది మరియు మలేరియా సిబ్బంది మిషనరీ సహాయంతో పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఓవర్ హెడ్ ట్యాంకులు , డ్రైన్లు , మంచి నీటిని సరఫరా చేసే వాల్వ్ పిట్స్ , రహదారులు శుభ్రపరుస్తున్నారు. మురుగు కాలువలల్లో పూడికతీతతో పాటు ఫాగింగ్ , ఎబెట్ మరియు బ్లీచింగ్ పౌడర్ తో స్ప్రే చేస్తున్నారు. గ్రామంలో పూర్తి స్థాయిలో ముళ్ళ పొదలను శుభ్రచేయడంతో పాటు వ్యర్ధాలను తొలగించడం జరిగింది. జిల్లా , డివిజన్ స్థాయి పంచాయితీ అధికారుల నిరంతర పర్యవేక్షణలో యంపీడీఓ , పంచాయితీ సెక్రెటరీలు పారిశుద్ధ కార్యక్రమాలు పకడ్బంధీగా చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఆర్ డబ్ల్యూ ఎస్ ఆధ్వర్యంలో సోమవారం కూడా గ్రామంలో త్రాగునీటి సరఫరా కోసం 4,000 లీటర్ల సామర్థం గల 20 ట్యాంకర్లు, 12,000 లీటర్ల సామర్థం గల 3 ట్యాంకర్లు ద్వారా మంచి నీటిని సరఫరా చేయడం జరుగుతున్నది. దీనితో పాటు గ్రామస్తుల త్రాగునీటి అవసరాల కోసం 680 వాటర్ క్యానులను పంపిణీ చేయడం జరిగింది. తురకపాలెం గ్రామంలో ఉపశమన చర్యలలో భాగంగా సోమవారం కూడా గ్రామంలోని 3,829 మందికి అల్పాహారం , మధ్యాహ్న భోజనం , రాత్రి భోజనం అందించటం జరుగుతోందని కలెక్టర్ వివరించారు.

## పాఠశాలల్లో స్మార్ట్ టాయిలెట్లు ప్రారంభించిన మంత్రి నాదెండ్ల

తెనాలిటౌన్, సెప్టెంబర్8, ప్రభాతవార్త: పట్టణంలోని పురపాలక సంఘ పాఠశాలల్లో నెస్లే కంపెనీ వారి సౌజన్యంతో,ఇరవైఒక్క లక్షల రూపాయల వ్యయంతో, విద్యార్థుల కోసం నిర్మించిన స్మార్ట్ టాయిలెట్లను మంత్రి నాదెండ్ల మనోహర్ సోమవారం ప్రారంభించారు. పట్టణంలోని కొత్తపేట నందుగల శ్రీమతి




దొడ్డపనేని ఇందిరా మున్సిపల్ గర్ల్స్ హై స్కూల్ నందు మరియు చెంచుపేటలోని కోగంటి శివయ్య మున్సిపల్ హైస్కూల్ నందు మరియు గంగానమ్మపేటలోని తోటకూర సుబ్బారావు మున్సిపల్ హై స్కూల్ నందు విద్యార్థులకు స్మార్ట్ టాయిలెట్ లను విద్యా ర్థులతో కలిసి ప్రారం భించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా తీర్చిదిద్దుతామన్నారు.ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు,ప్రజా ప్రతినిధులు పెద్ద ఎత్తున కూటమి పార్టీల నాయకులు పాల్గొన్నారు.

## సద్గురు మూర్తికి గ్రహణానంతర అభిషేకం



జగ్గయ్యపేట, సెప్టెంబర్ 8, ప్రభాతవార్త : జగ్గయ్యపేట మండలంలోని బలుసు పాడు శ్రీగురుధామ్‌లో సోమవారం ఉదయం సద్గురు శ్రీశివానంద మూర్తి భగవాన్లకు గ్రహణానంతర అభిషేక కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. డాక్టర్ అబ్దుల్ కలాం అంతర్జాతీయ పురస్కార గ్రహీత, ప్రముఖ తాత్వికులు గెంటేల వెంకటరమణ-వసంతలక్ష్మి గురుదంపతుల ఆధ్వర్యంలో శ్రీశివానందగురు ఎడ్యుకేషనల్/కల్చరల్ ట్రస్టు ప్రతినిధులు ఈకార్యక్రమాన్ని నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు ఈకార్యక్రమంలో పాల్గొని స్వయంగా అభిషేకం, అలంకరణ, నక్షత్ర హారతులతో ఆరాధించారు.

## డాక్టర్ సామల విజయకుమార్‌కు ఎమ్మెల్యే రాజగోపాల్ నివాళి

జగ్గయ్యపేట, సెప్టెంబర్ 8, ప్రభాతవార్త :జగ్గయ్యపేట పట్టణంలో నాలుగు దశాబ్దాలపాటు పేద, బడుగు వర్గాలకు వైద్యసేవలందించిన డాక్టర్ సామల విజయకుమార్ సంస్మరణ కార్యక్రమం సోమవారం షేర్‌మహ్మద్‌పేట క్రాస్‌రోడ్ వద్దగల అన్నెపాక వారి సమావేశ మందిరం వద్ద నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన స్థానిక ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య), విజయ కుమార్ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఒక మంచి గ్రామీణ



వైద్యుని కోల్పోయామని విచారం వ్యక్తంచేశారు. విజయకుమార్ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం, సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో మాజీమున్సిపల్ వైస్‌చైర్మన్ మహ్మద్ అక్బర్, మాజీ యార్డు డైరెక్టర్ పున్నా ఉపేంద్ర కూడా పాల్గొన్నారు.

## 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక'లో 7 ఫిర్యాదులు



విజయవాడ కార్పొరేషన్,సెప్టెంబరు 8,ప్రభాతవార్త: ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూంలో అదనపు కమీషనర్ డాక్టర్ డి.చంద్రశేఖర్ నిర్వహించారు. సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో 7 ఫిర్యాదులు అందగా అందులో పట్టణ ప్రణాళికకు సంబంధించినవి-3,ఇంజనీరింగ్-2,రెవిన్యూ-1,ఎస్టేట్-1 ఫిర్యాదులను అందుకున్నారు. ఈ కార్యక్రమంలో చీఫ్ ఇంజనీర్ ఆర్.శ్రీనాథ్‌రెడ్డి,చీఫ్ మెడికల హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కె.అర్జునరావు,డిప్యూటీ డైరెక్టర్(హార్టికల్చర్)చంద్రశేఖర్,ఎస్టేట్ ఆఫీసర్ ఎ.శ్రీధర్,బయాలజిస్ట్ కామేశ్వరరావు,జాయింట్ డైరెక్టర్ అమృత్ డాక్టర్ లత,వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ ఎస్ఎస్ సోమశేఖరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పోలీసు కమిషనర్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక: 79 ఫిర్యాదులు

విజయవాడ కార్పొరేషన్,సెప్టెంబరు 8,ప్రభాతవార్త: సిపి రాజశేఖరబాబు ఆదేశాల మేరకు పోలీస్ కమీషనర్ కార్యాలయంలో డిసిపి ఎబిటిఎస్ ఉదయరాణి ప్రజా సమస్యల పరిష్కార వేదికను నిర్వహించి ప్రజల నుండి 79 ఫిర్యాదులను అందుకున్నారు. వీటిపై భాధితులతో మాట్లాడటంతో




ఎ ా ట ం దివ్యాంగులు, వృద్ధుల వద్దకు నేరుగా వెళ్ళి వారి సమస్యలు గురించి అడిగి తెలుసుకొని వాటిని త్వరగా పరిష్కరించాలని ఫోన్ ద్వారా సంబంధిత స్టేషన్ ఎస్‌హెచ్ఓలతో మాట్లాడి సత్వరమే చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. సోమవారం అందిన ఫిర్యాదుల్లో భూవివాదాలకు,ఆస్థి వివాదాలకు,నగదు లావాదేవీలకు సంబంధించినవి-44,భార్యాభర్తలు,కుటుంబ కలహాలకు సంబంధించినవి-2,వివిధ మోసాలకు సంబంధించి-1,మహిళా సంబంధిత నేరాలకు సంబంధించి-9,చోరీలకు సంబంధించి-1,ఇతర చిన్న చిన్న వివాదాలు సమస్యలకు,సంఘటనలకు సంబంధించి-22 మొత్తం 79 ఫిర్యాదులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో డిసిపితో పాటు అధికారులు,సిబ్బంది పాల్గొని ఫిర్యాదులు పరిష్కరించడంలో సహకారాన్ని అందించారు.

## మున్సిపల్ పాత కార్యాలయ భవనం కూల్చివేత తగదు...



జగ్గయ్యపేట, సెప్టెంబర్ 8, ప్రభాతవార్త : జగ్గయ్యపేట మున్సిపల్ పాత కార్యాలయ భవనాన్ని కూల్చివేసే పనులు చేపట్టటం తగదని, చైర్మన్ దురుద్దేశ పూరకంగా, చట్టవ్యతిరేకంగా కూల్చివేత పనులకు పాల్పడుతున్నారని వైఎస్ఆర్సీపి కౌన్సిలర్ వట్టెం మనోహర్ ఆరోపించారు. సోమవారం ఈమేరకు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదుచేస్తూ మున్సిపల్ కమిషనర్ కృష్ణారావుకు వినతిపత్రం సమర్పించారు. భవనం కూల్చి కొత్తదాన్ని నిర్మించేందుకు ఆన్‌లైన్ టెండర్ ద్వారా లీజుదారుడు ముందుకు వస్తే వారికి సహకరిస్తామని, లేకుంటే న్యాయస్థానాన్ని ఆశ్రయించాల్సివస్తుందని ఆయన ఫిర్యాదులో పేర్కొన్నారు.

## గోల్డెన్ జూబ్లీ ఉత్సవాలకు ఏఎన్‌యు ముస్తాబు

**- ఏడాది మొత్తం 4 విడతల్లో కార్యక్రమాలకు ప్రణాళిక**
**- 11న ఏఎన్‌యు స్థాపించి 50ఏళ్ళు- ప్రత్యేక లోగో ఆవిష్కరణకు సన్నాహాలు**
**- ఉత్సవాలకు 5గురు మాజీ వీసీలు రాక - కమిటీ సమావేశంలో గోల్డెన్ జూబ్లీ ఉత్సవాలపై సమీక్ష**

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం,సెప్టెంబరు8, ప్రభాతవార్త: 1976 సెప్టెంబరు 11న అప్పటి రాష్ట్రపతి ఫక్రుద్దీన్ అలీ అహ్మద్ చేతుల మీదుగా నాగార్జునవర్సిటీగా ఏర్పాటైంది. ఆతరువాత వైయస్.రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా వచ్చాక 2004లో యూనివర్సిటీల చట్ట సవరణ జరిగింది. అందులో నాగార్జున యూనివర్సిటీ పేరును ఆచార్య నాగార్జున యూనివర్సిటీగా మార్పు చేస్తు అప్పటి గవర్నర్, వర్సిటీ ఛాన్సలర్ ఆర్డినెన్స్ జారీ చేశారు. కాగా, 2001కి సిల్వర్ జూబ్లీ వేడుకలు జరుపుకున్న వర్సిటీ ఈనెల 11కు గోల్డెన్ జూబ్లీ ఉత్సవాలకు సిద్ధమైంది. వర్సిటీ స్థాపించి 50ఏళ్ళు అయిన సందర్భాన్ని పురస్కరించుకుని గోల్డెన్ జూబ్లీ ఉత్సవాలు అంగరంగ వైభవంగ నిర్వహించేందుకు వర్సిటీ యంత్రాంగం ప్రణాళికలు రూపొందిస్తుంది. ఉత్సవాల నిర్వహణలో భాగంగా 2025-2026 వరకు 3లేదా 4విడతల్లో ఉత్సవాలు జరుపనున్నారు. ఈ ఉత్సవాలు నిర్వహణకు ఇన్‌చార్జి వీసి ఆచార్య




కె.గంగాధరరావు చైర్మన్‌గా 10కమిటీలను నియమించారు. ఇందులో ప్రిన్సిపాల్స్, పాలకమండలి సభ్యులు, నూటా, వికాస నాయకులు, కోఆర్డినేటర్లు, డైరెక్టర్‌లు, అధ్యాపకులు, విభాగాధిపతులు, కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌లు, గెస్ట్ ఫ్యాకల్టీ, ఇంజనీరింగ్ విభాగం ఉద్యోగులు తదితరులు ఉన్నారు. 1.ఒవరాల్ పర్యవేక్షణ, 2. ఫైనాన్స్ కమిటీ, 3.సభా నిర్వహణ కమిటీ, 4. ట్రాన్స్‌పోర్ట్ అండ్ హాస్పటల్ కమిటీ, 5. వీడియోగ్రఫీ కమిటీ, 6. మీడియా కమిటీ, 7. వెహికల్ పార్కింగ్, 8. రిఫ్రెష్‌మెంట్స్ కమిటీ, 9. స్టూడెంట్ మొబలైజేషన్ అండ్ ఆడిటోరియం కమిటీ, 10. కల్చరల్ యాక్టివిటీ కమిటీలను నియమించారు. ఈ కమిటీలతో సోమవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రెక్టార్ ఆచార్య కె.రత్నషీలామ, రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం, సిడిసి డీన్ ఆచార్య వి.రవికుమార్‌లతో పాటు కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వీసి మాట్లాడుతూ గోల్డెన్ జూబ్లీ ఉత్సవాలు విజయవంతంగా నిర్వహించేందుకు చేయాల్సిన ఏర్పాట్లపై కమిటీల నిర్వాహకులకు పలు సూచనలు చేశారు.

**ప్రత్యేక లోగో ఆవిష్కరణ:** వర్సిటీ గోల్డెన్ జూబ్లీ వేడుకలు చరిత్రలో నిలిచేలా ప్రత్యేక లోగో ఆవిష్కరణ చేశారు. ఈ లోగోలో ఆచార్య నాగార్జునుడి బొమ్మపై 50 సంఖ్య ముద్రించి 50లో వర్సిటీలో ఉన్న అన్ని విభాగాల పేర్లు ఉండేలా రూపొందిస్తున్నారు. తద్వారా ఈ లోగో కూడా ఒక ప్రత్యేకతను సంతరించుకోనుంది.

**పూర్వ వీసిలు రాక:** వర్సిటీ గోల్డెన్ జూబ్లీ వేడుకల్లో భాగంగా వర్సిటీకి వీసిలుగా పనిచేసిన వారిని ప్రత్యేకంగా గౌరవించేందుకు ఆహ్వానించింది. ఇందులో 5గురు పూర్వ వీసిలు ఉత్సవాల్లో పాల్గొనేందుకు అంగీకారం తెలిపారు. వారిలో ఆచార్య సి.వి.రాఘవులు, ఆచార్య ఎల్.వేణుగోపాల్‌రెడ్డి, ఆచార్య వి.బాలమోహన్ దాస్, ఆచార్య వై.ఆర్.హరగోపాల్ రెడ్డి, ఆచార్య రాజేంద్రప్రసాద్‌లు ఉన్నారు.

## యువత మానసిక దృఢత్వం పెంచుకోవాలి: వీసి


ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం,సెప్టెంబరు8, ప్రభాతవార్త: యువత మానసిక దృఢత్వాన్ని పెంచుకోవాలని ఇన్‌చార్జి వీసి ఆచార్య కె.గంగాధరరావు అన్నారు. వర్సిటీలోని సైకాలజీ విభాగం ఆద్వర్యంలో ఈనెల 10న ఆత్మహత్యల నివారణ దినోత్సవం సందర్భంగా విద్యార్థుల్లో ఆత్మహత్యల



నివారణపై అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. విభాగం విద్యార్థులు వర్సిటీలోని 300మంది విద్యార్థులను ఎంపిక చేసుకుని వారిద్వారా 1300మంది విద్యార్థులకు ఆత్మహత్యల నివారణకై ప్రత్యేక అవగాహన కల్పించారు. ఆత్మహత్యలు చేసుకోవాలనే ఆలోచనలో ఉన్న వారిని గుర్తించడం వారికి ప్రాథమిక చికిత్స కింద సైకలాజికల్ ట్రీట్‌మెంట్ ఇవ్వడం వంటి అంశాలను విద్యార్థులకు వివరించారు. ఇటువంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో ఆత్మహత్యలు చేసుకోవాలనే భావన కూడా నశిస్తుందని వీసి అన్నారు. నిరంతరం విద్యార్థులు ఇటువంటి కార్యక్రమాలు చేపట్టి అవగాహన కల్పించాలని సూచించారు. సైకాలజీ విభాగం విద్యార్థులను అబినందించారు. ఈ సందర్భంలో విభాగాధిపతి ఆచార్య జి.చెన్నారెడ్డి, అధ్యాపకులు టి.డి.విమల, ప్రమీళారాణి, అనుపమ, కృష్ణమోహన్, విద్యార్థులు పాల్గొన్నారు.

## వర్సిటీలో బిసి అధ్యాపకులకు సన్మానం

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం,సెప్టెంబరు8, ప్రభాతవార్త: వర్సిటీలో పలువురు బిసి అధ్యాపకులకు బిసి ఎంపాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం ఘన సన్మానం జరిగింది. ఈ కార్యక్రమంలో ఈనెల 5న బెస్ట్ టీచర్ అవార్డులు అందుకున్న ఆచార్య జి.చెన్నారెడ్డి, ఆచార్య ఆర్.రమేష్‌రాజు, నూటా కార్యదర్శిగా ఎన్నికైన ఆచార్య యం.త్రిమూర్తిరావు, ఆర్ట్స్




ప్రతినిధిగా ఎన్నికైన ఆచార్య వి.తులసీదాసు, కంప్యూటర్ సైన్స్ అధ్యాపకులు సూర్యకామేశ్వరి లను సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు సి.హెచ్.సాంబశివరావు, కార్యదర్శి ఐ.సాయిరాం, ట్రెజరర్ సాగర్,ఎన్.శ్రీనివాస్, డి.ఇఇ. వెంకటేశ్వరరావు, రెడ్డి ప్రకాశరావు, పూలే అధ్యయన కేంద్రం ప్రోగ్రామర్ డాక్టర్ కోటీ యాదవ్, గోపాలకృష్ణ, కాశయ్య, ప్రసాద్, దరియా తదితరులు పాల్గొన్నారు.

## 15నెలల్లో రాష్ట్ర ప్రజలకు ఎన్నడూచూడని సంక్షేమం అందించిన సిఎం చంద్రబాబు : 'ప్రత్తిపాటి'

చిలకలూరిపేట,సెప్టెంబర్8,ప్రభాతవార్త: కష్టనష్టాలు అధిగమించి, సవాళ్లు, సంక్షోభాలను అవకాశంగా మలిచి ప్రజలకోసం ఏ ముఖ్యమంత్రికి సాధ్యంకానన్ని సంక్షేమ పథకాలు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అమలు చేస్తున్నారని మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. నరావర్సిక్స్ - నరావర్ వీరాట్ విజయోత్సవ సభలో నిర్వహణలో బాగంగా టిడిపి అధిష్టానం ఆదేశాల మేరకు ప్రత్తిపాటి సోమవారం ఉరవకొండ నియోజకవర్గ శ్రేణులతో సమావేశమయ్యారు. రాష్ట్ర ఆర్ధిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌తో కలసి ఉరవకొండ టిడిపి కార్యాలయంలో పార్టీ నేతలు, కార్యకర్తల అభిప్రాయాలు, ఆలోచనలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్తిపాటి మాట్లాడుతూ 15 నెలల పాలనలో కూటమి ప్రభుత్వం కనీవిని ఎరుగని రీతిలో ప్రజలకు సుపరిపాలన అందించిందని అన్నారు. మరో 15 ఏళ్లపాటు మన ప్రభుత్వం అధికారంలో ఉండాలంటే ప్రతి ఒక్కరూ ప్రజలతో మమేకమై పథకాలపై విస్తృత ప్రచారం చేయాలన్నారు. కూటమి ప్రభుత్వమే 15ఏళ్లు అధికారంలో ఉండాలని, అప్పుడే రాష్ట్రం దేశం గర్వించేస్థాయిలో అభివృద్ధి చెందుతుందంటున్న ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ వ్యాఖ్యలలోని వాస్తవాన్ని పార్టీ శ్రేణులు గ్రహించాలని ప్రత్తిపాటి సూచించారు. జగన్ పచ్చి అబద్దాల కోరు అని, ఆయన వైసిపి చేస్తున్న అసత్యప్రచారాలను ఎప్పటికప్పుడు టిడిపి శ్రేణులు సమర్ధవంతంగా తిప్పికొట్టాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నిధులను పక్కదారి పట్టించి ఒక్క మెడికల్ కాలేజీ కూడా సక్రమంగా పూర్తి చేయని జగన్, 17 కాలేజీలు కట్టించినట్లు చెప్పుకోవడం సిగ్గుచేటు అని ప్రత్తిపాటి అభిప్రాయపడ్డారు. అన్ని విషయాలలో జగన్, వైసిపి దుష్ప్రచారాన్నే నమ్ముకున్నాయని, ఐదేళ్లు ప్రజలకు ఏమీ చేయలేదు కాబట్టే ఆ పార్టీ అవాస్తవాలతో నెట్టుకొస్తుందని అన్నారు. తమ పాలనలో ప్రజలకు ఈ మంచి చేశాం, ఫలానా అభివృద్ది చేశామని చెప్పుకోలేని నిస్సహాయస్దితిలో, ప్రజలకు మంచిచేస్తున్న కూటమి ప్రభుత్వంపై వైసిపి విమర్శలు చేస్తుందని ప్రత్తిపాటి తెలిపారు.





## జాతీయ రహదారిపై 2వరోజు రైతుల ధర్నా

చిలకలూరిపేట,సెప్టెంబర్8,ప్రభాతవార్త: చీరాల-పిడుగురాళ్ల ఓడరేవు బైపాస్ పనులకు, రోడ్డు విస్తరణకు బొప్పూడి, పసుమర్రు గ్రామ రైతులనుంచి ప్రభుత్వం భూములు సేకరించారు. ఈ సేకరించిన భూములలో రోడ్డు పనులు కొనసాగిస్తున్నారు. కానీ భూములు ఇచ్చిన రైతులకు ఇంతవరకు ప్రభుత్వం పరిహారం చెల్లించలేదు. దీనికి నిరసనగా బొప్పూడి, పసుమర్రు గ్రామ రైతులు ఆదివారం జాతీయ రహదారిపై దర్నా, నిరసన కార్యక్రమం నిర్వహించారు. రెండవ రోజు సోమవారం కూడా సర్వీస్ రోడ్డులో టెంట్‌వేసి ఈ ధర్నాను రైతులు కొనసాగించారు. ఈ కార్యక్రమంలో రెండు గ్రామాలకు చెందిన రైతులు గుంటు హరిబాబు, గుంటు కోటేశ్వరరావు, అంబటి సోంబాబు, అప్పాపురం అమీర్‌జానీ, మహిళా రైతులు, తదితరులు పాల్గొని నిరసన వ్యక్తం చేశారు. తమ వద్దనుంచి తీసుకున్న పొలాలకు నష్టపరిహారం చెల్లించేవరకు ఈ కార్యక్రమాన్ని కొనసాగిస్తామని వారు ఈ సందర్భంగా తెలిపారు.



## రైతులకు అండగా వైకాపా 'అన్నదాత పోరు' -పోస్టర్‌ను ఆవిష్కరించి మాజీ మంత్రి రజనీ

చిలకలూరిపేట,సెప్టెంబర్8,ప్రభాతవార్త: రాష్ట్రంలో రైతన్నలు తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారని, యూరియా కొరతను అదుపులోకి తేవడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మాజీమంత్రి విడదల రజిని అన్నారు. సోమవారం నరసరావుపేట రోడ్డులోని తన నివాసంలో కార్యకర్తలతో



సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఈనెల 9వ తేదిన చేప ట్టనున్న రైతన్నలకు అండగా వైఎస్ఆర్‌సిపి అన్నదాత పోరు పోస్టర్‌ను ఆవిష్కరించారు. రజిని తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ గత వైసిపి ప్రభుత్వంలో రైతు భరోసా కేంద్రాల ద్వారా ఎరువులు, విత్తనాలు, పంట అవసరాలు సమయానికి అందించబడ్డాయని గుర్తుచేశారు. అంతేకాకుండా పంటకు గిట్టుబాటు ధర కల్పించడం ద్వారా రైతు కుటుంబాలకు భరోసా కల్పించామని రజిని ఈ సందర్భంగా తెలిపారు. ఈనెల 9వ తేది ఉదయం 10 గంటలకు నరసరావుపేట వైఎస్ఆర్ కార్యాలయం నుంచి ఆర్డీఓ కార్యాలయం వరకు రైతులతో కలిసి ప్రదర్శనగా వెళ్లి ఆర్డీఓకు వినతిపత్రం అందచేయటబడటం జరుగుతుందని ఆమె వివరించారు. కావున నియోజకవర్గంలోని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతు సోదరులు ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమంలో తప్పనిసరిగా పాల్గొని విజయవంతం చేయవలసినదిగా ఆమె కోరారు. ఈ ఆవిష్కరణ కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షులు షేక్ దరియావలి, మండల పార్టీ అధ్యక్షులు దేవినేని శంకరరావు, వైసిపి నాయకులు సింగారెడ్డి కోటిరెడ్డి, తొక్కల అంజిరెడ్డి, కొండవీటి ఆంజనేయులు, కొప్పురావూరి నాగేశ్వరరావు, షేక్ సైదావలి, మొషే, బందారు జయకుమార్, ఉడతా వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## జగన్ అసెంబ్లీకి వెళ్లకుండా వీధి నాటకాలు : 'జనసేన' నేత బాలాజీ

చిలకలూరిపేట,సెప్టెంబర్8,ప్రభాతవార్త: ప్రజా సమస్యలు పరిష్కారానికి ప్రజలు ఇచ్చిన అవకాశాన్ని వినియోగించుకొని ప్రతిపక్ష పార్టీ నేత వైఎస్‌జగన్ అసెంబ్లీకి వెళ్లాలని, నియమావళి ప్రకారం అధికారికంగా విపక్ష హోదా వైసిపికి రాదని తెలిసికూడా అసెంబ్లీకి రాకుండా జగన్ వీధి నాటకాలు ఆడటం సరికాదని, జనసేన పార్టీ సెంట్రల్ ఆంధ్రా కో కన్వీనర్ పెంటేల బాలాజీ అన్నారు. సోమవారం తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 18వ తేది నుంచి అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమవుతున్న నేపధ్యంలో ప్రభుత్వంపై వైసిపి చేసిన విమర్శలకు సమాధానాలు రాబట్టుకునే అవకాశాలు ఉంటాయని అన్నారు. అసెంబ్లీకి వెళ్లకుండా నమ్మి ఓట్లేసిన ప్రజలకు సమాధానం చెప్పాల్సిన భాధ్యత వైసిపి ఎమ్మెల్యేలు, అధినేత జగన్‌పై ఉందని బాలాజీ చెప్పారు. ఏ రాజకీయ పార్టీ అయినా ప్రజలలోకి వెళ్లి తమ ఉనికిని చాటుకోవాల్సిన అవసరం, మరోవైపు అసెంబ్లీ కార్యక్రమాలలో హాజరు కావల్సిన భాధ్యత కూడా ఉంటుందని తెలిపారు. ఈ రెండు అవకాశాలలో ఏదైనా సరిగ్గా ఉపయోగించుకోకపోతే వైసిపికి భవిష్యత్‌లో మరింత నష్టమే మిగిలే అవకాశం ఉందని అన్నారు. వ్యక్తిగత అహంకారాలను ప్రక్కన పెట్టి సభకు హాజరై ప్రజా కోసం గళమెత్తితేనే ప్రజలను న్యాయం చేసిన వారవుతారని బాలాజీ హితవు పలికారు.



## బిఆర్ఐజి హైస్కూల్లో విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసిన నేతలు

చిలకలూరిపేట,సెప్టెంబర్8,ప్రభాతవార్త: పట్టణంలోని బిఆర్ఐజి హైస్కూల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని సోమవారం మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని తనిఖీ చేశారు. విద్యార్థులకు వడ్డించే ఆహార పదార్థాలను రుచి చూశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీమంత్రి, స్థానిక శాసనసభ్యుడు ప్రత్తిపాటి పుల్లారావు ఆదేశాల మేరకు పట్టణంలో ఉన్న మున్సిపల్ ప్రభుత్వ పాఠశాలలలో స్వచ్ఛమైన త్రాగునీరు, రుచికరమైన, నాణ్యమైన భోజనం, పరిశుభ్రమైన వ్యక్తిగత మరుగుదొడ్డు, వాటి నిర్వహణను తనిఖీ చేశారు. విద్యార్థులకు ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్యాబోధన కొనసాగించాలని పాఠశాల ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులకు సూచించారు. ఈ కార్యక్రమంలో చిలకలూరిపేట మార్కెట్‌యార్డ్ చైర్మన్ షేక్ కరిముల్లా, వైస్ చైర్మన్ పిల్లి కోటేశ్వరరావు, వార్డు కౌన్సిలర్ రాయని హరిత, పాఠశాల ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.



## 'గార్డ్స్' ఆధ్వర్యంలో కస్తూర్బా పాఠశాలలో అంతర్జాతీయ అక్షరాస్యతా దినోత్సవం

నాదెండ్ల,సెప్టెంబర్8,ప్రభాతవార్త: స్వచ్ఛంద సేవాసంస్థ గార్డ్స్ ఆధ్వర్యంలో మండలంలోని నాదెండ్ల కస్తూరిబా బాలికల పాఠశాలలో సోమవారం అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాలప్రత్యేక అధికారిణి మాధవిలత ఈ సందర్భంగా నిర్వహించిన సభకు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా ప్రముఖ సాహితీ విమర్శకులు డాక్టర్ పివి సుబ్బారావు పాల్గొని చదువు ఆవశ్యకత గురించి విద్యార్థినీలకు వివరించారు. అక్షరాస్యత సాధించిన దేశాలు అభివృద్ధి పథంలో ఉన్నాయని, అక్షరాస్యతలో వెనుకబడిన దేశాలు ఇంకా అభివృద్ధికి నోచుకోలేదని తెలిపారు. మన దేశం కూడా నూరుశాతం అక్షరాస్యత సాధించినప్పుడే అభివృద్ధి పథంలో అగ్రస్థానంలో ఉంటుందని, అందుకోసం అందరూ శక్తి వంచన లేకుండా కృషి చేయాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జెవివి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ దార్ల బుజ్జిబాబు పాల్గొని పాఠశాల గ్రంథాలయానికి 50 రకాల బాలల పుస్తకాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో గార్డ్స్ ఉపాధ్యక్షులు గేరా యాకోబు, సభ్యులు సతీష్‌చంద్ర తదితరులు పాల్గొన్నారు.



## పట్టణ టిడిపి బీసిసెల్ నూతన అధ్యక్షునిగా అవ్వారు లక్ష్మణ్ ఏకగ్రీవం

చిలకలూరిపేట,సెప్టెంబర్8,ప్రభాతవార్త: తెలుగుదేశం పార్టీ సంస్ధాగత ఎన్నికలలో బాగంగా నియోజకవర్గ పట్టణ స్దాయి కార్యవర్గాల ఎన్నికల ప్రక్రియను పార్టీ శ్రేణులు కొద్ది కాలంగా కొనసాగిస్తున్నారు. సోమవారం పార్టీ కార్యాలయంలో పట్టణ బిసిసెల్ కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పట్టణ బిసిసెల్ విభాగ కమిటి అధ్యక్షులుగా అవ్వారు లక్ష్మణకుమార్ ప్రధాన కార్యదర్శిగా యలగాల వెంకటేశ్వర్లు, ఉపాధ్యాక్షులుగా మోదుకూరి వెంకటశివరాం, శిరమా శ్రీనివాసరావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ నియామకానికి సహకరించిన మాజీమంత్రి, స్దానిక శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావుకు ధన్యవాదాలు తెలిపారు. ఈ ఎన్నిక కార్యక్రమంలో పార్టీ నాయకులు నెల్లూరి సదాశివరావు, షేక్ కరిముల్లా, పఠాన్ సమద్‌ఖాన్, మద్దుమాల రవి, మురకొండ మల్లిబాబు, క్లస్టర్ ఇన్‌చార్జిలు తదితరులు పాల్గొన్నారు.



## ఉపాధ్యాయుల పెండింగ్ డిఎలను ప్రభుత్వం విడుదల చేయాలి : ఎస్టీయు డిమాండ్

చిలకలూరిపేట,సెప్టెంబర్8,ప్రభాతవార్త: రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం చిలకలూరిపేట మండలశాఖ ఆధ్వర్యంలో మండలంలోని అన్ని పాఠశాలలను సందర్శించి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపడుతున్నారు. దీనిలో బాగంగా సోమవారం మండలంలోని బొప్పూడి హైస్కూల్‌లోని ఉపాధ్యాయులను కలసి సభ్యత్వాన్ని సేకరించారు. ఈ సందర్భంగా యస్టీయు రాష్ట్ర ఆర్ధిక కార్యదర్శి కె కోటేశ్వరరావు, రాష్ట్ర డైరీ కన్వీనర్ పోటు శ్రీనివాసరావులు మాట్లాడుతూ ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న ముఖ్యమైన సమస్య ఏన్నో సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న డిఎ బకాయిలను విడుదల చేయాలని, పెండింగ్‌లో ఉన్న మూడు డిఎలలో తక్షణమే రెండు డిఎలను ప్రకటించాలని ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయ సంఘాలతో చర్చలు జరపాలని, ఉపాధ్యాయులు పెండింగ్‌లో ఉన్నటువంటి ఆర్ధిక సమస్యలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యస్టీయు నాయకులు బొంతా రవి, షేక్ మస్తాన్‌వలి, అజ్మీర్ ఆలీఖాన్, వడితే రమణానాయక్ తదితరులు పాల్గొన్నారు.



## కరాటేలో మోడరన్ స్టెల్లార్ విద్యార్థులకు మూడు స్వర్ణాలు

చిలకలూరిపేటటౌన్,సెప్టెంబర్8,ప్రభాతవార్త: పల్నాడుజిల్లా దాచేపల్లిలో ఆదివారం జరిగిన జాతీయస్దాయి ఇన్విటేషన్ పోటీలలో పట్టణంలోని మోడరన్ స్టెల్లార్‌లో 10వ తరగతి విద్యార్ధి డి జస్వంత్ కటా, టీమ్‌కటా, వెపన్ విభాగాలలో మూడు బంగారు పతకాలు, కుమిటి విభాగంలో వెండి పతకాన్ని సాధించారు. 6వ తరగతి చదువుతున్న బి మణికంఠ కుమిటి విభాగంలో కాంస్య పతకం సాధించారు. కాగా వీరిద్దరిని సోమవారం పాఠశాలలో జరిగిన ప్రత్యేక సమావేశంలో మోడరన్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ చేబ్రోలు మహేష్, ప్రత్యూష, ప్రిన్సిపల్ విజయలక్ష్మీ ప్రసూన, కరాటే మాష్టర్లు డి రాజ, బి బాలు, ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు అభినందించారు.



## పురపాలకసంఘం ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం

తెనాలిటౌన్, సెప్టెంబర్8, ప్రభాతవార్త: పురపాలక సంఘం ఆధ్వర్యంలో పట్టణంలోని సుల్తానాబాద్ వడ్డెర కాలనీలో సోమవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. మున్సిపల్ ఆరోగ్య శాఖ అధికారి మొవ్వ ఏసుబాబు, సుల్తానాబాద్ అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యాధికారి డాక్టర్ రక్షిత్ శార్దూల్, ఆరోగ్య సిబ్బంది పాల్గొని ఆయా ప్రాంత ప్రజలకు వైద్య, రక్త పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. వర్షాకాలం, వాతావరణ మార్పులను దృష్టిలో ఉంచుకొని ప్రజలు వ్యాధులు బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని, దోమల ద్వారానే డ్నెగ్యు మలేరియా టైఫాయిడ్ వంటి వ్యాధులు వస్తాయని, కావున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ మొవ్వ ఏసుబాబుతెలియజేశారు. డాక్టర్ రక్షిత్ శార్దూల్, మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్లు, శ్రీ కంఠ ఉమకాంత్, అందే బాల చంద్ర మోళి, సిబ్బంది మల్లేశ్వరరావు, వేణుగోపాల్, శ్రీనివాసరావు హెల్త్ విజిటర్లు టి.పద్మావతి, డి.విజయ కుమారి, ఏఎన్ఎం, వై లత, గీత వాణి, అర్బన్ హెల్త్ సిబ్బంది వి.తేజస్విని, పి రాఘవరెడ్డి, ఆశ వర్కర్లు, సుజాతభాయ్, లీల, తదితరులు పాల్గొన్నారు.



## ప్రధాని మోడీ చిత్రపటానికి పాలాభిషేకం

తెనాలిటౌన్, సెప్టెంబర్8, ప్రభాతవార్త: భారతీయ జనతా పార్టీ గుంటూరు జిల్లా అధ్యక్షులు చెరుకూరి తిరుపతిరావు ఆదేశాల మేరకు స్ధానిక బిజెపి నాయకులు పొట్టిమూర్తి శ్రీనివాస్ ఆధ్వర్యంలో, సోమవారం పట్టణంలోని రైల్వే స్టేషన్ సెంటర్ దగ్గర ప్రధానమంత్రి నరేంద్రమోడీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం స్ధానిక బీజెపి నాయకుడు పొట్టి మూర్తి శ్రీనివాస్ మాట్లాడుతూ భారత ప్రధాని నరేంద్ర మోడీ పేదల పక్షపాతి అని మరొకసారి నిరూపించుకోవడం, దసరా కానుకగా దేశవ్యాప్తంగా జీఎస్టీ తగ్గింపు హర్షిస్తూ ప్రధాని నరేంద్రమోడీ చిత్రపటానికి పాలాభిషేకం చేయటం జరిగిందని, పేద మధ్యతరగతి కుటుంబాలకు మరియు రైతులకు అని రంగాల వారికి జీఎస్టీ తగ్గింపు చాలా ఉపయోగకరం అని కొనియాడారు. అంతేకాకుండా వ్యాపారస్తులు కూడా చాలా ఆనందంగా ఉన్నారని తెలియచేశారు. బీజేపీ గుంటూరు జిల్లా యువ మోర్చా అధ్యక్షులు మైల హరికృష్ణ, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు కటారి వాసుదేవ్ నాయుడు, బిజెపి మూడో పట్టణ అధ్యక్షులు సందీప్ రాజు, సీనియర్ నాయకులు అడపా సంపత్ రాయుడు, బిత్రా కనకదుర్గ, సింగం రాజు కనకదుర్గ, యువ నాయకులు చంద్ర, ఫణికృష్ణ తదితరులు పాల్గొనారు.



## పారిశుధ్య సిబ్బందికి బీమా బాండ్లు పంపిణీ చేసిన మంత్రి నాదెండ్ల

తెనాలి మునిసిపాలిటీ, సెప్టెంబర్8, ప్రభాతవార్త:పట్టణ పురపాలక సంఘంలో పారిశుధ్య విధులు నిర్వహిస్తున్న కార్మికులకి, స్ధానిక శాసనసభ్యులు రాష్ట్ర ఆహార పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తన సొంత నిధులతో ఒక్కొక్కరికి ఐదులక్షల రూపాయల ప్రమాద బీమా సౌకర్యం కల్పించారు. సోమవారం పట్టణంలోని శ్రీ రామకృష్ణ కవి కళాక్షేత్రంలో నిర్వహించిన కార్యక్రమంలో పారిశుధ్య కార్మికులకు భీమా బాండ్లు అందించారు. ఈ సందర్భంగా మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ, పారిశుధ్య కార్మికులకు అండగా ఉంటానన్నారు. అంతేకాకుండా ఈ ప్రమాద బీమాపాలసీల ద్వారా కార్మికులకు, వారి కుటుంబాలకు ఆర్ధిక భరోసా లభిస్తుందన్నారు. పారిశుధ్య కార్మికులు లేని సమాజాన్ని ఊహించలేమన్నారు. పట్టణ అభివృద్ధిలో వారి పాత్ర కూడా ఉందన్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించుటలో పారిశుధ్య కార్మికులు ముందుంటారన్నారు. అలాంటి పారిశుధ్య కార్మికులకు ప్రజలు ప్రభుత్వం అండగా ఉండాలన్నారు. వారి ఆరోగ్యాన్ని కూడా లెక్కచేయకుండా వీధుల పరిశుభ్రతకి, పట్టణ సుందరీకరణకు, ఎంతో నిబద్ధతతో, వారు చేసే పనిని, వారి యొక్క కృషిని, అభినందించాలన్నారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ కేవీ. గోపాలకృష్ణ, మునిసిపల్ చైర్మన్ తాడిబోయిన రాధిక, కమిషనర్ పి.శ్రీకాంత్, మున్సిపల్ ఆరోగ్యాధికారి మొవ్వ ఏసుబాబు, పలువురు అధికారులు పెద్ద ఎత్తున మున్సిపల్ పారిశుద్ధ సిబ్బంది పాల్గొన్నారు.




## భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు

తెనాలిటౌన్, సెప్టెంబర్8, ప్రభాతవార్త: చంద్రగ్రహణం ముగియడంతో పట్టణంలోని పలు దేవాలయాలు సోమవారం నాడు కిటకిటలాడాయి. పట్టణంలోని వైకుంఠపురంలో వెలసిన శ్రీ లక్ష్మీ ౣ పద్మావతి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవాలయం మరియు గంగానమ్మపేటలోని శ్రీ రామేశ్వర స్వామి దేవాలయం (పాత శివాలయం)అలాగే రామలింగేశ్వరపేటలోని శ్రీ రామలింగేశ్వర స్వామి దేవస్ధానాల్లో భక్తులు ఉదయం నుంచి భారీగా తరలివచ్చి స్వామివార్లకు అభిషేకాలు నిర్వహించి దానాలు సమర్పించారు. గ్రహణ శాంతుల నిమిత్తం దేవాలయాల్లో భక్తుల రద్దీ ఎక్కువగా ఉండటం, క్యూలైన్లో నిర్వహణ సరిగ్గా లేకపోవడం తో, పలువురు భక్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సోమవారం తెల్లవారుజాము నుండి అర్చకులు యధావిధిగా దేవాలయాల్లో అభిషేకాలు దేవాలయ దర్శనం యధావిధిగా నిర్వర్తించారు.



## నియోజకవర్గ వైకాపా పరిశీలకునిగా గులాం రసూల్ నియామకం

తెనాలిటౌన్, సెప్టెంబర్8, ప్రభాతవార్త: వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తెనాలి నియోజకవర్గ నూతన పరిశీలకుడిగా గులాం రసూల్ ని పార్టీ అధిష్టానం నియమించింది. ఈ సందర్భంగా సోమవారం పట్టణంలోని వైసిపి కార్యాలయానికి వచ్చిన ఆయన మాజీ శాసనసభ్యులు అన్నాబత్తుని శివకుమార్ ని మర్యాదపూర్వకంగా కలిశారు. గులాం రసూల్ ను మాజీ ఎమ్మెల్యే శివకుమార్ అభినందించారు. స్ధానిక రాజకీయ పరిస్థితులతో పాటు ఇతర అంశాలపై చర్చించారు. నియోజకవర్గంలో పార్టీ పఠస్థతకు తీసుకోవాల్సిన అంశాలు మరియు పార్టీ పునర్ వైభవం ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టడంలోనూ, అధికార పార్టీపై నిరసన కార్యక్రమాలు తెలుపుటలోనూ, వైసీపీ కార్యకర్తలకు అండగా నిలుస్తానని గులాం రసూల్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు వైసీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు



## అంతర్జాతీయ అక్షరాస్యతా దినోత్సవం

రాజుపాలెం, సెప్టెంబరు 8 ప్రభాతవార్త : మండలంలోని కొండమోడు వద్ద ఉన్న దీనమ్మ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో నడుస్తున్న డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ అనాథ పిల్లల వృద్ధాశ్రమంలో అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. జేఫామ్ సర్వీసెస్ ఫీల్డ్ ఆఫీసర్ చెవుల ఆంజనేయులుచే ఈ కార్యక్రమం జరిగింది. విద్యార్థులకు ఈ సందర్భంగా పెన్సిళ్ళు, పెన్నులు, మిఠాయిలను, డిక్షనరీలను అందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఆశ్రమ నిర్వాహకులు పాల్గొన్నారు.



## కొండమోడులో సీజనల్ వ్యాధులపై అవగాహన



రాజుపాలెం, సెప్టెంబరు 8 ప్రభాతవార్త : మండలంలోని కొండమోడు గ్రామంలో సీజనల్ వ్యాధులపై అవగాహన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. మలేరియా అధికారి రవీంద్ర రత్నాకర్ గ్రామంలో పర్యటించారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రభలే అవకాశాలు ఉన్నాయన్నారు. ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మురుగు కాలువలలో, వాటర్ ట్యాంక్‌లలో బ్లీచింగ్ పిచికారి చేసుకోవాలన్నారు. మండల వైద్యాధికారి రవితేజనాయక్ జయంతి కాలనీలో పర్యటించి వైద్య సిబ్బందితో ఫీవర్ సర్వే, లార్వా సర్వే చేయించారు. మలేరియా సిబ్బంది చంద్రశేఖర్, వసంతరావు, షరీఫ్, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

## యూరియా కొరతపై వైసీపీ 'అన్నదాత పోరు'ను జయప్రదం చేయండి

కారంపూడి, సెప్టెంబరు 8 ప్రభాతవార్త: వైసీపీ పిలుపు మేరకు ఈ నెల 9న రెవెన్యూ డివిజన్ పరిధిలో రైతులకు మద్ధతుగా యూరియా కొరతపై అన్నదాత పోరు నిరసన కార్యక్రమాన్ని నిర్వహించాలని వైసీపీ అధిష్టానం పిలుపునిచ్చారు. ఈ మేరకు పల్నాడు జిల్లా వైసీపీ అధ్యక్షులు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో గురజాల రెవెన్యూ డివిజన్ కార్యాలయం వద్ద యూరియా కొరతపై అన్నదాత పోరు కార్యక్రమం జరగనుంది. దీనికి సంబంధించి మాచర్ల పార్టీ కార్యాలయంలో పిన్నెల్లి ఆదివారం పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో రైతు సోదరులు, వైసీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిన్నెల్లి కోరారు. పోస్టరు ఆవిష్కరణ కార్యక్రమంలో పల్నాడు జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు కొమ్ము చంద్రశేఖర్, యువజన విభాగం జిల్లా కార్యదర్శి బైరెడ్డి బసివిరెడ్డి, సోషల్ మీడియా జిల్లా నాయకులు జక్కిరెడ్డి, నాగిరెడ్డి, ఎస్టీ సెల్ రాష్ట్ర నాయకులు జాన్‌పాల్ నాయక్, బీసీ సెల్ రాష్ట్ర కార్యదరిశ్శి బొంకూరి నాగేశ్వరరావు, సీనియర్ నాయకులు కారంపూడి టౌన్ అధ్యక్షులు బొమ్మిన అల్లయ్య, యువజన విభాగం మండల అధ్యక్షులు చిలుకూరి చంద్రశేఖరరెడ్డి, ఒప్పిచర్ల వైసీపీ నాయకులు వంకాయలపాటి పిచ్చయ్య, బూత్ కమిటీ మండల అధ్యక్షులు కోట శివారెడ్డి, మేధావుల సంఘం మండల అధ్యక్షులు బొగ్గవరపు నాగరాజు, మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు కిరణ్, యువజన విభాగం మండల కార్యదర్శి కొమెర అంకారావు, మేధావుల విభాగం ప్రధాన కార్యదర్శి ప్రభుకిషోర్, మండల కార్యదర్శి దొంత వీరాంజనేయులు, పేటసన్నెగండ్ల వైసీపీ నాయకులు చిన్ని, బీసీ యువజన విభాగం నాయకులు మేకల అమరయ్య, లక్ష్మీపురం నడికోట చిరంజీవి, మండల ప్రచార కమిటీ అధ్యక్షులు కాట శ్రీనివాసరావు, రమావత్ కోమటినాయక్, కిల్లా కాశీ, చింతపల్లి సూరే వెంకటేశ్వరున్న, గుండెబోయిన శివ, తదితర వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## కారంపూడిలో సీజనల్ వ్యాధులపై అవగాహన సదస్సు

కారంపూడి, సెప్టెంబరు 8 ప్రభాతవార్త: కారంపూడి-2 సచివాలయం పరిధిలోని ఇందిరానగర్ కాలనీలో వైద్యాధికారి డా॥ ఎం.రమ్య, డా॥ కె.లక్ష్మీమౌనిక ఆధ్వర్యంలో సీజనల్ వ్యాధులపై అవగాహన సదస్సు సోమవారం జరిగింది. పరిసర పారిశుద్ధ్యం, వ్యక్తిగత పారిశుద్ధ్యం, దోమలు కుట్టకుండా, పుట్టకుండా నివారణ చర్యలపై వైద్యులు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు కె.మల్లయ్య, పీఎల్ మస్తాన్‌వలి, ఎం.లాలునాయక్, ఎంఎల్‌హెచ్‌పీ జ్యోతి, ఏఎన్ఎంలు జి.ఈశ్వరి, సీహెచ్ అరుణ, ఆశ కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. కాష్టాలగడ్డ ఏరియాలో పంచాయతీ సిబ్బంది మురుగు కాలువలు, పరిసరాల్లో ఉన్న చెత్త నిల్వలను తొలిగించారు. ఆశ కార్యకర్తలు లార్వా సర్వే చేసి, నివారణ చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో ఆశ కార్యకర్తలు బి.రాజేశ్వరి, పి.ఏసమ్మ, బి.విమల, ఎ.ధనలక్ష్మి, ఎన్.అనసూయమ్మ, ఎన్.అనురాధ, ఎన్.లక్ష్మీదేవి, ఎస్‌కే సల్మా పాల్గొన్నారు.



## సీపీఐ, రైతు సంఘం ఆధ్వర్యంలో కారంపూడిలో ధర్నా

కారంపూడి, సెప్టెంబరు 8 ప్రభాతవార్త: రైతులకు యూరియా సక్రమంగా సరఫరా చేసి కొరత లేకుండా చూడాలని కోరుతూ భారత కమ్యూనిసుస్ట పార్టీ, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో సోమవారం కారంపూడి తహశీల్దారు కార్యాలయం ముందు ధర్నా చేపట్టి తహశీల్దారుకు వినతిపత్రం అందజేశారు. యూరియా సక్రమంగా సరఫరా చేసి రైతులకు ఇబ్బంది లేకుండా చూడాలని మండల కార్యదర్శి సైదా కోరారు. ఇటీవల ఆంధ్ర, తెలంగాణ సరిహద్దులో అక్రమంగా తరలిపోతున్న యూరియా, డీఏపీ లారీలను అడ్డుకున్నారన్నారు. ఇలాంటివి జరగకుండా బ్లాక్ మార్కెట్‌ను అరికట్టాలని కోరారు. కార్యక్రమంలో మండల సహాయ కార్యదర్శి మేకపోతు చిన్న కోటిరెడ్డి, ఒప్పిచర్ల సీపీఐ కార్యదర్శి ఇందూరు శ్రీను, రైతు సంఘం నాయకులు గాలం శ్రీనివాసరావు, షేక్ సుభాని, సూరె హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.




## కారంపూడి మండల అభివృద్ధికి రూ.1.24 కోట్లు విడుదల: ఎంపీడీఓ

కారంపూడి, సెప్టెంబరు 8 ప్రభాతవార్త: కారంపూడి మండల పరిధిలోని 15 గ్రామాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు విడుదల చేసినట్లు ఎంపీడీఓ గంటా శ్రీనివాసరెడ్డి తెలిపారు. 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.1.24 కోట్లు మంజూరయ్యాయన్నారు. ఈ నిధులతో గ్రామాల్లో మౌలిక సదుపాయాలు, తాగునీరు, రహదారుల మరమ్మతులు, వీధి దీపాల ఏర్పాటు, ప్రజాహిత కార్యక్రమాలకు వినియోగించనున్నట్లు ఆయన తెలిపారు. గ్రామస్థాయిలో చేపట్టబోయే అభివృద్ధి కార్యక్రమాలకు ఇది పెద్ద ఊతమని ఎంపీడీఓ పేర్కొన్నారు. నిధుల వినియోగంలో పారదర్శకతకు ప్రాధాన్యం ఇవ్వడంతోపాటు ప్రజల భాగస్వామ్యాన్ని పెంచేందుకు గ్రామసభల ద్వారా సూచనలు స్వీకరించనున్నట్లు తెలిఎపారు. గ్రామాల సమగ్ర పురోగతికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను ప్రజలు ఆదరించి, అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు.



## 'పని ప్రదేశాల్లో మహిళలకు రక్షణ కల్పించాలి'

యడ్లపాడు, సెప్టెంబర్ 8, ప్రభాతవార్త : బాల్య వివాహాలు, గర్భవతులు, బాలింతలు, పిల్లల అరోగ్యము మరియు పోషణకు సంబంధించి అవగాహన కల్పించి తదుపరి మహిళలకు పని ప్రదేశాలలో రక్షణ కల్పించాలని నాదెండ్ల ఐసిడిఎస్ ప్రాజెక్టు సిడిపిఒ జి శాంతకుమారి పేర్కొన్నారు. ఐసిడిఎస్ నాదెండ్ల పరిధిలోని యడ్లపాడు గ్రామ సమీపంలోని ఎన్ఎస్ఎల్ టెక్స్‌టైల్ మిల్లులో మిషన్ సంకల్ప కార్యక్రమాన్ని అమె సోమవారం నిర్వహించారు. తదుపరి ఓవిసి సోషల్ కౌన్సిలర్ ఎమ్ సంగీత మాట్లాడుతూ గృహహింస నుండి మహిళలకు రక్షణ చట్టం గురించి వివరించారు. ఓఎస్‌సి లీగల్ కౌన్సిలర్ కె వాణిశ్రీ మాట్లాడుతూ పని ప్రదేశాలలో మహిళలపై లైంగిక దాడులు నివారణ ఐసిసి కంప్లెయిట్ చేయటం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మిల్లులోని తల్లులు, మహిళలు, పురుషులు తదితరులు పాల్గొన్నారు.



## అమ్మాయి కోసం సెల్ టవరెక్కాడు.. తదుపరి తన్నులు తిన్నాడు...

తెనాలిటౌన్, సెప్టెంబర్8, ప్రభాతవార్త: :పట్టణంలోని పాండురంగ పేటలో అశోక్ అనే యువకుడు సోమవారం మద్యం మత్తులో సెల్ టవర్ ఎక్కి హల్చల్ చేశాడు. వివరాల్లోకి వెళితే విజయనగరం జిల్లా బొబ్బిలికి చెందిన అశోక్ అనే యువకుడు కొన్నాళ్లుగా పట్టణంలోని పాండురంగపేటలో నివసిస్తూ భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. గత కొన్నేళ్లుగా పాండురంగపేటలో ఓ వివాహిత మహిళతో సహజీవనం చేస్తున్నాడు. ఇదికాక స్థానికంగా ఉండే 14 ఏళ్ల మైనర్ బాలికను ప్రేమించాను, ఆమెతోనే పెళ్లి చేయాలంటూ మద్యం మత్తులో సెల్ టవర్ ఎక్కాడు. స్థానికుల సమాచారం అందుకున్న త్రీటౌన్ పోలీసులు అక్కడకు చేరుకొని మద్యం మత్తులో ఉన్న ఆ యువకుడిని కిందకి దింపే ప్రయత్నం చేశారు. దాదాపు మూడు గంటల హైడ్రామా అనంతరం క్రిందికి దిగిన ఆ యువకుడిని స్థానికులు దేహశుద్ధి చేయగా మూడవ పట్టణ పోలీసులు అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషనకి తరలించారు.



# బాపట్ల జిల్లా వార్త



## ప్రజాసమస్యల పరిష్కారంలో అధికారులు బాధ్యతతో వ్యవహరించాలి: కలెక్టర్

బాపట్ల,సెప్టెంబర్ 8,ప్రభాతవార్త: ప్రజల సమస్యల పరిష్కారంలో అధికారులు బాధ్యతతో వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి తెలిపారు. స్థానిక కలెక్టరేట్ లోని పిజిఆర్ఎస్ హాలులోసోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన ప్రజా సమస్యల వినతి పత్రాలను వారు స్వయంగా స్వీకరించి, కొన్నింటికి తక్షణమే పరిష్కార మార్గం చూపించారు. కొన్నింటిని సంబంధిత శాఖ అధికారులకు అందించి ప్రతి వినతిని నాణ్యతతో తక్షణమే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పి జి ఆర్ ఎస్ లో వచ్చే ప్రతి సమస్యలను పరిష్కరించాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో నాణ్యత చూపని అధికారులపై తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన అధికారులను హెచ్చరించారు.



ప్రజల సమస్యలను పరిష్కరించిన వాటికి ఆడిటింగ్ పూర్తి చేయాలన్నారు. ఆడిటింగ్ చేయుటలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆయన అన్నారు. వార్తాపత్రికలలో ప్రచురితమైన ప్రతికూల వార్తలపై జిల్లా కలెక్టర్ స్పందించి ఆయా శాఖలకు సంబంధించిన అధికారులను ఆయన ప్రశ్నించారు. అధికారులు ఆయా వార్తల పై జిల్లా కలెక్టర్ కు వివరణ ఇచ్చారు. యూరియా పంపిణీ కేంద్రాల వద్ద రైతులకు క్యూ లైన్ లో కుర్చీలు ఏర్పాటు చేయాలన్నారు. అక్కడ వారికి షామియానాలు, మంచినీళ్లు అందుబాటులో ఉండాలని, పోలీసులను ఆయా కేంద్రాలలో విధులు కేటాయించాలన్నారు.. యూరియా కోసం వచ్చే రైతులకు కేంద్రాలలో ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూడాలని, ప్రతి గ్రామంలో గ్రామసభలను పెట్టి ఆ ఊరిలో వరి సాగు ఎన్ని ఎకరాల్లో చేయబడింది, ఎంత యూరియా సరఫరా చేశారు, ఇంకా ఎంత కావాలో వివరాలను తయారు చేయాలన్నారు. గ్రామసభలకు రైతులు రాకపోతే పొలాలకు వెళ్లి యూరియా సరఫరా పై వారికి అవగాహన కల్పించాలని,యూరియా సరఫరా లో ఎటువంటి సమస్యలు లేకుండా చూడాలని, ఏమైనా సమస్యలు సృష్టించిన యెడల సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోబడం జరుగుతుందని ఆర్డీవోలు, ఎమ్మార్వోలు, ఎంపీడీవోలు, ఎంఎవోలు, ఏ డి ఎ లను హెచ్చరించారు.

జిల్లాలోని అన్ని గ్రామాలలో భూములు, పొలాలు, ఇండ్ల స్థలాల రీ సర్వే జరుగుతుందని, అదేవిధంగా స్వామిత్వ సర్వే కూడా జరుగుతుందన్నారు.. అందరూ ఈ సర్వేలో సహకరించి వారి ఆస్తులను కొలతలు వేయించుకొని ప్రాపర్టీ కార్డులు పొందాలని అన్నారు. ఎవరి ఆస్తులను వారే పరిరక్షించుకోవాలని ఆయన తెలిపారు. ఈనెల 10వ తేదీన ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవం సందర్భంగా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.. జిల్లాలో ఆత్మహత్యలు ఎక్కువైనాయని, 15 సంవత్సరాల నుండి 30 సంవత్సరాలలోపు వారు ఎక్కువగా ఆత్మహత్యలకు గురి అవుతున్నారని, ఈ ఆత్మహత్యల నుండి ప్రజలను కాపాడేందుకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని జిల్లా వైద్యాధికారులకు జిల్లా కలెక్టర్ పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి సంయుక్త కలెక్టర్ జి. గంగాధర్ గౌడ్,డిఆర్ఓ శ్రీనివాసరావు, బాపట్ల రెవెన్యూ డివిజన్ అధికారి గ్లోరియా మరియు అన్ని శాఖల జిల్లా అధికారులు మరియు తదితరులు పాల్గొన్నారు.

## లబ్ధిదారులందరికీ అధునాతన రైస్‌కార్డులు: ఇన్‌చార్జి జెసి ఆదేశం

బాపట్ల,సెప్టెంబర్ 8,ప్రభాతవార్త: జిల్లాలో లబ్ధిదారులందరికీ అధునాతన రైస్ కార్డులు అందజేయాలని ఇన్చార్జి సంయుక్త కలెక్టర్ జి గంగాధర్ గౌడ్ పౌర సరఫరాల అధికారులకు తెలిపారు. స్థానిక కలెక్టర్ కార్యాలయంలోని పిజిఆర్ఎస్ హాలులో సోమవారం ఇన్చార్జి సంయుక్త కలెక్టర్ జి గంగాధర్ గౌడ్ ఈపాస్ మిషన్ ను రైస్ డీలర్ కు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని 4 లక్ష 71 వేల 3 వందల 82 మంది లబ్ధిదారులకు కొత్త అధునాతన రైస్ కార్డులను అందజేయుటకు 1123 ఈపాస్ మిషన్లు సరఫరా చేయడం జరిగిందన్నారు.



ఈపాస్ మిషన్ల ద్వారా ఈనెల 15వ తేదీ నుండి అధునాతన రైస్ కార్డులను సిబ్బంది లబ్ధిదారుల ఇంటికి వెళ్లి ఈ కేవైసీ అనంతరం అందజేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. అధునాతన రైస్ కార్డులు అందజేయుటలో ప్రజా ప్రతినిధుల సహకారం పొందాలని ఆయన పౌర సరఫరా అధికారులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాల అధికారి జమీర్ భాష ,సిబ్బంది పాల్గొన్నారు.

## యూరియా సరఫరా చేయటంలో 'కూటమి' ప్రభుత్వం విఫలం: మండల వైకాపా అధ్యక్షుడు వెంకటప్పారెడ్డి

కొల్లిపర,సెప్టెంబరు 8 (ప్రభాతవార్త): రైతులకు అవసరమైన యూరియాను సరఫరా చేయటంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని వైసిపి మండల అధ్యక్షుడు వెంకటప్పారెడ్డి అన్నారు.సోమవారం మండల కేంద్రం కొల్లిపర వైసీపీ కార్యాలయంలో వైసీపీ నాయకులతో కలసి ఆయన అన్నదాత పోరు పోస్టర్‌ను ఆవిష్కరించారు.




ఈ సందర్భంగా వెంకటప్పారెడ్డి మాట్లాడుతూ రైతు సమస్యలపై మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ ఆధ్వర్యంలో 9 వ తేదీన ఉదయం తెనాలి రామలింగేశ్వరరావు పేటలో ఏ 1 కన్వెన్షన్ హాలు నుంచి ప్రదర్శనగా వెళ్లి సబ్‌కలెక్టర్ కార్యాలయంలో వినతి పత్రం అందజేయటం జరుగుతుందన్నారు.అన్నదాత పోరుబాట కార్యక్రమానికి రైతులు,పార్టీ రహితంగా నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.కార్యక్రమంలో వైసీపీ నాయకులు భీమవరపు శివకోటిరెడ్డి,అవుతు సాంబిరెడ్డి,పిల్లి గంగాధరరావు,మండ్రు రాజు,మల్లేల రవి,ఆరిమండ కృష్ణారెడ్డి,ఆరిమండ మహేంద్రరెడ్డి,అవుతు శ్రీనుశేఖర్‌రెడ్డి,షేక్ అబ్దుల్లా తదితరులు పాల్గొన్నారు.

## సచివాలయ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలి

### --సచివాలయ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సతీష్

కొల్లిపర,సెప్టెంబరు 8 (ప్రభాతవార్త): సచివాలయ ఉద్యోగుల ప్రధాన సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సచివాలయ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సతీష్ అన్నారు.సోమవారం మండల కేంద్రం కొల్లిపరలో సచివాలయ ఉద్యోగులు తమ సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని



తహశీల్ధార్ సిద్ధార్థకు,ఎంపీడీవో విజయలక్ష్మికి అందజేసారు.ఈ సందర్భంగా సతీష్ మాట్లాడుతూ సెలవు దినాలలో కూడా సర్వేలను చేయించటం వలన సచివాలయ ఉద్యోగులు మానసిక వత్తిడికి గురవుతున్నారన్నారు,స్పష్టమైన జాబ్ చార్ట్ అమలు చేయాలన్నారు.గతంలో వలంటీర్లు పనిచేసే క్లస్టర్లను సచివాలయ సిబ్బందికి బదలాయించటం అన్యాయమని దానిని వెనుకకు తీసుకోవాలని డిమాండ్ చేసారు.సచివాలయ ఉద్యోగులు ఆత్మగౌరవంతో విధులు నిర్వహించే విధంగా చూడాలన్నారు.కార్యక్రమంలో డిజిటల్ అసిస్టెంట్లు దీనరాజు,డాక్టర్ రాజేష్‌నాయుడు,పణీంద్ర, ప్రధీప్,ఇంజనీరింగ్ అసిస్టెంట్లు అరుణ్‌బాబు,భరత్,వెల్ఫేర్ అసిస్టెంట్లు కారుమంచి సుబ్బారావు,కె.ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి నారా లోకేష్ చొరవతో మంజూరైన ఎల్‌వోసీ చెక్కు అందజేత

మంగళగిరి, సెప్టెంబర్ 8, ప్రభాతవార్త : మంగళగిరి పట్టణంలోని కొత్తపేటకు చెందిన షేక్ సలీమా కుమార్తె జోయా ఆశ్రత్ (3సం) అనారోగ్యానికి గురికాగా విజయవాడలోని ఆంధ్రా ఆస్పటల్‌లో చికిత్స చేయిస్తున్నారు. సలీమా కుటుంబం ఆర్థిక ఇబ్బందులతో మంత్రి నారా లోకేష్‌కు అర్జీ పెట్టుకోగా వెంటనే స్పందించిన ఆయన సీఎంఆర్‌ఎఫ్ అధికారులతో మాట్లాడి రూ. 2 లక్షల 50 వేల ఎల్‌వోసీని



మంజూరు చేయించారు. ఆ ఎల్‌వోసీ పత్రాన్ని టీడీపీ నాయకులు సోమవారం జోయా ఆశ్రత్ తల్లికి అందజేశారు. దీనితో మంత్రి నారా లోకేష్‌కు జోయా ఆశ్రత్ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మంగళగిరి పట్టణ అధ్యక్షులు పడవల మహేష్ మాట్లాడుతూ అనారోగ్యంతో ఉన్నవారికి సీఎం రిలీఫ్ ఫండ్ అండగా ఉంటుందని, గత వైసిపి ప్రభుత్వం దీనిని నిర్వీర్యం చేసిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మంగళగిరి పట్టణ ప్రధాన కార్యదర్శి షేక్ రియాజ్, 1వ వార్డు అధ్యక్షులు శ్రీనివాసరావు, కె రమేష్ బాబు, పోలూరి నాగేశ్వరరావు, ఎం రామకోటేశ్వరరావు, షేక్ సలీమ్ బాష, బాణాల రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## బాపట్ల జిల్లాలో ఎరువుల కొరత లేదు: రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు: కలెక్టర్

బాపట్ల,సెప్టెంబర్ 8,ప్రభాతవార్త: బాపట్ల జిల్లాలో ఎరువుల కొరత లేదు, రైతులు ఆందోళన చెందవద్దు అని కలెక్టర్ జె.వెంకటమురళీతెలిపారు రైతులకు తెలిపారు.ఈ సందర్భంగా సోమవారం ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు 16845 మెట్రిక్ టన్నులు యూరియా మార్క్ఫెడ్ మరియు ప్రైవేట్ డీలర్ల ద్వారా రైతులకు ఖరీఫ్ 2025 సీజన్ కు అందించడం జరిగిందన్నారు. ఈ నెల 7,8వ తేదిలలో రైల్ హెడ్ ద్వారా మన జిల్లాకు కోరమండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ నుంచి యూరియ 760 ఎంటిఎస్,ఇండియన్ పొటాష్ లిమిటెడ్ నుంచి యూరియా1015 ఎంటిఎస్, రాష్ట్రీయ కెమికల్స్ అండ్ ఫర్టిలైజర్స్ లిమిటెడ్ నుంచి యూరియా 500 ఎంటిఎస్ మొత్తం 2275ఎంటిఎస్ రావడం జరిగిందన్నారు. వచ్చిన ఎరువులను రైతులకు పంపిణీ చేయుటకు అన్ని ఏర్పాట్లు చేయడం జరిగింది. ఇందులో జిల్లాలోని 62 ఆర్‌కెఎస్ లకు మరియు 23 పిఎసిఎస్ లకు కేటాయించడం జరిగినది. కావున రైతులు ఆందోళన పడవలసిన అవసరం లేదు. అంతేకాకుండా రైతుల కోసం



కలెక్టర్ కార్యాలయంలో 8247040131 ఫోన్ నెంబర్ అందుబాటులో ఉందన్నారు. ఈ నెంబరుకు ఫోన్ చేసి ఎరువులకు సంబంధించి ఏ విధమైన సమాచారమైనా తెలుసుకొనవచ్చునన్నారు. వరుసగా మన జిల్లాకు కేటాయించిన ఎరువులు ఈ ఖరీఫ్ సీజన్ కు పుష్కలంగా అందుబాటులో ఉంచడం జరిగిందని ఆయన తెలిపారు.

## బీచ్ ఫెస్టివల్‌ను రాష్ట్ర పండుగగా నిర్వహించాలి: కలెక్టర్

బాపట్ల,సెప్టెంబర్ 8,ప్రభాతవార్త: బీచ్ ఫెస్టివల్ ను రాష్ట్ర పండుగగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి తెలిపారు. బీచ్ ఫెస్టివల్ నిర్వహణపై అన్ని శాఖల అధికారులతో సోమవారం స్థానిక కలెక్టరేట్ లో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందరద్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని జిల్లాలో ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ చెప్పారు. ఈనెల 26, 27, 28 తేదీలలో బీచ్ ఫెస్టివల్ నిర్వహించడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. రాష్ట్రస్థాయిలో నిర్వహించే బీచ్ ఫెస్టివల్ కు భద్రత ఏర్పాట్ల నిమిత్తం నాలుగు ఎస్డిఆర్ఎఫ్ బృందాలు నియమించాలన్నారు. ఒక రోజుకి కనీసం 80 వేల నుంచి లక్షమంది వరకు పర్యాటకులు వచ్చే అవకాశం ఉన్నందున, పర్యాటకుల సంఖ్యకు తగినట్టుగా సరిపడా ముందస్తు ఏర్పాట్లు చేయాలన్నారు. వేడుకల కొరకు హెలి రైడ్స్, పారా గ్లైడింగ్, కయాకింగ్, పారాసైలెంగ్, ఫోర్ వీలర్స్



రైడ్స్, గుర్రాలు, ఒంటెలు ప్రదర్శన, జెయింట్ వీల్, డ్రాగన్ ట్రైన్, రంగులరాట్నం, కొలంబస్, బ్రేక్ డ్యాన్స్, రైడ్ వంటివి ఏర్పాటు చేయాలన్నారు. ప్రజలు అత్యంత ఆహ్లాదం, సరదాగా, సంతోషంతో గడిపే వాతావరణం కల్పిస్తున్నామన్నారు. ప్రజలకు ఎలాంటి సమస్యలు ఉత్పన్నం గాకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఏపీ, తెలంగాణ రాష్ట్రాలలో ప్రాచుర్యం పొందిన ఆహార పదార్థాలు ప్రదర్శన, విక్రయాల కొరకు 100 ఫుడ్ కోర్టులు ఏర్పాటు చేస్తున్నామనిఆయన తెలిపారు. సూర్యలంక బీచ్ ను విద్యుత్ వెలుగులతో నింపాలన్నారు. పర్యాటకుల కొరకు 200 డ్రెస్ చేంజింగ్ రూమ్స్, 350 మరుగుదొడ్లు, బాతింగ్ షవర్స్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించిన నేపథ్యంలో ప్లాస్టిక్ వాటర్ బాటిల్స్ లేకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. తాగునీటి సమస్య లేకుండా ప్రత్యేకంగా ఏర్పాట్లు చేస్తున్నామని వివరించారు. మూడు రోజుల వేడుకలకు లక్షలాదిమంది ప్రజలు వస్తున్నందున పారిశుద్ధ్య కార్యక్రమాలు భారీగా చేపట్టాలన్నారు. పంచాయతీ, మున్సిపల్ సిబ్బంది చిత్తశుద్ధితో పనిచేసేలా అవగాహన కల్పించాలన్నారు. బీచ్ వాలీబాల్, కబాడీ, కో కో, బాక్సింగ్ క్రీడా పోటీలు జరుగుతాయన్నారు. జాతీయస్థాయి క్రీడాకారులు హాజరవుతారని, వసతి సౌకర్యాలు ఏర్పాటు చేయాలన్నారు. కాల్ సెంటర్, పోలీస్ పెట్రోలింగ్ ఉండేలా చూడాలన్నారు. బీచ్ ఫెస్టివల్ ను వైభవంగా నిర్వహించాలని ఇంచార్జి సంయుక్త కలెక్టర్, డి ఆర్ ఓ జి.గంగాధర్ గౌడ్ తెలిపారు.వేడుకల నోడల్ ఆఫీసర్ గా పర్యాటక శాఖ అధికారి నాగిరెడ్డి వ్యవహరిస్తారన్నారు. వేడుకలు జయప్రదంగా నిర్వహించడానికి అధికారులను నియమిస్తూ జారీ చేసిన ఉత్తర్వులు, విధుల కేటాయింపులను వివరించారు. ఈ సమావేశంలో ఆర్డీవోలు, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## సాగునీటి కోసం ఇబ్బంది పడుతున్న రైతులు

### -ఇంజన్లతో నీటిని తోడుకుంటున్న వైనం -నీరులేక ఎండిపోతున్న వరిపంట

నిజాంపట్నం, సెప్టెంబరు 8, ప్రభాతవార్త ః మండలంలోని రైతుల సాగు సాగు కష్టాలు అన్నీ ఇన్నీ కావు. సకాలంలో వర్షాలు పడకపోవటంతో వరి సాగుకు రైతులు అనేక ఇబ్బందులు పడుతునా న్నరు. కృష్ణానదిలో పుష్కలంగా నీరు ఉన్నా మండలంలోని రైతులకు సాగునీరు అందక పంట ఎండిపోయే సి ్థతికి వచ్చిందని రైతులు వాపోతున్నారు. మండలంలోని వరి పంట వేసే రైతులకు పిట్టలవానిపాలెం నుంచి, రేపల్లె నుంచి రెండు సాగునీటి కాలవలద్వారా సాగునీరు అందిస్తారు. నిజాంపట్నం మండలం సాగునీటి కాలవలకు చివరన ఉండటంతో ప్రతి ఏటా సాగునీటికి ఇబ ్బంది



పడుతున్నారు. ఎగువ ప్రాంత రైతులు, సాగునీటి శాఖ అధికారులు దయతలిస్తే ఇక్కడి రైతులు పంట పండించుకుంటారు. రేపల్లె నుంచి వచ్చే పంట కాలవ నిజాంపట్నం మండలంలోని పల్లపట్ల, కూచినపూడి మీదుగా అడవులదీవి వెళుతుంది. మండలంలోని మూడొంతుల భూమి ఈ పంట కాలవపైనే ఆధారపడి సాగు జరుగుతుంది. కానీ సాగునీటికి ఎప్పుడూ రైతులు ఇబ్బంది పడుతూనే ఉంటారు. కూచినపూడి వద్ద, అడవులదీవి సమీపంలో రెండు షట్టర్లు ఉన్నాయి. అయినా సాగునీటిని



వంతులవారీగా వేసిన సందర్భాలు తక్కువే. కూచినపూడి వద్ద, అడవులదీవి సమీపంలో ఉన్న షట్టర్లు మూస్తేనే బొర్రావారిపాలెం, కూచినపూడి, తదితర ప్రాంత రైతులకు సాగునీరు సమృద్ధిగా ఉంటుంది. పంట కాలవలో సాగునీరు తక్కువగా ఉండటంతో కూచినపూడి, బొర్రావారిపాలెం తదితర ప్రాంత రైతులు కాలవలో ఇంజన్లు ఏర్పాటుచేసి నీటిని తోడి తమ పంట పొలాలను కాపాడుకుంటున్నారు. బావాజీపాలెం, నిజాంపట్నం తదితర గ్రామాలలో సాగునీటికి ఇబ్బంది పడుతున్నారు. పంటలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడుతున్నది. ఇకనైనా సాగునీటి శాఖ అధికారులు కాలవలకు తగినంత సాగునీరు విడుదల చేయాలని రైతులు కోరుతున్నారు.

## ప్రజాసమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదు: ఎస్పీ

బాపట్ల,సెప్టెంబర్ 8,ప్రభాతవార్త ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించేది లేదని పోలీస్ అధికారులను జిల్లా ఎస్పీ తుషార్ డూడి ఐపీఎస్ హెచ్చరించారు. స్థానిక జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఎస్పీ పాల్గొని ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఫిర్యాదిదారులతో ఎస్పీ స్వయంగా మాట్లాడి



వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం సంబంధిత అధికారులతో మాట్లాడుతూ, ప్రజా సమ స్యల పరిష్కార వేదికలో అందిన ఫిర్యాదుల పూర్వాపరాలను విచారించి, వాస్తవమై నట్లయితే చట్టపరిది .లో నిర్ణిత గడువులోగా పరిష్కరించాలన్నారు. పోలీసు అధికారులు చిత్తశుద్ధితో ప్రజా సమస్యల పరిష్కారం చూపాలన్నారు. అర్జీలు పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారం చూపాలని ఆదేశించారు. అర్జీల పరిష్కారానికి తీసుకున్న చర్యలకు సంబంధించిన నివేదికను జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయానికి పంపాలన్నారు. అత్తారింటి వేధింపులు, కుటుంబ కలహాలు, భూ వివాదాలు, ఆర్థిక మోసాలు తదితర సమస్యలపై మొత్తం 52 అర్జీలు పీజీఆర్ఎస్ కార్యక్రమం ద్వారా స్వీకరించబడినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో బాపట్ల డిఎస్పీ జి. రామాంజనేయులు, చీరాల డిఎస్పీ ఎమ్.డి.మోయిన్, పీజీఆర్ఎస్ సెల్ అధికారులు మరియు సిబ్బంది.తదితరులు పాల్గొన్నారు.

## 15లోగా ఎన్‌ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌లకు ఎంపికైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలి

బాపట్ల,సెప్టెంబర్ 8,ప్రభాతవార్త: ఎన్ఎంఎంఎస్ పరీక్షలలో స్కాలర్‌షిప్‌కుఎంపికైన విద్యార్థులు ఈ నెల 15 వ తేదిలోపు ఎన్ఎస్పి పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన మాట్లాడుతూ 2024 డిసెంబర్‌లో జరిగిన ఎన్ఎంఎంఎస్ పరీక్షలలో,అంతకు ముందు స్కాలర్‌షిప్‌లకు ఎంపికైన విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకునే విధంగా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు,పాఠశాల నోడల్ అధికారులు ప్రత్యేక శ్రద్ధ వమించాలన్నారు. దరఖాస్తులను ఈ నెల 15వ తేది తరువాత తీసుకోబడవన్నారు. ప్రభుత్వ ,జిల్లా పరిషత్,మున్సిపల్ పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న ఎంపికై విద్యార్థులచే స్కాలర్‌షిప్ దరఖాస్తు చేయించకపోతే ఆయాపాఠశాలల ప్రధానోపాధ్యాయులు,పాఠశాల నోడల్‌వ అధికారులు బాధ్యత వహించాల్సి ఉంటుందనిఆయన తెలిపారు.

## యూరియా కొరత నుంచి రైతులను కాపాడాలి

బాపట్ల,సెప్టెంబర్ 8,ప్రభాతవార్త: రాష్ట్రంలో యూరియా కొరత నుండి, బ్లాక్ మార్కెట్లో ఉన్న యూరియా ను వెలికి తీసి రైతులను కాపాడాలని సిపిఐ బాపట్ల జిల్లా కార్యదర్శి తన్నీరు సింగరకొండ



ప్రభుత్వాన్నిడిమాండ్ చేశారు.సిపిఐ బాపట్ల జిల్లా సమితి ఆధ్వర్యంలో బాపట్ల తహసిల్దార్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమాన్ని సోమవారంనిర్వహించారు. నిరసనకార్యక్రమంలో సిపిఐ బాపట్ల జిల్లా కార్యదర్శి తన్నీరు సింగరకొండ మాట్లాడుతూ మాది రైతు ప్రభుత్వం అని, రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని, రైతే రాజుని,రైతే ఈ దేశానికి వెన్నుముఖ అని అధికారం లోకి రాకముందు అనేక ప్రగళ్బాలు పలుకుతున్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు యూరియాను అందించడంలో ఘోరంగా విఫలమయ్యారన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను ఆయన దుయ్యబట్టారు. బ్లాక్ మార్కెట్లో ఉన్న యూరియాను వెలికి తీసి రైతులను ఆదుకోవాలని ప్రభుత్వాలను అధికారులను డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు మామిడి బత్తుల అశోక్, సిపిఐ జిల్లా సీనియర్ నాయకులు ముత్తిరెడ్డి నాగేశ్వరరావు, శ్రీనివాసరావు, ఫణీంద్ర, ఎలమంద తదితర పార్టీ నాయకులు కార్యకర్తలు రైతులు పాల్గొన్నారు

## యూరియా కోసం రైతుల అగచాట్లు!

నిజాంపట్నం, సెప్టెంబరు 8, ప్రభాతవార్త ః మండలంలోని రైతులు యూరియా కోసం అనేక ఇబ్బందులు పడుతున్నారు. బహిరంగ మార్కెట్‌లో లభించక, వ ్యవసాయశాఖ, పిఎసిఎస్‌లద్వారా వస్తున్న యూరియా అందక అనేక మంది రైతులు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని నిజాంపట్నం, కూచినపూడి తదితర 15 పంచాయితీల గ్రామాలలో రైతులకు అవసరమైన యూరియాని



పిఎసిఎస్‌లద్వారా, వ్యవసాయశాఖ ద్వారా అందజేస్తున్నారు. అయితే యూరియా అవసరమైన మేరకు తీసుకోవాల్సి న కొందరు రైతులు ముమ్మందు యూరియా లభిస్తుందోలేదో అనే అనుమానంతో అధిక మొత్తంలో తీసుకుంటున్నారు. దీంతో కొందరికి మాత్రమే యూరియా అందుతోంది. మండలంలోని ఆయా గ్రామ పంచాయితీ కార్యాలయాల వద్ద వ్యవసాయశాఖ కార్యాలయాల వద్ద ఆయా ప్రాంతాల రైతులకు యూరియా పంపిణీ చేస్తున్నారు. అయితే ఇతర ప్రాంతాలకు చెందిన రైతులు అక్కడకు వెళ్ళి యూరియాను తీసుకుంటున్నారు. దీంతో యూరియా అందని రైతులు లబోదిబో మంటునా ్నరు. బహిరంగ మార్కెట్‌లో యూరియా దొరకటంలేదని, రేటు ఎక్కువ అయినా బహిరంగ మార్కెట్లో కొనుగోలు చేసి పంటకు సకాలంలో యూరియా చల్లుకుంటామని రైతులు వాపోతున్నారు. యూరియా కోసం రైతులు ఉదయం నుంచే నిజాంపట్నం 3 సచివాలయం వద్ద వేచియున్నారు. యూరియా అందని కొందరు నిరాశతో వెనుదిరిగి వెళ్ళారు. బావాజీపాలెంలో యూరియాను పంపిణీ చేశారు.

## పలువురు ప్రజాప్రతినిధులు టిడిపిలో చేరిక

పొన్నూరు, సెప్టెంబరు 8,ప్రభాతవార్త: చేబ్రోలు మండల పరిధిలోని వేజండ్ల గ్రామంలో వైఎస్సార్‌కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు ఎంపిటీసిలు, వార్డు సభ్యులు టిడిపిలో చేరారు. ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ పార్టీ కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కూటమి ప్రభుత్వం విధానాలు, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై గ్రామానికి చెందిన వైకాపా నాయకులు



టిడిపిలో చేరారు. వేజండ్ల ఎంపిటిసి సభ్యుడు కాసు అనితరెడ్డి, కాసు ఈశ్వరరెడ్డి, ఈమని వేణుగోపాల్‌రెడ్డి, ముల్కా శ్రీనివాసరెడ్డి, పల్లా గోపాల్‌యాదవ్, వేజండ్ల శశికుమార్(14వవార్డు సభ్యుడు), వేజండ్ల అజయ్‌కుమార్, చింతాబత్తిన అరుణ్‌కుమార్, దాసరి ప్రేమ్‌బాబు, (బూత్ కన్వీనర్లు), అనేక మంది నాయకులు టిడిపిలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ధూళిపాళ్ళ మాట్లాడుతూ పార్టీకి వచ్చిన ప్రతి ఒక్కరికి అవకాశాన్ని బట్టి ప్రాధాన్య ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో చేబ్రోలు టిడిపి అధ్యక్షుడు మైలా వెంకటరామరాజు తదితరులున్నారు.

## ఘనంగా డాక్టర్ గరికపాటి రాజారావు వర్ధంతి

పొన్నూరు, సెప్టెంబరు 8,ప్రభాతవార్త: నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా, భూస్వామ్య దోపిడీకి వ్యతిరేకంగా ప్రజలను చైతన్య పరుస్తూ మా భూమి నాటాకిని దర్శకత్వం వహించి, అనేక వేల ప్రదర్శనలు ఇచ్చిన మహనీయుడు డాక్టర్ గరికపాటి రాజారావు అని ప్రజానాట్య మండలి జిల్లా



అధ్యక్షుడు ఆరేటి రామారావు అన్నారు. స్థానిక కార్యాలయంలో సోమవారం గరిపాటి రాజారావు వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ నాటకరంగంలో అనేక పాత్రలు పోషించి అనేకమంది నటులను తన నటన కార్ఖానా నుండి తెలుగు వెండి తెరకు పంపిన నాయకుడు రాజారావు అని కొనియాడారు.రాజారావు ఆశయసాధనకు కృషి చేయాలని కోరారు. తొలుత రాజారావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులరి ్పంచారు. ఈ కార్యక్రమంలో దేవరకొండ శ్రీనివాస్, అంకమయ్య, గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఈ చిత్రంతో సినిమా ఖ్యాతి మరో మెట్టు పైకి ఎక్కేలా రూపొందిస్తున్నాం..



శుక్ర, మాటరాని మౌనమిది వంటి డిఫరెంట్ మూవీస్ తర్వాత దర్శకుడు పూర్వాజ్ రూపొందిస్తున్న కొత్త సినిమా "ఏ మాస్టర్ పీస్". అరవింద్ కృష్ణ, జ్యోతి పూర్వజ్, మనీష్ గిలాడ, అషు రెడ్డి లీడ్ రోల్స్‌లో నటిస్తున్న ఈ చిత్రాన్ని శ్రీకాంత్ కండ్రేగుల, మనీష్ గిలాడ, ప్రజయ్ కామత్ నిర్మిస్తున్నారు. "ఏ మాస్టర్ పీస్"సినిమా ఒక న్యూ కాన్సెప్ట్ సూపర్ హీరో మూవీ ఎక్స్‌పిరియన్స్ ను తెలుగు ప్రేక్షకులకు అందించబోతోంది. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ తుది దశకు చేరుకుంది. క్లైమాక్స్ సీన్స్ రూపొందిస్తున్నారు. ఈ రోజు "ఏ మాస్టర్ పీస్" షూటింగ్ కవరేజ్ కు మీడియా మిత్రులను ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్‌లోదర్శకుడు పూర్వాజ్ మాట్లాడుతూ "ఏ మాస్టర్ పీస్" సినిమా షూటింగ్ కవరేజ్ కు వచ్చిన మీడియా మిత్రులకు థ్యాంక్స్. ఈ ప్రాజెక్ట్ మొదలయ్యేందుకు శ్రీకాంత్ కండ్రేగుల కారణం. ఆ తర్వాత మనీష్ గిలాడ మా చిత్ర ప్రొడక్షన్ లో భాగమై సినిమాను ఇంకో స్థాయికి తీసుకెళ్లారు. ఆయన ఈ చిత్రంలో సూపర్ విలన్‌గా నటిస్తున్నారు. అరవింద్ కృష్ణ కెరీర్ గురించి మీ అందరికీ తెలిసిందే."ఏ మాస్టర్ పీస్" చిత్రంలో సూపర్ హీరోగా ఆయన కనిపిస్తారు. ఈ చిత్ర కథను మన పురాణా ఇతిహాసాల నుంచి స్ఫూర్తి పొంది తయారుచేశాను. దశరథ మహారాజు మంత్రుల్లో ఒకరైన సుమంత్రుడికి శ్రీరాముడు వనవాసం వెళ్తున్న సమయంలో ఒక వరం లభిస్తుంది, ఆ వరం నేపథ్యంగా సూపర్ హీరో క్యారెక్టర్ ను, హిరణ్యకశ్యపుడి ద్వాపర యుగానికి చెందిన ఒక అంశంతో సూపర్ విలన్ పాత్రను క్రియేట్ చేశాం. శ్రీరాముడి త్రేతాయుగానికి, హిరణ్యకశ్యపుడి ద్వాపర యుగానికి, ఇప్పటి కలియుగానికి అనుసంధానిస్తూ సాగే ఒక కొత్త తరహా స్క్రిప్ట్ ను "ఏ మాస్టర్ పీస్"చిత్రంలో చూస్తారు. అరవింద్ కృష్ణ సూపర్ హీరోగా అద్భుతంగా పర్ ఫార్మ్ చేశారు. అలాగే మనీష్ గిలాడ సూపర్ విలన్ గా ఆకట్టుకుంటాడు. డిఫరెంట్ రోల్స్ లో జ్యోతి పూర్వజ్ నా వైఫ్, ఎంతో బాగా నటించింది. మా టీమ్ అంతా నా వెన్నంటి ఉండి మూవీకి వర్క్ చేస్తున్నారు. ప్రస్తుతం క్లైమాక్స్ షూటింగ్ జరుగుతోంది. మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా రిలీజ్ చేయాలని ప్లాన్ చేస్తున్నాం అని అన్నారు. ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ యోగి పోసాని మాట్లాడుతూ "ఏ మాస్టర్ పీస్" సినిమా షూటింగ్ తో పాటు వీఎఫ్ఎక్స్ పరంగా ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా రూపొందిస్తున్నాం. క్లైమాక్స్ షూటింగ్ ఎంత గ్రాండ్‌గా చేస్తున్నామో మీకు చూపించాలనే మీడియా మిత్రులను ఇన్వైట్ చేశాం. ఈ భారీ క్లైమాక్స్ ను పక్కా ప్లానింగ్ తో చేస్తున్నాం.ప్రతి టీమ్ మెంబర్ మాకు బాగా సపోర్ట్ చేస్తున్నారు.హీరో అరవింద్ కృష్ణ మాట్లాడుతూ "ఏ మాస్టర్ పీస్" చిత్రంలో నటించే అవకాశం కల్పించిన మా డైరెక్టర్ పూర్వాజ్‌కి మనస్ఫూర్తిగా థ్యాంక్స్ చెబుతున్నా. అనివార్య కారణాలతో మా సినిమా షూటింగ్ కొంత ఆలస్యమైంది. నాకోసం మా డైరెక్టర్ పూర్వాజ్ చాలా వెయిట్ చేశారు. నాకే కాదు మా టీమ్ లోని చాలా మందికి ఇబ్బందులు ఎదురయ్యాయి. అవన్నీ గుర్తొస్తే నేను ఎమోషనల్ అవుతాను. మనం జీవితంలో ఏదో గొప్పగా సాధించబోయో ముందు ఇలాంటి కష్టాలు వస్తుంటాయని అంటారు. "ఏ మాస్టర్ పీస్" సినిమా తెలుగు సినిమా ఖ్యాతిని పెంచేలా రూపొందుతోంది. మనీష్ గిలాడ మా చిత్రంలో సూపర్ విలన్, కానీ మా సినిమాకు ప్రొడక్షన్ సైడ్ నిలబడ్డ సూపర్ హీరో. జ్యోతి పూర్వాజ్ బాగా నటించారు. మా ప్రొడ్యూసర్స్ ఎంతో ప్యాషనేట్‌గా మూవీ చేస్తున్నారు. మా టీమ్ అందరికీ థ్యాంక్స్. మీ అందరి సపోర్ట్ మాకు కావాలని కోరుకుంటున్నా. అన్నారు.హీరోయిన్ జ్యోతి పూర్వాజ్ మాట్లాడుతూ నేను రెండేళ్ల కిందట ఈ ప్రాజెక్ట్ లోకి వచ్చాను. ఏ మాస్టర్ పీస్‌సూపర్బ్ స్క్రిప్ట్ తో వస్తోంది. ఈచిత్రంలో నాక్యారెక్టర్ డిఫరెంట్ వేరియేషన్స్ లో ఉంటుంది. ప్రేక్షకులు ఒక్కోసారి ఆశ్చర్యపోతారు. నా కెరీర్ లో నటిగా సంతృప్తినిచ్చిన క్యారెక్టర్ ఇది.



భాగ్యశ్రీ బోర్సే

# విజయ్ ఆంటోనీ ఫిల్మ్ కార్పొరేషన్ 'బుకీ' గ్రాండ్ గా లాంచ్

అజయ్ దిషన్, ధనుష హీరో హీరోయిన్స్ గా గణేష్ చంద్ర దర్శకత్వంలో రూపొందుతున్న యూత్ ఫుల్ ఎంటర్టైనర్ 'బుకీ'. విజయ్ ఆంటోనీ ఫిల్మ్ కార్పొరేషన్, శరవంత్ రామ్ క్రియేషన్స్ బ్యానర్స్ పై రామంజేయులు జవ్వాజీ నిర్మిస్తున్నారు. విఎఫ్సి ప్రజెంట్ చేస్తున్నారు.

ఈ చిత్రం పూజా కార్యక్రమాలతో ఈ రోజు గ్రాండ్‌గా లాంచ్ అయ్యింది. ముహూర్తపు సన్నివేశానికి సత్య దేవ్ ఫస్ట్ క్లాప్ కొట్టారు. సి కళ్యాణ్ కెమెరా స్విచ్ ఆన్ చేశారు. మంచు లక్ష్మీ స్క్రిప్ట్



అందించారు. విజయ్ ఆంథోని, రామాంజనేయులు గౌరవ దర్శకత్వం వహించారు.

ఈ చిత్రంలో పాండియరాజన్, సునీల్, లక్ష్మీ మంచు, ఇందుమతి, వివేక్ ప్రసన్న కీలక పాత్రలు పోషిస్తున్నారు. విజయ్ ఆంటోని మ్యూజిక్ అందిస్తున్నారు.


మూవీ లాంచింగ్ ప్రెస్ మీట్ లో విజయ్ ఆంటోనీ మాట్లాడుతూ, అందరికి నమస్కారం. ఈ సినిమా షూటింగ్ ని ఆల్రెడీ మొదలుపెట్టాం. సినిమా ఫుటేజ్ చూశాను. చాలా అద్భుతంగా ఉంది. చాలా అద్భుతమైన టీం తో చేస్తున్న సినిమా ఇది. డైరెక్టర్ చంద్ర డాక్టర్ సలీం సినిమాకి కెమెరామెన్‌గా వర్క్ చేశారు. బుకీ మంచి కమర్షియల్ సక్సెస్ అవుతుందని నమ్మకం ఉంది. ఫిబ్రవరిలో సినిమాని రిలీజ్ చేయడానికి ప్లాన్ చేస్తున్నాము. అందరికీ థాంక్యూ సో మచ్. హీరో అజయ్ దిషన్ మాట్లాడుతూ, మార్గన్ సక్సెస్ ఈ సినిమా చేయడానికి మంచి కాన్ఫిడెన్స్ వచ్చింది. విజయ్ అంటోని గారికి, డైరెక్టర్, నిర్మాతకి ధన్యవాదాలు. సునీల్ లక్ష్మీఅందరితో కలిసి పనిచేయడం చాలా ఆనందంగా ఉంది. సినిమా చాలా అద్భుతంగా వస్తుంది. ఫిబ్రవరిలో సినిమాని రిలీజ్ చేయడానికి ప్లాన్ చేస్తున్నాం. తప్పకుండా ఈ సినిమా మీ అందరికీ నచ్చుతుంది.హీరోయిన్ ధనుష మాట్లాడుతూ, ఈ సినిమా నాకు చాలా ప్రత్యేకం. ఈ అవకాశం ఇచ్చిన దర్శక నిర్మాతలకు ధన్యవాదాలు. తప్పకుండా ఈ సినిమా మీ అందరిని అలరిస్తుందిడైరెక్టర్ మాట్లాడుతూ, విజయ్ డాక్టర్ సలీం సినిమాకి నేను సినిమాటోగ్రాఫర్‌గా పని చేశాను. నన్ను బిలీవ్ చేసి ఈ సినిమా ఇచ్చిన నిర్మాత రామ్‌కి ధన్యవాదాలు. సినిమా చాలా అద్భుతంగా వస్తుంది. మీ అందరి బ్లెస్సింగ్స్ కావాలని కోరుకుంటున్నాను. మంచు లక్ష్మీ మాట్లాడుతూ, ఇది అందరికీ యూనివర్సల్‌గా అర్థమయ్యే కథ. ఈ సినిమాలో భాగం కావడం చాలా ఆనందంగా ఉంది. డైరెక్టర్‌కి టీమ్ అందరికీ ఆల్ ద వెరీ బెస్ట్ . సినిమా అద్భుతమైన విజయం సాధించాలని కోరుకుంటున్నాను.ప్రొడ్యూసర్ రామంజేయులు మాట్లాడుతూ,అందరికీ నమస్కారం. మా పూజా కార్యక్రమానికి వచ్చిన అతిథులకు ధన్యవాదాలు. ఇప్పుడున్న యూత్ కి అద్భుతంగా కనెక్ట్ అయ్యేలా ఈ స్క్రిప్ట్ ని రెడీ చేసాము. ఈ సినిమాలో మంచి మెసేజ్ కూడా ఉంది. చిన్నలకు పెద్దలకు అందరికీ నచ్చేలా ఉంటుంది. అజయ్ చాలా టాలెంటెడ్. మంచు లక్ష్మీసునీల్ మ్యూజిక్ డైరెక్టర్ విజయ్ ఈ సినిమాలో ఉండడం పెద్ద ఎసెట్. డైరెక్టర్‌కి చాలా విజన్ ఉంది. ఈ సినిమాకి సపోర్ట్ చేసిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు. నటీనటులు: అజయ్ దిషన్, ధనుష, పాండియరాజన్, సునీల్, లక్ష్మీ మంచు, ఇందుమతి మణిగండన్, వివేక్ ప్రసన్న, బ్లాక్ పాండి, ఆదిత్య, బిగ్ బాస్ సత్య,... శ్రీరామ్, రాధ, అశ్విన్ రామ్, షియారా శర్మి, ప్రియాంక.

# 'తెలుసు కదా' సినిమా షూటింగ్ పూర్తి చేసుకున్న రాశీ ఖన్నా

స్టార్ బాయ్ సిద్ధు జొన్నలగడ్డ రొమాంటిక్ డ్రామా తెలుసు కదా. రాశీ ఖన్నా, శ్రీనిధి శెట్టి హీరోయిన్స్‌గా నటిస్తున్నారు. ప్రముఖ స్టైలిస్ట్ నీరజా కోన దర్శకత్వంలో, పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై టిజి విశ్వ ప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మిస్తున్న నిర్మిస్తున్నారు. తాజాగా హీరోయిన్ రాశీ ఖన్నా ఈ సినిమా షూటింగ్ పూర్తి చేసుకున్నారు.'తెలుసు కదా' జర్నీ గురించి రాశీ ఖన్నా మాట్లాడుతూ, కెమెరాలు ఆగిపోయిన తర్వాత కూడా మరిచిపోలేని కథలు ఉంటాయి.తెలుసు కదా అలాంటి కథల్లో ఒకటి. అద్భుతమైన అనుభవాలన్నీ కలగలిసిన ప్రయాణం ఇది. ఈప్రయాణంలో నాతో పాటు నడిచిన అద్భుతమైన టీంకి కృతజ్ఞతలు. మేము సృష్టించిన ఈ ప్రపంచంలోకి మీరు అడుగుపెట్టే రోజుకోసం ఎదురుచూస్తున్నాను. ఇది మీకు ఒక గొప్ప రైడ్‌గా ఉంటుంది. థమన్ ఎస్ ఈ చిత్రానికి సంగీతం అందించారు.ఫస్ట్ సింగిల్ మల్లికా గంధ చార్ట్ బస్టర్ హిట్ అయ్యింది. ఈ మూవీకి డీవోపీ జ్ఞాన శేఖర్. నేషనల్ అవార్డు విన్నర్ నవీన్ నూలి ఎడిటర్. అవినాష్ కొల్ల ఆర్ట్ డైరెక్షన్, కాస్ట్యూమ్స్ షీతల్ శర్మ.తెలుసు కదా సినిమా ఈ దీపావళి కానుకగా అక్టోబర్ 17న విడుదల కానుంది.తారాగణం: సిద్ధు జొన్నలగడ్డ, రాశి ఖన్నా, శ్రీనిధి శెట్టి, వైవా హర్షరచన, దర్శకత్వం: నీరజ కోన నిర్మాతలు: టిజి విశ్వ ప్రసాద్, కృతి ప్రసాద్,బ్యానర్: పీపుల్ మీడియా ఫ్యాక్టరీ, సంగీతం: థమన్ ,ఎస్‌డిఓపి: జ్ఞాన శేఖర్ విఎస్, ఎడిటర్: నవీన్‌నూలి,ప్రొడక్షన్ డిజైనర్: అవినాష్‌కొలా,కాస్ట్యూమ్ డిజైనర్: శీతల్ శర్మ,పిఆర్‌ఓ: వంశీశేఖర్.



# పప్పీ షేమ్' సాంగ్ రిలీజ్



ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని మోస్ట్ ఎవైటెడ్, యూనిక్ ఎంటర్ టైనర్ ఆంధ్రా కింగ్ తాలూకా ఫస్ట్ సింగిల్ నువ్వుంటే చాలే తో తన పెన్ పవర్ చూపించారు. మహేష్ బాబు ఎదర్శకత్వంలో ప్రముఖ బ్యానర్ మైత్రి మూవీ మేకర్స్ ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ పాట అగ్రస్థానంలో కొనసాగుతోంది. బిగ్గెస్ట్ మ్యూజిక్ హిట్లలో ఒకటిగా నిలిచింది. ఇప్పుడు, సెకండ్ సింగిల్ పప్పీ షేమ్ ని మేకర్స్ రిలీజ్ చేశారు. రామ్ పోతినేని హైఆక్టేన్ వోకల్స్, అద్భుతమైన స్క్రీన్ ప్రజెన్స్ హైలైట్ నిలిచింది.వివేక్ మెర్విన్ స్వరపరిచిన ఈ ట్రాక్, ఎనర్జిటిక్ బీట్స్‌తో యూత్ అండ్ ఫెస్టివల్ వైబ్‌ను సృష్టిస్తుంది. ఈ పాట రామ్, అతని గ్యాంగ్ తమ అభిమానస్టార్‌చిత్రం విజయంపై ఆనందిస్తున్న ప్పుడు, పందెం ఓడిపోయిన యాంటీఫ్యాన్స్‌ను ట్రోల్ చేస్తున్న మూమెంట్ ని ప్రజెంట్ చేస్తోంది.భాస్కరభట్ల క్యాచి లిరిక్స్ తో వినోదాన్ని, అభిమానుల జ్ఞాపకాలను అద్భుతంగా అందించారు. ఈ ట్రాక్ ముఖ్యంగా ఫస్ట్ డే ఫస్ట్ షో (ఎఫ్‌డిఎఫ్ఎస్) మ్యాడ్ నెస్ ని ప్రజెంట్ చేసింది. ఇది రామ్ అభిమానులకే కాకుండా ప్రతి స్టార్ అభిమానులకు ఒక వేడుకగా మారింది. రామ్ పోతినేని తొలిసారిగా పాడిన ఈ సాంగ్ లో ఆయన వోకల్స్ ఎనర్జీ, ఫన్, వైబ్, కరిజ్మా పాటకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఎనర్జిటిక్ బీట్‌లో ఆయన వాయిస్ కలిసిపోతూ ఫెస్టివ్ మూడ్‌ను మరింత ఎలివేట్ చేసింది. విజువల్స్ కూడా అదే స్థాయిలో ఆకట్టుకుంటూ, రామ్ తన గ్యాంగ్‌తో కలిసి సెలబ్రేషన్ మోడ్‌లో ఎంజాయ్ చేస్తూ కనిపించటం ఫ్యాండమ్,స్టార్ మానియాకి అద్దం పడుతుంది.ఈ చిత్రంలోబాగ్యశ్రీ బోర్స్ హీరోయిన్‌గా నటించగా, సూపర్‌స్టార్‌గా ఉపేంద్ర కీలక పాత్రలో కనిపించనున్నారు. రావు రమేష్, మురళిశర్మ, సత్య, రాహుల్ రామకృష్ణ, వీటీవీ గణేష్ వంటి ప్రముఖ నటులు ముఖ్యమైన పాత్రల్లో నటిస్తున్నారు.ప్రస్తుతం చివరి దశ షూటింగ్ జరుపుకుంటున్న ఆంధ్ర కింగ్ తాలూకా" నవంబర్ 28న గ్రాండ్‌గా ప్రేక్షకుల ముందుకు రానుంది.తారాగణం: రామ్ పోతినేని, ఉపేంద్ర, భాగ్యశ్రీ బోర్సే, రావు రమేష్, మురళీశర్మ, సత్య,రాహుల్ రామకృష్ణ, జుగిజు గణేష్ స్క్రీన్ ప్లే, దర్శకత్వం: మహేష్‌బాబు పి.

# డీమన్ స్లేయర్ స్క్రీనింగ్‌లో రష్మికతో ఫ్యాన్స్ హంగామా




సోనీ పిక్చర్స్ ఎంటర్టైన్‌మెంట్ ఇండియా నిర్వహించిన డీమన్ స్లేయర్: కిమెట్సు నో యైబా – ఇన్ఫినిటీ క్యాసిల్ ప్రత్యేక ఫ్యాన్ స్క్రీనింగ్ ముంబైలో ఘనంగా జరిగింది. ఈ ఈవెంట్‌లో 250కి పైగా అభిమానులు పాల్గొనగా, ప్రత్యేక ఆకర్షణగారష్మిక మందన్నా, టైగర్ ష్రాఫ్ హాజరై అనిమే కల్చర్‌ను సెలబ్రేట్ చేశారు.రష్మిక, టాంజిరో – నెజుకో సోదర సోదరీ మణులకి ప్రేరణగా ఉండే ప్రత్యేక డ్రెస్సులో అభిమానులను అలరించగా, టైగర్‌తన జెనిట్సు–ఇన్‌స్పైర్డ్ జాకెట్‌లో ఫ్యాండమ్‌ను ప్రదర్శించారు.

అభిమానులతో మాట్లాడిన టైగర్, తనకు బాగానచ్చిన సీన్ జెనిట్సు్బ్ కైగాకు" అని చెప్పారు. అందరూ పడిపోయినా,జెనిట్సు మాత్రమేప్రశాంతంగా కోటలోకిప్రవేశించాడు" అని ఆయన గుర్తుచేశారు. రష్మిక కూడా అభిమానులను వారి ఫేవరెట్ సీన్ గురించి అడిగింది.దీనికి పెద్ద ఎత్తున స్పందన రావడంతో అకాజా గియు, టాంజిరో" ఫైట్ సీక్వెన్స్‌కు థండరస్ రెస్పాన్స్ లభించింది. భారతదేశవ్యాప్తంగా విడుదల:డీమన్ స్లేయర్: ఇన్ఫినిటీ క్యాసిల్‌టికెట్లు ఇప్పటికేఅందుబాటులో ఉన్నాయి.750కిపైగా స్క్రీన్లలోవిడుదల – భారతదేశంలోఇప్పటి వరకు ఎప్పుడూలేని స్థాయి రిలీజ్. రిలీజ్ డేట్: సెప్టెంబర్ 12, 2025:.భారతదేశంలోనే అతిపెద్ద అనిమే థియేట్రికల్ రిలీజ్‌గా నిలిచే ఈ ఫిల్మ్‌ను తప్పక థియేటర్స్‌లో చూడండి.

# ఆడియన్స్‌కు డిఫరెంట్ ఎక్స్‌పీరియన్స్ ఇస్తుంది



విజయం తర్వాత మరో పవర్ ఫుల్ ప్రాజెక్ట్ 'భద్రకాళి'తో వస్తున్నారు. విజయ్ ఆంటోనీకి ల్యాండ్‌మార్క్ మూవీగా నిలిచే ఈ చిత్రానికి అరుణ్ ప్రభు దర్శకత్వం వహించగా, సర్వంత్ రామ్ క్రియేషన్స్ బ్యానర్‌పై రామాంజనేయులు జవ్వాజీ నిర్మించారు. ఈ ప్రాజెక్ట్‌ను విజయ్ ఆంటోనీ ఫిల్మ్ కార్పొరేషన్, మీరా విజయ్ ఆంటోనీ సమర్పిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన ప్రమోషనల్ కన్టెంట్ కి మంచి రెస్పాన్స్ వచ్చింది. 'భద్రకాళి' సెప్టెంబర్ 19న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా హీరోయిన్ తృప్తి రవీంద్ర, రియా జిత్తు విలేకరుల సమావేశంలో సినిమా విశేషాలు పంచుకున్నారు. హీరోయిన్ తృప్తి రవీంద్ర మాట్లాడుతూ,మాది మహారాష్ట్ర. తమిళ్లో హీరోయిన్ గా ఇది నా ఫస్ట్ సినిమా. సినిమాల్లోకి రాకముందు నేను సాఫ్ట్వేర్ ఇంజనీర్ గా పని చేశాను. ఇంజనీరింగ్ సమయంలోనే నాకు సినిమా పట్ల చాలా ఆసక్తి ఉండేది. థియేటర్స్ ప్లేస్ కోసం ఆడిషన్స్ ఇచ్చాను. కెమెరా ముందు నటించడం నాకు చాలా ఆనందాన్ని ఇచ్చే విషయం. కొన్ని టీవీ కమర్షియల్స్ కూడా చేశాను.అరుణ్ డైరెక్షన్ టీం నుంచి ఈ సినిమా కోసం ఆడిషన్ కాల్ వచ్చింది. తర్వాత అడిషన్ ఇచ్చాను. లుక్ టెస్ట్ చేసిన తర్వాత ఈ క్యారెక్టర్ కోసం ఓకే చేశారు. ఈ సినిమాలో చాలా రిలేటబుల్ క్యారెక్టర్ చేస్తున్నాను. అందరూ కనెక్ట్ అయ్యేలా ఉంటుంది. డైరెక్టర్ చాలా అద్భుతంగా క్యారెక్టర్ డిజైన్ చేశారు. ఈ సినిమా చాలా బ్యూటిఫుల్ ఎక్స్పీరియన్స్. షూటింగ్ చాలా ఎంజాయ్ చేశాను. విజయ్‌తో నటించడం చాలా మంచి ఎక్స్పీరియన్స్ డైరెక్టర్ ప్రొడ్యూసర్ అందరు చాలా సపోర్ట్ చేశారు. తెలుగు ఆడియన్స్ అన్ని రకాల సినిమాల్ని గొప్పగా ఆదరిస్తారు. సినిమాని గొప్పగా సెలబ్రేట్ చేసుకుంటారు. ఈ సినిమా కూడా ఆడియన్స్ మంచి ఎక్స్పీరియన్స్ ఇస్తుందని కోరుకుంటున్నాను. హీరోయిన్ రియా జిత్తు మాట్లాడుతూ.. నేను మలయాళీ. తమిళ్, మలయాళీ సినిమాలు చూస్తూ పెరిగాను. చైల్డ్ ఆర్టిస్ట్ గా నాకు అనుభవం ఉంది. దాదాపు 15 సినిమాలు చైల్డ్ ఆర్టిస్ట్‌గా చేశాను. సినిమాల నుంచి కొంత బ్రేక్ తీసుకొని చదువుపై దృష్టి పెట్టాను. చదువు పూర్తయిన తర్వాత మళ్లీ సినిమాల్లోకి వచ్చాను.విజయ్ ఆంటోనీ 25వ సినిమాలో భాగం కావడం చాలా ఆనందంగా ఉంది. ఆయన మ్యూజిక్ వింటూ పెరిగాను. ఆయన మ్యూజిక్ నాకు చాలా ఇష్టం. ఈ సినిమాలో ఒక డిఫరెంట్ క్యారెక్టర్ చేశాను. ఇప్పుడే ఎక్కువ రివిల్ చేయకూడదు. విజయ్ చాలా హంబుల్ పర్సన్. ఆయన నుంచి చాలా విషయాలు నేర్చుకున్నాను. డైరెక్టర్ అరుణ్ చాలా క్లారిటీ ఉన్న మేకర్. మాకు చాలా కాన్ఫిడెన్స్ ఇచ్చారు. ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా సినిమాని నిర్మించారు నిర్మాతలు. ఇది చాలా ఇంపాక్ట్ ఫుల్ కథ. ఇలాంటి కథ సొసైటీ కి చాలా అవసరం. తప్పకుండా ఈ సినిమా అందరికీ కనెక్ట్ అయ్యేలా ఉంటుంది.తెలుగు ఆడియన్స్ మంచి సినిమాలని ఆదరిస్తారు. భద్రకాళి కూడా చాలా ఇంపాక్ట్ ఫుల్ కంటెంట్ తో వస్తున్న సినిమా. తప్పకుండా అందరినీ అలరిస్తుందని కోరుకుంటున్నా న్నానని అన్నారు.

# ఎంగేజింగ్ హారర్ మిస్టరీ థ్రిల్లర్ "కిష్కింధపురి"



కౌశిక్ పెగల్లపాటి

"కిష్కింధపురి" చాలా ఎంగేజింగ్ హారర్ మిస్టరీ థ్రిల్లర్. ఆడియన్స్ కి ఎడ్జ్ ఆఫ్ సీట్ ఎక్స్‌పీరియెన్స్ ఇస్తుంది: డైరెక్టర్ కౌశిక్ పెగల్లపాటి బెల్లంకొండ సాయి శ్రీనివాస్ మిస్టీరియస్ అకల్ట్ థ్రిల్లర్ కిష్కింధపురి. అనుపమ పరమేశ్వరన్ హీరోయిన్ గా నటిస్తున్న ఈ చిత్రానికి కౌశిక్ పెగల్లపాటి దర్శకత్వం వహించారు. షైన్ స్క్రీన్స్ బ్యానర్‌పై సాహు గారపాటి నిర్మించారు. ఇప్పటికే విడుదలైన ప్రమోషనల్ కంటెంట్ సినిమాపై అంచనాలు పెంచింది. ఈ చిత్రం సెప్టెంబర్ 12న విడుదల కానుంది. ఈ సందర్భంగా డైరెక్టర్ కౌశిక్ పెగల్లపాటి విలేకరుల సమావేశంలో సినిమా విశేషాలు పంచుకున్నారు.

**ఈ ప్రాజెక్టు ఎలా స్టార్ట్ అయింది?**

ఒక సందర్భంలో నిర్మాత సాహుకి ఈ కథ చెప్పాను. ఆయనకి చాలా నచ్చింది. తర్వాత బెల్లంకొండ శ్రీనివాస్ విన్నారు. ఆయన చాలా ఎక్సైట్ అయ్యారు. అందరికీ కథ నచ్చడంతో ప్రాజెక్ట్ ని మొదలుపెట్టాం.

**హారర్ సినిమానే చెప్పాలని ఎందుకు అనిపించింది?**

నాకు హారర్ సినిమా చాలా ఇష్టం, ఆ జానెర్ కి ఒక సపరేట్ ఫ్యాన్ బేస్ ఉంటుంది. హారర్ ని ఇష్టపడే ఆడియన్స్ కి నచ్చేలా ఒక కథ చేయాలని ఎప్పటినుంచో ఉండేది. కిష్కిందపురి హారర్ మిస్టరీ రెండు బ్లెండ్ అయిన సినిమా. ఇందులో ఎడ్జ్ ఆఫ్ ది సీట్ థ్రిల్లింగ్ ఎలిమెంట్స్ చాలా వున్నాయి.

ఈ కథ విన్న తర్వాత సాయి శ్రీనివాస్ ఎలా రియాక్ట్ అయ్యారు?

ఈ కథ ఆయనకు చాలా నచ్చి. సాయి యాక్షన్ హల్క్ హీరో. ఆయన ఈ కథ విని ఉన్నది ఉన్నట్లుగా తీయమని చెప్పారు. మేము ఏదైతే అనుకున్నామో అది స్క్రీన్ మీదకి అద్భుతంగా వచ్చింది. కథ, విజువల్, టెక్నికల్ గా ఆడియన్స్ కి ఒక మంచి ఎక్స్పీరియన్స్ ఇవ్వాలని సాయి మొదటి నుంచి నన్ను చాలా సపోర్ట్ చేశారు.

**కిష్కిందపురి టైటిల్ జస్టిఫికేషన్ ఏమిటి?**

కిష్కింధపురి అంటే మనకి రామాయణం గుర్తొస్తుంది. ఈ కథకి స్ఫూర్తి రామాయణం. అయితే ఆ స్ఫూర్తి చాలా మెటాఫర్‌గా వుంటుంది. **అనుపమ క్యారెక్టర్ గురించి?**

అనుపమ ఇప్పటివరకు చేయని క్యారెక్టర్ చేశారు. ఇందులో హీరో హీరోయిన్ క్యారెక్టర్స్ నేను చూసిన రియల్ లైఫ్ ఇన్సిడెంట్ ఇన్స్పిరేషన్‌గా తీసుకున్నాను. ఇద్దరు కూడా కొత్తగా కనిపిస్తారు. సాయి అనుపమ కాంబినేషన్లో వచ్చిన రాక్షసుడు సూపర్ హిట్ కదా.

**ఈసినిమా అంచనాలను అందుకుంటుందా?**

ఒక సెన్సిబుల్, మంచి సినిమా చేశామని నమ్మకం ఉంది.కచ్చితంగా వర్కౌట్ ఉందనే వర్క్ అవుట్ అవుతుందనే నమ్ముతున్నాం.

9-9Pg5 9_9-9Pg5.qxd 9/8/2025 10:17 PM Page 1



# అమెరికాకు మిత్రుడైనా భారత్‌కు శత్రువే!

## ప్రధానిమోడీపై ఎఐసిసి చీఫ్ ఖర్గే విసుర్లు



**న్యూఢిల్లీ, సెప్టెంబరు 8:** భారత ప్రధాని నరేంద్ర మోడీ మన దేశానికి శత్రువంటూ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే విమర్శించారు. అమెరికా సుంకాల అంశాన్ని ప్రస్తావిస్తూ, ఆ దేశ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మోడీ మళ్లీ స్నేహితులను కావొచ్చని వ్యాఖ్యానించారు. మోడీ, ట్రంప్ పరస్పరం ఓట్లు కోరినందున ఒకరికొకరు మంచిగా ఉండవచ్చని అన్నారు. ఈ మేరకు కర్ణాటకలోని కలబురిగిలో పలు వ్యాఖ్యలు చేశారు. మోడీ ట్రంప్ పొత్తు భారతదేశం ఖర్చుతో వచ్చిందని ఖర్గే పేర్కొన్నారు. మీరు మీ సిద్ధాంతాల ప్రకారం నడుచుకోండి. కానీ దేశ ప్రజలనురక్షించండి. ఎందుకంటే దేశం ముందు. మీస్నేహం ద్వితీయంఅని ఆయననొక్కి చెప్పారు. భారతదేశం దశాబ్దాలుగా తటస్థత, అలీన విదేశాంగ విధానాన్ని అనుసరిస్తోందని, అది ఆ మార్గంలోనే కొనసాగాలని ప్రధానమంత్రిని ఖర్గే కోరారు. సవరించిన జిఎస్టీ రేట్లపై, పేదలకు ప్రయోజనం చేకూర్చే ఏ చర్యనైనా కాంగ్రెస్ స్వాగతిస్తుందని ఖర్గే అన్నారు. కానీ బిజెపి ప్రభుత్వం సంవత్సరాలుగా ప్రజలను హింసిస్తోందని ఆరోపించారు. మేం ఆ అంశాన్ని ఎనిమిదేళ్ల క్రితం లేవనెత్తాం. రెండు శ్లాబులు ఉంటే అది పేద ప్రజలకు ప్రయోజనం చేకూరుస్తుందని మేం చెప్పాం. కానీ వారు నాలుగు నుంచి ఐదు శ్లాబులను ప్రవేశపెట్టి ప్రజలను దోచుకున్నారు. ఎన్నికలు సమీపించిన తర్వాత కొన్ని ఇబ్బందులను ఎదుర్కొని జిఎస్టీ శ్లాబులను సవరించారని ఆయన పేర్కొన్నారు. చైనా చొరబాటు సమయంలో ఎవరూ భారత భూభాగంలోకి ప్రవేశించలేదని మోడీ గతంలో చేసిన వాదనను కూడా ఖర్గే ప్రస్తావించారు. ఇప్పుడు మోడీ స్వయంగా చైనాలోకి ప్రవేశించారని ఎద్దేవా చేశారు. జాతీయ ప్రయోజన సమస్యలపై ప్రతిపక్షాలు ఐక్యంగా ఉన్నప్పటికీ, మోడీమద్దతును దుర్వినియోగం చేయడానికి అది అనుమతించదని తేల్చిచెప్పారు కాంగ్రెస్అధ్యక్షుడు. దేశం విషయానికి వస్తే మేం ఒక్కటే. అందులో ఎటువంటి సందేహంలేదు. కానీ మేం మీకు మద్దతు ఇస్తున్నందున, మీరు ఏదైనా ఏకపక్షంగా చేయాలని దాని అర్థం కాదు. మేం దీన్ని నమ్మం అని ఆయన అన్నారు. ట్రంప్‌తో బహిరంగంగా పొత్తు పెట్టుకోవడంద్వారా భారత్‌అంతర్జాతీయ ఖ్యాతిని మోడీదెబ్బతీశారని ఖర్గే ఆరోపించారు. ఆయన భారత్ స్థానాన్ని పాడు చేశారని ఆరోపించారు. బీహార్‌లో రాబోయే ఎన్నికలలో కాంగ్రెస్ హైలైట్ చేయాలని యోచిస్తున్న అంశాలను ఖర్గే వెల్లడించారు. మాకు చాలా సమస్యలు ఉన్నాయి. నిరుద్యోగం, శాంతిభద్రతలు, మహిళలపై లైంగిక దాడులు, దళితులు వెనుకబడిన తరగతులకు స్కాలర్‌షిప్‌లు అందడం లేదు. రైతులకు ఎరువులు అందడం లేదు. ఓట్ల చోరీ అంశం కూడా మా ప్రధాన ఎజెండా అని కాంగ్రెస్ అధ్యక్షుడు తెలిపారు. కర్ణాటకలోని కాంగ్రెస్ ప్రభుత్వం బ్యాలెట్ పేపర్లను ఉపయోగించి స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలనినిర్ణయించడం మంచిదేననితెలిపారు. మేం దీనిని డిమాండ్ చేస్తున్నాం. రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికల్లో దీనిని ప్రవేశపెట్టింది.



## సోషల్ మీడియా నిషేధంపై నేపాల్‌లో తీవ్ర ఆందోళనలు

### ఇరవై మంది మృతి

**కఠ్మాండూ, సెప్టెంబరు 8:** నేపాల్‌లో సోషల్ మీడియాపై నిషేధం హింసకు దారి తీసింది. సోమవారం కెపి శర్మఓలీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా యువత చేపట్టిన ఆందోళన హింసాత్మకంగా మారింది. ఈ ఆందోళనల్లో ఇప్పటివరకు 20మంది ప్రాణాలుకోల్పోగా.. 300 మందికి పైగా గాయపడ్డారు. ఆందోళనకారులు నేపాల్ పార్ల మెంట్ వద్ద దూసుకొస్తున్న క్రమంలో భద్రతా దళాలతో ఘర్షణ జరిగింది. దీంతో కాల్పులు జరిపి ఆందోళనకారులను అదుపు చేయాల్సి వచ్చింది. వేలమంది యువతతో కఠ్మాండూ జనసముద్రంగా మారిపోయింది. పోలీసులు ప్రకటించిన నిషేధిత జోన్లను కూడా వారు లెక్కచేయలేదు. గడువులోపల కమ్యూనికేషన్లు, సమాచార సాంకేతిక శాఖ వద్ద రిజిస్టర్ కానందుకు ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, వాట్సప్, యూట్యూబ్, ఎక్స్, రెడిట్, లింక్డిన్ వంటి సామాజిక మాధ్యమాలపై నేపాల్ ప్రభుత్వం గత గురువారం నిషేధం విధించింది. ఈ మాధ్యమాలు ఆగస్టు 28 నుంచి ఏడురోజుల్లోగా రిజిస్టర్ కావాల్సి ఉంది. ఈ గడువు బుధవారం రాత్రి తీరిపోయినా అవి రిజిస్టర్ కాలేదు. టిక్‌టాక్, వైబర్, విట్క్, నింబజ్, పోపో లైవ్ మాత్రం రిజిస్టర్ అయ్యాయి. టెలిగ్రామ్, గ్లోబల్ డైరీలు రిజిస్ట్రేషన్ కోసం దరఖాస్తు చేశాయి. వాటికి ఆమోదం తెలిపే ప్రక్రియ నడుస్తోంది. ఫేస్‌బుక్ తదితర సామాజిక మాధ్యమాలపై ప్రభుత్వ నిషేధం వల్ల చదువు కోసమో, సంపాదన కోసమో విదేశాల్లో ఉంటున్న 70 లక్షల మంది నేపాలీ యువత స్వదేశంలో కుటుంబ సభ్యులతో, బంధుమిత్రులతో సంభాషించే అవకాశం కోల్పోతారు. ప్రభుత్వ నిషేధం భావప్రకటన, పత్రికా స్వేచ్ఛకు భంగకరమనీ, రాజ్యాంగ భరోసా ఇచ్చిన సమాచార హక్కునూ కాలరాస్తోందని నేపాల్ పాత్రికేయుల సమాఖ్య విమర్శించింది.



## రష్యాపై రెండోదశ ఆంక్షలు విధించేందుకు మేం రెడీ

### అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్

**వాషింగ్టన్, సెప్టెంబరు 8:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ రష్యాకు వ్యతిరేకంగా రెండోదశ ఆంక్షలు విధించేందుకు సిద్ధంగా ఉన్నామని ప్రకటించారు. క్రెమ్లిన్ నుంచి చమురు కొనుగోలు చేసే భారత్ సహా ఇతర దేశాలపై రెండో దశ ఆంక్షల ప్రభావం పడనున్నట్లు వెల్లడించారు. ఉక్రెయిన్‌పై రష్యా నిన్న భీకర దాడికి పాల్పడిన విషయం తెలిసిందే. ఈ దాడిలో కీవ్‌లోని కీలకమైన ప్రభుత్వ సముదాయాన్ని మాస్కో దళాలు ధ్వంసం చేశాయి. ఈ దాడి తర్వాత ట్రంప్ నుంచి రెండో దశ ఆంక్షల ప్రకటన వెలువడింది. రష్యా దాడి నేపథ్యంలో వైట్‌హౌస్‌లో జరిగిన మీడియా సమావేశంలో విలేకరులు ట్రంప్‌కు పలు పశ్నలు సంధించారు. రష్యా లేదా చమురు కొనుగోలు చేసే దేశాలపై చర్యలు తీసుకుంటారా అని అధ్యక్షుడిని ప్రశ్నించారు. దీనికి 'అవును, అందుకు సిద్ధంగా ఉన్నాం' అంటూ ట్రంప్ సమాధానమిచ్చారు. యుద్ధం ఆపి, ఉక్రెయిన్‌తో శాంతి చర్చలకు వచ్చేలా రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌పై ఒత్తిడి తెచ్చే వ్యూహంలో భాగంగా, ఆ దేశం నుంచి చమురును దిగుమతి చేసుకుంటున్న దేశాలపై మరోసారి సుంకాలతో పాటు ఆంక్షలను విధించాలని వాషింగ్టన్, దాని యూరోపియన్ మిత్ర దేశాలు యోచిస్తున్నట్టు యూఎస్ ట్రెజరీ సెక్రటరీ స్కాట్ బీసెంట్ ప్రకటించిన విషయం తెలిసిందే. అమెరికా, యూరోపియన్ యూనియన్లు జోక్యంచేసుకుని రష్యన్ చమురు కొనుగోలుచేసే దేశాలపై ఆంక్షలు, టారిఫ్‌లు విధించగలిగితే రష్యన్ ఆర్థిక వ్యవస్థ పూర్తిగా కుప్పకూలిపోవడమే కాక, అది రష్యా అధ్యక్షుడు పుతిన్‌ను చర్చలకు తీసుకువస్తుందని ఆయన అన్నారు.

## పునరుత్పాదక విద్యుత్ రంగంలో అదానీ 60 బిలియన్ డాలర్ల పెట్టుబడులు!



**న్యూఢిల్లీ, సెప్టెంబరు 8:** ప్రముఖ పారిశ్రామికవేత్త గౌతమ్ అదానీ నేతృత్వంలోని అదానీ గ్రూప్ విద్యుత్ రంగంలో ముఖ్యంగా పునరుత్పాదక శక్తి, ఉత్పత్తి, పంపిణీలో 2032 వరకు దాదాపు 60 బిలియన్ డాలర్ల పెట్టుబడి పెట్టాలని చూస్తోంది. 2025 ఆర్థిక సంవత్సరం నాటికి 14.2 గిగావాట్లనుంచి పునరుత్పాదక ఇంధన సామర్థ్యాన్ని 50 గిగా వాట్లకు పెంచడానికి 2030 నాటికి గ్రూప్ 21 బిలియన్ డాలర్ల పెట్టుబడిని ప్లాన్ చేస్తోందని పెట్టుబడిదారుల ప్రజెంటేషన్‌లో అదానీ పవర్ తెలిపింది. అదానీ గ్రూప్‌లో భాగమైన అదానీ గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్ యుటిలిటీస్కేల్ గ్రిడ్‌కనెక్ట్ చేయబడిన సౌర, పవన విద్యుత్ ప్రాజెక్టులను అభివృద్ధి చేస్తుంది. అదానీ ఎనర్జీ సొల్యూషన్స్ లిమిటెడ్ ద్వారా ట్రాన్స్‌మిషన్, పంపిణీ సామర్థ్యాలను నిర్మించడంలో ఈ గ్రూప్ 17 బిలియన్ డాలర్లు పెట్టుబడి పెట్టనుంది. పవర్ డొమైన్‌లోని వివిధకోణాల్లో అంటే పవర్ ట్రాన్స్‌మిషన్, డిస్ట్రిబ్యూషన్, స్మార్ట్ మీటరింగ్, కూలింగ్ సొల్యూషన్స్‌లో ఉనికిని కలిగి ఉన్న ఒక బహుళ సంస్థ. ఈ ఏడాది మార్చి 31 నాటికి 19,200 కి.మీ.గా ఉన్న భారతదేశపు పెరుగుతున్న ఇంధన అవసరాలను తీర్చడానికి, 2030 ఆర్థిక సంవత్సరం నాటికి 30,000 కి.మీ.ల ట్రాన్స్‌మిషన్ లైన్లను ఏర్పాటు చేయాలని కంపెనీ చూస్తోంది. 2025 ఆర్థిక సంవత్సరంలో 17.6 బిజూగా ఉన్న విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని 41.9 గిగా వాట్లకు పెంచుకునేందుకు, 2032 ఆర్థిక సంవత్సరంనాటికి అదానీ పవర్‌ద్వారా 22 బిలియన్ డాలర్లు పెట్టుబడి పెట్టాలని గ్రూప్ చూస్తోంది. అదానీ పవర్ భారతదేశంలో అతి పెద్ద ప్రైవేట్ థర్మల్ విద్యుత్ ఉత్పత్తిదారు, ఇది గుజరాత్, మహారాష్ట్ర, కర్ణాటక, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, జార్ఖండ్, తమిళనాడులలో విస్తరించిఉన్న సామర్థ్యాలతో, గుజరాత్‌లో 40 మెగావాట్ల సౌర విద్యుత్ ప్రాజెక్టును కలిగిఉంది. భారత్ ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న విద్యుత్ మార్కెట్లలో ఒకటిఅని అదానీగ్రూప్ తెలిపింది. ఇక్కడ మొత్తం స్థాపిత సామర్థ్యం 11 శాతం వృది ఉంటుందని, 2025లో 475 గిగావాట్లనుండి 2032నాటికి 1,000గిగావాట్లకి చేరుకుంటుందని అంచనా.

## స్థానికుల భుజాలపై ఎక్కి ఎంపి వరద ప్రాంతాల పర్యటన!

**కతిహార్(బీహార్), సెప్టెంబరు 8:** కుండపోత వర్షాలతో బీహార్‌లోని కతిహార్‌జిల్లా అతలా కుతలమైంది. ఎడతెగని వర్షాలవల్ల అక్కడి లోతట్టు ప్రాంతాలన్నీ నీట మునిగాయి. ఈ క్రమంలో కాంగ్రెస్ ఎంపీ తారీఖ్ అన్వర్ వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించడం వివాదాస్పదమైంది. ఎంపీ వరద నీటిలో దిగకపోవడంతో గ్రామస్థులు వీపులపై మోసుకెళ్లిన విడియోలు వైరల్ అయి రాజకీయ పార్టీలకువిమర్శనాస్త్రాలు లభించాయి. అయితే ఆ విమర్శలను కాంగ్రెస్ పార్టీ తోసిపుచ్చింది. ఎంపీకి అస్వస్థతగా ఉండటంతో గ్రామస్థులు మోసుకెళ్లారని వ్యాఖ్యానించింది. తారీఖ్ అన్వర్ కతిహార్ ఎంపీగా వ్యవహరిస్తున్నారు. వరదలు రావడంతో పరిస్థితిని పరిశీలించేందుకు రెండ్రోజులపాటు ఆయన తన నియోజకవర్గంలో పర్యటించారు. అందుకోసం పలు రకాల రవాణా సౌకర్యాలను వినియోగించారు. ట్రాక్టర్, పడవలో వెళ్లి వరద బాధితులను కలిశారు. ఈ సందర్భంగా ఓ చోట బురదగా ఉండటంతో గ్రామస్థులు ఆయనను వీపులపై మోసుకెళ్లారు. దీనిపై రాజకీయ విమర్శలు వచ్చాయి. ఈ వీడియోపై కతిహార్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు సునీల్ యాదవ్ స్పందించారు. ఎంపీ అన్వర్‌కు ఆరోగ్యం బాగాలేదు కాబట్టే గ్రామస్థులు మోసుకెళ్లారనిచెప్పారు. తాము ట్రాక్టర్, బోటు, బైకులపై గ్రామాల్లో పర్యటించామని తెలిపారు. ఒకచోట బురద కారణంగా తాము ప్రయాణిస్తున్న ట్రక్ నిలిచిపోయిందని, అక్కడి నుంచి

## అమెరికా స్టోర్లలో దేశం పరువుతీస్తున్న భారత్ మహిళలు

**వాషింగ్టన్, సెప్టెంబరు 8:** అమెరికాలోని ప్రముఖ 'టార్గెట్' సూపర్ మార్కెట్లలో భారతీయ మహిళలు షాప్‌లిఫ్టింగ్ చేస్తూ పట్టుబడుతున్న ఘటనలు కలకలం రేపుతున్నాయి. పోలీసుల బాడీక్యామ్‌లలో రికార్డయిన ఈ దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఓ సందర్భంలో భారత్‌లో దొంగతనాలు చేయడానికి అనుమతి ఉందా అని ఓ పోలీస్ అధికారి అడిగిన ప్రశ్న చర్చనీయాంశంగా మారింది. ఇటీవల ఇల్లినాయిస్‌లోని ఓ టార్గెట్ స్టోర్‌లో సుమారు రూ. 1.1 లక్షల విలువైన సరుకులతో ఓ భారతీయ మహిళ పట్టుబడింది. ఆమె ఏడు గంటలకు పైగా స్టోర్‌లోనే గడిపి, చివరకు బిల్లుచెల్లించకుండా కార్ట్‌తో బయటకు వెళ్లేందుకు ప్రయత్నించింది. సిబ్బంది సమాచారంతో అక్కడికి చేరుకున్న పోలీసులు ఆమెను ప్రశ్నించారు. ఆ సమయంలో ఆమె, నన్ను క్షమించండి. నేను ఈ దేశానికి చెందినదాన్ని కాదు. ఇక్కడ ఉండనని వేడుకుంది. దీనికి స్పందించిన ఓ అధికారి, అయితే భారత్‌లో దొంగతనాలు చేయొచ్చా నేనలా అనుకోవడం లేదు అని ఘాటుగా ప్రశ్నించారు. అనంతరం ఆమెకు బేడీలు వేసి స్టేషన్‌కు తరలించారు.

ఈ ఏడాది జనవరి 15న జరిగిన మరో ఘటనలో, గుజరాతీ మాట్లాడే మరో భారతీయ మహిళ ఇలాగే టార్గెట్ స్టోర్‌లో పట్టుబడింది. పోలీసుల విచారణ సమయంలో ఆమె తీవ్రంగా ఏడుస్తూ, ఉక్కిరిబిక్కిరైంది. దీంతో పోలీసులు ఆమెను శాంతపరిచే ప్రయత్నం చేశారు. తాను తీసుకున్న వస్తువులను తిరిగి అమ్ముకోవడానికి ఈ పని చేసినట్టు ఆమె అంగీకరించింది.

## బిజెపి ఎంపీ సోదరికీ తప్పని గృహహింస



### అత్తింటి వేధింపులపై పోలీసులకు ఫిర్యాదు

**లక్నో, సెప్టెంబరు 8:** ప్రజా ప్రతినిధుల కుటుంబ సభ్యులకు గృహహింస తప్పడం లేదు. అత్తింటి వారి అకృత్యాలను నిలదీసినందుకు చిత్రహింసలకు గురిచేస్తున్నారు. ఎలాగైనా వదిలించుకోవాలని ఆమెను బజార్లోకి గుంజి అందరూ చూస్తుండగా కర్రలు, లాఠీలతో కొడుతున్నారు. గత కొన్ని నెలలు ఇది జరుగుతున్నా చుట్టుపక్కల వారు చోద్యం చూస్తున్నారే తప్ప అడ్డుకోలేకోకపోవడం గమనార్హం. వేధింపులు ఆగకపోవడంతో బాధితురాలు కేసు పెట్టడంతో వెలుగులోకి వచ్చింది. ఉత్తరప్రదేశ్‌లోని ఫరూఖాబాద్ బిజెపి ఎంపీ ముకేశ్ రాజ్‌పుత్ సోదరి రీనా రాజ్‌పుత్‌కు 17 ఏండ్ల క్రితం ఇటా జిల్లా రాణి అవంతిబాయి నగర్‌కు చెందిన వ్యక్తితో వివాహం జరిగింది. వారికి ఓ కూతురు ఉన్నది. అయితే గత కొంతకాలంగా రీనా రాజ్‌పుత్‌పై అత్తింటివారు వేధింపులకు పాల్పడుతున్నారు. ఆమెను ఇంట్లో నుంచి బయటకు వెళ్లగొట్టాలనుకున్నారు. ఇందులో భాగంగా ఆమె స్నానం చేస్తుండగా మామ, బావ కలిసి రహస్యంగా వీడియో తీశారు. గుర్తించిన ఆమె వారిని ప్రశ్నించడంతో మామ ఆమెను తుపాకీతో కొట్టాడు. అతనినుంచి తప్పించుకోవడానికి ప్రయత్నించగా, తన బావమరిది వీధిలో ఇనుప రాడ్‌తో విచక్షణా రహితంగా కొట్టాడు. ఓపిక నశించిన ఆమె వారి అకృత్యాలను నిలదీయడంతో ఆగ్రహించిన మామ ఇంట్లో నుంచి బయటకు గుంజుకొచ్చి కర్రతో తీవ్రంగా కొట్టారు. దీంతో ఆమె స్థానిక పోలీసులను ఆశ్రయించారు. లాఠీలు, కర్రలతో తరచూ కొడుతున్నారని, తన కూతురిని కూడా హింసించారని తన ఫిర్యాదులు పేర్కొన్నారు. తనకు న్యాయం చేయాలని, భవిష్యత్‌లో ఎలాంటి హానీ జరగకుండా చూడాలని అధికారులను కోరారు. కాగా, బాధితురాలు అధికార పార్టీకి చెందిన ఎంపీ కావడంతో తీవ్ర చర్చనీయాంశమైంది.

## తేజస్వి భార్య ఒక జెర్సీ ఆవులాంటిది!

### సొంతపార్టీ ఎమ్మెల్యే రాజ్ వల్లభ్ యాదవ్ విమర్శలు

**పాట్నా, సెప్టెంబరు 8:** బీహార్‌లో ఎన్నికల వేడి రాజుకుంటున్న వేళ రాష్ట్రీయ జనతా దళ్ (ఆర్జేడీ) మాజీ ఎమ్మెల్యే రాజ్ బల్లభ్ యాదవ్ చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపుతున్నాయి. ఆర్జేడీ నేత తేజస్వి యాదవ్ భార్య రాజశ్రీని ఉద్దేశించి ఆయనచేసిన జెర్సీ ఆవు అని చేసిన వ్యాఖ్య రాజకీయంగా ప్రకంపనలు సృష్టిస్తోంది. నార్దిగంజ్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో రాజ్ బల్లభ్ మాట్లాడుతూ తేజస్వి యాదవ్‌పై విమర్శలు గుప్పించారు. తేజస్వి యాదవ్ మన కులం అమ్మాయిని పెళ్లి చేసుకుని ఉంటే బాగుండేది. సమాజంలోని ఓ బిడ్డకు మేలు జరిగేది. కానీ ఆయన హర్యానాపంజాబ్ నుంచి ఎవరో ఒకరిని తీసుకొచ్చారు, ఆమె ఓ జెర్సీ ఆవులా ఉందఅని తీవ్రమైన వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యాఖ్యలపై ఆర్జేడీ మహిళావిభాగం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. నవాడాలో జిల్లా ఆర్జేడీ మహిళా విభాగం అధ్యక్షురాలు రేణుసింగ్ నేతృత్వంలో నిరసన చేపట్టారు. సద్భావనా చౌక్ వద్ద రాజ్ బల్లభ్ యాదవ్ దిష్టిబొమ్మను దగ్ధం చేసి, ఆయనకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా రేణు సింగ్ మాట్లాడుతూ.. తేజస్వి భార్య రాజశ్రీని జెర్సీ ఆవు అని పిలవడం ద్వారా రాజ్ బల్లభ్ యాదవ్ కేవలం ఆమెను మాత్రమే కాదు, యావత్ మహిళా లోకాన్నే అవమానించారు. దీన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోం అని హెచ్చరించారు. మహిళల పట్ల అవమానాలను భారతదేశం సహించదంటూ నిరసనకారులు నినాదాలు చేశారు. గతంలో ఆర్జేడీలో ఉన్న రాజ్ బల్లభ్ యాదవ్‌కు వివాదాస్పద చరిత్ర ఉంది. 2016లో బాలికపై అత్యాచారం కేసులో ఆయన జైలుకు వెళ్లారు. దీంతో ఆయన్ను పార్టీ నుంచి బహిష్కరించారు. అయితే, ఇటీవలే పట్నా హైకోర్టు ఈ కేసులో ఆయన్ను నిర్దోషిగా ప్రకటించింది.

## భారత్ వంటి దేశాలపై ఆంక్షలు అవసరమే



### ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ

**కీవ్, సెప్టెంబరు 8:** రష్యా నుంచి చమురు కొనుగోళ్లు చేసే భారత్ వంటి దేశాలపై ఆంక్షలు విధించడం సరైన నిర్ణయమేనని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ వ్యాఖ్యానించారు. మాస్కో-కీవ్ మధ్య సంధి కుదిర్చేందుకు భారత్ దౌత్య యత్నాలు చేస్తున్నా ఆయన నుంచి ఇటువంటి వ్యాఖ్యలు రావడం గమనార్హం. జెలెన్‌స్కీ ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ 'రష్యాతో వ్యాపార లావాదేవీలు చేస్తున్న దేశాలపై టారిఫ్‌లు విధించడం సరైన చర్యే' అని పేర్కొన్నారు. ఇటీవల షాంఘై సహకార సంస్థ సదస్సు సందర్భంగా ప్రధాని మోడీ తియాంజెన్‌లో చైనా అధినేత జిన్‌పింగ్, రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో కలిసి వేదిక పంచుకోవడంపై స్పందిస్తూ ఈ వ్యాఖ్యలు చేశారు. అలాస్కాలో ట్రంప్-పుతిన్ చర్చలు విఫలమైన నేపథ్యంలో రష్యాపై మరిన్ని ఆంక్షలు విధించేందుకు అమెరికా సిద్ధమవుతోంది. ఈ నేపథ్యంలో జెలెన్‌స్కీ ప్రకటన వెలువడటం గమనార్హం. నేషనల్ ఎకనామిక్ కౌన్సిల్ డైరెక్టర్ కెవిన్ హస్సెట్ మాస్కోపై మరిన్ని సరికొత్త ఆంక్షలు విధిస్తారని వెల్లడించారు. 'ఉక్రెయిన్‌పై రష్యా చేస్తున్న యుద్ధంలో సహకరించే వారిపై ఆంక్షలు అమలయ్యేలా చూసే బాధ్యత మాదే. ఉదాహరణకు భారత్ ఇంకా రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తోంది. ఈ నేపథ్యంలో దీనిపై స్పందించేందుకు మేము సిద్ధంగా ఉన్నాం. ఆంక్షల స్థాయి.. వాటిని విధించిన సమయంపై ప్రస్తుతం, భవిష్యత్తులో కూడా మాట్లాడుకొంటారు' అని పేర్కొన్నారు.

ఇటీవల కాలంలో ఉక్రెయిన్‌తో యుద్ధాన్ని ముగించాలని భారత్ కూడా ప్రయత్నాలు చేస్తోంది. ప్రధాని మోడీ అటు పుతిన్, ఇటు జెలెన్‌స్కీతో చర్చలు జరుపుతున్నారు. గత నెల రెండో వారంలో పుతిన్‌తో భేటీకి ముందు ఉక్రెయిన్ అధినేతతో మాట్లాడారు. 'ఉక్రెయిన్‌కు సంబంధించి ఇటీవలి పరిణామాలపై జెలెన్‌స్కీతో మాట్లాడి, ఆయన అభిప్రాయాలు తెలుసుకున్నారు. ఈ వివాదాన్ని వీలైనంత త్వరగా, శాంతియుతంగా పరిష్కరించడంపై భారత్ స్థిరమైన వైఖరి గురించి తెలియజేశారు. యుద్ధం ముగింపు విషయంలో సాధ్యమైన సహకారాన్ని అందించేందుకు, ఉక్రెయిన్‌తో ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేసుకునేందుకు భారత్ కట్టుబడి ఉంది' అని ప్రధాని మోడీ ట్వీట్ చేశారు. తామిద్దరం కీలక అంశాలపై వివరంగా చర్చించినట్లు జెలెన్‌స్కీ సైతం పేర్కొన్నారు. అయినా ఆయన నుంచి భారత్‌పై ప్రతికూల ప్రకటన వెలువడటం గమనార్హం.

## సంక్షిప్తంగా..

### ముంబయి బీచ్‌లో అక్షయ్, సిఎం భార్య క్లీన్ అండ్‌గ్రీన్



**ముంబయి, సెప్టెంబరు 8:** గణేశ్ నిమజ్జనం అనంతరం ముంబైలోని సముద్ర తీరాలు చెత్తతో నిండిపోవడం తెలిసిందే. ఈ నేపథ్యంలో, పర్యావరణ పరిరక్షణకు నడుం బిగించిన బాలీవుడ్ స్టార్ అక్షయ్ కుమార్, మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్ భార్య అమృత ఫడ్నవీస్ స్వయంగా చెత్తను తొలగించి అందరికీ ఆదర్శంగా నిలిచారు. ప్రస్తుతం ఈ క్లీన్ అండ్‌గ్రీన్ వీడియో సోషల్ మీడియాలో అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. మహారాష్ట్రలో అత్యంత వైభవంగా జరిగే గణేశ్ ఉత్సవాల అనంతరం, ముఖ్యంగా అనంత చతుర్దశి రోజున, జుహు, గిర్గావ్ వంటి ప్రధాన బీచ్‌లలో నిమజ్జనం పెద్ద ఎత్తున జరుగుతుంది. దీనివల్ల విగ్రహాల అవశేషాలు, పూలు, ఇతర పూజా సామగ్రితో తీర ప్రాంతాలు కలుషితమవుతాయి. ఈ సమస్యను పరిష్కరించేందుకు దివ్య ఫౌండేషన్, బృహన్ ముంబై మున్సిపల్ కార్పొరేషన్ (బీఎంసీ) కలిసి జుహు బీచ్‌లో ఈ పరిశుభ్రతా కార్యక్రమాన్ని చేపట్టాయి. ఈ క్లీనింగ్ డ్రైవ్‌లో అక్షయ్ కుమార్, అమృత ఫడ్నవీస్‌తో పాటు బిఎంసీ కమిషనర్ డాక్టర్ భూషణ్ గగ్రాని కూడా పాల్గొన్నారు.

### భారత్‌లో పర్యటిస్తున్న ఇజ్రాయెల్ ఆర్థిక మంత్రి

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 8:** ఇజ్రాయెల్ ఆర్థిక మంత్రి బెజలెల్ స్మోట్రిచ్ భారత పర్యటనకు రానున్నారు. సోమవారం నుంచి మూడు రోజులపాటు బెజలెల్ స్మోట్రిచ్ భారత్‌లో పర్యటిస్తారని భారత విదేశాంగ శాఖ వర్గాలు తెలిపాయి. రెండు దేశాల మధ్య కొంత కాలం నుంచి ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేసుకోవాలనే విషయంలో చర్చలు జరుగుతున్నాయని పేర్కొన్నాయి. ఇజ్రాయెల్ ఆర్థిక మంత్రి భారత పర్యటన సందర్భంగా భారత్‌ఇజ్రాయెల్ 'ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం పై సంతకం చేసే అవకాశం ఉంది. ఇరుదేశాల మధ్య స్వేచ్ఛాయుత వాణిజ్య ఒప్పందం దిశగా అడుగులు పడనున్నట్లు అంతర్జాతీయ మీడియా వర్గాలు వెల్లడించాయి. పర్యటనలో భాగంగా స్మోట్రిచ్ గాంధీనగర్‌లోని భారతదేశ ప్రపంచ ఆర్థికసేవల కేంద్రాన్ని సైతం సందర్శించనున్నారు. బెజలెల్ స్మోట్రిచ్,ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, వాణిజ్య పరిశ్రమల మంత్రి పీయూష్ గోయల్, గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్‌లతో భేటీ కానున్నట్లు అధికారులు చెప్పారు.

### ట్రంప్ ఆనాటి తీరును ఎన్నటికీ మరువలేం: శశిథరూర్



**న్యూఢిల్లీ, సెప్టెంబరు 8:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్‌తో సంబంధాలపై సానుకూలంగా మాట్లాడటం, ప్రధాని నరేంద్రమోడీ వెంటనే స్పందించడంపై కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ కీలక వ్యాఖ్యలుచేసారు. ప్రధాని మోడీ త్వరగానే స్పందించినప్పటికీ రెండు దేశాల ప్రభుత్వాలు, దౌత్యవేత్తలు చేయాల్సిన తీవ్రమైన మరమ్మతులు మిగిలే ఉన్నాయని అన్నారు. భారత్ విషయంలో ట్రంప్ తన స్వరాన్ని తగ్గించడాన్ని జాగ్రత్తగా స్వాగతిస్తున్నామని థరూర్ చెప్పారు. భారతీయులు ఎదుర్కొన్న పరిణామాలను దృష్టిలో ఉంచుకుంటే ట్రంప్‌వల్ల కలిగిన బాధను, అవమానాన్ని త్వరగా మర్చి పోలేమని అన్నారు. అధ్యక్షుడు, ఆయన సిబ్బంది చేసిన అవమానాలు చాలా ఉన్నాయని తెలిపారు. ట్రంప్ పాదరస స్వభావం కలిగిన వ్యక్తని థరూర్ అభివర్ణించారు. 'ప్రధాని నరేంద్రమోడీ చాలా త్వరగా స్పందించారు. సమగ్ర ప్రపంచ వ్యూహాత్మక భాగస్వామ్యం అనే ప్రాథమిక సంబంధం గురించి విదేశాంగ మంత్రి కూడా నొక్కి చెప్పారు.

### సల్మాన్‌ఖాన్ ఒక గూండా : అభినవ్ కశ్యప్

**ముంబయి, సెప్టెంబరు 8:** బాలీవుడ్ కండల వీరుడు సల్మాన్ ఖాన్‌పై దబాంగ్ చిత్ర దర్శకుడు అభినవ్ కశ్యప్ సంచలన ఆరోపణలు చేశారు. సల్మాన్ ఖాన్ ఒక గూండా అని, అతడో చెడ్డ వ్యక్తి అని తీవ్ర వ్యాఖ్యలు చేయడం పరిశ్రమలో కలకలం రేపుతోంది. ప్రముఖ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో అభినవ్ ఈ వ్యాఖ్యలు చేశారు. సల్మాన్‌కు నటనపై ఏమాత్రం ఆసక్తి లేదు. గత 25 ఏళ్లుగా అదే పరిస్థితి. షూటింగ్‌కు వచ్చి మనకు ఏదో మేలు చేస్తున్నట్టు ప్రవర్తిస్తాడు. నటన కంటే ఒక సెలబ్రిటీగా వచ్చే పవర్‌ను ఎంజాయ్ చేయడానికే ఎక్కువ ఇష్టపడతాడు. అతడు ఒక గూండా. దబాంగ్ సినిమాకు ముందు ఈ విషయం నాకు తెలియదు. సల్మాన్ ఒక మర్యాద లేని, చెడ్డ మనిషి అని తీవ్రంగా విమర్శించారు. సల్మాన్ కుటుంబంపైనా ఆయన ఆరోపణలు చేశారు.

## శ్రీకాళహస్తీశ్వరాలయంలో మృత్యుంజయ అభిషేకాలు



**శ్రీకాళహస్తి, సెప్టెంబరు 8 ప్రభాతవార్త:** శ్రీకాళహస్తీశ్వరాలయం సోమవారం భక్తులతో కిట కిటలాడింది. ఆదివారం సాయంత్రం వరకు చంద్రగ్రహణం అంటూ స్వామి అమ్మవార్లను దర్శించుకున్న భక్తులు రాత్రి దివ్యక్షేత్రంలోనే నిద్రచేసారు. సోమవారం వేకువ జాము నుంచి భోశంకరుని దర్శనానికి భక్తులు తరలి వచ్చారు. దాంతో ముందు జాగ్రత్తగా అధికారులు ఏర్పాట్లు చేసారు. వచ్చిన ప్రతిభక్తుడు సుదర్శనం చేసుకునే రీతిలో ఆలయ ఇఒ టి.బాపిరెడ్డి సిబ్బందికి ఆదేశించారు. ఆలయంలో సోమవారం శివయ్యకు ప్రీతి పాత్రమైన రోజు కాబట్టి దూర ప్రాంతాలు పొరుగు రాష్ట్రాల నుంచి వచ్చిన భక్తులు అభిషేకాలకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చారు. దాంతో శివయ్యకు విశేష సంఖ్యలో అభిషేకాలు నిర్వహించారు.

## నందిగామలో 10 తులాల బంగారు గొలుసు స్నాచింగ్

**విజయవాడ,సెప్టెంబరు 8,ప్రభాతవార్తప్రతినిధి:** ఎన్టీఆర్ జిల్లా లోని నందిగామలో చైన్ స్నాచింగ్ ఘటన చోటు చేసుకుంది. ద్విచక్ర వాహనంపై మాస్కులు వేసుకుని వచ్చిన ఇద్దరు దుండగులు ఈ చోరీకి పాల్పడ్డారు. గుర్రం మనోహరి అనే మహిళ రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తుండగా ఆమె మెడలోని 100 గ్రాముల బంగారు గొలుసు లాక్కొని వెళ్ళారు. ఈ ఘటనపై ఆమె పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.




జాతీయ సాంస్కృతిక ఉత్సవాలు పోస్టరును ఆవిష్కరిస్తున్న జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

## నవంబరు 22,23 తేదీల్లో సాహిత్య సాంస్కృతిక వేడుకలు

**విజయవాడ,సెప్టెంబరు8,ప్రభాతవార్తప్రతినిధి:** ఎన్టీఆర్ జిల్లా యంత్రాంగం సారధ్యంలో ఆంధ్ర ప్రదేశ్ పర్యాటకశాఖ సౌజన్యంతో మల్లెతీగ సాహిత్యసేవాసంస్థ నిర్వహణలో నవంబరు 22, 23 తేదీలలో సాంస్క ృతిక రాజధాని విజయ వాడలో జాతీయ సాంస్క ృతిక ఉత్సవాలు2025 పేరుతో రెండు రోజుల పాటు సాహిత్య సాంస్కృతిక వేడుకలు జరుగనున్నాయి. ఈ సందర్భంగా సమకాలీన సమస్యలపై కథ, కవితల పోటీ, పర్యావరణం, సోషల్ మీడియా, ధూమపానం, డ్రగ్స్ వంటి అంశాలపై కార్టూన్లపోటీలు వుంటాయి. పోటీలో గెలుపొందిన రచయితలకు, కవులకు, కార్టూనిస్టులకు నగదు బహుమతులు వుంటాయి. పోటీకి వచ్చిన రచనలు, కార్టూన్లతో ఒక ప్రత్యేక సంచిక కూడా వెలువడుతుంది. కవి సమ్మేళనంలో పాల్గొనేవారు 30 లైన్లకు మించని కవితలుగానీ లేదా గేయం, పద్యం, గజల్ చదవొచ్చు. నాలుగు నిమిషాలకు మించని సందేశాత్మకమైన ఏకపాత్రలు, స్కిట్స్ కూడా చేయవచ్చు. ఇవి మహిళల్ని కించపరిచేవిగా వుండ కూడదు. పాల్గొనాలన్న ఆసక్తి వున్న వారు తమ రచనల్ని, ఏకపాత్రల్ని, స్కిట్స్ ను ముందుగా ఈమెయిలు కు పంపాలి. ఆమోదం పొందిన రచనల్ని, స్కిట్స్ ను మాత్రమే ప్రదర్శనకు అంగీకరిస్తారు. మీ రచనలు, స్కిట్స్, ఏకపాత్రల్ని పంపాల్సిన చివరి తేదీ అక్టోబరు 25. పూర్తి వివరాలకు 92464 15150, 83329 03156 నెంబర్లలో సంప్రదించవచ్చు.




ఎన్టీఆర్ జిల్లా జాయింట్ కలెక్టర్గా ఎస్. ఇలక్కియ ఐఎఫ్ టి యు ఆధ్వర్యంలో డిమాండ్ కూడిన వినతి పత్రం అందజేస్తున్న ఇఫ్టూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం. రామకృష్ణ తదితరులు

## ఉచిత బస్సుతో నష్టపోతున్న ఆటో, క్యాబ్ డ్రైవర్లను ఆదుకోవాలి

**విజయవాడ,సెప్టెంబరు8,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో లక్షలాది మందికి ఉపాధి కల్పిస్తున్న రవాణా రంగం. వాటిలో ఆటోల ద్వారా ఉపాధి పొందుతున్న కార్మికుల పట్ల ప్రభుత్వానికి ఏ మాత్రం కనికరంలేదని ఇఫ్టూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం రామకృష్ణ అన్నారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఉద్యోగ ఉపాధి లేక నిరు ద్యోగ యువకులు ఉన్నత చదువులు చదివి ఆటో డ్రైవర్లుగా మారుతున్నారు. సోమవారం ఎన్టీఆర్ జిల్లా జాయింట్ కలెక్టర్గా ఎస్. ఇలక్కియ ఐఎఫ్ టి యు ఆధ్వర్యంలో డిమాండ్ కూడిన వినతి పత్రం అందజేశారు. రామకృష్ణ మాట్లాడుతూ ఉ చిత బస్సు పథకం ప్రవేశపెట్టి టాటా మ్యాజిక్ వంటి డ్రైవర్ల కుటుంబాలను పూర్తిగా దెబ్బతీశారు.ఆటో, క్యాబ్, టాటాఏసీ డ్రైవర్ల కార్మిక కుటుంబాలు నష్టపోకుండా ప్రతి డ్రైవర్కు సంవత్సరానికి రూ.30 వేలు చొప్పున ఇవ్వాలని, సంక్షేమబోర్డు ఏర్పాటు చేయాలని, జీఓ నెం. 21. వంటి ఎన్నికల హామీలతో పాటు అవినీతికి నిలయంగా మారిన ఎ.టి.సి. సెంటర్లను రద్దు చేయాలని, డ్రైవర్లను జైలుపాలు చేసే ప్రమాదకర హిట్ అండ్ రన్ చట్టంలోని సెక్షన్ 1061,1062 రద్దు చేయాలని కోరుతున్నాము.

ఈ కార్యక్రమంలో ప్రగతిశీల ఆటో కార్మిక సంఘం సిటీ ఉపాధ్యక్షులు టి శ్రీను, నాని, రమేష్, కొండలు, అరుణోదయ శ్రీను, రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న పయ్యావుల కేశవ్, నారాయణ, అనగాని ప్రసాద్ తదితరులు

## కడప మహానాడు కంటే అనంతపురంలో భారీ సభ

### మంత్రి పయ్యావుల కేశవ్ వెల్లడి

**అనంతపురం, సెప్టెంబరు 8, ప్రభాతవార్త బ్యూరో**
కడప మహానాడు కుమించి అనంతపురంలో సూపర్ సిక్స్ సూపర్ హిట్ భారీ బహిరంగ సభకు ఏర్పాట్లు జరుగుతున్నాయని, కడప సభ కంటే అనంతపురం సభ గ్రౌండ్ రెట్టింపు స్థాయిలో ఉందని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ వెల్లడించారు. సూపర్ సిక్స్ పథకాలు ప్రభుత్వం అమలు చేసినందుకు , నూరు రోజుల్లోనే హంద్రీ నీవా కాలవ వెడల్పు , లైనింగ్ చేసినందుకు జిల్లా ప్రజలు సంతోషంగా ఉన్నారని, అందుకు కృతజ్ఞతగా ప్రజలు అనంతపురం సభను విజయవంతం చేసేందుకు సిద్ధంగా ఉన్నారని మంత్రి తెలియజేశారు. అనంతపురంలో ఈ నెల 10న సూపర్ సిక్స్ విజయోత్సవ సభ సభకు సంబంధించిన ఏర్పాట్లను సోమవారం మధ్యాహ్నం పలువురు రాష్ట్ర మంత్రులు నారాయణ, అనగాని ప్రసాదు, గొట్టిపాటి రవికుమార్, ఎమ్మెల్యేలు దగ్గుబాటి ప్రసాద్, ఎమ్మెస్ రాజు, రాష్ట్ర డిజిపి హరీష్ కుమార్ గుప్తా, ఇతర అధికారులతో కలిసి మంత్రి పయ్యావుల కేశవ్ పరిశీలించారు. సభాస్థలి తోపాటు ప్రజల కోసం ఏర్పాటు చేసిన గ్యాలరీలను పరిశీలించారు. ఈ సందర్భంగా సభాస్థలి వద్ద మంత్రి పయ్యావుల కేశవ్ విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత జరుగుతున్న ఈ సభ చరిత్రలో నిలిచిపోయే విధంగా ఉంటుందన్నారు.

## ప్రజా సమస్యలపై మాట్లాడితే తిడుతున్నారు: మాజీమంత్రి దాడిశెట్టి రాజా

**విజయవాడ,సెప్టెంబరు 8,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీలో కూటమి ప్రభుత్వంపై కాకినాడ వైసీపీ జిల్లా అధ్యక్షుడు దాడిశెట్టి రాజా తీవ్రంగా మండిపడ్డారు. రాష్ట్రంలో హిట్లర్ పాలన నడుస్తోందని ఆరోపించారు.

ప్రజా సమస్యలపై గొంతెత్తి వారిని సిఎం చంద్రబాబు దుర్భాషలా డుతున్నారని తీవ్రంగా విమర్శించారు. ఇక, వికలాంగులను దొంగలతో పోల్చడం,యూరియా కోసం మాట్లాడే రైతులను మా పార్టీవాళ్ళుగా ముద్ర వేయడం అత్యంత దుర్మార్గం అని అన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో యూరియా కొరత తీవ్ర స్థాయికి చేరుకుంది.

రైతులు ఆందోళన చెందుతున్నారని మాజీ మంత్రి దాడిశెట్టి రాజా పేర్కొన్నారు. అయితే, సిఎం చంద్రబాబు అమలు చేస్తున్న రెడ్బుక్ పాలనకు, కేసులనకు ప్రతిపక్షాలు ఎప్పటికీ భయపడవని మాజీ స్పష్టం చేశారు.

# రైతులకు మేలు చేసే ప్రభుత్వం

### యూరియా పంపిణీపై సమగ్ర వివరాలు వెల్లడించిన స్పీకర్ అయ్యన్నపాత్రుడు

**నర్సీపట్నం,సెప్టెంబరు 8 ప్రభాతవార్త:** రైతుల కోసం ప్రభుత్వం చేపట్టిన చర్యలు తోపాటు యూరియా పంపిణీ పై స్పీకర్ అయ్యన్నపాత్రుడు సోమవారం వెల్లడించారు. స్పీకర్ క్యాంప్ కార్యాలయంలో స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడు పత్రికా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సకాలంలో వర్షం పడటంతో ఎప్పుడూ లేని విధంగా రైతులు వరి నాట్లు వేసుకున్నారని తెలిపారు. నియోజకవర్గంలోని చివరి రైతు వరకు నీరు అందేలా కాలవలు శుభ్రపరిచే చర్యలు చేపట్టినట్లు చెప్పారు. కొంతమంది రైతులను తప్పుదోవ పట్టించే విధంగా వ్యవసాయం గురించి తెలియని వారు కూడా వ్యవసాయం గురించి మాట్లాడుతున్నారని విమర్శించారు. నర్సీపట్నం నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో 10,274 హెక్టార్లలో పంటలు సాగుతున్నాయని, వాటికి 25,685 ఎకరాల మేరకు యూరియా అవసరమని వివరించారు. ఒక ఎకరానికి సగటు 75 కిలోల



సోమవారం మీడియా సమావేశంలో మాట్లాడుతున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు

యూరియా అవసరం ఉంటుందని, నిర్దేశ స్థాయిలో మూడు విడతలుగా రైతులకు పంపిణీ చేస్తామని చెప్పారు. విత్తనం వేసిన 15 రోజులకు 25 కేజీలు, గడ్డి నివృత్తి చేసిన తర్వాత మరో 25 కేజీలు, పంట పండిన సమయంలో మూడో విడతగా 25 కేజీలు ఇవ్వబడతాయని తెలిపారు. మొత్తం 25,685 ఎకరాల కోసం 1,926 మెట్రిక్ టన్నుల యూరియా అవసర మవుతుందని చెప్పారు.ఇప్పటివరకు రైతు భరోసా కేంద్రాలు, పిఎసిఎస్లకు 1,055 మెట్రిక్ టన్నుల యూరియా పంపిణీ చేశామని, అందులో 902 మెట్రిక్ టన్నులను రైతులకొనుగోలు చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం స్టాక్లో 152 మెట్రిక్ టన్నులు ఉండగా, మరో 15 రోజుల్లో అదనంగా 270 మెట్రిక్ టన్నులు పంపిణీ చేయనున్నట్లు స్పష్టం చేశారు. యూరియా అందుబాటులో ఉన్న కేంద్రాల వివరాలను కూడా వెల్లడించారు. అలాగే, సజ్జల రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ ప్రతిపక్ష నాయకుడు హోదా ఇస్తేనే అసెంబ్లీకి వస్తానని చెబుతున్నారని, కానీ రాజ్యాంగ గౌరవంగా ప్రజల సమస్యల కోసం అసెంబ్లీకి రావాలని సూచించారు. ఎమ్మెల్యే జీతం తీసుకుంటూ అసెంబ్లీకి రాకపోవడం నేర మని అన్నారు. 18న ప్రారంభమయ్యే అసెంబ్లీ సమావేశాలకు హాజరు కావాలని వైసిపి అధినేత జగన్మోహన్ రెడ్డికి సలహా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తాండవ రిజర్వాయర్ చైర్మన్ కరక సత్యనారాయణ, గొలుగొండ మండలం పార్టీ అధ్యక్షులు అడిగర్ల నాని బాబు పాల్గొన్నారు.

## యుటిఎఫ్-రణభేరి జాత విజయవంతానికి పిలుపు

### పోస్టర్లు ఆవిష్కరించిన రాష్ట్ర యుటిఎఫ్ కార్యదర్శి జివి రమణ

**చిత్తూరు, సెప్టెంబరు 8 ప్రభాతవార్త:** పాఠశాల విద్యారంగ సమస్యలు, ఆర్థికపరమైన సమస్యలపై సెప్టెంబర్ 15 నుండి 19వ తేదీ వరకు జరిగే యుటిఎఫ్ రణభేరి జాతను విజయతంతం చేయాలని రాష్ట్ర యుటిఎఫ్ కార్యదర్శి జివి రమణ పిలుపునిచ్చారు. జిల్లా యుటిఎఫ్ కార్యాలయంలో సోమవారం రాష్ట్ర యుటిఎఫ్ కార్యదర్శి జివి రమణ జిల్లా అధ్యక్షుడు సోమశేఖర్రెడ్డి, ప్రధాన కార్యదర్శి మణిగండన్లతో కలిసి యుటిఎఫ్ రణభేరి జాత పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర యుటిఎఫ్ కార్యదర్శి జివి రమణ మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడి 15 నెలలు పూర్తయినా ఇప్పటి వరకు ఒక్క సమస్య పరిష్కారం కాలేదని, ఉపాధ్యాయులపై యాప్ల పనిభారం, పి4, విద్యాశక్తి కార్యక్రమాలు, పరీక్షల మూల్యాంకనం, ఆన్లైన్ అప్లోడ్ తదితర బోధనేతర పనులను ఉపాధ్యాయులపై ఎక్కువ మోపుతున్నారని ఆరోపించారు. అలాగే



పిఆర్సి కమీషన్ సత్వరం ఏర్పాటు చేయాలని, డిఎలు విడుదల చేసి ఐఆర్ను ప్రకటించాలని డిమాండ్ చేశారు. కుప్పంలో ఈ నెల 15న రణభేరి జాత ప్రారంభమవుతుందని, సెప్టెంబర్ 25వ తేదీ విజయవాడలో బహిరంగ సభ ద్వారా రణభేరి మోగిస్తున్నామన్నారు. జిల్లాలో ఐదు రోజుల పాటు జరిగే ఈ బైక్ రణభేరి జాతను విజయవంతం చేయడానికి ప్రతి ఉపాధ్యాయుడు కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహ అధ్యక్షురాలు రెహెనాబేగం, రాష్ట్ర కౌన్సెలర్ ఎస్పి భాషా, నాయకులు ఏకాంబరం, పార్ధసారధి, భానుప్రకాష్, రాజేష్కుమార్, సర్దార్, మధు తదితరులు పాల్గొన్నారు.

## పదో తేదీన జరిగే సూపర్ సిక్స్ సభకు పోలీసుల ఆంక్షలు

**అనంతపురం, సెప్టెంబరు 8, ప్రభాతవార్త బ్యూరో**
ఈనెల 10 వ తేదీన అనంతపురంలో జరిగే సూపర్ సిక్స్ సూపర్ హిట్ విజయోత్సవ సభ నేపథ్యంలో ఆ ఒక్కరోజు వాహనదారులు ఈకింది ఆంక్షలు పాటించి పోలీసులతో సహకరించాలని అనంతపురం జిల్లా ఎస్పీ పి. జగదీష్ ఒక ప్రకటనలో తెలియజేశారు. .రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఇతర ప్రజాప్రతినిధులు భారీ ఎత్తున ప్రజలు అనంతపురం లో నిర్వహించే విజయోత్సవ సభలో పాల్గొనే అవకాశమున్నందున వాహనాల రాకపోకలు కొనసాగేందుకు పోలీసు వారు సూచించిన ఆంక్షలు తప్పకుండా పాటించి సహకరించాలని జిల్లా ఎస్పీ విజ్ఞప్తి చేశారు. జిల్లా ఎస్పీ ఈ కింది విధంగా ప్రకటన విడుదల చేశారు. ..హైదరాబాద్ నుంచి బెంగళూరు వైపు వెళ్లే వాహనాలు అనంతపురం టౌన్ నుండి కాకుండా వడియంపేట - బుక్కరాయసముద్రం - నాయన పల్లి క్రాస్ -నార్పల క్రాస్ - బత్తలపల్లి - ధర్మ వరం - ఎన్ఎస్ గేట్ - విబీ44 మార్గంలో



ప్రయా ణించాలి. కర్నూల్ నుంచి తిరుపతి/చెన్నై వెళ్లే వాహనాలు అనంతపురం టౌన్ నుండి కాకుండా వడియంపేట - బుక్కరాయసముద్రం - నాయనపల్లి క్రాస్ - నార్పల క్రాస్ - బత్తలపల్లి - కదిరి - మదనపల్లె మార్గంలో ప్రయాణించాలి. బళ్లారి నుంచి బెంగళూరు వెళ్లే వాహనాలు అనంతపురం టౌన్ నుండి కాకుండా చెల్లికేర - తుమ్కూరు - నెలమంగళ - బెంగళూరు మార్గంలో ప్రయాణిం చాలి బెంగళూరు నుంచి హైదరాబాద్ వెళ్లే వాహనాలు అనంతపురం టౌన్ నుండి కాకుండా ఎన్ఎస్ గేట్ - ధర్మవరం - బత్తలపల్లి - నార్పల క్రాస్ - నాయనపల్లి క్రాస్ - బుక్కరాయసముద్రం - వడియంపేట - ఎన్ హెచ్ 44 మార్గంలో ప్రయాణించాలి. తిరుపతి/చెన్నై నుంచి కర్నూల్ వెళ్లే వాహనాలు అనంతపురం టౌన్ తప్పించుకుని కదిరి - బత్తలపల్లి - నార్పల క్రాస్ - నాయనపల్లి క్రాస్ - బుక్కరాయసముద్రం - వడియంపేట - విబీ 44 మార్గంలో ప్రయాణిం చాలి. బెంగళూరు నుంచి బళ్లారి వెళ్లే వాహనాలు అనంతపురం తప్పించుకుని బెంగళూరు - నెలమంగళ - తుమ్కూరు-చెల్లికేర మార్గంలో ప్రయాణించాలి. జిల్లా ఎస్పీ జారీ చేసిన ప్రకటన ను బట్టి కర్ణాటక, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు సంబంధించిన ప్రయాణికులు , వాహనదారులు అనంతపురం మీదుగా జాతీయ రహదారిపై వెళ్లే వాళ్లు, వెళ్లాలని ఆలోచన ఉన్నవారు ముందస్తుగా తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరమైతే ఉంది.

# 42పసిడి పతకాలు సాధించిన కడియాల లోకేష్సాయి

### యూనివర్సిటీలో టాపర్గా చౌడేపల్లి యువకుడు

**చౌడేపల్లి(చిత్తూరు జిల్లా), సెప్టెంబరు 8 ప్రభాతవార్త**
రాజ్యాంగం స్ఫూర్తిగా జీవిస్తున్న కుటుంబంలో విద్యాకుసుమం ఉద్భవించింది...చిన్నతనం నుంచి సమాజ పోకడలపై అవగాహన పుణికిపుచ్చుకున్న అతనిలో అందరి హితం కోసం న్యాయవాద మార్గాన్ని ఎంచుకొన్నాడు...ఊహ తెలిసినప్పటే న్యాయశాస్త్రం రాజ్యాంగం విధివిధానాలపై పట్టు సాధించాడు...తాతయ్య రాజకీయ చతురత తల్లిదండ్రుల సూచనల మేరకు న్యాయశాస్త్రంలో రాణించి 42పసిడి పతకాలను కొల్లగొట్టి రికార్డు సాధించి చౌడేపల్లికే గర్వకారణంగా నిలచాడు... చిత్తూరు జిల్లా చౌడేపల్లికి చెందిన కడియాల నగేష్ తిరుపతిలో రెడ్సాండిల్ కోర్టులో స్పెషల్ పిపిగా పనిచేస్తున్నాడు. తండ్రి నగేష్, తల్లి వనజమ్మల ముద్దల తనయుడు కడియాల లోకేష్ సాయి తొలి నుంచి రాజ్యాంగంతోపాటు సమాజంలో జరుగుతున్న పోకడలను తండ్రి కడియాల నగేష్ ద్వారా తెలుసుకొంటూ వుండేవాడు. ఈక్రమంలో సామాన్యులకు న్యాయం చేయాలన్న తపన అతనిలో కల్గింది. దీంతో న్యాయవాద వృత్తిపై గాలి మల్లింది. తల్లిదండ్రులు సైతం అతని ఇష్టాన్ని కాదనకుండా ప్రోత్సహించారు. ఉన్నత విద్యాభ్యాసం తిరుపతి విద్యానికేతన్లో పూర్తి చేసుకొన్నాడు. అనంతరం న్యాయవాద కోర్సును అనకాపల్లి జిల్లా సబ్బవరంలోని దామోధరం సంజీవయ్య జాతీయ విశ్వవిద్యాలయంలో బిఎ ఎల్ఎల్బిలో (2018-23)లో చేరి పూర్తి చేసాడు. ఇదే బ్యాచ్లో కడియాల లోకేష్సాయి అన్ని సబ్జెక్టుల్లోనూ ప్రతిభ చూపి బ్యాచ్ మొత్తానికి టాపర్గా నిలచాడు. మొత్తం మీద 42బంగారు పతకాలు సాధించి రికార్డు నెలకొలపాడు. విద్యార్థి నాయకుడా రాణిస్తూనే వాణిజ్య, క్రిమినల్ లాలో జస్టిస్ ఇ.వెంకటేషన్ పతకాలను హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ధీరజ్సింగ్ ఠాకూర్ చేతుల మీదుగా అందుకున్నాడు. అదే విధంగా ఇండియన్ ఫీనల్కోడ్, కోడ్ ఆఫ్ క్రిమినల్ ప్రొసీజర్ ఇలా అన్నింటిలోనూ 42 బంగారు పతకాలు సాధించి



యువతకే ఆదర్శంగా నిలచాడు. ప్రస్తుతం కడియాల లోకేష్సాయి తిరుపతిలోని న్యాయవాది విజయ్శేఖర్ వద్ద అడ్వకేట్ ప్రాక్టీసు చేస్తున్నాడు.

**తాత కెవిపతి నేపథ్యం :** కడియాల లోకేష్సాయి తాత కెవిపతి రాజకీయ దురంధుడుగా పేరుగడించారు. సర్పంచు నుంచి ఎమ్మెల్యే వరకు సేవలందించాడు. చౌడేపల్లి మేజర్ పంచాయతీ సర్పంచుగా, చౌడేపల్లి సమితి ఇన్ఛార్జీ ఛేర్మన్గా వ్యవహరించాడు. అంతేకాకుండా 1978-83 మద్య కాలంలో పుంగనూరు ఎమ్మెల్యేగా సమాజం కోసం పని చేశాడు. ఆయన కుమారుల్లో ఒకరు కడియాల నగేష్ ప్రస్తుతం తిరుపతిలోని రెడ్సాండిల్కోర్టులోస్పెషల్పిపిగా పనిచేస్తున్నాడు.

**సుప్రీం కోర్టు న్యాయమూర్తి అవుతా : కడియాల లోకేష్ సాయి:** దామోదరం సంజీవయ్య జాతీయ విశ్వవిద్యాలయంలో బిఎల్ఎల్బి పూర్తి చేశాను. అన్ని సబ్జెక్టుల్లోనూ రాణించి మొత్తం మీద 42బంగారు పతకాలు సాధించడం ఆనందంగా వుంది. తాత ఆశ్వీదం, అమ్మనాన్నలు కడియాల నగేష్,వనజమ్మల సూచనలతో ఇంతటి విజయానికి మూలకారణం. సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి కావాలన్నది నాకల. ప్రస్తుతం తిరుపతిలోలా ప్రాక్టీస్ అంకిత భావంతో పనిచేస్తున్నా. నాన్న స్ఫూర్తితో సమాజానికి సేవ చేయాలన్నది నా లక్ష్యం.

# రాష్ట్రాభివృద్ధిలో ప్రవాసాంధ్రులు భాగం కావాలి: మంత్రి కొండపల్లి శ్రీనివాస్

### జ్యూరిచ్లోని తెలుగు కమ్యూనిటితో సమావేశమైన మంత్రి కొండపల్లి

**సచివాలయం,సెప్టెంబరు 8,ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాభివృద్ధిలో ప్రవాసాంధ్రులు కీలకపాత్ర పోషించాలని,సృజనాత్మక ఆలోచనలతో తమ స్వగ్రామాల్లో సూక్ష్మ మధ్య తరహా పరిశ్రమల రూపంలో అభివృద్ధికి పాటుపడాలని రాష్ట్ర సూక్ష్మ,చిన్న,మధ్యతరహా పరిశ్రమలు,గ్రామీణ పేదరిక నిర్మూలన,ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్



పిలుపునిచ్చారు.వారం రోజులపాటు స్విట్జర్లాండ్ పర్యటనలో ఉన్న మంత్రి కొండపల్లి జ్యూరిచ్లోని తెలుగు అసోసియేషన్ ఆఫ్ స్విట్జర్లాండ్ (టిఎఎస్) ఆధ్వర్యంలో జరిగిన ఆత్మీయ సమావేశంలో పాల్గొన్నారు.ఈ సమావేశంలో మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో వేగవంతంగా అభివృద్ధి చెందుతున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రవాసాం ధ్రులు పెట్టుబడులు పెట్టడం ద్వారా రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిలో భాగం కావాలని కోరారు.ప్రవాసాం ధ్రులు తమ మాతృభూమితో నిత్యం సంబంధాలు కొనసాగిస్తూ మన సంస్కృతి సాంప్రదాయాలను కాపాడాల్సిన అవసరం ఉందన్నారు.భవిష్యత్ తరాలకు తెలుగు సాంస్కృతిక వారసత్వాన్ని పరిచయం చేయడం ద్వారా పిల్లలను సాంస్కృతిక మరియు విద్యా కార్యక్రమాల్లో భాగం చేయాలని మంత్రి సూచించారు.ఆహ్లాదకర వాతావరణంలో జరిగిన ఈ సమావేశంలో పలువురు స్విట్జర్లాండ్ తెలుగు కమ్యూనిటీసభ్యులు ఆంధ్రప్రదేశ్ సామాజిక ఆర్థికాభివృద్ధిలో తాము భాగం అవుతామన్న ఆసక్తిని వ్యక్తంచేశారు.టిఎఎస్ నుండి తాతికొండ కిషోర్,సన్నీ మూడనూరు, ఏపిఎన్ఆర్టీ నుంచి శ్రీకృష్ణ వల్లూరి సమన్వయం తో ఏర్పాటైన ఈ సమావేశంలో స్విట్జర్లాండ్లో ఉంటున్న పలువురు తెలుగు కమ్యూనిటీ సభ్యులు పాల్గొన్నారు.

## పల్లె నివాసానికి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు



**అనంతపురం, సెప్టెంబరు 8 ప్రభాతవార్త బ్యూరో:** పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి నివాసానికి విచ్చేసిన ఎమ్మెల్యేలు రాష్ట్ర టిడిపి అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, జయనాగేశ్వర్ రెడ్డి, బండారు శ్రావణి, ఎమ్మెల్సీలు బీద రవిచంద్ర, రాంభూపాల్ రెడ్డి, మాజీ మంత్రి అమరనాథ్ రెడ్డి, సీఎం ప్రోగ్రాం కోఆర్డినేటర్ వెంకటేష్, ఏడిసిసి బ్యాంకు చైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి, మాజీ ఎంపీపీ శ్రీరామ్ రెడ్డి తదితరులు మాజీ మంత్రి నివాసంలో తేనీటి విందు స్వీకరించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, బిజెపి రాష్ట్ర అధ్యక్షులు మాధవ్తో పాటు కూటమి పార్టీకి సంబంధించిన మంత్రులు ఎమ్మెల్యేలు ఈనెల 10న అనంతరం నిర్వహించే సూపర్ సిక్స్ సూపర్ హిట్ విజయోత్సవ సభకు విచ్చేస్తున్న సందర్భంగా పెద్ద ఎత్తున ప్రజలు తరలివచ్చి భారీ సక్సెస్ చేసే విధం గా ఏర్పాట్లు చేసుకో వాలని స్థానిక ఎమ్మె ల్యేలకు, ఎమ్మెల్సీలకు స్థానిక ప్రజాప్రతినిధులకు రాష్ట్ర టీడీపీ అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు సూచించారు. అనంతలో నిర్వహించే సూపర్ సిక్స్ సూపర్ హిట్ సభను కనీవినీ ఎరుగని రీతిలో నిర్వహిస్తున్నామని, అందుకు తగిన విధంగా వాహనాల ఏర్పాటు సభ వేదిక సభా ప్రాంగణము వాహనాల పార్కింగ్ భోజనాలు, నీటి వసతి పెద్ద ఎత్తున చేపట్టాలని ఎమ్మెల్యేలకు తెలిపారు. అంతేకాకుండా ఎక్కడ ట్రాఫిక్ సమస్య లేకుండా కూటమి పార్టీ కార్యకర్తలు పోలీసులతో సహకరించాలని కోరారు. అనంతరం పల్లె నివాసంలో పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి, డాక్టర్ పల్లె వెంకటకృష్ణ కిషోర్ రెడ్డి కుటుంబ సభ్యులతో ప్రత్యేకంగా మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కేరళ మాజీ డిజిపి శంకర్ రెడ్డి కుటుంబ సభ్యులు, శ్రీబాలాజీ విద్యాసం స్థల యాజమాన్య ప్రతినిధి శ్రీకాంత్ రెడ్డి, పీవీ కేకే ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ సుబ్బారావు, కళ్యాణ దుర్గం డీఎస్ మూర్తి, పుట్టపర్తి నియోజకవర్గ కూటమి పార్టీ నాయకులు సామకోటి ఆదినారాయణ, వెంగళమ్మ చెరువు సింగల్ విండో అధ్యక్షులు శ్రీరామ్ రెడ్డి, టిడిపి సీనియర్ నాయకులు పుల్లప్ప, నల్లమడ మండలం చిన్నపరెడ్డి, కూటమి పార్టీల కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా దసరా ఉత్సవాలు

### దేవదాయ శాఖ కమిషనర్ కె రామచంద్ర మోహన్

**ఇంద్రకీలాద్రి, సెప్టెంబరు 8, ప్రభాతవార్త:** బెజవాడ దుర్గమ్మ వారి ఆలయంలో దసరా ఉత్సవాలను వైభవంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నామని రాష్ట్ర దేవదాయ శాఖ కమీషనర్ కె రామచంద్ర మోహన్ అన్నారు. సోమవారం ఆయన దసరా ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాట్లపై ఇఓ వికె శీనా నాయక్, ఇంజనీరింగ్ అధికారులు ఆయనకు వివరించారు. కనకదుర్గానగర్ వద్ద నూతనంగా నిర్మించిన బిటిరోడ్డు నుండి కాలినడకన ప్రసాదంపోటు, అన్నదానం భవనాలు తదితర భవనాలను దేవదాయ శాఖ కమీషనర్ పరిశీలించి పలు సూచనలు చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ సెప్టెంబర్ 22నుండి ప్రారంభమయ్యే ఉత్సవాలకు దేశవ్యాప్తంగా 10 లక్షలకు పైగా భక్తులు విచ్చేస్తారని అంచనా వేస్తున్నామన్నారు. భక్తులకు సకల సదుపాయాలు చేపట్టామన్నారు. ఏర్పాట్లపై తాము ఎప్పటికప్పుడు కలెక్టర్, పోలీస్ కమీషనర్,దేవస్థానం ఇఓలతో సమీక్షల్లో పాల్గొని పర్యవేక్షిస్తున్నామన్నారు. రాబోయే పది రోజులు కీలకంగా భావించి పనులు వేగవంతం చేస్తున్నామని సామాన్య భక్తులకు సంతృప్తకర దర్శనం కల్పించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. ఈనెల 15 కల్లా ఉత్సవాల ఏర్పాట్లు పూర్తవ్వాలనే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు.



నూతన ప్రసా దాల పోటులో అమ్మ వారి ప్రసాదాల తయారీ జరుగుతుందన్నారు. నూతన అన్నదాన భవనంలో రెండు అంతస్థుల్లో బఫేపద్ధతిలో భక్తులకు భోజన సదుపాయం ఏర్పాటు చేస్తామ న్నారు. ఈ సందర్భంగా ఇఓకు, దేవదాయశాఖ ఛీఫ్ ఇంజనీర్ శేఖర్కు, దేవాలయ ఇఇలు కెవిఎస్ఆర్ కోటేశ్వరరావు, బి రాంబాబులకు పలు ఆదేశాలిచ్చారు.

# ఆదిలాబాద్ సిమెంటు ప్లాంటును పునరుద్ధరించాలి



## సిసిఐ ఉన్నతాధికారులతో ఐటి, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

**హైదరాబాద్, సెప్టెంబరు 8, ప్రభాతవార్త:** ఖాయిలా పడిన సిమెంట్ కార్పోరేషన్ ఆఫ్ ఇండియా (సిసిఐ) ఆదిలాబాద్ ప్లాంటును పునరుద్ధరించాలని రాష్ట్ర ఐటి, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ పరిశ్రమను తిరిగి నడిపిం చాలని సిఎం రేవంత్‌రెడ్డి, తానూ పలు సందర్భాల్లో కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల మంత్రి హెచ్ డి కుమారస్వామిని కలిసి కోరిన విషయాన్ని ఆయన గుర్తు చేసారు. సోమవారం సచివాలయంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సిసిఐ సిఎండి సంజయ్ బంగా, ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ తదితరులతో నిర్వహిం చిన ఉన్నత స్థాయి సమావేశంలో పునరుద్ధరణ ప్రతిపాదనలపై శ్రీధర్ బాబు చర్చించారు. ప్లాంటును ఆధునిక యంత్రాలతో పునరు ద్ధరిం చడానికి రూ. 2 వేల కోట్లు అవసరమవు తాయని సిఎండి చెబుతున్నారని, అది జరిగితే మూడు వేల మందికి ఉపాధి దొరుకుతుందని శ్రీదర్ బాబు తెలిపారు. వెనకబడిన ఆదిలాబాద్ జిల్లాలోని ఈ భారీ పరిశ్రమను పూర్తి స్థాయిలో కేంద్ర ప్రభుత్వమే రివైవ్ చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పలు సందర్భాల్లో కోరారని తెలిపారు. కేంద్రం ప్రతిపాదిస్తున్నట్టుగా ప్లాంటు ప్రైవేటీకరణను (డిస్ ఇన్వెస్ట్ మెంటును) తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని అన్నారు. పునరుద్ధరణకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనలను సిసిఐ కోరుతోందని, త్వరలోనే దీనిపైన తమ అభిప్రాయాలను అందచేస్తామని వెల్లడించారు. రెండు వేల ఎకరాల్లో నాణ్యతతో కూడిన సున్నపురాయి గనులు ఉన్నందున ప్లాంటు నిర్వహణ అసాధ్యమేమీ కాదని శ్రీధర్ బాబు చెప్పారు. సమావేశంలో మైన్స్ అండ్ జియాలజీ ముఖ్యకార్యదర్శి ఎన్. శ్రీధర్, గనుల శాఖ డైరెక్టర్ వల్లూరు క్రాంతి, టిజిఐఐసి ఎండి శశాంక తాండూరు సిసిఐ ప్లాంట్ జిఎం శరద్ కుమార్, సిసిఐ రీజినల్ మేనేజర్ ఉమేశ్ కుమార్ సింగ్ తదితరులు పాల్గొన్నారు. కేంద్ర మాజీ మంత్రి వేణుగోపాలచారిలు కూడా సమావేశానికి హాజరై తమ సూచనలను వెల్లడించారు.



రాష్ట్ర సమాచార కమిషన్ విచారణల ప్రత్యక్ష ప్రసారాన్ని ప్రారంభించిన గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్

# పారదర్శకతే ప్రజల్లో విశ్వసనీయతను పెంచుతుంది

## గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్

**విజయవాడ, సెప్టెంబర్ 8,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్ర సమాచార కమిషన్ రెండవ అప్పీళ్లు , ఫిర్యాదుల విచారణల ప్రత్యక్ష ప్రసారాన్ని ఆంధ్ర ప్రదేశ్ గవర్నర్ జస్టిస్ఎస్. అబ్దుల్ నజీర్ సోమవారం రాజ్ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా గవర్నర్ అబ్దుల్ నజీర్ మాట్లాడుతూ, రాష్ట్ర సమాచార కమిషన్ విచారణల ప్రత్యక్ష ప్రసారం కమిషన్ పనితీరులో మరింత పారదర్శకంగా నిర్వహించడానికి చాలా ఉపయోగపడుతుందని చెప్పారు. ఈ సందర్భంగా రాష్ట్ర సమాచార కమిషన్ కృషిని అభినందించారు. కేంద్ర సమాచార కమిషన్ ప్రధాన సమాచార కమిషనర్ హీరాలాల్ సమారియా, న్యూఢిల్లీలోని నేషనల్ ఇన్ఫర్మేటిక్స్ సెంటర్ రాష్ట్ర సమన్వయకర్త మరియు శాస్త్రవేత్తజి డాక్టర్ ఆర్.కె. పాఠక్, గవర్నర్ ఇ.ఓ. కార్యదర్శి డాక్టర్ ఎం. హరి జవహర్‌లాల్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. రాష్ట్ర సమాచార కమిషనర్ ఆర్.మహబూబ్ బాషా ఈ కార్యక్రమంలో కమిషన్ కార్యాలయం నుండి ప్రత్యక్ష ప్రసారం ద్వారా పాల్గొన్నారు.

### పిజిఆర్ఎస్‌కు 11 అర్జీలు



పొన్నూరు, సెప్టెంబరు 8,ప్రభాతవార్త: ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రతి సోమవారం తహశీల్దార్ కార్యాలయంలో నిర్వహించే పిజిఆర్ఎస్‌కు వివిధ సమస్యలకు సంబంధించి తొమ్మిది అర్జీలు అందినట్లు తహశీల్దార్ కార్యాలయ సూపరింటెండెంట్ ఆలేటి మాధవి చెప్పారు. అందులో రెవెన్యూకు సంబంధించి-7,డిఆర్‌డిఏకి సంబంధించి-2, సర్వేకి సంబంధించి-2 అర్జీలు అందినట్లు చెప్పారు. ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి, జవాబుదారీ తనానికి పిజిఆర్ఎస్ ఎంతగానో దోహదపడుతుందన్నారు. మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రామారావు, ఈఓపిఆర్డీ మల్లికార్జునరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

### రైతుసేవా కేంద్రాల్లో ఎరువుల నిల్వలు: ఎడిఎ రామకోటేశ్వరి

పొన్నూరు, సెప్టెంబరు 8,ప్రభాతవార్త: రెండు, మూడు రోజుల్లో అన్నీ రైతు సేవా కేంద్రాల్లో రైతులకు అవసరమైన ఎరువులను అందుబాటులో ఉంచుతామని ఎడిఎ వి.రామకోటేశ్వరి తెలిపారు. మండల కేంద్రమైన చేబ్రోలు సచివాలయం-2లో రైతు చెంతకు యూరియా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రామకోటేశ్వరి మాట్లాడుతూ



యూరియాలేదని ఆపోహ లు మానాలని సూచించారు. రైతులు ఈ పంటకు అవసరమైన ఎరువులను మాత్రమే తీసుకోవాలన్నారు. మండల వ్యవసాయాధికారి పి.ప్రియదర్శిని మాట్లాడుతూ ఎరువులను అధిక ధరలకు విక్రయించినా, కావాలని ఎరువుల కొరత సృష్టించినా సంబంధిత వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకొంటామని హెచ్చరించారు. ఈ సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. టిడిపి నాయకులు ఆవుల రాజశేఖర్, రైతులు పాల్గొన్నారు.

### 22నుంచి శంకరమఠంలో నవరాత్రి ఉత్సవాలు

పొన్నూరు, సెప్టెంబరు 8,ప్రభాతవార్త: స్థానిక బ్రాహ్మణ బజారులో వేంచేసియున్న శ్రీశ్రీశ్రీ శంకరాచార్య సన్నిధి-గాయత్రీ మందిరంలో ఈ నెల 22వ తేదీ నుంచి వచ్చే నెల 2వ తేదీ వరకు శ్రీదేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు జరుగుతాయని బ్రాహ్మణ మహాసభ ముఖ్య సలహాదారు పులిపాక వేంకట సత్యసాయివరప్రసాద్‌శర్మ చెప్పారు. 29న సరస్వతిపూజ, 30న దుర్గాష్టమి, ఒకటో తేదీన మహార్నవమి, 2వ తేదీన విజయదశమి సందర్భంగా ప్రత్యేక పూజలు జరుగుతాయన్నారు.ఉత్సవాల పది రోజులు గోత్రనామాలతో పూజలు జరిపించుకోవాలనుకునేవారు రూ.600చెల్లించాలన్నారు. పూర్తి వివరాలకు శంకరాచార్య సన్నిధిలో సంప్రదించాలని కోరారు.

# నేత్రదానానికి టిజిఎస్‌ఆర్‌టిసి తోడ్పాటు

## ఆర్‌టిసి బస్సుల్లో ఉచితంగా కార్నియాల తరలింపు

## సరోజినిదేవి కంటి ఆస్పత్రితో ఎంఒయు

**హైదరాబాద్, సెప్టెంబరు 8, ప్రభాతవార్త:** సామాజిక బాధ్యతలో భాగంగా నేత్ర దానానికి తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ(టిజిఎస్ఆర్‌టిసి) తోడ్పాటు అందిస్తోందని సంస్థ ఎండి విసి సజ్జనార్ తెలిపారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో సేకరించిన నేత్రాలను ఉచితంగా ఆర్‌టిసి బస్సుల్లో హైదరాబాద్‌కు తరలించాలని నిర్ణయించినట్టు తెలిపారు. నెట్‌వర్క్ టు సైట్ పేరుతో సరోజిని దేవి కంటి ఆసుపత్రితో ఆర్‌టిసి అవగాహన ఒప్పందం(ఎంవోయు) చేసుకుంది. హైదరాబాద్ మెహిదిపట్నంలోని సరోజిని దేవి కంటి ఆసుపత్రి ప్రాంగణంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో ఒప్పంద పత్రాలపై ఆర్‌టిసి ఎండీ విసి సజ్జనార్.. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మోదిని ఒప్పంద పత్రాలపై సంతకాలు చేసి పరస్పరం అవగాహన ఒప్పందం చేసుకున్నారు. ఈ ఒప్పందం ప్రకారం.. రాష్ట్రంలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో నేత్రదాతల నుంచి సేకరించిన కార్నియాలను ఆర్‌టిసి బస్సుల్లో ఉచితంగా హైదరాబాద్‌కు పంపిస్తారని.. సేకరించిన కార్నియాలను ఐస్ బాక్స్‌లో భద్రపరిచి ఆర్‌టిసి లాజిస్టిక్స్ కేంద్రాల్లో వైద్య సిబ్బంది అందజేస్తా రని.. వాటిని తమ బస్సుల్లో హైదరాబాద్‌కు ఆర్‌టిసి డ్రైవర్లు తీసుకువస్తారని విసి తెలిపారు. బస్సులు హైదరాబాద్ చేరుకోగానే సరోజిని కంటి ఆసుపత్రి సిబ్బంది వచ్చి వాటిని తీసుకుని.. ఐ బ్యాంక్‌లో భద్రపరుస్తారని తెలిపారు.

పవిత్రమైన ఈ దాతృ త్వ కార్యక్రమంలో తమ సంస్థ భాగస్వా మ్యం కావడం సంతోషంగా ఉందని సజ్జనార్ తెలిపారు. నెట్‌వర్క్ టు సైట్‌పై ఆర్‌టిసి సిబ్బందికి అవగాహన కల్పిస్తున్నామన్నారు. మృతి చెందాక అత్యంత విలువైన అవయవాలను మట్టిపాలు చేసేకన్నా అంధత్వంతో లోకాన్ని చూడలేని వారికి చూపునీయడం గొప్ప కార్య మన్నారు. భారతదేశంలో ప్రతి ఏటా 3 లక్షలకుపైగా మంది నేత్రాల కోసం ఎదురుచూస్తుంటే.. కేవలం 18 వేల మార్పిడిలు మాత్రమే జరుగు తున్నాయని గుర్తుచేశారు. మరణాంతరం నేత్రదానం చేసేందుకు ప్రతి ఒక్కరు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. సరోజిని దేవి కంటి ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మోదిని మాట్లాడుతూ.. ఉచితంగా కార్నియాలను బస్సు ల్లో ఉచితంగా తరలించేందుకు ముందుకు వచ్చిన టిజిఎస్‌ఆర్‌టిసి యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. ఆర్‌టిసి బస్సుల్లో సురక్షి తంగా కార్నియాలను సరోజిని కంటి ఆసుపత్రికి తీసుకువచ్చి రోగులకు అమర్చుతామని చెప్పారు. ఈ సందర్భంగా ఆర్‌టిసి ఎండి సజ్జనార్‌సజ్జనర్ నేత్రదాన ప్రతిజ్ఞ చేసి.. నేత్రదాన ప్రతిజ్ఞా పత్రంపై సంతకం చేసి సరోజిని దేవి కంటి ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మోదినికి అందజేశారు.

# నేను బిఆర్ఎస్‌లోనే ఉన్నా.. అభివృద్ధి కోసం అన్ని పార్టీలతో ఉంటా

## పార్టీ సభ్యత్వానికి నేను రాజీనామా చెయ్యలేదు!

## సంచలన వ్యాఖ్యలు చేసిన భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం

**భద్రాచలం, ప్రభాతవార్త :** భద్రాచలం నియోజకవర్గ ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు సంచలనమైన వ్యాఖ్యలు చేశారు. నేను బిఆర్ఎస్ పార్టీలోనే ఉన్నానని, అభివృద్ధి కోసం అన్ని పార్టీలతో ఉంటానని ఆ పార్టీ సభ్యత్వానికి నేను రాజీ నామా చేయలేదని, కాంగ్రెస్ పార్టీ సభ్యత్వం పొందలేదని ముఖ్యమంత్రిని కలవడానికి కారణం కేవలం వరదల వలన దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేసేందుకు నిధులు మంజూరు చేయాలని కోరేందుకేనని వ్యాఖ్యలు చేశారు. దాంతో ఈ వ్యాఖ్యలు ఉమ్మడి ఖమ్మం జిల్లావ్యాప్తంగా తీవ్ర సంచలనం రేపాయి. పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రధాన అనుచరుడుగా గుర్తింపు పొందిన ఎమ్మెల్యే డా.తెల్లం వెంకట్రావు మొదట ఆయనతోనే వైఎస్సార్‌సీపీ, ఆ తరువాత బిఆర్ఎస్ పార్టీలో చేరారు. అనూహ్య రాజకీయ పరిస్థితుల దృష్ట్యా పొంగులేటి శ్రీనివాసరెడ్డి కాంగ్రెస్ తీర్థం పుచ్చుకోగా ఆయనతోనే ఖమ్మంలో జరిగిన ప్రత్యేక వేదికపై రాహుల్‌గాంధీ చేతులమీదుగా కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకున్నారు. ఆ తరువాత కాంగ్రెస్‌లో ఉంటే ఎమ్మెల్యేగా పోటీ చేసేందుకు అవకాశం ఉండదని తెల్లం వెంకట్రావు వెంటనే బిఆర్ఎస్ పార్టీవైపు జంప్ చేశారు. తెల్లం వెంకట్రావును తమ పార్టీలోకి ఆహ్వానించి అభ్యర్థిగా తెల్లం పేరు ను ప్రకటిస్తే బిఆర్ఎస్ పార్టీని భద్రాచలం నియోజకవర్గంలో గెలిపిం చుకున్నారు. పొంగులేటి శ్రీనివాసరెడ్డి మంత్రిగా బాధ్యతలు చేపట్టడంతో ఆయన సమక్షంలో మరలా డా.తెల్లం వెంకట్రావు కాంగ్రెస్ పార్టీ కండువాను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతులమీదుగా కప్పుకున్నారు. దీంతో తీవ్ర ఆగ్రహానికి గురైన బీఆర్ఎస్ పార్టీ అధిష్ఠానం తెల్లం వెంకట్రావుతోపాటు బీఆర్ఎస్ పార్టీ బీ -ఫామ్‌పై గెలిచి పార్టీ ఫిరాయించిన మరో 9 మంది ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవాలంటూ మొదట హైకోర్టును ఆశ్రయించారు. హై కోర్టును నుంచి బీఆర్ఎస్ పార్టీకు అంత సానుకూలత లభించకపోవడంతో సుప్రీంకోర్టును ఆశ్రయించారు.

**తెల్లంది నరంలేని నాలుకంటూ పలువురు మండిపాటు**

నాడు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే భద్రాచలం నియోజకవర్గ అభివృద్దే ఎజెండాగా కాంగ్రెస్ పార్టీలో చేరడం జరిగిందని వెల్లడించిన ఎమ్మెల్యే డా.తెల్లం వెంకట్రావు .. నరం లేని నాలుక వలె నేడు ఈ విధంగా మాట్లాడడ మేమిటని పలువురు రాజకీయ విశ్లేషకులు, ప్రజలు మండిపడుతున్నారు.

# కాళోజీ కథల పుస్తకాన్ని ఆవిష్కరించిన మంత్రి జూపల్లి



**హైదరాబాద్, సెప్టెంబరు 8, ప్రభాతవార్త:** తెలంగాణ సాహిత్య ఆకాడమీ ఆధ్వర్యంలో ప్రచురించిన పద్మభూషణ్ కాళోజి నారాయణరావు రచించిన కథల పుస్తకాన్ని సోమవారం డా.బీఆర్. అంబేద్కర్ సచివాలయంలో సాంస్కృతిక, పర్యాటక, ఎక్సైజ్ పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఆవిష్కరిం చారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణలో కాళోజి సాహిత్యానికి చేసిన కృషిని ఆయన కొనియాడారు.నా గొడవ అనే పుస్తకంలో ఆయన రాసిన కవిత్వమే కాకుండా సాహిత్యం లోని అనేక అంశాలను ఆయన స్పృశించారని, తెలంగాణ భాషకు ఆయన చేసిన కృషి కూడా గొప్పదన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కాళోజి జయంతిని తెలంగాణ భాషా దినోత్సవం గా జరుపుకోవడం ఎంతో శుభ సూచకమని, ఇంతటి గొప్ప సాహిత్యవేత 111వ జన్మదిన సందర్భంగా తెలంగాణ సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో కాళోజీ కథల పుస్తకాన్ని తీసుకురావడాన్ని అభినందించారు.

ఈ కార్యక్రమంలో తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి డాక్టర్ నామోజు బాలా చారి, కవి యాకుబ్ , ఈమని శివనాగిరెడ్డి, ముచ్చర్ల దినకర్ తోపాటు పలువురు పాల్గొన్నారు.

# నేటి నుంచి అఖిలభారత జైళ్ల విభాగాల డ్యూటీమీట్

## టిఎస్‌పిఎలో ప్రారంభించనున్న గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ

**హైదరాబాద్, సెప్టెంబరు 8, ప్రభాతవార్త:** అఖిల భారత జైళ్ల విభాగాల ఏడవ డ్యూటీ మీట్ మంగళవారం ప్రారంభం కానుంది. శివార్లలోని హిమా యత్ సాగర్‌లో గల రాష్ట్ర పోలీసు అకాడమిలో మూడు రోజులపాటు జరగనున్న ఈ డ్యూటీ మీట్‌ను రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ప్రారంభించ నున్నారు.

ఈ డ్యూటీ మీట్‌లో 20కి పైగా అంశాలలో దేశవ్యాప్తంగా 21 రాష్ట్రాలు, మూడు కేంద్రపాలిత ప్రాంతాలకు చెందిన జైళ్ల శాఖ అధికారులు, సిబ్బంది పోటీ పడుతున్నారు.

రాష్ట్ర చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు, హోంశాఖ ప్రత్యేక కార్యదర్శి రవిగుప్తా, డిజిపి జితేందర్, జైళ్ల శాఖ డిజి సౌమ్యా మిశ్రా సహ ఆయా రాష్ట్రాల జైళ్ల శాఖ ముఖ్యఅధికారులు పాల్గొనున్నారు.

ఈ డ్యూటీ మీట్‌లో మొత్తం 1300 మంది పాల్గొంటున్నారు. డ్యూటీ మీట్ పురస్కరించుకుని రూపొందించిన లోగోను రాష్ట్ర జైళ్ల శాఖ డిజి సౌమ్యా మిశ్రా సోమవారం పో లీసు అకాడమిలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయా రాష్ట్రాలకు చెందిన జైళ్ల శాఖ అధికారులు, సిబ్బంది ప్రత్యేకంగా పెరేడ్ నిర్వహించారు.

# యూరియా కోసం రైతన్నల పాట్లు

## -అధికారుల మాటలు నీటి మూటలే
## -(అయినవారికి ఆకుల్లో.... కానివారికి కంచాల్లో ' అన్న చందంగా యూరియా
## -తూతూ మంత్రంగా కూపన్ల పంపిణీ



పొన్నూరు, సెప్టెంబరు 8,ప్రభాతవార్త: అయినవారికి ఆకుల్లో....కానివారికి కంచాల్లో అన్న చందంగా ఉంది ఎరువుల పంపిణీ. అధికారులేమో ఎరువుల కొరత లేదు....ఎంత కావాలంటే అంత ఇస్తామంటారు....రైతు సేవా కేంద్రాల్లో రైతుల కోసం ఉంచామంటారు...ఎక్కడా ఎరువులు మాత్రం కనిపించవు....అంటే అధికారులు చెప్తున్న ఎరువుల నిల్వలు ఎక్కడి పోతున్నాయంటూ రైతులు ఆందోళన చేస్తున్నారు. తాము రైతులం ఎరువుల కోసం ఎన్నో వ్యవయప్రయాసలకోర్చి రావాల్సి వస్తుంది....రైతు సేవ కేంద్రాల్లో ఉన్నట్లయితు తాము అక్కడికి వెళ్ళి అవసరమైన ఎరువులు తీసుకెళ్తాం కాదా...? మాకు మోసే కూలి తప్పుతుంది......ట్రాన్స్‌పోర్టు ఖర్చు తగ్గుతుంది... పనులు మానుకొని ఈ తిరుగుడు తప్పుతుందంటూ అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారపార్టీ నాయకుల కనుసన్నల్లోనే ఎరువుల పంపిణీ జరుగుతుందని.....నిజమైన రైతులకు ఎరువులు చిక్కడం లేదంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు పలువురు రైతులు. యూరియా కోసం కూపన్లు పంచుతున్నారు....కానీ అది కూడా తూతూ మంత్రమేనని రైతులు ఆరోపిస్తున్నారు. ఎరువుల పంపిణీ కేంద్రాల్లో వారి సొంత మనుషులకు ఒక రకంగా....వేరే వారికి ఇంకోరకంగా ఎరువులను వారి ఇష్టం వచ్చినట్లు ఇస్తున్నారని చెప్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, వ్యవసాయాధికారులు నిజమైన రైతులకు, ఎరువులు అవసరమైన వారికి ఇచ్చేవిధంగా చూడాలని పలువురు రైతులు కోరుతున్నారు. సోమవారం వ్యవసాయ మార్కెట్‌యార్డుల్లోనూ, మండల పరిధిలోని మునిపల్లెలోనూ యూరియా కోసం రైతున్నలు పడ్డ శ్రమ, కష్టం అంతా...ఇంతా కాదు....క్యూలో నిరీక్షించినా తమ వరకు యూరియా వస్తుందో...రాదో తెలియని అయోమయపరిస్థితుల్లో రైతులున్నారు.

### పేదల పక్షపాతి ప్రధాని మోడీ: బిజెపి జిల్లా కార్యదర్శి కలపాల శ్రీనివాసరావు

పొన్నూరు, సెప్టెంబరు 8,ప్రభాతవార్త: అన్నీ వర్గాల ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలనే ఉద్దేశంతోనే ప్రధానమంత్రి నరేంద్రమోడి జీఎస్టీ తగ్గించి ప్రజలందరకీ మేలు చేశారని



భారతీయ జనతాపార్టీ జిల్లా కార్యదర్శి కలపాల శ్రీనివాసరావు అన్నారు. స్థానిక నిడుబ్రోలు రైల్వే స్టేషన్‌లో నరేంద్రమోడి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా గోవాడ వెంకటకృష్ణారావు మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్రమోడి దసరా కానుకగా జీఎస్టీని తగ్గించి పండుగలన్నీ సక్రమంగా చేసుకొనే వెసులుబాటు కల్పించారన్నారు. దేశానికి నరేంద్రమోడి సేవలు ఎంతో ఉపయోగమన్నారు. దీపావళి నాటికి జీఎస్టీ తగ్గిస్తామని చెప్పిన నరేంద్రమోడి మాట మీద నిలబడి పేదలకు ఎంతో మేలు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో చిలకపాటి లక్ష్మణ్‌రామాచార్యులు, గురుబాలు, తోట జనార్ధనరావు, భట్టిప్రోలు రామకృష్ణ తదితరులున్నారు.

# రాష్ట్రానికి మరో 50,000 మెట్రిక్ టన్నుల యూరియా: మంత్రి అచ్చెన్నాయుడు

## ఫలించిన చంద్రబాబు విశేష కృషి

**విజయవాడ,సెప్టెంబరు 8,ప్రభాతవార్తప్రతినిధి:** గత నెల ఆగస్టు నెల నుంచి చేసిన కేటాయింపు 81000 మెట్రిక్ టన్నుల యూరియాకు అదనంగా ప్రస్తుతము 50000 కేంద్రం రాష్ట్రానికి ఇస్తుందని కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు మరో రెండురోజులలో కాకినాడ ,విశాఖ ,మంగళూరు ,జైగర్ నౌకాశ్రయంలకు ఓడలు చేరుకోనున్నాయి. నౌకాశ్రయంల నుండి సత్వరమే మన ప్రాంతానికి రైల్వే గూడ్స్ రేకుల ద్వారా ఎరువుల సరఫరాకు కొంకణ్ రైల్వే మరియు దక్షిణ రైల్వే వున్నతాదికారులకు దిశా నిర్దేశం చేసిన కేంద్ర పౌర విమానయాన మంత్రి కింజరాపు రామ్మోహన నాయుడు తెలిపినట్లు వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు వివరించారు. ప్రస్తుతం దేశ వ్యవసాయ రంగములో యూరియా సరఫరా సంక్షోభం ,ప్రతిష్టంభన ఏర్పడిన ఈ కీలక సమయములో రాష్ట్ర రైతాంగానికి ముఖ్యముగా సన్న ,చిన్న కారు రైతులు ,కౌలు రైతులకు యూరియా విషయంలో ఎటువంటి ఇబ్బంది కలగకుండా ఉండటం కోసం ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడు స్వయంగా ప్రత్యక్ష కార్యాచరణ లోకి దిగి ,వరుసగా కేంద్ర ప్రభుత్వంతో కేంద్ర ఎరువుల రసాయనిక మంత్రి నడ్డా గారితో జరిపిన చర్చల జరిసారన్నారు. తద్వారా,రాష్ట్ర రైతుల అవసరాలను వారి దృష్టికి తీసుకెళ్లడం లో చేసిన విశేష కృషి పూర్తి స్థాయిలో సత్ఫలితాలను ఇచ్చినట్లు వివరించారుజప్రస్తుత ఈ కీలక సమయములో 50000 మెట్రిక్ టన్నుల యూరియాను రాష్ట్రానికి కేటాయింపు చేసినందుకు రైతుల తరుపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నామని చెప్పారు. కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్(సి ఐ యల్) ద్వారా కాకినాడ పోర్ట్ నకు 17294 మెట్రిక్ టన్నులు, ఇండియన్ పొటాష్ లిమిటెడ్ (ఐ పి యల్)మంగళూరు కు 5400 మెట్రిక్ టన్నులు ,నర్మదా కంపెనీ నుండి జైగర్ పోర్ట్ నకు 10800 మెట్రిక్ టన్నులు, నేషనల్ ఫెర్టిలైజర్స్ నుండి విశాఖ కు 15874 మెట్రిక్ టన్నుల యూరియా రాబోవు రెండు రోజుల లోపు రాష్ట్రానికి చేరుతున్నాయని తెలిపారు .ఈ కేటాయించిన 50000 మెట్రిక్ టన్నుల యూరియా ఆగస్టు నెలకు కేటాయించిన 82151 మెట్రిక్ టన్నుల యూరియా కేటాయింపుకు అదనం అని చెప్పారు .41183 మెట్రిక్ టన్నుల యూరియా ఇప్పటికే రైతుసేవ కేంద్రాలకు సరఫరా చేయటం జరిగిందని ,మిగిలిన 40968 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరాకు సిద్ధముగా ఉండి,రవాణా లో ఉందని తెలిపారు.రైతులు ధైర్యముగా ఉండాలని ,ఎటువంటి కొరత లేదని తెలిపారు.శాస్త్రీయంగా ,తక్షణ అవసరాలకు అనుగుణంగా మాత్రమే వ్యవసాయ అధికారుల నుంచి సిఫారసు మేరకు మాత్రమే యూరియా వాడాలని కోరారు . వ్యవసాయ సంచాలకులు ఢిల్లీ రావు ఐఏఎస్ కు సూచనలను చేస్తూ ఎరువుల వినియోగము పై గ్రామ స్థాయిలో క్షేత్ర సిబ్బంది ఔట్ రీచ్ కార్యక్రమము నిర్వహించాల్సిందిగా తెలియ చేశారు.రాష్ట్రానికి సమృద్ధిగా ఎరువులను కేటాయించడంలో చంద్రబాబు నాయుడుకి మరొకసారి కృతజ్ఞతలు తెలిపారు.

# డోన్ బిసి హాస్టల్‌లో ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య

**డోన్,సెప్టెంబరు 8,ప్రభాతవార్త:** నంద్యాల జిల్లా డోన్ పట్టణంలోని బిసి కళాశాల,బిసి బాలుర వసతిగృహంలో ఇంటర్ మొదటి సంవత్సరం (ఎంపిసి )చదువుతున్న విద్యార్థి శ్యాంసుందర్(16) ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకొని మృతిచెందిన దురదృష్టకర సంఘటన సోమవారం ఉదయం చోటుచేసుకుంది.పట్టణంలోని శ్రీరామనగర్‌లో ఉన్న వసతిగృహంలో ఉదయం బాత్రుంలో ఉన్న కొక్కానికి ఆ విద్యార్థి టెలిఫోన్ వైరుతో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు.బాత్రుంకు వెళ్లిన విద్యార్థులు భయపడి హాస్టల్‌వార్డెన్‌కు, పోలీసులకు సమాచారం ఇచ్చారు.సమాచారాన్ని అందుకున్న పోలీసులు హుటాహుటీన ఘటనస్థలానికి చేరుకొని ఆత్మహత్యకు గల కారణాలపై దర్యాప్తు చేపట్టారు.విషయం తెలుసుకున్న ఆర్డీఓ నరసింహులు హస్టల్‌కు చేరుకొని వార్డెన్,తోటి విద్యార్థులతో విచారించారు.శ్యాంసుందర్ అనంతపురం జిల్లా యాడికి పట్టణంకు చెందినవాడిగా తెలిసింది.సమాచారం అందుకున్న తల్లితండ్రులు అక్కడికి చేరుకొని తమ కుమారుడు గత వారం ఊరికి వచ్చి నిన్న మధ్యాహ్నం(ఆదివారం) హాస్టల్‌కి వెళ్తున్నాడనుకున్న తమకు ఇలా హాస్టల్‌లోనే ఆత మ్రహత్యకు పాల్పడి విగతజీవిగా పడి ఉండడం తట్టుకోలేక పోతున్నామని వారు కన్నీరుమున్నీరుగా విలపించారు.తమ కుమారుని ఉజ్వల భవిష్యత్తుకై కలలు కన్న తల్లితండ్రులు తమ కుమారుడు ఇలా అర్ధాంతరంగా చనిపోవడంతో వారి రోదనలు మిన్నంటాయి.వారిని ఓదార్చడం కష్టతరమైంది.ఈ ఘటనపై డోన్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.తదుపరి డోన్ మండల ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శవపంచనామా నిర్వహించారు.కేసు ప్రాథమిక దర్యాప్తు అనంతరం,టీం ఆఫ్ డాక్టర్ల పోస్టుమార్టం నివేదిక ప్రకారం ఇది స్పష్టమైన సొంతంగా ఉరివేసుకొని చనిపోయిన కేసుగా తెలిసింది. విచారణలో విద్యార్థి శ్యాంసుందర్ ఒంటరి స్వభావం కలవాడని తెలిసింది.అతనితో చనువుగా ఉండే అతని అన్నయ్య వేరే కళాశాలకు వెళ్లిన తర్వాత అతను మరింతగా ఒంటరితనంను అనుభవించినట్లు తెలుస్తుంది.అతను హాస్టల్‌లో ఉండడానికి ఇష్టపడకపోగా ,తన పెద్దనాన్నకు సైతం హాస్టల్‌లో ఉండాలనిపించడం లేదని చెప్పాడు.రెండు నెలల క్రితం హాస్టల్‌లో చేరినా,తన భావాలను ఎప్పుడు స్నేహితులతో పంచుకోలేదు.

# మూడు భాషలు నేర్చుకున్నా

## నూతన జాతీయ విద్యావిధానానికి లోకేష్ మద్దతు



**విజయవాడ,సెప్టెంబరు 8,ప్రభాతవార్త ప్రతినిధి:**కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన జాతీయ విద్యా విధానాన్ని ఏపీ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ సమర్థించారు. 'ఇండియా టు డే సౌత్ కాన్‌క్లేవ్ 2025'లో మాట్లాడుతూ తన అభిప్రాయాలను పంచుకున్నారు. నూతన జాతీయ విద్యావిధానంలో మూడు భాషలు నేర్చుకోవాలని చెబుతున్నప్పటికీ ఎక్కడా హిందీ తప్పనిసరి అని చెప్పలేదన్నారు. 'నేడే ఢిల్లీలో కేంద్ర విద్యాశాఖమంత్రి ధర్మేంద్ర ప్రదాన్‌ను కలిశాను.మాతృభాషలో బోధనపై దృష్టి పెట్టాలని ఆయన స్పష్టంగా చెప్పారు. ఒక భారతీయుడిగా మాతృభాష ప్రాధాన్యం నాకు తెలుసు.అలాగే హిందీ నేర్చుకోవడం ఎంత ముఖ్యమో తెలుసు' అని వ్యాఖ్యానించారు.తన సొంత అనుభవాన్ని లోకేష్ వివరిస్తూ తాను కూడ మూడు భాషలు నేర్చుకున్నానని వెల్లడించారు. 'నేను మూడు భాషలు నేర్చుకునన విద్యార్థిని.నా కుమారుడు కూడ అదే పని చేస్తున్నారు. ఇవాళ పిల్లలు ఐదు భాషలు నేర్చుకుంటున్నారు. జర్మన్,జపనీస్ ఇలా ఎన్నో భాషలు ఉన్నాయి. అవి నేర్చుకుంటే ఆ దేశాల్లో పనిచేయడానికి వీలవుతుంది' అని వివరించారు.

ఉత్తరాది రాష్ట్రాల్లో కూడా దక్షిణాది భాషలు నేర్చుకోవాలా? అని ప్రశ్నించగా,ఎందుకు నేర్చుకోకూడదు? ఆంధ్రప్రదేశ్ సరిహద్దు ప్రాంతాల్లో ఒడియా,తమిళ్,కన్నడ మాధ్యమాల్లో బోధించమని ఆదేశాలు జారీ చేస్తున్నాం. పిల్లలు తాము కోరుకునే భాష నేర్చుకోవాలి. రాజకీయ నిర్ణయాల ఆధారంగా అది జరుగకూడదు' అని పేర్కొన్నారు. ఎన్డీయే కూటమితో తెలుగుదేశం పొత్తు 2029 తర్వాత కూడ కొనసాగుతుందని చెప్పారు. ప్రధాని నరేంద్రమోడీ నాయకత్వాన్ని విశ్వసిస్తూ ఉప రాష్ట్రపతి ఎన్నాకల్లో ఎన్డీయే కూటమి అభ్యర్థి సీపీ రాధాకృష్ణన్‌కు మద్దతిస్తామని చెప్పారు. ఇండియా కూటమి అభ్యర్థి బి.సుదర్శనరెడ్డి తెలుగు వ్యక్తి కదా అని లోకేష్‌ను ప్రశ్నించగా...'భారత్ ఫస్ట్' అనే నినాదంతో తమ పార్టీ ముందుకు సాగుతోందని బదులిచ్చారు.

09-09pg 12 VJA_09-09pg10.qxd 9/8/2025 10:33 PM Page 1



# యూఎస్ ఓపెన్ విజేత అల్కరాజ్

## ఫైనల్లో సినర్ సంచలన ఓటమి



**న్యూఢిల్లీ:** స్పానిష్ యువ సంచలనం కార్లోస్ అల్కరాజ్ 2025 యూఎస్ ఓపెన్ పురుషుల సింగిల్స్ టైటిల్ సాధించాడు. ఫైనల్లో ఇటలీకి చెందిన జానిక్ సినర్‌ను 6-2, 3-6, 6-1, 6-4 తేడాతో ఓడించి, రెండో యూఎస్ ఓపెన్‌ను (2022, 2025), ఓవరాల్‌గా ఆరో గ్రాండ్‌స్లామ్‌ను సొంతం చేసుకున్నాడు. ఈ గెలుపుతో అల్కరాజ్ నంబర్ వన్ స్థానానికి కూడా తిరిగి దక్కించుకున్నాడు. ఆర్థర్ ఆష్ స్టేడియంలో జరిగిన హై వోల్టేజ్ మ్యాచ్‌లో అల్కరాజ్ తన అద్భుతమైన ఫుట్‌వర్క్, శక్తివంతమైన ఫోర్ హ్యాండ్స్‌తో సినర్‌ను కట్టడి చేశాడు. ఆట ప్రారంభం నుండి దూకుడు ప్రదర్శించిన అల్కరాజ్ తొలి సెట్ గెలిచి, రెండో సెట్ కోల్పోయినప్పటికీ తిరిగి పుంజుకున్నాడు. ఈ మ్యాచ్‌లో అల్కరాజ్ కీలక పాయింట్లలో ఒత్తిడిని ఎదుర్కొని, క్లచ్ షాట్లతో మ్యాచ్‌ను తనవైపు తిప్పుకున్నాడు. సినర్ విషయానికి వస్తే తొలి సెట్ కోల్పోయినప్పటికీ రెండో సెట్‌లో అద్భుతంగా పుంజుకున్నాడు. ఈ మ్యాచ్‌లో సీనర్ బేస్ లైన్ కంట్రోల్ బాగా ఉండి ర్యాలీల్లో స్థిరత్వాన్ని ప్రదర్శించాడు. అయితే సర్వీస్‌లో లోపాలు అతన్ని ఓటమిపాల్చేశాయి. సినర్ ఫస్ట్ సర్వ్ విజయ శాతం కేవలం 48గా ఉంది. అలాగే సినర్ అల్కరాజ్‌కు బ్రేక్ అవకాశాలు చాలా ఇచ్చాడు. మూడో సెట్ కోల్పోవడం సినర్ ఆత్మ విశ్వాసాన్ని దెబ్బతీసింది. ఓవరాల్‌గా ఈ మ్యాచ్‌లో సినర్ అల్కరాజ్‌తో పోటీలో వెనుకబడ్డాడు.

## మహిళల హాకీ ఆసియా కప్..

# సూపర్ 4కు భారత్

### సింగపూర్ ఓటమి



**న్యూఢిల్లీ:** మహిళల హాకీ ఆసియా కప్-2025లో సింగపూర్‌ను ఓడించి భారత్ సూపర్ 4 కు అర్హత సాధించింది. సోమవారం జరిగిన ఈ మ్యాచ్‌లో సింగపూర్‌పై 12-0 తేడాతో అద్భుతమైన విజయం సాధించిన తర్వాత భారత మహిళల హాకీ జట్టు ఆసియా కప్‌లో తన స్థానాన్ని పదిలం చేసుకుంది. తొలి రెండు నిమిషాల్లోనే భారత్ ముంతాజ్ దూసుకెళ్లి రివర్స్ స్టిక్ షాట్‌తో స్కోరింగ్‌ను ప్రారంభించింది. సింగపూర్‌ను 8వ నిమిషంలో భారత్ యొక్క మొదటి పెనాల్టీ కార్నర్‌ను తప్పించుకోగలిగినప్పటికీ, నేహా (11) రీబౌండ్‌లోకి దూసుకెళ్లి, వ్యూహాత్మక టచ్‌తో దాన్ని గోల్ చేయడం ద్వారా స్కోరు 2-0 చేసింది. 2 నిమిషాల తర్వాత, లాల్రెమ్సియామి మరో గోల్ చేసి ఆధిక్యాన్ని 3-0కి పెంచింది. మొదటి క్వార్టర్ ముగిసేలోపు, నవనీత్ 14వ నిమిషంలో పెనాల్టీ కార్నర్‌ను గోల్‌గా మార్చి స్కోరును 4-0కి చేరేటట్లు చేసింది. 2వ క్వార్టర్‌లో సింగపూర్ ప్రతిఘటించినా నవనీత్ (20) స్కోరును 5-0కి తీసుకొచ్చింది. మూడవది నవనీత్ గోల్ కీపర్‌ను దాటి తన హ్యాట్రిక్‌ను పూర్తి చేసి (28) ఆధిక్యాన్ని 6-0కు పెంచింది. ఆ తర్వాత ఉదిత పెనాల్టీ కార్నర్ నుండి మరో గోల్ చేసింది, ఇది హాఫ్ టైం ముగిసే సమయానికి భారత్‌కు 7-0 ఆధిక్యాన్ని అందించింది. ఇక (32) లాల్రెమ్సియామి ముంతాజ్‌కు గోల్ అందించి 8-0 స్కోరు అందించింది. భారత్ తరపున వరుసగా 2 పెనాల్టీ కార్నర్లు లభించగా, (38) నేహా మళ్లీ గోల్ చేసింది. క్వార్టర్ చివరిలో, నేహా చేసిన స్ట్రైక్‌ను అడ్డుకున్నా షర్మిల రీబౌండ్‌పై దూసుకెళ్లి ఆధిక్యాన్ని 11-0కి పెంచింది. చివరి క్వార్టర్‌లో భారత్ ఒత్తిడిని కొనసాగించి (53) రుతుజా పిసల్ గోల్‌తో స్కోర్‌షీట్‌లో తన పేరును లిఖించింది.



# నేటి నుండి ఆసియా కప్

## అఫ్ఘానిస్థాన్, హాంగ్‌కాంగ్ మధ్య తొలి మ్యాచ్

## హాట్‌ఫేవరేట్‌గా టీమిండియా

**న్యూఢిల్లీ:** ఆతృతగా ఎదురు చూస్తున్న ధనాధన్ బ్యాటింగ్, సిక్సర్లు, బౌండరీల మోతతో దద్దరిల్లనున్న ఆసియా కప్ 2025 టోర్నీ ఈ నెల 9వ తేదీ నుండి ప్రారంభం కానుంది. యూఏఈ వేదికగా టీ20 ఫార్మాట్‌లో జరిగే ఈ టోర్నీ కోసం ఆసియా క్రికెట్ దేశాలు సిద్ధమయ్యాయి. ఆతిథ్య యూఏఈతో పాటు భారత్, పాకిస్థాన్, ఒమన్, శ్రీలంక, బంగ్లాదేశ్, అఫ్గానిస్థాన్, హాంగ్ కాంగ్‌లు బరిలోకి దిగుతున్నాయి. భారత కాలమానం ప్రకారం మ్యాచ్‌లన్నీ రాత్రి 8 గంటలకు ప్రారంభం కానున్నాయి. అఫ్గానిస్థాన్, హాంగ్ కాంగ్ మధ్య అబుదాబి వేదికగా తొలి మ్యాచ్ జరగనుంది. ఇప్పటికే ఇరు జట్లు యూఏఈకి చేరుకున్నాయి. ఆసియాలో భారత్ తర్వాత తామే అత్యంత పటిష్టమైన జట్టుగా నిరూపించుకునేందుకు ఈ టోర్నీని ఉపయోగించుకోవాలని అఫ్గాన్ భావిస్తోంది. హాంగ్ కాంగ్‌తో పోరులో అఫ్గాన్ హాట్ ఫేవరేట్‌గా బరిలోకి దిగనుంది. అద్భుతం జరిగితే తప్పా ఈ మ్యాచ్‌లో అఫ్గాన్ సునాయస విజయాన్నందుకుంటుంది. మరోవైపు హాంగ్ కాంగ్ మూడో సారి ఆసియా కప్ బరిలోకి దిగుతోంది. కానీ అఫ్గాన్‌కు పోటీనిచ్చే సామర్థ్యం అయితే హాంగ్ కాంగ్‌కు లేదు. ఇక ఈ ఆసియా కప్ కోసం ఇప్పటికే యూఏఈ చేరుకున్న సూర్యకుమార్ యాదవ్, శుభ్‌మన్ గిల్ కెప్టెన్, వైస్ కెప్టెన్ నేతృత్వంలోని భారత జట్టు ముమ్మరంగా సాధన చేస్తోంది. ఈ టోర్నీలో టీమిండియానే హాట్‌ఫేవరేట్‌గా కనిపిస్తున్నా పొట్టి ఫార్మాట్‌లో ఎవర్నీ తక్కువ అంచనా వేయలేం. దాయాదీ పాకిస్థాన్, అఫ్గానిస్థాన్‌ల నుంచి భారత్‌కు గట్టి పోటీ ఎదురువ్వనుంది. గతేడాదిగా టీ20 ఫార్మాట్‌లో టీమిండియా మెరుగైన ప్రదర్శన చేసింది. అంతేకాకుండా ఈ ఫార్మాట్‌లో వరల్డ్ ఛాంపియన్‌గా నిలిచింది. యూఏఈలో పిచ్‌లు కఠినంగా ఉన్నా బ్యాటింగ్‌కు ప్రతికూలమైనా, భారీ స్కోర్లు నమోదు చేసే సత్తా టీమిండియాకు ఉంది. శుభ్‌మన్ గిల్ రీఎంట్రీతో బ్యాటింగ్ లైన్ మరింత బలోపేతమైంది. ఐపీఎల్‌తో పాటు ఇంగ్లండ్ గడ్డపై అద్భుత ప్రదర్శన కనబర్చిన గిల్ సూపర్ ఫామ్‌లో ఉన్నాడు. దుబాయ్ వంటి స్లో వికెట్‌లపై కూడా గిల్ రాణించగలడు. బౌలింగ్ విభాగం కూడా పటిష్టంగా ఉంది. స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా రీఎంట్రీ ఇవ్వడంతో పేస్ విభాగం మరింత బలోపేతమైంది. అతనికి అర్ష్‌దీప్ సింగ్ అండగా ఉండనున్నాడు. వరుణ్ చక్రవర్తీ, కుల్దీప్ యాదవ్, అక్షర్ పటేల్‌తో స్పిన్ విభాగం కూడా పటిష్టంగా ఉంది. హార్దిక్ పాండ్యా, అభిషేక్ శర్మ రూపంలో పార్ట్ టైమ్ బౌలర్లు కూడా జట్టుకు అందుబాటులో ఉన్నారు.

## ప్రపంచ ఆర్చరీ ఛాంపియన్‌షిప్


## వ్యక్తిగత విభాగాల్లో రిషబ్, అమన్, ప్రధమేష్ ఓటమి



**న్యూఢిల్లీ:** ప్రపంచ ఆర్చరీ ఛాంపియన్‌షిప్‌లో ముగ్గురు భారతీయ పురుషుల కాంపౌండ్ ఆర్చర్లు క్వార్టర్ ఫైనల్స్ లో ఓటమిపాలయ్యారు. దక్షిణ కొరియాలోని గ్వాంగ్జులో సోమవారం జరిగిన ప్రపంచ ఆర్చరీ ఛాంపియన్‌షిప్‌లో భారత పురుషుల కాంపౌండ్ ఆర్చర్లు రిషబ్ యాదవ్, అమన్ సైని, ప్రథమేష్ ఫుగే ప్రపంచ ఆర్చరీ ఛాంపియన్‌షిప్‌లో క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకున్నా కానీ తదుపరి మరింత ముందుకు సాగలేకపోయారు, వ్యక్తిగత విభాగంలో వారి పతక ఆశలకు ముగింపు పలికారు. అయితే ఆదివారం పురుషుల కాంపౌండ్ టీమ్‌గా ఈ ముగ్గురూ కలిసి భారత్‌కు తొలి స్వర్ణం సాధించారు. క్వార్టర్ ఫైనల్స్‌లో, రిషబ్ యాదవ్ ప్రపంచ నంబర్ 3, టాప్ సీడ్ ఫ్రెంచ్ ఆర్చర్ నికోలస్ గిరార్డ్‌తో హోరాహోరీగా తలపడ్డాడు. ప్రారంభ చివరల్లో 10 పరుగులు వరకూ చేసినా గిరార్డ్ చివరలో రిషబ్‌ను 146 -145 తేడాతో ఓడించాడు. దీంతో వ్యక్తిగత పతకం కోసం చేసిన అతని ప్రయత్నం ముగిసింది. అలాగే ఉత్కంఠభరితమైన మ్యాచ్‌లో ప్రథమేష్ ఫుగే, డెన్మార్క్‌కు చెందిన ప్రపంచ నంబర్ 2 మథియాస్ ఫుల్లెర్టన్‌తో తలపడ్డాడు. ఇద్దరు ఆర్చర్లు 148 పాయింట్లతో ముగించి మ్యాచ్‌ను షూట్‌ఆఫ్‌లోకి నెట్టారు. ఫుల్లెర్టన్ చేసిన 10లో 9 పాయింట్లను తృటిలో అధిగమించి ప్రథమేష్ చారిత్రాత్మక పరుగుకు ముగింపు పలికింది. ఇక అమన్ సైనీ తన క్వార్టర్ ఫైనల్‌లో యుఎస్ఎకి చెందిన కర్టిస్ బ్రాడ్‌నాక్స్ నుండి తీవ్ర వ్యతిరేకతను ఎదుర్కొన్నాడు. చివరల్లో అమన్ నిలకడను కొనసాగించలేకపోవడంతో బ్రాడ్‌నాక్స్ 147-144 తేడాతో విజయం సాధించాడు.

# ఎటిపి ర్యాంకింగ్స్‌లో టాప్ 25లో భాంబ్రీకి చోటు

## దిగజారిన మాజీ వరల్డ్‌ఛాంపియన్ బోపన్న





**న్యూఢిల్లీ:** పురుషుల డబుల్స్ ఎటిపి ర్యాంకింగ్స్‌లో యుకీ భాంబ్రీ తొలిసారి టాప్ 25లో చోటు దక్కించుకున్నాడు. అదే సమయంలో మాజీ ప్రపంచ ఛాంపియన్ రోహన్ బోపన్న 9 స్థానాలకు దిగజారిపోయాడు. ఎటిపి సోమవారం విడుదల చేసిన తాజా ర్యాంకింగ్స్‌లో భారత ఏస్ టెన్నిస్ ఆటగాడు భాంబ్రీ పురుషుల డబుల్స్ ర్యాంకింగ్స్‌లో అత్యధికంగా 22వ స్థానానికి చేరుకున్నాడు. 33 ఏళ్ల అతను 10 స్థానాలు ఎగబాకి తన కెరీర్‌లో తొలిసారిగా ప్రపంచ టాప్ 25లోకి ప్రవేశించాడు. ఇదే సమయంలో మాజీ ప్రపంచ నంబర్ 1 రోహన్ బోపన్న 9 స్థానాలు దిగజారి ప్రపంచ ర్యాంక్‌లో 63వ స్థానానికి పడిపోయాడు. అలాగే బొల్లిపల్లి రిత్విక్ రెండు స్థానాలు మెరుగుపడి 71వ స్థానానికి చేరుకున్నాడు. టాప్ 100లో చోటు దక్కించుకున్న ఇతర భారత డబుల్స్ ఆటగాళ్ళు ఎన్ శ్రీరామ్ బాలాజీ (75), విజయ్ సుందర్ ప్రశాంత్ (84), మరియు అనిరుధ్ చంద్రశేఖర్ (98) ఉన్నారు. గత వారం, భాంబ్రీ, న్యూజిలాండ్‌కు చెందిన తన డబుల్స్ భాగస్వామి మైఖేల్ వీనస్‌తో కలిసి యుఎస్ ఓపెన్ సెమీఫైనల్‌కు చేరుకున్నారు. అయితే, ఈ జంట బ్రిటన్‌కు చెందిన నీల్ స్కుప్స్కి-జో సాలిస్‌బరీ చేతిలో 7-6 (2) 6-7(5) 4-6 తేడాతో ఓడిపోయింది. యుఎస్ ఓపెన్‌లో సెమీఫైనల్ ముగింపు గ్రాండ్‌స్లామ్‌లో భాంబ్రీ అత్యుత్తమ ప్రదర్శన కనబరిచాడు.

## వాణిజ్యం



# స్వల్పలాభాలకే సెన్సెక్స్, నిఫ్టీలు ముగింపు!

**ముంబయి, సెప్టెంబరు 8:** సెన్సెక్స్, నిఫ్టీలు సోమవారం స్వల్ప లాభాలకే పరిమితం అయ్యాయి. మార్కెట్లు ఉదయం నుంచి ముగింపు వరకు హెచ్చుతగ్గులను ఎదుర్కొన్నాయి. చివరలో ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు మొగ్గ చూపడంతో ఇంట్రాడేలో వచ్చిన లాభాలన్నీ ఆవిరయి చివరకు స్వల్ప లాభాలతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. ముందురోజు సెషన్‌తో పోలిస్తే సెన్సెక్స్ 80,904.40 పాయింట్ల వద్ద లాభాల్లో మొదలైంది. ఇంట్రాడేలో 80,733.07 పాయింట్ల కనిష్టానికి చేరిన సెన్సెక్స్ గరిష్టంగా 81,171.38 పాయింట్ల వరకు పెరిగింది. చివరకు 76.54 పాయింట్ల లాభంతో 80,787.30 వద్ద ముగిసింది. నిఫ్టీ 32.15 పాయింట్లు పెరిగి 24,773.15 వద్ద స్థిరపడింది. ఆటో, మెటల్, ఆయిల్, గ్యాస్, పీఎస్‌యూ బ్యాంకులు రాణించడంతో నిఫ్టీ 24,885.50 పాయింట్ల గరిష్టాన్ని తాకింది. అయితే, చివరి గంటలో మదుపరులు లాభాల స్వీకరణకు దిగడంతో.. స్వల్ప లాభాలతో బయటపడింది. బీఎస్ఈ మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు ఒక్కొక్కటి 0.5శాతం పెరిగాయి. నిఫ్టీలో ప్రధానంగా టాటా మోటార్స్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, ఐషర్ మోటార్స్, ఎం అండ్ ఎం, బజాజ్ ఆటో నిఫ్టీలో లాభాలను ఆర్జించాయి. ట్రెంట్, ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్, ఏషియన్ పెయింట్స్, టీసీఎస్, టెక్ మహీంద్రా నష్టపోయాయి. ఆటో ఇండెక్స్ 3.3శాతం, రియాలిటీ ఆయిల్, గ్యాస్, పీఎస్‌యూ బ్యాంక్, మెటల్ 0.5 శాతం నుంచి ఒకశాతం వరకు పెరిగాయి. కార్లు, ఎస్‌యూవీల ధరల తగ్గింపుతో టాటా మోటార్స్ షేర్లు 3.6శాతం పెరిగాయి, ఐసీఈ ఎస్‌యూవీ పోర్ట్‌ఫోలియోలో ధరల తగ్గింపుతో మహీంద్రా అండ్ మహీంద్రా షేర్లు 4శాతం వృద్ధిని నమోదు చేశాయి. జుహై పివిన్ న్యూ ఎనర్జీతో వ్యూహాత్మక భాగస్వామ్యం తర్వాత సర్వోటెక్ షేర్లు 5.8శాతం పెరగ్గా.. భూటాన్‌లో 570 మెగా వాట్స్ జలవిద్యుత్ ప్రాజెక్టును ఏర్పాటు చేయడంతో అదానీ పవర్ షేర్ ధర 4.2శాతం పెరిగింది.

# చోక్సీని భద్రతగా చూసుకుంటాం..

## బెల్జియంకు భారత్ భరోసా



**న్యూఢిల్లీ, సెప్టెంబరు 8:** దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ) కుంభకోణంలో ప్రధాన నిందితుడిగా ఉన్న వజ్రాల వ్యాపారి మెహుల్ చోక్సీని భారత్‌కు రప్పించేందుకు కేంద్ర ప్రభుత్వం తన ప్రయత్నాలను ముమ్మరం చేసింది. విచారణ నిమిత్తం ఆయనను అప్పగించాలని కోరుతూ దాఖలు చేసిన అభ్యర్థనలో కీలకమైన హామీలను పొందుపరిచింది. భారత్‌లోని జైలులో చోక్సీకి ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూసుకుంటామని బెల్జియంకు భరోసా ఇచ్చింది. రూ. 12,000 కోట్ల పీఎన్‌బీ మోసం కేసులో విచారణ ఎదుర్కొనేందుకు చోక్సీని భారత్‌కు అప్పగించే ప్రక్రియలో భాగంగా, ఆయనకు జైలులో కల్పించబోయే సౌకర్యాలపై భారత ప్రభుత్వం స్పష్టమైన హామీలు ఇచ్చింది. చోక్సీకి సరిపడా నాణ్యమైన ఆహారం అందించడంతో పాటు, 24 గంటల పాటు నిరంతర వైద్య సంరక్షణ అందుబాటులో ఉంటుందని తన అభ్యర్థనలో పేర్కొంది. అంతేకాకుండా, ఆయన ఉండే గది, పరిసరాలు అత్యంత పరిశుభ్రంగా ఉండేలా అన్ని చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చింది. విదేశాల్లో తలదాచుకుంటున్న ఆర్థిక నేరగాళ్లు, అక్కడి కోర్టులలో తమను అప్పగించవద్దని కోరేటప్పుడు తరచుగా భారత జైళ్లలోని దుర్భర పరిస్థితులను కారణంగా చూపుతుంటారు. ఈ వాదనలను తిప్పికొట్టేందుకే కేంద్ర ప్రభుత్వం ముందుజాగ్రత్త చర్యగా ఈ హామీలను తన అప్పగింతల అభ్యర్థనలో చేర్చినట్టు తెలుస్తోంది. ఈ హామీల ద్వారా చోక్సీని వీలైనంత త్వరగా భారత్‌కు రప్పించి, చట్ట ప్రకారం విచారణ పూర్తి చేయాలని అధికారులు భావిస్తున్నారు.




# కొత్తపరివర్తన జీఎస్టీ లబ్ధి అవాస్తవం

## జిఎస్టీపై వైరల్‌పోస్టుకు సిబిఐసి వివరణ

**న్యూఢిల్లీ,సెప్టెంబరు 8:** జీఎస్టీలో చేపట్టిన సంస్కరణలు ఈనెల 22నుంచి అమలుకు రానున్న నేపథ్యంలోకేంద్ర పరోక్ష పన్నులు, కస్టమ్స్ పేరుతో వైరల్ అవుతున్న పోస్టు ఆందోళన కలిగించింది. సిబిఐసి వరకూ వెళ్లిన ఈ పోస్టుపై సిబిఐసి ఛైర్మన్ పేరిట ఆ విభాగం క్లారిటీ ఇచ్చింది. ఈనెల 22వ తేదీ నుంచి అమలులోకి వస్తోన్న జీఎస్టీ కొత్త రూల్స్ కింద కొత్త ట్రాన్సిషన్ బెనిఫిట్స్ ఉంటాయన్న ప్రచారాన్ని ఖండించింది. అలాంటి బెనిఫిట్స్ ఏం లేవని తేల్చేసింది. సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఇన్‌డైరెక్ట్ ట్యాక్సెస్, కస్టమ్స్ విభాగం (సీబీఐసీ) ఛైర్మన్ అది తప్పుడు ప్రచారమని స్పష్టం చేశారు. అలాంటి ప్రచారాలు తప్పుడు, తప్పుదారి పట్టించేవి అని తెలిపింది. సీబీఐసీ ప్రకటన ప్రకారం జీఎస్టీ మార్పుల ద్వారా చాలా రకాల బెనిఫిట్స్ ఉంటాయంటూ సీబీఐసీ ఛైర్మన్ జారీ చేసినట్లు సోషల్ మీడియాలో వైరల్ అవుతోన్న ఓ పోస్టు మా దృష్టికి వచ్చింది. అన్‌యుటిలైజ్డ్ సెస్ క్రెడిట్, ఎగ్జెంప్టెడ్ సప్లాయిస్ ఐటీసీ, కొత్త ధరల సవరణ బెనిఫిట్స్ వంటివి అందులో క్లెయిమ్ చేశారు. అటువంటి వాదనలు వాస్తవంగా తప్పు, తప్పుదారి పట్టించేవని తెలియజేస్తున్నాం అని పేర్కొంది. దేశ ప్రజలు, ట్రేడ్ యూనియన్లు, ఇండస్ట్రీ కమ్యూనిటీల సభ్యులు, ఇతర భాగస్వామ్యులు ఇలాంటి వాటిని నమ్మవద్దని సూచించింది. ప్రభుత్వం అధికారికంగా జారీ చేసే నోటిఫికేషన్లు, సర్క్యులర్లు, ఎఫ్ఏక్యూలను మాత్రమే చూడాలని కోరింది. దాని ద్వారానే తదుపరి తరం జీఎస్టీ సంస్కరణల గురించి తెలుసుకోవాలని స్పష్టం చేసింది. అయితే, సిన్‌న్ గూడ్స్, లగ్జరీ వస్తువులకు సంబంధించి 40 శాతం ట్యాక్స్ శ్లాబ్ తీసుకొస్తున్నారు. వాటి ధరలు అమాంతం పెరుగుతాయి. కానీ, చాలా వరకు నిత్యావసర వస్తువుల ధరలు దిగివస్తాయని చెప్పవచ్చు. 12, 28 శాతం శ్లాబులను పూర్తిగా తొలగించారు.

## గణేశ్ నవరాత్రులు బిజినెస్

# రూ.45వేల కోట్లు!

## కెయిట్ అంచనాలను మించిన వ్యాపారం



**ముంబయి, సెప్టెంబరు 8:** దేశవ్యాప్తంగా నిర్వహించిన గణేశ నవరాత్రులు భక్తి, సంస్కృతి పెంపొందించడం మాత్రమే కాదు, దేశ ఆర్థిక వ్యవస్థకు కూడా ఊపు తెచ్చిందని చెప్పవచ్చు. గణేష్ చతుర్థికి ఈ ఏడాది దేశవ్యాప్తంగా దాదాపు రూ. 45,000 కోట్ల వ్యాపారాన్ని తెచ్చిందని కాన్ఫెడరేషన్ ఆఫ్ ఆల్ ఇండియా ట్రేడర్స్ (కెయిట్) అంచనా వేసింది. గత ఏడాది రూ. 25,000 కోట్ల వ్యాపారం జరిగినట్లు తెలిపింది. ఈసారి పూర్తిగా స్వదేశీ ఉత్పత్తులకే ప్రాధాన్యం ఇవ్వడం వల్ల అనేక వ్యాపార రంగాలకు మేలు జరిగిందని చెప్పింది. విగ్రహాలే రూ. కెయిట్‌జాతీయ అధ్యక్షుడు బీసీ భారతియా మాట్లాడుతూ ఒక్క గణపతి విగ్రహాల వ్యాపారమే రూ. 1000 కోట్లకు పైగా జరిగింది. పుష్పాలు, దండలు, కొబ్బరికాయలు వంటి అవసరమైన సామగ్రి కొనుగోళ్లు మరో రూ. 500 కోట్ల బిజినెస్ అయితే ఇక మోదకాలు, ఇతర స్వీట్ల డిమాండ్ ద్వారా రూ. 2,000 కోట్లను దాటేసింది. పండగ సమయంలో కేటరింగ్, స్నాక్స్ సర్వీసులు రూ. 3,000 కోట్ల వ్యాపారాన్ని సృష్టించాయి. ఈ ఏడాది దేశవ్యాప్తంగా సుమారు 20 లక్షలగణేష్ పందిళ్లు ఏర్పాటయ్యాయి. ఒక్కమహారాష్ట్రలోనే 7లక్షలపందిళ్లు, కర్ణాటకలో 5 లక్షలు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, మధ్యప్రదేశ్‌లలో ఒక్కో చోట 2 లక్షల చొప్పున పందిళ్లు వెలిశాయి. ఒక్కో పందిరికి కనీసం రూ. 50,000 ఖర్చు చేసినా, అలంకరణలు, ఏర్పాట్లు, పూజల కోసం మొత్తం రూ. 10,000 కోట్లకు పైగా ఖర్చయిందని భారతియా వెల్లడించారు. గణేష్ చతుర్థి కేవలం పూజలు, పందిళ్లతోనే ఆగలేదు. స్థానిక టూరిజం, బస్సులు, క్యాబ్‌లు, రైళ్ల వ్యాపారాలకు రూ. 2,000 కోట్ల ఆదాయాన్ని తెచ్చిపెట్టింది. బట్టలు, ఆభరణాలు, హోమ్ డెకర్, గిఫ్ట్ ఐటెమ్‌ల రిటైల్ వ్యాపారం రూ. 3,000 కోట్లకు చేరింది. పెద్ద ఎత్తున ఈవెంట్‌లు నిర్వహించే ఈవెంట్ మేనేజ్‌మెంట్ కంపెనీలు రూ. 5,000 కోట్ల ఆదాయాన్ని ఆర్జించాయి. గణేష్ చతుర్థి మహారాష్ట్ర, కర్ణాటక, గుజరాత్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, మధ్యప్రదేశ్, తమిళనాడు, గోవా వంటి రాష్ట్రాల్లో ఆర్థిక కార్యకలాపాలకు ఊతమిచ్చిందని కెయిట్ సెక్రటరీ జనరల్ ఎమెరిటస్ ప్రవీణ్ ఖండేల్‌వాల్ తెలిపారు. రక్షా బంధన్‌తో మొదలైన పండగల సీజన్ గణేష్ చతుర్థి, నవరాత్రులు, దసరా, కర్వా చౌత్, దీపావళి, ఛత్ పూజ ఆ తర్వాత పెళ్లిళ్ల సీజన్‌తో భారత ఆర్థిక వ్యవస్థ ఊపందుకోనుందని కెయిట్‌అంచనా వేసింది.

# బిఎస్ఇలో ట్రేడింగ్ గంట మోగించిన బాలకృష్ణ



**ముంబయి, సెప్టెంబరు 8:** ప్రముఖ సినీ నటుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ దేశ ఆర్థిక రాజధాని ముంబైలోని నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ)లో ట్రేడింగ్ ప్రారంభానికి సూచికగా మోగించే గంటను ఆయన మోగించారు. ఈ విషయాన్ని ఆయన సోషల్ మీడియా ద్వారా అందరితో పంచుకున్నారు. ఈ గౌరవం దక్కించుకున్న మొట్టమొదటి దక్షిణ భారత నటుడిగా ఆయన ఒక ప్రత్యేక గుర్తింపు పొందారు. ముంబై స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో చిరస్మరణీయ, మరపురాని ఘట్టం. ఈ రోజు నేను మా బసవతారకం ఇండోఅమెరికన్ క్యాన్సర్ ఆసుపత్రి ప్రతినిధులతో ముంబై పర్యటనలో భాగంగా నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్‌ని సందర్శించడం జరిగింది. ఆ సందర్భంగా నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ అధికారులు చూపిన ఆత్మీయత, ఇచ్చిన గౌరవం నా హృదయాన్ని తాకింది. ప్రత్యేక ఆహ్వానం ఇచ్చి, నాకు స్టాక్ ఎక్స్ఛేంజ్ బెల్ మోగించే అవకాశాన్ని ఇచ్చారు. దక్షిణ భారతీయ నటుడిగా, హీరోగా ఈ వేదికపై బెల్ మోగించిన మొదటి వ్యక్తిగా నిలవడం నాకు గర్వకారణం మాత్రమే కాదు ఇది నా తెలుగు ప్రజల ప్రేమ, ఆదరణ, ఆశీర్వాదాల ప్రతిఫలమని భావిస్తున్నాను. ఈ క్షణం నాకు మరపురానిది. ఇది వ్యక్తిగత ఘనత కాదని, మనందరి ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలుస్తుందని నమ్ముతున్నాను అంటూ బాలయ్య స్పందించారు.

# రూ.15వేల కోట్ల సమీకరణకు ఎల్జీ ఎలక్ట్రానిక్స్ ఐపిఒ




**ముంబయి, సెప్టెంబరు 8:** దక్షిణకొరియా ఎలక్ట్రానిక్స్ కంపెనీ ఎల్జీ అనుబంధ సంస్థఎల్జీ ఎలక్ట్రానిక్స్ ఇండియా పబ్లిక్ ఇష్యూకు వస్తోంది. రూ.15వేల కోట్లు మార్కెట్‌నుంచి సమీకరించేందుకు వచ్చే అక్టోబరులో రానున్నట్లు బ్యాంకింగ్ వర్గాలు చెపుతున్నాయి. అన్నీ అనుకున్నట్లు అయితే 2025 అతిపెద్ద ఐపిఒగా నిలుస్తుంది. టాటాక్యాపిటల్, అర్బన్ కంపెనీ, బోట్, జునిపెర్‌గ్రీన్ కంపెనీలుకూడాఐపిఒకు క్యూలో ఉన్నాయి. గత ఏడాదిడిసెంబరులో దరఖాస్తుచేసిన ఎల్జీకి ఈ ఏడాది మార్చిలో సెబీ ఆమోదం తెలిపింది. ఐపిఒలో భాగంగా 15శాతం లేదా 10.2 కోట్ల షేర్లను విక్రయించి రూ.15వేల కోట్లను మాతృసంస్థ సమీకరించనుది. వాస్తవానికి ఈ ఏడాది ఏప్రిల్ మేనెలల్లోనే ఐపిఒకు రావాలని ఎల్జీ సన్నాహాలుచేసినప్పటికీ మార్కెట్‌పరిస్థితులు సానుకూలంగా లేకపోవడంతో వాయిదావేసింది. గత ఏడాది అక్టోబరులో దక్షిణకొరియా హుండైయి మోటార్ ఐపిఒతో రూ.25వేలకోట్లు సమీకరించింది. ఈఏడాది 30కిపైగా ఐపిఒలు మార్కెట్‌నుంచి రూ.60వేలకోట్లు సమీకరించాయి. హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ అనుబంధ హెచ్‌డిపి ఫైనాన్షియల్ రూ.12,500 కోట్లుసమీకరించి అతిపెద్ద ఐపిఒగా ఉంది. మరికొన్ని నెలల్లోనే ట్యాటాక్యాపిటల్, గ్రో, మీషో, ఫోన్‌పే, బోట్, లెన్స్‌కార్ట్, ఫిజిక్స్ వంటి మరికొన్ని కంపెనీలు ఐపిఒకు వస్తున్నాయి. టెక్నాలజీతో పనిచేసే ఆన్‌లైన్‌మార్కెట్‌ప్లేస్ అర్బన్ కంపెనీ ఐపిఒ ఈనెల 10న ప్రారంభం అయి 12తో ముగుస్తుంది. పబ్లిక్ ఇష్యూతో రూ.1900 కోట్లు సమీకరిస్తుంది. షేర్లు రూ.98 నుంచి రూ.103గానిర్ణయించారు. రిటైల్ ఇన్వెస్టర్లు కనీసం ఒక లాట్ 145షేర్లు కొనుగోలుచేయాలి.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., and printed at Sy No.658/A , NH-5, Ankireddy Palem, Guntur Dist-522005. Ph:2355939, 2512322(0863), 9848812526. RNI No. 64861/96 , Editor : *Damerla Sai Baba, Postal Licence/AP/Vj/GTR/57/08-10 *Responsible for selection of News under the PRBAct. Regd.: No.H/SD/337/12-14